

THE LARGEST CIRCULATED TELUGU WEEKLY
స్వాతి
ESTABLISHED 1984
₹20
3.8.2018
స్వతంత్ర పత్రిక
ఇక రోజులన్నీ మీవే
SMYFRIENDS.COM


Himalaya™
SINCE 1930
FOR MOMS
స్తన్యం ఇచ్చే తల్లులకు ప్రత్యేక సంరక్షణఅవసరం అవుతుంది
కొత్త తల్లులకు ప్రతిరోజూ ఒక కొత్త సాహసం మరియు సవాళ్లు ఎదురవుతాయి. మీ బిడ్డ చిరునవ్వుతో మీ చిరునవ్వుతో మీ రోజు ప్రారంభం అవుతుంది, అలానే సుదీర్ఘంగా పాలిచ్చే కార్యక్రమం మీకు అలసటను కలిగిస్తుంది. స్తన్యాన్ని సక్రమంగా పట్టుకోకపోవడం నుంచి పరిశుభ్రత విధానాలు సక్రమంగా లేకపోవడం వల్ల, మీ చనుమొనలు పుండ్లుగా మారతాయి, సున్నితత్త్వం పెరగడం వల్ల పగుళ్లు కూడా ఏర్పడతాయి.
మీ చనుమొనలకు అవసరమైన సంరక్షణ అందించండి!
పాలిచ్చిన ప్రతిసారి కూడా, మీ చొనుమొనలను హిమాలయా ఫర్ మమ్స్ నర్సింగ్ వైప్‌లతో బాగా శుభ్రం చేసుకోండి, హిమాలయా ఫర్ మమ్స్ నిపిల్ కేర్ బటర్‌తో సహజంగా నయం కానివ్వండి.
కొబ్బరినూనె యొక్క సుగుణాలు కలిగిన, నర్సింగ్ వైప్‌లు పాలు ఇచ్చే తల్లులు చనుమొనలపై ఉండే పాలు లేదా తీపి అవక్షేపాలను తొలగించే ఒక ఆదర్శవంతమైన పరిష్కారం. కోకుం బటర్ మరియు వర్జిన్ కొబ్బరినూనె సంవృద్ధిగా ఉండే హిమాలయ ఫర్ మమ్స్ నిపుల్ కేర్ బటర్‌తో పుండ్లు మరియు పగిలిన చనుమొనలకు గుడ్ బై చెప్పండి.
Himalaya
FOR MOMS
nipple care butter
Himalaya
SINCE 1930
nursing wipes
72
FOR MOMS
మీ చనుమొనల సంపూర్ణ సంరక్షణకొరకు హిమాలయ ఫర్ మమ్స్‌లో
వనమూలికల నుంచి నమ్మకమైన సంరక్షణను పొందండి.
Available online at www.himalayastore.com



EPSON
EXCEED YOUR VISION
7 PAISE BLACK
18 PAISE COLOUR
Composite Colour*
*The total Colour CPP including black ink is 25 paise.
India's No.1 Inkjet Printer
ఇల్లైనా లేదా
ఆఫీస్ అయినా
ఇండియా
అతి తక్కువ
ధరకే
ప్రింట్ చేస్తుంది
70 మిలీ రీఫిల్ ఇంకు బాటిళ్ళు
₹299 నుండి ప్రారంభం
ఎప్సన్ ఇంక్‌ట్యాంక్ ప్రింటర్స్
ప్రింట్ చేయడానికి ఏకైక మార్గం
2.5 MILLION HAPPY USERS IN INDIA
భారతదేశపు నం.1' ఇంకు జెట్ ప్రింటర్
330 సర్వీసు సెంటర్లు 252 నగరాలు
శ్రేణి ఎ4, ఎ3, కలర్/మోనో, వైఫై, ఎథర్నెట్, డ్యూప్లెక్స్
1 సంవత్సరం ఆన్-సైట్ వారంటీ*+ ఉచిత ఇన్‌స్టాలేషన్
Visit jointherevolution.co.in or call
ANDHRA PRADESH Vijayawada 98852 22296, Vizag 95028 85566, Tirupati 75696 95781 TELANGANA 99896 33221
eClean
Epson Helpline: For product info or service - 1800 425 0011
For service - 1860 3000 1600 (9AM - 6PM) (Mon - Sat)
Email: think@eid.epson.co.in
SMS EPSON TO 58558



THE LARGEST CIRCULATED TELUGU WEEKLY

సపరివార పత్రిక

స్వాతి

FOUNDER PROPRIETOR EDITOR : VEMURI BALARAM

కళాసాధన

ప్రతి మానవునిలోనూ ఓ తేజస్సుంటుంది. దీనినే సంస్కృతంలో 'తేజోవలయం' అనీ, ఆంగ్లంలో 'ఆరా' అనీ అంటారు.

దేవతల చిత్రాలను చిత్రించేటప్పుడు వారి ముఖం చుట్టూ ప్రకాశపుంజాన్ని చిత్రిస్తారు.

అది వారి కళలయొక్క చిహ్నం. అవతారానికి సంబంధించిన శక్తిసామర్థ్యాలు వారు చూపెట్టిన కళలద్వారా అర్థం అవుతుంది.

పరశురాముని యందు మూడు, రామచంద్రుని యందు పన్నెండు, కృష్ణునియందు 16 కళలని చెప్పబడ్డాయి. దాని భావం ఏమంటే సాధారణశక్తికి అన్నిరెట్లు వారి దగ్గర ఆత్మశక్తి ఉన్నదన్నమాట.

సూక్ష్మదర్శులైనవారు ఏ వ్యక్తియొక్కగాని, వస్తువు యొక్కగాని ఆంతరంగిక స్థితినిగూర్చి వాని తేజోవలయం,రంగు,రూపం, ప్రకాశం, చైతన్యాలను చూచి తెలుసుకోగలుగుతారు.

కళావిద్యనుగురించిన జ్ఞానం భూమిలో అంతర్గతంగా దాగి ఉన్న పదార్థాలను, వస్తువులను, వానిలో దాగి ఉన్న గుణప్రభావ మహత్యాలను సులభంగా తెలుపుతుంది.

ఏ మనిషిలో ఎన్ని కళలున్నాయి? వానిలో శారీరక విశేషాలేవి? మానసిక విశేషాలేవి? ఆత్మిక విశేషాలేవి? ఏయే గుణ, దోష, యోగ్యతా సామర్థ్యాలందు హెచ్చుతగ్గులు ఉన్నాయి? అనే విషయాలు సహజంగా తెలిసిపోతాయి.

ఈ జ్ఞానం తెలియడంవల్ల ఏ వ్యక్తితో ఎట్టి సంబంధాలను కలిగి ఉండాలో తెలిసివస్తుంది.

కళావిజ్ఞానం తెలిసినవాడు తన శరీరంలోని సాత్వికతలో హెచ్చుతగ్గులను తెలుసుకొని దాని ద్వారా ఆత్మబలాన్ని సరిదిద్దుకుంటాడు. తన కళలకు సంబంధించిన పరిశోధనా ఫలితాలతో వికాసం పొందుతాడు. కళయే సామర్థ్యం.

-గాయత్రీ మహావిజ్ఞానం



పాఠక దేవుళ్ళకు నమస్కారం

ఎడిటర్

వేమూరి బలరామ్

ESTABLISHED 1984 | సంపుటి 35 | 3.8.2018 | సంచిక 5

అనిల్ బిల్డింగ్స్ సూర్యారావుపేట పోస్ట్ బాక్స్ 339 విజయవాడ 520 002

Leaders will be those who empower others

సీరియల్స్

కథలు



ముఖచిత్రం : వేదిక

శీర్షికలు

స్పెషల్ ఫీచర్స్

చందాను www.swatipublications.com వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు

E-mail: advtswati@gmail.com swativja@eth.net

విడిప్రతి ₹20 12 నెలలకు ₹1076

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిల్) ₹6666 (100 డాలర్లు)

Editor : VEMURI BALARAM Swati Publications Anil Buildings Suryaraopet Vijayawada 520 002 Printed and Published by the owner VEMURI BALARAM

Printed at Anil Swati Press Autonagar Vijayawada Cover at Kala Jyothi Process Pvt.Ltd., Hyderabad

Tel.: (0866) 243 1862 243 4017 Advt. 243 1233 Mktg. 243 3938 Fax: 0866-243 0433

అనూస్‌లో సర్వీసెస్ మాత్రమే కాదు, హెర్బల్ ప్రొడక్ట్స్ కూడ ఎక్సలెంట్...



నా పేరు రీనా హిందోచా. నేను యోగా ఇన్‌స్ట్రక్టర్‌ని. యోగా నేర్పేటపుడు నా అండర్ ఆర్మ్స్‌లో అన్‌వాంటెడ్ హెయిర్ (అవాంఛిత రోమాలు) మరియు పిగ్మెంటేషన్ వల్ల చాల ఎంబరాసింగ్‌గా ఉండేది. వ్యాక్సింగ్ లాంటి టెంపరరీ పద్ధతులకు వెళ్ళినా మళ్ళీ వారంలోనే అవాంఛిత రోమాలు పెరగడం, అవి కూడ రిమూవ్ చేయడానికి వీలు లేనట్లుగా పెరగడం చూసి చాల విసుగ్గా ఉండేది. కొన్ని క్లినిక్స్‌లో ట్రయల్‌గా లేజర్ ట్రీట్‌మెంట్ తీసుకొని చూశాను, కాని శాశ్వత పరిష్కారం కాలేదు. ఆ సమయంలోనే అనూస్ పెర్మనెంట్ హెయిర్ రిమూవల్ ట్రీట్‌మెంట్ గురించి తెలిసి, వారిని అప్రోచ్ అయ్యాను. లేజర్ ట్రీట్‌మెంట్ గురించి వారు సజెస్ట్ చేసినప్పుడు వారిని నేను అదే ప్రశ్నించాను. వేరే క్లినిక్స్‌లో ట్రీట్‌మెంట్ తీసుకున్నాను కదా! నాకు రిజల్ట్ లేదు, మరి మీరెలా ఇవ్వగలరు అని. నేను అంతకు ముందు తీసుకున్న లేజర్ ట్రీట్‌మెంట్ ప్రభావం, అనూస్‌లో లేజర్ ట్రీట్‌మెంట్ యొక్క వివరాలు అంటే థిక్ అండ్ డార్క్ హెయిర్‌కు లేజర్ ఎలా పనిచేస్తుంది, గ్రే హెయిర్‌కి అయితే ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇస్తారు, సన్నని నూగు లాంటి రోమాలకు ఎలా, ఇలా అవాంఛిత రోమాలను శాశ్వతంగా తొలగించే ట్రీట్‌మెంట్ యొక్క వివరాలు నాకు క్లియర్‌గా ఎక్స్‌ప్లెయిన్‌చేశారు. నా స్కిన్ మరియు నా హెయిర్ కలర్‌కి నాకు తగిన విధంగా ఎలా కస్టమైజ్డ్ ప్రోగ్రాం డిజైన్ చేస్తారో చెప్పారు. అంతా విన్నాను, నాకు ఒక్క మాట నచ్చింది, అదేమిటంటే ఎప్పుడు ఏ ట్రీట్‌మెంట్ ఇవ్వాలి, పూర్తిగా ఎలా తగ్గించాలి అనే బాధ్యత మాది, మీకు మీ అండర్ ఆర్మ్స్ హెయిర్ తగ్గాలి అంతే కదా ! అని. వెంటనే ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేసిన నాకు పరిష్కారంగా ఫాస్ట్ రిజల్ట్ కనిపించింది. ట్రీట్‌మెంట్ తీసుకొనే సమయంలో అనూస్ సిస్టర్స్‌ని కలిశాను. వారితో నా అండర్ ఆర్మ్స్ పిగ్మెంటేషన్ గురించి కూడ డిస్కస్ చేశాను. వారు నాకు అండర్ ఆర్మ్స్ పిగ్మెంటేషన్ కోసం అనూస్ అర్గానిక్ ప్రొడక్ట్ లైటెనింగ్ అండ్ వైటెనింగ్ మాస్క్‌ప్యాక్‌గా వాడమని సూచించారు. అద్భుతం! ఊహించనంత ఫలితాలు. ఐ యామ్ వెరీ హ్యాపీ నౌ... నేను ఇపుడు యోగా చెప్పేటప్పుడు అస్సలు నా అవాంఛిత రోమాల గురించి కాని, పిగ్మెంటేషన్ గురించి కాని ఆలోచించటం లేదు. ఇదే మాస్క్‌ని నేను నా ముఖానికి, మెడకు, చేతులకు కూడ అప్లై చేశాను. నా స్కిన్ ట్యానింగ్ కూడ మాయం. అనూస్ గురించి నాకు తెలియడం, వారి సహాయం తీసుకొని, నాకు వచ్చిన ఇబ్బందిని దూరం చేసుకోవాలి అన్న ఆలోచన వచ్చిందే తడవుగా నేను ట్రీట్‌మెంట్‌లో జాయిన్ అయ్యాను. అక్కడ గడిపిన రోజులు, స్టాఫ్‌తో గడిపిన గంటలు నాకు ఇష్టమైన క్షణాలు. అక్కడికి వెళ్ళిన ప్రతిసారి నాకు ఎక్సైట్‌మెంట్. నాకు అనూస్‌కి వెళ్ళిన ప్రతిసారి నా పుట్టిల్లు గుర్తుకొస్తుంది. ఎందుకో తెలియదు ఇప్పటికీ అనూస్‌కి వెళ్ళడానికి కారణం వెతుకుతాను. ఐ లవ్ అనూస్. ♥♥♥♥


రీనా హిందోచా, యోగా ఇన్‌స్ట్రక్టర్



తెలుపు జుట్టు ఉన్న ప్రతి ఒక్కరి అవసరం...!


అనూస్ బ్లాక్ ఎక్స్‌పర్ట్ 100% నేచురల్ హెర్బల్ ప్రొడక్ట్.

ఎలర్జీలు లేవు, పిగ్మెంటేషన్ లేదు, చూపు మందగించడం, జుట్టు రాలడం లేదు.

క్లిక్ లింక్ : https://www.youtube.com/watch?v=JIuUHIbfGxk&t=16s

కాంతులీనే చర్మం కోసం

ఎల్ & డబ్ల్యు హెర్బల్ ఫేస్ మాస్క్



మేని ఛాయను పెంచుతుంది, ముడతలు, మచ్చలు, పిగ్మెంటేషన్, ట్యానింగ్‌ను తగ్గిస్తుంది.

అనూస్ వీడియోస్‌కై మీ వాట్సప్ నంబరును ఈ 91000 34054 కు షేర్ చేయండి. ఆన్‌లైన్‌లో కొనాలంటే www.anoos.com

అనూస్ హెర్బల్ ప్రొడక్ట్స్ మీ దగ్గరలోని సూపర్ మార్కెట్స్‌లోగాని, షాపులోగాని పొందాలంటే, పదే పదే అడిగి ఒత్తిడి పెంచండి.

మా సేవలకై మీ ప్రశ్నలను ఈ నంబరుపై 99596 16106 సంప్రదించండి – అనూస్ సిస్టర్స్

ANOO'S
SALON & CLINIC Since 1983
TELANGANA | ANDHRAPRADESH
KARNATAKA | TAMILNADU | USA

Watch Anoo's Programme
Every Saturday in STAR MAA at 7.30 AM
Every Saturday in HMTV at 1.30 PM.
Every Saturday in V6 at 3.30 PM

Services & International Beauty School Courses: 99596 16106
Product Enquiries: 9100034054



అత్యధిక సర్క్యులేషన్‌గల ఏకైక తెలుగు వారపత్రిక

20.7.2018

స్వామి రామతీర్థగారి సుభాషితం అందరూ తెలుసుకోదగ్గది.

కొత్త సీరియల్ 'నానితో నిత్య' ఎంతగానో ఆకట్టుకుంది.

'ఒక చిన్నమాట' శీర్షిక రచయిత్రి వారం వారం ఒక్కొక్క విషయం సులభంగా అర్థమయ్యేలా చర్చిస్తున్నారు.

ఎమ్.వి.రంగారావు విశాఖపట్నం

'మనిషిలో మనిషి', 'పరదేశీ ప్రేమ కథ', 'నానితో నిత్య', 'వేట' సీరియల్స్ అన్నీ ఇంట్రెస్టింగ్‌గా సాగుతున్నాయి.

'స్నేహితుడా-రహస్య స్నేహితుడా!', 'మంత్రోపదేశం', 'ఆదిత్య హృదయం' కథలు బాగున్నాయి.

'B హ్యాపీ', 'WhatsApp' జోకులు చాలా బాగున్నాయి.

లక్ష్మీ గిరిజాకుమార్ రాజమహేంద్రవరం

స్వామి రామతీర్థ వారి ఉవాచ ననుసరించి 'విశ్వమే నేను, నేనే విశ్వం నేనే దేవుడను...మేమిద్దరం ఒకటే' అని గ్రహిస్తే పరిపూర్ణ విజయం లభిస్తుందన్న దృగ్విషయం ఉదాత్తంగా ఉంది.

'సరికొత్త వ్యసనం' వ్యాసంలో వ్యాసకర్త మనోభిప్రాయాలన్నింటితో శతశాతం ఏకీభవిస్తున్నాం.

'నానితో నిత్య' కొత్త సీరియల్ ఆసక్తికరంగా ఉంది.

ఎస్.ఎస్.చంద్రబోస్ విశాఖపట్నం

'నానితో నిత్య' కొత్త సీరియల్ చాలా బాగుంది.

కథ 'మంత్రోపదేశం' బాగుంది.

కడుపుబ్బరం తగ్గటానికి ఎలాంటి ఆహారం తినాలో తెలియజేశారు థ్యాంక్స్! 'హెల్త్ బిట్స్' బాగున్నాయి.

ఎ.కొండలరావు దూసి

విగ్రహాలు పూర్తికాకుండానే తలుపులు తీయటంతో ఆగ్రహానికి శిల్పి గురై పూర్తిచేయకుండానే మధ్యలోనే వదిలి వెళ్ళిపోయాడని 'జగన్నాథ రథోత్సవం' వ్యాసంలో తెలుసుకున్నాం.

సోషల్ మీడియాకి బానిసలుగా మారి కుటుంబ కష్టసుఖాలను పట్టించుకోకుండా వింత మనుషుల మాదిరిగా మారుతున్నారు అన్నదాంట్లో నిజం వుందని 'సరికొత్త వ్యసనం' ఫీచర్‌లో తెలుసుకున్నాం.

'నానితో నిత్య' సీరియల్ ప్రారంభంనుండే ఆసక్తి కలిగించింది.

జి.వి.మురళీమోహన్ ముచ్చుమిల్లి

వచ్చేవారం స్పెషల్

మెనూపాజ్

'జగన్నాథ రథోత్సవం' విశేషాలు భక్తుల్ని అలరించాయి.

దేశాభివృద్ధిలో స్త్రీలు భాగస్వాములు కాకపోతే సగం జనాభా వెనకపడినట్టే అని చెప్పిన 'ఒక చిన్న మాట' నిజానికి బహుదొడ్డమాట.


'స్నేహితుడా-రహస్య స్నేహితుడా!', 'మంత్రోపదేశం', 'ఆదిత్య హృదయం' కథలు ముచ్చటగా ఉన్నాయి.

'చివరిరోజుల్లో' సినీరంగంలోని దయనీయ పరిస్థితికి గీతాకపూర్ జీవితం అద్దంపట్టింది.

శీర్షికలు, ఫీచర్స్ హృదయాలకు భలే పసందు విందుచేశాయి.

వి.లంబకర్ణ రాజేంద్రనగర్

ఇది మంచి సమయం



26.7.2018 నుండి 1.8.2018 వరకు శ్రీ విలంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం. 28.7.2018 నుండి కృష్ణపక్షం.

26.7.2018 గురువారం
తిథి: చతుర్దశి రా. 11.16 వరకు
నక్షత్రం: పూర్వాషాఢ రా. 9.25 వరకు
వర్జ్యం: ...ఉ. 6.59 వరకు
దుర్ముహూర్తం: ప. 9.57-10.49 వరకు. మ. 3.10-4.02 వరకు
రాహుకాలం: మ. 1.45-3.22 వరకు
మంచి సమయం : ఉ. 7.50 నుండి 9.20 వరకు
సూర్యోదయం: 5.42కి
సూర్యాస్తమయం: 6.36కి

27.7.2018 శుక్రవారం
తిథి: పూర్ణిమ రా. 1.50 వరకు
నక్షత్రం: ఉత్తరాషాఢ రా.12.33 వరకు
వర్జ్యం: ఉ. 6.29 నుండి 8.17 వరకు. తె. 5.04 వరకు
దుర్ముహూర్తం: ప.8.13 నుండి 9.05 వరకు. మ. 12.33-1.25 వరకు
రాహుకాలం: ప.10.30-12.08 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.43కి
సూర్యాస్తమయం: 6.36కి

28.7.2018 శనివారం
తిథి: బహుళ పాడ్యమి తె.4.21 వరకు
నక్షత్రం: శ్రవణం రా. 3.37 వరకు
వర్జ్యం: ...ఉ. 6.52 వరకు
దుర్ముహూర్తం: ఉ.5.37 నుండి 7.20 వరకు
రాహుకాలం: ప. 8.53-10.30 వరకు
మంచి సమయం: ప.9.15-11.15 వరకు
సూర్యోదయం: 5.43కి
సూర్యాస్తమయం: 6.36కి

29.7.2018 ఆదివారం
తిథి: విదియ పూర్తి
నక్షత్రం: ధనిష్ఠ పూర్తి
వర్జ్యం: ప. 8.06-9.54 వరకు
దుర్ముహూర్తం: సా. 4.53-5.45 వరకు
రాహుకాలం: సా. 5.00-6.38 వరకు
మంచి సమయం: మ. 11.15-12.10 వరకు
సూర్యోదయం: 5.43కి
సూర్యాస్తమయం: 6.35కి

30.7.2018 సోమవారం
తిథి: విదియ ఉ. 6.41 వరకు
నక్షత్రం: ధనిష్ఠ ఉ. 6.32 వరకు
వర్జ్యం: మ. 2.31-4.17 వరకు
దుర్ముహూర్తం : మ. 12.32 నుండి 1.24 వరకు.మ. 3.09-4.01 వరకు
రాహుకాలం: ఉ. 7.14-8.52 వరకు
మంచి సమయం: ప.11.15-1.20 వరకు
సూర్యోదయం: 5.44కి
సూర్యాస్తమయం: 6.35కి

31.7.2018 మంగళవారం
తిథి: తదియ మ. 3.43 వరకు
నక్షత్రం: శతభిషం ప. 9.10 వరకు
వర్జ్యం : సా. 4.10-5.55 వరకు
దుర్ముహూర్తం: ప. 8.12-9.04 వరకు రా. 11.02-11.54 వరకు
రాహుకాలం: మ. 3.22-4.59 వరకు
మంచి సమయం: లేదు
సూర్యోదయం: 5.44కి
సూర్యాస్తమయం: 6.35కి

1.8.2018 బుధవారం
తిథి : చవితి ప. 10.23 వరకు
నక్షత్రం: పూర్వాభాద్ర ప.11.26 వరకు
వర్జ్యం: రా. 9.44-11.27 వరకు
దుర్ముహూర్తం : ప. 11.43 నుండి 12.34 వరకు
రాహుకాలం: మ.12.09 నుండి 1.45 వరకు
మంచి సమయం: ప. 9.20-10.00 వరకు
సూర్యోదయం: 5.44కి
సూర్యాస్తమయం: 6.34కి

*చాలా సంతృప్తికరమైన జీవితం మీది.



ఆషాఢంలో శుభం లాభం
బంగారం తరుగు చార్జీల మీద
50%
వరకు తగ్గింపు
వజ్రాల విలువ మీద
20%
వరకు తగ్గింపు
ఈ ఆఫర్ ఆగస్టు 11 వరకు మాత్రమే
శుభం చేకూర్చే రోజులన్నీ శుభదినాలే
*conditions apply
22 క్యారెట్ పాత బంగారు నగల మార్పిడిపై 0% తగ్గింపు
హైదరాబాద్ [సోమాజిగూడ సర్కిల్ | కె.పి.హెచ్.బి. కాలని | దిల్‌సుఖ్‌నగర్ | ఎ.ఎస్. రావ్ నగర్ | మెహిదిపట్నం
చందానగర్ | హిమాయత్‌నగర్ | కొండాపూర్] విశాఖపట్నం | తిరుపతి | కర్నూలు | విజయవాడ | కాకినాడ | రాజమండ్రి
గుంటూరు | భీమవరం | కడప | నెల్లూరు | అనంతపురం | వరంగల్
BUY ONLINE AT: malabargoldanddiamonds.com
220 కి పైగా షోరూమ్‌లు 9 దేశాలలో
మలబార్ గోల్డ్ & డైమండ్స్

ఒక చిన్నమాట

ఇటీవల ఇద్దరు ప్రముఖులు మాట్లాడినమాటలు బహు చర్చితమయ్యాయి. ఇద్దరూ ఒకే రోజు భిన్న ప్రాంతాలలో, భిన్న సందర్భాలలో మాట్లాడారు. ఇద్దరూ ఒకే పార్టీకి చెందినవారు.

శశిథరూర్ ప్రజాస్వామ్యము, సెక్యూలరిజమ్ గురించి ఒక సభలో మాట్లాడుతూ ఈ మాటలన్నారు. "వారు (బి.జె.పి.) ఒకవేళ ఇప్పుడున్న బలాన్ని తిరిగి లోక్‌సభలో పొందారంటే, అప్పుడు వాస్తవంగా మనకు అర్థమైన ప్రజాస్వామ్య రాజ్యాంగం ఉండదు... ఎందుకంటే భారత రాజ్యాంగాన్ని చింపి మరో కొత్తది రాసే మూడు కారణాలు వారికున్నాయి.

"దానిలో వారు హిందూ రాష్ట్రాన్ని పొందుపరుస్తారు. దానితో అల్పసంఖ్యాకుల సమానత్వాన్ని తొలగిస్తారు. అది 'హిందూ పాకిస్తాన్'ను సృష్టిస్తుంది. ....స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన గొప్ప నాయకులు, మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా ఆజాద్ ఇందుకోసం పోరాడలేదు"

హిందూ,పాకిస్తాన్ అనే మాట కొంచెం విపరీతంగా తోచింది. ప్రజాస్వామ్యమే లేని, టెర్రరిస్టులకు ఆలవాలమైన పాకిస్తాన్‌తో పోల్చడమేమిటి అని పలువురు ప్రశ్నించారు. దేశంలో అల్పసంఖ్యాకులను శాంతపరచటం, సంతృప్తిపరచటం ముఖ్యము కాదు. వారికి సాధికారత కల్పించి ప్రజలందరూ దేశనిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొనేటట్లు చూడాలి.

పాక్‌లో మైనారిటీలపట్ల వివక్ష కాదు కదా, వారు మైనారిటీలు అసలు లేకుండానే చూస్తారు.ఆ దేశంలో సైన్యాలు మొత్తం దేశాన్ని తమ నియంత్రణలో పెట్టుకున్నాయి. రాజ్యాంగాన్ని పక్కకు పెట్టిన సందర్భం భారతదేశంలో ఎమర్జెన్సీ సమయంలోనే జరిగింది. ఈ దిశలో మరి అడుగులు పడలేదు.


ఈ విమర్శలన్నిటినీ థరూర్ తోసిపుచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌వారు చెప్పే 'హిందూ రాష్ట్రము' పాకిస్తాన్‌ను అద్దంలో ప్రతిఫలించినట్లుంటుంది అని ఫేస్‌బుక్‌లో జవాబిచ్చారు.

శశిథరూర్‌పట్ల ప్రజలకెంతో గౌరవముంది. ఆయన 29 ఏళ్ళకాలం అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితిలో పనిచేశారు. యు.ఎన్. సెక్రటరీ జనరల్ కోఫీ అన్నన్‌తో పనిచేశారు.సెక్రటరీ జనరల్ పోస్టు ఖాళీ అయినప్పుడు దానికి పోటీ చేశారు. అంతర్జాతీయ వ్యవహారాలలో ఎలాగూ అనుభవముంది.

ఎన్నో ఏళ్ళుగా రచయితగా గొప్ప పేరుంది.వీరు రాసే నవలలు కాలక్షేపానికో లేక ఒక భావజాలాన్ని ప్రచారం చేయటానికో కాదు. వాస్తవికతను ప్రతిబింబిస్తూ ఉంటాయి. నవల కోసం ఎంతో పరిశోధన చేసినట్లు కనిపిస్తుంది.



డాక్టర్ జె.భాగ్యలక్ష్మి
E-mail: jbhagyalakshmi43@yahoo.in



స్కాలర్లీ నవలలుగా వీటిని పేర్కొనవచ్చు. ఎప్పుడూ సందర్భోచితంగా, సహేతుకంగా మాట్లాడే వ్యక్తి ఇలా మాట్లాడటం ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. అందులోను రాజకీయాలలో, ముఖ్యంగా ఎన్నికల వాతావరణం ఊపందుకుంటున్నప్పుడు మాటల అర్థాలు ఎంతో విశ్లేషణకు గురవుతాయి.

"అర్థాల గురించి శ్రద్ధ వహిస్తే శబ్దాలు వాటంతటవే బాగుంటాయి" అని లూయిస్ కార్రల్ అంటారు.

మొత్తానికి హిందూ-పాక్ ఉపన్యాసం చాలా ప్రశ్నలు లేవనెత్తినందున రాహుల్ పార్టీకి దానినుండి దూరంగా ఉండమని సలహా ఇచ్చారు.

వారి కమ్యూనికేషన్ చీఫ్ రణ్‌దీప్ సుర్జేవాలా కూడా ఈ విషయమై ట్వీట్‌చేసి బి.జె.పి. ద్వేషాన్ని తిరస్కరిస్తున్నప్పుడు కాంగ్రెస్ నేతలు తమ మాటలు జాగ్రత్తగా ఎన్నుకోవాలని చెప్పారు. థరూర్ మాత్రం 'ఈ మాటలు మళ్ళీ అంటాను' అని అంటారు.

"మనం ఇండియాను పరిరక్షించుకోవాలి. మన ప్రియమైన దేశాన్ని హిందూ రూపంలో పాకిస్తాన్‌గా మార్చకూడదు"ఒక ఛానెల్ ఇంటర్వ్యూలో ఇదివరకటి ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీని థరూర్ మాటల గురించి వ్యాఖ్యానించమంటే "అతను చెప్పినది నేను చదవలేదు. ఆయన పండితుడు.

రచయిత, ఎమ్.పి పార్లమెంట్ విదేశ వ్యవహారాల కమిటీకి పెద్ద. ఆయన ఏమి చెప్పినా చక్కగా ఆలోచించే చెపుతారు" అని అన్నారు. నాయకులు, ప్రముఖులు ఎప్పుడూ రాజకీయంగా సరైన మాటలు (పొలిటికల్లీ కరెక్ట్) మాట్లాడాలంటే కుదరదు. ఆలోచనా ప్రవాహంలో, భావోద్రేకతలో భావాలు ఏ రూపంలో బయటపడతాయో చెప్పేది



కష్టం.రాహుల్‌గాంధీ విషయమే తీసుకోండి."కాంగ్రెస్ ముస్లిమ్‌ల పార్టీ" అని ఎందుకన్నారు?దీనికి ఎన్ని విమర్శలు,విశ్లేషణలు ఎదుర్కోవలసి వచ్చింది!

ఎన్నికల ముందు 2019 సమాజంలో వివిధ వర్గాలతో కలిసే కార్యక్రమంలో భాగంగా ముస్లిమ్ మేధావులను జూలై 11వ తేదీ కలిసిన సందర్భంగా రాహుల్ కాంగ్రెస్,ముస్లిమ్‌ల పార్టీ అన్నారని 'ఇంక్విలాబ్' అనే ఉర్దూ వార్తాపత్రిక రాసింది.

దీనిని నెపంగా తీసుకుని కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని, అల్పసంఖ్యాకులను శాంతింపజేస్తూ,సంతృప్తి పరచే మార్గంలో ఉందని విమర్శలు వచ్చాయి. కర్ణాటక ఎన్నికల సందర్భంగా 'యజ్ఞోపవీతం ధరించిన హిందువుగా' ప్రకటింపబడిన రాహుల్ ఏకంగా పార్టీని 'ముస్లిమ్‌ల పార్టీ' అనటమేమిటి అని ప్రశ్నించారు.

చాలామంది విలేకరి తప్పుగా రాశారన్నారు. విలేకరి తన రిపోర్టు పక్షమే నిలిచారు. "ఆలీగఢ్ ముస్లిమ్ యూనివర్సిటీ, జామియా మిలియాల గురించి ఎక్కువగా మాట్లాడకండి" అని ఎవరో సలహా ఇస్తే రాహుల్ గాంధీ ఇలా అన్నారట.

"ఒకవేళ బి.జె.పి., కాంగ్రెస్ పార్టీ ముస్లిమ్‌లది అని అంటే అననీ, కాంగ్రెస్ పార్టీ ముస్లిమ్‌లదే. ముస్లిమ్‌లు బలహీనులు గనుక కాంగ్రెస్ ఎప్పుడూ బలహీనుల పక్షమే" ఎన్ని విమర్శలొచ్చినా పార్టీ తరపున సమర్థింపేగాని రాహుల్ స్వయంగా మాట్లాడరే అని అందరూ ప్రశ్నించగా, రాహుల్ ట్వీట్ చేశారు.

"కుల,మతాలు నాదృష్టిలో చాలాచిన్నవిషయాలు... నేను పట్టించుకోను. ప్రతి మనిషినీ నేను ప్రేమిస్తాను- ఇదే కాంగ్రెస్. కాంగ్రెస్ అంటే నేనే"

మహానుభావా! మరొక తగాదాకు తెర తీశారు. కాని రాహుల్ మాటల్లో నిజాయితీ ఉంది.

ఆరోగ్యంగా ఉన్నవారికి కూడా క్యాన్సర్ స్క్రీనింగ్ అవసరం

● వ్యాధి లక్షణాలు బయట పడకముందే గుర్తించవచ్చు. ● చికిత్సలో 100 % ఫలితాలు రాబట్టవచ్చు.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad.
Ph : 98480 11421
Kurnool : 08518 273001
Guntur : 0863 2223300

మనం ఇంతకు ముందు సంచికలో చెప్పుకున్నట్లుగా, క్యాన్సర్‌ను ఎంత ముందుగా గుర్తిస్తే అంత సులువుగా నయం చేయవచ్చు. అయితే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడానికి మనకు రెండు రకాల కారకాలు అవసరం. అవి 1) క్యాన్సర్ వ్యాధి యొక్క ముందస్తు లక్షణాలను గురించి తెలుసుకోవడం 2) స్క్రీనింగ్.

1) ముందస్తు లక్షణాలు : సామాన్య ప్రజలు క్యాన్సర్ యొక్క ముందస్తు లక్షణాలను గురించిన పరిజ్ఞానం కలిగి ఉండటం వలన క్యాన్సర్‌ను త్వరగా గుర్తించడానికి వీలవుతుంది. గడ్డలు, అసాధారణ రక్తస్రావం, దీర్ఘకాలంపాటు ఆహారపు అరుగుదల సరిగ్గా లేకపోవడం, మొదలైనవి క్యాన్సర్ ముందస్తు లక్షణాలలో కొన్ని. బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారంలో క్యాన్సర్, నోటి క్యాన్సర్, పెద్ద ప్రేగులలో క్యాన్సర్, చర్మ క్యాన్సర్ వంటి వాటిలో పైన పేర్కొన్న లక్షణాలద్వారా క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చు.

2) స్క్రీనింగ్ : స్క్రీనింగ్ అనేది ఆరోగ్యంగా ఉండే వ్యక్తులలో నిగూఢమై ఉన్న క్యాన్సర్‌ను గుర్తించడానికి నిర్వహించే పరీక్ష. క్యాన్సర్ కారకాలు శరీరంలో దాగి ఉండే లక్షణాలు, ఇంకా బయటపడని వ్యక్తులలో నిర్వహించే సాధారణమైన, సులభమైన పరీక్ష. ముందు జాగ్రత్తగా ఈ పరీక్షలను నిర్వహించు కోవడం వలన మనకు ఎంతో మేలు జరుగుతుంది.

క్యాన్సర్ వచ్చే అవకాశం గలవ్యక్తులు :

★పొగత్రాగేవారు, పొగాకు నమలటం (గుట్కా పాన్ మసాల, జర్దా, మొదలైనవి) అలవాటు ఉన్నవారు.

★మద్యానికి బానిసలైనవారు, సిర్రోసిస్ లాంటి కాలేయ వ్యాధులు కలవారు.

★వ్యాయామం చేయనివారు, ఊబకాయం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా తీసుకునేవారు.

★పీచు పదార్థాలు తక్కువగా ఉండే ఆహారం తీసుకునేవారు, మసాలాలు ఎక్కువగా తినేవారు.

మహిళలకు నిర్వహించాల్సిన స్క్రీనింగ్ పరీక్షలు :

బ్రెస్ట్ క్యాన్సర్ : వయస్సు 40 సంవత్సరాలు నిండిన మహిళలు ప్రతి సంవత్సరం డిజిటల్ మమ్మోగ్రామ్ పరీక్ష చేయించుకోవడం మంచిది.

20 నుండి 30 సంవత్సరములు నిండిన మహిళలు ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి వైద్యునిచే స్థనాలను పరీక్ష చేయించుకోవాలి. 40 సంవత్సరాలు నిండిన మహిళలు ప్రతి సంవత్సరం స్థనాలను వైద్యునిచే పరీక్ష చేయించుకోవాలి.

20 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ రెగ్యులర్‌గా, ఇంటి వద్దనే స్థనాలను పరీక్షించు కోవాలి. స్థనాల్లో కణతులు, గడ్డలు ఏమైనా ఉన్నాయేమో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి.

గర్భాశయ ముఖద్వారపు క్యాన్సర్ :

సెక్స్‌లో పాల్గొనటం మొదలు పెట్టిన 3 సంవత్సరాల తరువాత నుండి ప్రతి మహిళ గర్భాశయ ముఖ ద్వారానికి స్క్రీనింగ్ పరీక్ష చేయించుకుంటూ ఉండాలి.

సాధారణ పి.ఏ.పి. పరీక్ష పద్ధతిలో సంవత్సరానికి ఒకసారి స్క్రీనింగ్ చేయించుకోవాలి. అదే అత్యాధునిక లిక్విడ్-బేస్డ్ పి.ఏ.పి. పద్ధతిలో అయితే రెండు సంవత్సరాలకు ఒకసారి పరీక్ష చేయించుకుంటే సరిపోతుంది.

30 సంవత్సరాలు పైబడిన వయస్సు కలవారు ప్రతి 3 సంవత్సరాలకి ఒకసారి పి.ఏ.పి. పరీక్ష మరియు హెచ్.పి.వి. డి.యన్.ఏ. పరీక్ష చేయించుకుంటే మంచిది.

కానీ, హెచ్.ఐ.వి. ఉన్నవారు, అవయవ మార్పిడి, కీమోథెరపీ, మత్తు పదార్థాలకు బానిసలవడం వంటి వాటి వలన రోగ నిరోధక శక్తి కోల్పోయిన వారు ప్రతి సంవత్సరం పైన చెప్పిన పరీక్ష చేయించుకోవాలి.



క్యాన్సర్ రాని గర్భాశయ ముఖద్వారం



క్యాన్సర్ సోకిన గర్భాశయ ముఖద్వారం

70 సంవత్సరాలు పైబడిన మహిళలలో గత 10 సంవత్సరాలుగా పి.ఏ.పి. పరీక్షలో నార్మల్‌గా వచ్చిన వారు స్క్రీనింగ్ పరీక్షలను ఆపేయవచ్చు.

హిస్టరెక్టమీ ద్వారా గర్భాశయంతో పాటు గర్భాశయ ముఖద్వారాన్ని కూడా తొలగించిన వారిలో స్క్రీనింగ్ టెస్టులు చేయాల్సిన అవసరం లేదు. అయితే కేవలం గర్భాశయాన్ని మాత్రమే తొలగించి, ముఖద్వారాన్ని తొలగించని సందర్భాలలో మాత్రం స్క్రీనింగ్ పరీక్షలను కొనసాగించాలి.

10 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు 46 సంవత్సరాలలోపు మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను ఇప్పించడం వలన 90% వరకు సర్వైకల్ క్యాన్సర్‌ని నివారించవచ్చు.

మగవారికి నిర్వహించాల్సిన స్క్రీనింగ్ పరీక్షలు:

ప్రోస్టేట్ క్యాన్సర్ : మగవారికి వచ్చే క్యాన్సర్‌లలో ప్రోస్టేట్ క్యాన్సర్ కూడా ఒకటి. భారతదేశంలో ప్రోస్టేట్ క్యాన్సర్ అసహజమేమి కాదు. కాని చాలా మందికి దీనిపై అవగాహన లేదు.

అనేక అంతర్జాతీయ సంస్థలు కూడా మగవారు రెగ్యులర్‌గా ప్రోస్టేట్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇస్తున్నాయి. 50 సంవత్సరాలు నిండిన మగవారు ప్రతి సంవత్సరం ప్రోస్టేట్ స్పెసిఫిక్ ఆంటిజన్ (పి.యస్.ఏ.) రక్తపరీక్ష, డిజిటల్ రెక్టల్ పరీక్ష చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా (నాన్న, సోదరుడు, కొడుకు) ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లయితే మిగతా మగవారు 40 సంవత్సరాల వయసు నుంచే ప్రోస్టేట్ స్క్రీనింగ్ చేయించుకోవాలి.

(సంశేషం)

జాతీయపార్టీల దక్షిణాది కష్టాలు

2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు తొలిసారిగా పార్లమెంట్‌లో నరేంద్రమోడీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం ఎదుర్కొన్నది. అవిశ్వాస తీర్మానంలో గెలుస్తామనే ఆలోచన ప్రతిపక్షాలకు లేదు.

స్పష్టమైన మెజారిటీవున్న ఎన్.డి.ఎ. ప్రభుత్వాన్ని ఈ దశలో పడగొట్టలేమని ప్రతిపక్షాలకు తెలుసు. అయినా అవిశ్వాసతీర్మాన ప్రతిపాదనను ఒక ప్రాంతీయ పార్టీ చేసింది. మరికొన్ని ప్రాంతీయ పార్టీలు బలపరుస్తున్నాయి.

సాధారణంగా పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానపు ఆలోచన ప్రధాన ప్రతిపక్షం తీసుకుంటుంది, మిగిలిన పార్టీలు బలపరుస్తాయి. కాని నరేంద్రమోడీ ప్రభుత్వంపై అవిశ్వాసంపెడదామన్న ఆలోచన అనధికార ప్రధానప్రతిపక్షపార్టీ కాంగ్రెస్ ఎన్నడూ చెయ్యలేదు.

సాధారణంగా అవిశ్వాస తీర్మానం అనేది ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టటానికి ప్రతిపక్షాలు వినియోగించుకుంటూ ఉంటాయి.

అటువంటి ప్రయత్నం కూడా కాంగ్రెస్ పార్టీ చెయ్యకపోవటం ఆ పార్టీ బలహీనత.

చివరికి ఎన్.డి.ఎ. ప్రభుత్వంమీద అవిశ్వాస తీర్మానాన్ని గతంలో ఎన్.డి.ఎ.లో భాగస్వామిగావున్న తెలుగుదేశం పార్టీ తెచ్చింది. గత సమావేశాల్లో ఇదే ప్రయత్నం ఒకసారి జరిగింది.

అప్పుడు అవిశ్వాస తీర్మానం ఇచ్చినది వై.కా.పా. అది కూడా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయపార్టీనే.

బడ్జెట్‌సమావేశాలలో అవిశ్వాసతీర్మానం చర్చకు రాకుండా ఇతర పార్టీలు అడ్డుకున్నాయి.

ప్రభుత్వం కూడా అవిశ్వాసం ఎదుర్కొనేకన్నా బడ్జెట్‌సమావేశాలు తుడిచిపెట్టుకుపోవటమే మంచిదన్న నిర్లక్ష్యధోరణి ప్రదర్శించింది. వెరసి తొలిసారిగా ఒక ప్రాంతీయ పార్టీ అదికూడా ఒక రాష్ట్ర అంశానికి సంబంధించి అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చింది.

ఈసారి మిగిలినపార్టీలు అడ్డుకోలేదు. ప్రభుత్వం కూడా అవిశ్వాస సవాలు స్వీకరించింది. నోటీసు అందుకోవటం, స్పీకర్ దానిని వెంటనే అంగీకరించి, చర్చకు సమయం కేటాయించడం జరిగింది. ఈ వ్యాసం వెలుగు చూసేసరికి అవిశ్వాస తీర్మానం కథ ఎలా ముగిసిందీ పాఠకులకు తెలిసిపోతుంది.

అవిశ్వాస తీర్మానసమయంలో ఎవరు ఎటువంటి అంశాలను లేవనెత్తింది,ఏ పార్టీ ఎటువంటి విమర్శలు చేసింది, ఆ విమర్శలకు సభానాయకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ ఎటువంటి ఎదురుదాడి చేసి ఆ తీర్మానాన్ని తోసిపుచ్చింది టెలివిజన్ తెరలమీద చూసి తెలుగు ఓటర్లు ఒక నిర్ణయానికి వచ్చేవుంటారు.

అయితే మిగిలిన పరిశీలకులు అంతగా గుర్తించని ఒక కీలకఅంశం అవిశ్వాసతీర్మానం ద్వారా దక్షిణాది రాష్ట్రాల రాజకీయధోరణి బహిర్గతం అవటం. రాజకీయంగా చూసినపుడు ఉత్తరాది, దక్షిణాది తేడాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వింధ్యపర్వతాలకు ఆవల, ఈవల వీస్తున్న రాజకీయ గాలులు భిన్నంగా వుంటున్నాయి. ఆ రెండు ప్రాంతాలలో రాజకీయపోరాటాలు జాతీయపార్టీలకు వ్యతిరేకంగా మారటం గమనించాలి.

ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలలో జాతీయపార్టీలు తమ ఉనికిని కాపాడుకోవటం కోసం శ్రమించాల్సివస్తున్నది.వాస్తవంలో బిజెపికి దక్షిణాదినఎన్నడూ అవకాశం లేదు. దానిని ఉత్తరాదిపార్టీగా కాంగ్రెస్‌వారు విజయవంతంగా చిత్రీకరించగలిగారు. పైగా బిజెపికి వున్న హిందీభాషాభిమానం నాటి జనసంఘ్‌ని దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించలేదు.



అదేవిధంగా జనసంఘ్‌ని బ్రాహ్మణ్-బనియా పార్టీ అంటూ ఒక రెండు సామాజిక వర్గాల గుప్పిట్లో వున్న పార్టీగా కాంగ్రెస్ ప్రచారం చేసి ఓటర్లను ఒప్పించగలిగింది. దాని ఫలితమే దక్షిణాదిన నాటి జనసంఘ్‌కి నిజాయితీతో వ్యవహరించే నాయకులు వున్నప్పటికీ, వారి ప్రభావం వారి నియోజకవర్గాలకు మాత్రమే పరిమితం అయింది.

అయితే నాటి జనసంఘ్ నేతలను విద్యావంతులు ఆదరించేవారు. కాబట్టి దక్షిణాది రాష్ట్రాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజక వర్గాల నుండి జనసంఘ్‌నేతలు శాసనమండలి ఎన్నికల్లో గట్టిపోటీఇచ్చేవారు, కొందరు గెలిచి శాసనమండలిలో తమ స్వరం గట్టిగా వినిపించేవారు.

వాస్తవంలో ఆంధ్రప్రదేశ్‌లో 1980ల్లో శాసనమండలి రద్దు ప్రతిపాదనను ఎన్టీఆర్ చేసింది బిజెపినేతల విమర్శలను తట్టుకోలేకనే. అయితే ఆ స్థాయినేతలు ఆ తర్వాతికాలంలో బిజెపిలో ఎదగకపోవటంతో క్రమంగా ఆపార్టీ ఆంధ్రప్రదేశ్‌లో బలహీనపడింది.

జనసంఘ్ రూపంలో వున్నప్పుడే ఆ పార్టీని దక్షిణాదికి విస్తరించకుండా పలురకాల ఎత్తుగడలు ప్రయోగించిన కాంగ్రెస్ తాము చేస్తున్న ప్రచారంతో సొంతపార్టీ కూడా క్రమంగా బలహీనపడుతున్న విషయాన్ని వారు గమనించుకోలేదు.

జనసంఘ్‌ని 'హిందీభాషపార్టీ' అనే ప్రచార అస్త్రం ద్రవిడపార్టీలకు అందించింది. ద్రవిడపార్టీలు తెలివిగా ఆ అస్త్రాన్ని కాంగ్రెస్‌మీదే ప్రయోగించాయి.

కాంగ్రెస్ పార్టీ నేతలకు హిందీ అభిమానం తక్కువేమీ కాదు. హిందీ రాకపోయినా కాంగ్రెస్‌లో జాతీయ స్థాయికి ఎదిగిన నేతలు కామరాజ్ నాడార్, సంజీవరెడ్డి వంటివాళ్ళని వేళ్ళమీద లెక్కించవచ్చు.

ఢిల్లీలో, కాంగ్రెస్‌పార్టీలో చక్రం తిప్పాలంటే హిందీ తప్పనిసరి అని దక్షిణాది కాంగ్రెస్ నేతలు చెవులు కొరుక్కుని తమ నిస్సహాయత ప్రకటించేవారు.కాంగ్రెస్‌ది అగ్రకులాల పెత్తనమే, హిందీ పెత్తనమే కాబట్టిఆ పార్టీని ఓడించాలంటూ ద్రవిడపార్టీలు ఇచ్చిన నినాదంతో తమిళులు అందునా వెనకబడిన సామాజికవర్గాలు ఒకే తాటికిందికి వచ్చి 1967లో కాంగ్రెస్‌ని మట్టికరిపించాయి.

ద్రవిడపార్టీల ప్రభుత్వానికి ఇది స్వర్ణోత్సవ సంవత్సరం. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ కోలుకోలేదు. తమిళనాడులోని కాంగ్రెస్ నేతలు తమ సొంత గెలుపు కోసం ద్రవిడ పార్టీల అండన బ్రతకాల్సివచ్చింది.

> ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, నీతి, విజ్ఞానానికి అద్దం పడుతుంది భాష.
> -వెంకయ్యనాయుడు, ఉపరాష్ట్రపతి

ద్రవిడ పార్టీలు ఎన్నిరకాలుగా చీలినా అధికారం మాత్రం వారిచేతిలోనుండి పోకుండా చూసుకున్నాయి. డి.ఎమ్.కె., అన్నా డి.ఎమ్.కె.లలో ఏదో ఒక ద్రవిడ పార్టీ గొడుగుకింద బ్రతకకతప్పటంలేదు కాంగ్రెస్‌కి. చిదంబరాలు, మణిశంకర్ అయ్యర్‌లకు తమిళులు ఎటువంటి గతిపట్టించారో అందరికీ తెలిసినదే.

అటువంటి తమిళ రాజకీయకోటను గత నాలుగు సంవత్సరాలలో ఛేదించాలని బిజెపి ఎన్నోరకాల ఎత్తుగడలను వేసింది.

ఎన్నిసార్లు నరేంద్ర మోడీ జయలలితను ప్రసన్నం చేసుకోవాలని ప్రయత్నించాడో, ఎన్నిసార్లు అమిత్‌షా రజనీకాంత్‌తో మంతనాలకు ప్రయత్నించాడో ప్రజలందరికీ తెలుసు.అయినా బిజెపిని తమిళనాడులోకి రానివ్వటం లేదు తమిళ ఓటర్లు. 1998 ఎన్నికల సమయంలో తొలిసారిగా తమిళనాడునుండి లోక్‌సభలోకి బిజెపి ప్రవేశించగలిగింది.

నాడు కోయంబత్తూరులో అద్వానీ హత్యకు ముస్లిమ్ సంస్థలు బాంబు పేలుళ్ళకు పాల్పడినందున కసిగా హిందూ ఓటర్లు బిజెపిని గెలిపించారు. అయితే ఆ గెలుపు తాత్కాలికమే.

ఆ తర్వాత తిరిగి అవకాశం ఇవ్వలేదు. రాహుల్ గాంధీ హత్య తమిళనాడులోనే జరిగింది. అయినా కాంగ్రెస్‌ని ఆదరించలేదు తమిళ ఓటర్లు. సానుభూతి ఓట్లతో గెలవగలమనుకున్న కాంగ్రెస్‌కి నిరాశే మిగిలింది. దక్షిణాగ్రంలో వున్న తమిళనాడులో జాతీయ పార్టీలు ఎదుర్కొంటున్న కష్టాలు అవి.

తమిళనాడు దాదాపుగా జాతీయపార్టీలకు 'నో ఎంట్రీ బోర్డు' పెట్టింది. చివరియత్నంగా బిజెపి రజనీకాంత్ అస్త్రం ప్రయోగించాలనుకుంటే, కమల్‌హాసన్ రాజకీయ రంగప్రవేశం బిజెపికి అడ్డంకి అయింది. తమిళనాడును గెలుచుకోవడం సంగతి పక్కనపెడితే, అసలు కాలుమోపటమే కష్టమైన వాతావరణం.

కేరళలో పరిస్థితి అంతకన్నా భిన్నమైనది కాదు. 70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో 1952 నుండి జరుగుతున్న ఎన్నికల్లో కేరళ అసెంబ్లీకి తొలిసారిగా ఒక్క ఎమ్.ఎల్.ఎ. తాజాగా ఎన్నికయ్యాడు. దీనినిబట్టి కేరళ ఎంతగా కొరుకుడుపడని రాష్ట్రమో బిజెపి పెద్దలకు అర్థమవుతున్నది.

కేరళలో కాంగ్రెస్ పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఒకప్పుడు ఆ రాష్ట్రంలో స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన పార్టీ కాంగ్రెస్. ఇప్పుడు క్రమంగా పలురకాల పార్టీలను కలుపుకుంటేగాని అధికారంలోకి రాలేదు. అది కూడా ఆ యా ప్రాంతీయ పార్టీ నాయకుల డిమాండ్లకు తల ఒగ్గితేనే ప్రభుత్వం నిలుస్తుంది. లేకుంటే అదీ లేదు.

కేరళలో కాంగ్రెస్ చేసిన పెద్దతప్పు ముస్లిమ్‌లీగ్‌తో జతకట్టి దానిని ప్రోత్సహించటం. 'సెక్యులర్' విధానం అని ప్రకటించుకుంటూ ముస్లిమ్‌లీగ్‌ని భుజంమీద ఎక్కించుకుని, క్రైస్తవపార్టీల కొమ్ముకాస్తూ క్రమంగా కాంగ్రెస్ సొంతబలాన్ని కోల్పోయింది.

కాంగ్రెస్ 'సెక్యులర్' రాజకీయాలకు విసిగిన కేరళ హిందూ జనాభా బిజెపివైపు మొగ్గుచూపడంలేదుకాని ఆర్.ఎస్.ఎస్.ని అభిమానిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నేత శశిథరూర్ చేస్తున్న హిందీ వ్యతిరేక వ్యాఖ్యలతో కేరళ మరింతగా మత రాజకీయాలలోకి నెట్టబడి రెండు జాతీయ రాజకీయపార్టీల వైపు విముఖత పెరిగినా ఆశ్చర్యం లేదు.

తెలుగురాష్ట్రాలను చీల్చి రాజకీయంగా లబ్ది పొందాలనుకున్న కాంగ్రెస్‌పార్టీకి ఓటర్లు గట్టిగానే బుద్ధిచెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తుడిచిపెట్టుకుపోయింది. తెలంగాణలో కార్యకర్తలు బలంగా నిలబడినా నాయకుల మధ్య విభేదాలు బలపడి కాంగ్రెస్ పార్టీ మరోమారు అధికారానికి దూరంకాక తప్పదనిపిస్తున్నది తెలంగాణలో. ఒక జాతీయపార్టీ బలహీనపడింది కాబట్టి రెండవ జాతీయపార్టీ ఐన బిజెపి బలపడుతున్న లక్షణాలు లేవు. బిజెపికి హైదరాబాద్‌కి ఆవల పట్టు తగ్గింది.

→ దక్షిణాదిన బలహీనపడిన కాంగ్రెస్
→ కాలు మోపటానికే కష్టపడుతున్న బిజెపి
→ బలంగావున్న ప్రాంతీయపార్టీలు
→ పుట్టుకొస్తున్న కొత్త ప్రాంతీయపార్టీలు

తెలంగాణ సెంటిమెంట్‌కి బిజెపి కార్యకర్తలు ప్రాంతీయపార్టీవైపుకు వెళ్ళిపోయారు. వారిని వెనక్కి తెచ్చుకునేందుకు చెయ్యాల్సిన పనులు ఎందుకనో బిజెపి నాయకులు చెయ్యటం లేదు. అంత సత్తా కలిగిన నాయకత్వం లేదక్కడ.

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగేళ్ళుగా స్తబ్దతగా పడకేసిన పార్టీ బిజెపి. కాంగ్రెస్ నేతలు ఎన్నిరకాల ఎత్తుగడలు వేసినా ప్రజలు ఆదరించని పార్టీ కాంగ్రెస్. దాదాపుగా ఒకే సమయంలో ఆ రెండు జాతీయపార్టీలలో కదలిక మొదలైంది. అయితే ఆ రెండు పార్టీలు ప్రభుత్వ వ్యతిరేక ఓటు కోసమే పాటుపడుతున్నాయి.

తెలుగుదేశం పార్టీ తన నాలుగేళ్ళ పాలనలో చేసిన తప్పిదాలు తక్కువేమీ కాదు.అయినా ఆ అధికారపార్టీ వ్యతిరేక ఓటు జనసేనవైపు మళ్ళుతుందేమోకాని జాతీయపార్టీలకు వచ్చే అవకాశం మాత్రం కనిపించటం లేదు.

దక్షిణాదిన రెండు జాతీయపార్టీలే కాదు మేము జాతీయపార్టీలమే అని చెప్పుకునే కమ్యూనిస్టు పార్టీల పరిస్థితి ఆశాజనకంగా లేదు. కేరళలో నామమాత్రపు ఉనికి తప్పించి మిగిలిన చోట్ల వామపక్షాలకు నాయకులు మిగిలారు. కార్యకర్తలు ఇతర పార్టీలతో సర్దుబాట్లు చేసుకున్నారు.

జాతీయపార్టీలకు కొద్దోగొప్పో ఆదరణ కనిపిస్తున్న రాష్ట్రం కర్ణాటక మాత్రమే. శక్తివంతమైన ప్రాంతీయ పార్టీ లేనందున జాతీయపార్టీలనే కన్నడిగులు ఆదరిస్తున్నారా! లేక కన్నడ ప్రాంతీయపార్టీలమీదవారికి విశ్వాసం కుదరటం లేదా! అనేది ప్రశ్న.

ఏమైనా బిజెపి బలంగావున్న దక్షిణాదిరాష్ట్రం కర్ణాటక. ఆ రాష్ట్రంలోనే కాంగ్రెస్ కూడా బలంగా వుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ దెబ్బతిని అధికారంలో జూనియర్ భాగస్వామిఅయినప్పటికీ సంస్థాగతంగా బలంగానే వుంది ఆ పార్టీ. దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో కలిసి 120 లోక్‌సభ స్థానాలున్నాయి.

ఆ 120 స్థానాలలో పోటీ చెయ్యగలిగిన స్థితిలో జాతీయపార్టీలు లేవు. ఇది జాతీయపార్టీల వాస్తవస్థితి.ఇటీవల తెలంగాణమంత్రి కె.టి.ఆర్.చేసిన ప్రకటన 'దక్షిణాదిన జాతీయపార్టీలకు స్థానం లేదు' అనేది గమనించాలి.'దక్షిణాదిప్రజలు ప్రాంతీయపార్టీలనే ఆదరిస్తున్నారు' అన్నది కె.టి.ఆర్. మాట.

ఇటువంటి వాటినే ఇదివరలో తెలుగుదేశం పార్టీ వారు అన్నారు. తెలుగురాష్ట్రాలలోని రెండు ప్రాంతీయ పార్టీలు చెప్పేది జాతీయ పార్టీలకు దక్షిణాదిన కాలం చెల్లింది అని. జాతీయపార్టీలని ఘనంగా చెప్పుకోవటమే గాని వాస్తవంలో అవి ప్రాంతీయపార్టీలకన్నా పెద్దవేం కాదు' అనేది.


అదే నిజమైతే దక్షిణాదిరాష్ట్రాలలోమరిన్ని ప్రాంతీయ పార్టీలు పెరిగే అవకాశముంటుంది. కొత్త ప్రాంతీయపార్టీలు ఇప్పటికే పుట్టుకువస్తున్నాయి.

ఆంధ్రాలో పవన్‌కళ్యాణ్, తెలంగాణలో కోదండరామ్‌లు ప్రాంతీయనేతలుగా ఎదగాలనుకుంటున్నారు. ఒక ప్రాంతీయపార్టీతో మరో ప్రాంతీయపార్టీ పోటీ పడితే ఫలితాలు ఎలా వుంటాయో తమిళనాడు, కేరళ రాజకీయాలు చూపుతున్నాయి.తమిళనాడులో ప్రాంతీయపార్టీలు రాష్ట్రప్రయోజనాలకోసం ఏకమవటం చరిత్ర. కాని అటువంటి ఐక్యత తెలుగు రాష్ట్రాలలోని ప్రాంతీయపార్టీలలో కనిపించదు.

బద్ధశత్రువుల్లా పోట్లాడుకుని తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు ఏదోక దశలో ఏదో ఒక జాతీయ పార్టీతో చేతులు కలపాల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికే బిజెపి చేయి వదిలి కాంగ్రెస్ చెయ్యిపట్టుకునే సర్కస్ తెలుగుదేశం పార్టీ చేస్తున్నది. అది ఆ పార్టీ బలహీనతను ప్రదర్శించుకోవటమే.

ప్రస్తుత పరిస్థితి ఎలావున్నా రాబోయే రోజులు తమకు ఆశాజనకం అనుకుంటున్నాయి జాతీయ పార్టీలు. కాంగ్రెస్ బలపడే అవకాశం లేదన్నది బిజెపి అంచనా. దక్షిణాదిన బిజెపిని అడుగుపెట్టనివ్వకుండా ప్రాంతీయపార్టీలను కలుపుకోవాలన్నది కాంగ్రెస్ ఆలోచన. ఒకరి మూలాలను మరొకరు నరుక్కునేలా జాతీయపార్టీల మధ్య రాజకీయం నడపటం దక్షిణాది ప్రాంతీయపార్టీల ఎత్తుగడ. ప్రస్తుతానికి దక్షిణాదిన ప్రాంతీయపార్టీలదే పైచేయి.

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు



దేవుడు నిద్రపోవడమా?

ఏ సంప్రదాయాన్ని హిందూ ధర్మం మనకి పాటించవలసిందని చెప్పినా దాంట్లో చెప్ప లేనంత విశేషం దాగివుంటుందనేది యథార్థం. ఆ విశేషాలు తెలుసుకోని-తెలియని కారణంగానే ఇత రులు మనని దుర్విమర్శ చేస్తూంటే మౌనంగా భరించ వలసినవాళ్ళమవుతున్నాం. అలాంటి విశేషాలని తెలుసుకోవలసిన బాధ్యత మనది.

వాటిని ప్రచారం చేసి హిందూధర్మాన్ని మరింతగా ప్రచారం చేయవలసిన కర్తవ్యం కూడా మనదే. మనని చెడుగా విమర్శించేవారిని గూర్చి 'వాళ్ళ పాపాన వాళ్ళే పోతా'రనే వైరాగ్యధోరణిని విడిచి మృదువుగా ఎదుటివారికి అర్థమయ్యేలా చెప్పుదాం!

ఈ నేపథ్యంలో శ్రీహరి ఆషాఢశుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) నుండి కార్తీకశుద్ధ ఏకాదశివరకూ అంటే నాలుగునెలలపాటు యోగనిద్రపోవడంలోని అంతరార్థాన్ని తెలుసుకుందాం!

దేవుడి కర్తవ్యం

ఏ కష్టం వచ్చినా మనం దైవాన్ని ప్రార్థిస్తాం.

అప్పుడా దైవం మన కష్టాన్ని తొలిగించి సుఖాన్ని సమకూరుస్తున్నాడు. అంతేకాదు మనం చేసిన పూజా ఫలానికి అనుగుణంగా మనం ఊహించని -

అడగని ఓ శుభాన్ని కూడా కలిగిస్తున్నాడు కొన్ని కొన్ని సందర్భాల్లో. ఇది నిజం కదా!

రాముడంతటివాడు-సాక్షాత్తు శ్రీహరి అవతార మైనవాడు - రావణుణ్ణి వధించవలసిందని దేవతలూ మహర్షులూ కోరితే-రావణవధ చేయగలిగినంత తపశ్శక్తి తన దగ్గర ఉందా? అని పరిశీలించుకుని, తన వద్ద అంత తపశ్శక్తి లేదని తెలుసుకుని

క్రమంగా- అహల్యనీ, అరణ్యంలో తపస్సు చేసు కుంటూండే మహర్షుల్నీ యాచించి తపశ్శక్తిని పొంది, ఆ తపశ్శక్తితో రావణుణ్ణి వధించగలిగాడు. చిత్రమే మంటే రాముడు క్షత్రియజాతికి చెందినవాడు.

ఎవరి చేతికిందనూ చేయి పెట్టి యాచించకూడని వాడు (**న ప్రతిగ్రహీతా**)ఐనా దేవతల ఋషుల రక్షణం కోసం తన తపశ్శక్తి చాలనందున తపశ్శక్తిని ఋషులనుండి యాచించి మరీ రావణవధని మిగి లిన రాక్షసులందరితో కలిపి చేయగలిగాడు.

అంటే ఏమన్నమాట? దైవం కూడా ఏ రక్షణని చేసినా ఆ పనికి సరిపడినంత తపశ్శక్తిని వ్యయం చేసుకుంటూనే ఉంటాడన్నమాట.

అలా సంవత్సరంలో 8 నెలలపాటు తపశ్శక్తిని ప్రజారక్షణం కోసం వ్యయం చేసేస్తూ చేసేస్తూ వెళ్ళి, ఆ కోల్పోయిన తపశ్శక్తిని తిరిగి నింపుకోవడం కోసం ఆ మిగిలిన 4 నెలల కాలంపాటూ తపస్సుని ఏకాం తంలో చేసుకుంటూ ఉంటాడన్నమాట.

ఆ తపస్సుని ఆర్జించుకునే కాలాన్నే 'యోగ నిద్రా కాలం'గా చెప్పారు పెద్దలు.

ఆ తపస్సుని ఏ కాలంలో ప్రారంభించాలా? అనుకున్న శ్రీహరి ఉత్తరాయణం దాటినవెంటనే తనకి ప్రీతికరమయిన తిథి ఏకాదశి ఎప్పుడొస్తుందో చూసుకుని ఆ రోజున- అంటే దక్షిణాయనంలోవచ్చే మొదటి ఏకాదశి (తొలి ఏకాదశి) రోజున తపస్సుని ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు.

నిజానికి శ్రీహరి ఎప్పుడూ 'శేషశయనుడు' అంటే ఆదిశేషునిమీద పడుకునేకన్పిస్తాడు.మరి ఇంకానిద్రిం చడమేమిటి? అంటేనిత్యం ఆయన కనులుగా ఉన్న సూర్యచంద్రులని ఆధారంగా చేసుకుని రాత్రినీ పగటినీ గమనిస్తూనే ఉంటూ ఆ రాత్రింబవళ్ళలో సాగుతున్న ప్రపంచపు నడకనీ,

ఈ కాలంలో జనం చేసే ధర్మాధర్మాలని పరి శీలిస్తూనే ఉంటాడాయన. అయితే ఈ నాలుగు నెలల కాలంపాటూ తాను అలా పరిశీలించే వీలు లేకుండా తపస్సుకి వెళ్తున్నాడు కాబట్టీ, ఆ తపశ్శక్తి కూడా మన రక్షణకోసమే కాబట్టీ-

ఇది నిజం కాబట్టే సంప్రదాయం తెలిసిన ఏ స్వామీజీ లేదా సంన్యాసాన్ని తీసుకున్న సంన్యాసీ కూడా ఈ నాలుగు నెలల కాలంపాటూ తన ఆశ్ర మాన్ని దాటి బయటికి వెళ్ళనే వెళ్ళడు.

అంతేకాదు, ఈ నాలుగు నెలల కాలంలోనూ రక్షణ అనేది ప్రజలకి కలగాలంటే తపశ్శక్తే కావలసి ఉంటుంది కాబట్టి, ఈ సంన్యాసులంతా జనులకి తపశ్శక్తి పెంపొందేందుకు కావలసిన దైవధ్యానాలనీ కీర్తిగానాలనీ, భజనలనీ, పూజాపురస్కారాలనీ భారత శ్రీమద్రామాయణ భాగవత గ్రంథాలనీ చదవడాన్ని ఏర్పాటుచేస్తారు.

అందుకని 'శ్రీహరి యోగనిద్ర' అంటే మన రక్షణ కోసం ఆయన చేసే 'తపస్సే' అని అర్థం.

మరో ప్రయోజనం

శ్రీహరి దేన్ని చేసినా దానిలో ఓ విశేషార్థం దాగుంటుంది. లోకంలో ధర్మప్రచారాన్ని చేసేవాళ్ళని 'స్వామీజీలూ' 'తాపసులూ' అంటుంటాం.వాళ్ళు వాళ్ళవాళ్ళ మఠాలు నిర్వహించుకోవాలంటే గృహస్థులు (సంసారులు) తప్పక సహకరించాల్సిందే.

ఆ ఉద్దేశ్యానికి అనుగుణంగానే గృహస్థులు మఠాలకి ఇస్తూనే ఉంటారు ధనరూపంగా ద్రవ్య (భోజన పదార్థాలు) రూపంగా... ఇలా.

ఈ చాతుర్మాస్యమనే పేరున్న నాలుగు నెలల కాలాన్నీ సంన్యాసులూ యతులూ స్వామీజీలూ తాపసులూ అనేవారికి 'నిషేధ కాలం' (ఎటూ ఆశ్రమాలని విడువకూడదు-తిరుగకూడదు)గా విధించనిపక్షంలో ఈ స్వామీజీలూ మొదలయినవారు 'శిష్యసంచారం' పేరిట గృహస్థులవద్దకి వెళ్ళనే వెళ్తారు.

స్వాములు తమ తమ ఇండ్లకి వచ్చారనే ఆనందంతో గృహస్థులంతా స్వాములవారి దగ్గరికే వచ్చేస్తే, అతి ముఖ్యమైన వర్షకాలం (వర్షాకాలం అనకూడదు) ఇది కాబట్టి గృహస్థులైనవాళ్ళు పొలంపనులకి వెళ్ళ(లే)రు 'స్వాములొచ్చా'రనే గౌరవంతో భయభక్తులతో. దాంతో లోకంలోని జనులందరికీ ధాన్యాభావం (పంట లేకపోవడం) కలుగుతుంది.

అందుకని వర్షకాలం వస్తున్న 4 నెలల కాలాన్నీ 'చాతుర్మాస్యకాల'మని పిలుస్తూ ఈ స్వామీజీలని 'తిరుగరా'దనే నియమానికి కట్టుబడేలా చేశారు.

తిరుగరాదన్నారు కాబట్టి మళ్ళీ వీళ్ళందరూ విశ్రాంతిని తీసుకోకుండా అందరిచేతనూ దైవకార్యక్రమాలనే చేయించాలనే ఉద్దేశ్యంతో వాళ్ళకి 'దైవారాధనం కర్తవ్య'మ్మనే విషయాన్ని (దేవుణ్ణి ఆరాధించి తీరాలి) వివరించి అలా ధ్యానం చేయిస్తూనేఉంటారు. ఇప్పుడీ నాలుగు నెలల చాతుర్మాస్యంద్వారా భగవత్ ధ్యానంలో కాలాన్ని గడపాలనీ వ్యవసాయపు పనులు చేసుకునే కాలంలో రైతు గృహస్థుల ఇళ్ళకి శిష్య సంచారంపేరిట వెళ్ళరాదనీ తెలిసింది.

ఇది ఆషాఢమాసం కాబట్టి నూతనంగా వివాహమైన జంటని దూరంగా ఉండాలనీ ఒకేచోట ఉండరాదనీ ఓ నిషేధాన్ని శాస్త్రం విధించింది.

నిషేధమంటూ ఒకటుంటే అది అన్ని జంటలకీ వర్తించేదిగా ఉండాలి కాని, కేవలం నూతన వధూవరులకి మాత్రమే ఉండమేమిటి? అనేది ప్రశ్న.

దీనికీ శ్రీహరి యోగనిద్రాకాలానికీ గల సంబంధం ఏమిటనేది కూడా ఓ ముఖ్య ఆలోచనమే. కొత్త జంట ఎప్పుడూ దాంపత్యం కోసమే ఎదురుచూస్తూఉంటారు. వాళ్ళకి దాదాపు రాత్రింబవళ్ళభేదం కూడా ఉండకపోవచ్చు. అలాటి సందర్భంలో ఒకవేళ గాని ఆమెకి గర్భధారణ కనుక జరిగితే కాన్పు మంచి వేసవి కాలంలో జరుగుతుంది.

కొత్త జంట దూరం దూరం

వేసవిలో పుట్టిన పిల్లలు బలిష్ఠంగా, మిగిలిన కాలంలో పుట్టినవారిలా ఉండ(లే)రు.

ఇక పగటివేళలోగాని ఆమె గర్భాన్ని ధరిస్తే కలిగే సంతానానికి నేత్రవ్యాధులూ, అపమృత్యుదోషం (గాయాలూ వాహన ప్రమాదాలూ దాడులూ)వంటివి కలిగే అవకాశం ఉంటుంది.

మృగాలూ జంతువులూ పశువులూ పక్షులూ క్రిమికీటకాలూ వెతికి వెతికి చంపబడడానికి కారణం పగటిపూటచేసే సంసారం కారణంగా గర్భాన్ని ధరించడం మాత్రమే. రాత్రిపూట సంగమించే అభ్యాసం ఈ పశుపక్ష్యాదులకి ఉండనే ఉండదు.

మరో ఆరోగ్యరక్షణ ప్రయోజనమేమంటే- 4 నెలల ఈ కాలం ఇటు ఎండలకాలానికీ అటు చలికాలానికీ మధ్యదైన కారణంగానూ,

ఈ రెంటికీ మధ్య ఉంటూన్న మన శరీరం రెండు వాతావరణాలకీ తట్టుకోవాల్సిన అవసరము వున్న కారణంగానూ, 4 నెలల కాలంలో 4 తీరుల ఆహారాన్ని తీసుకోవాల్సి ఉందనడం.

అందుకే ఆషాఢశుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) నుండి శ్రావణశుద్ధ దశమి వరకూ ఉండే మొదటి నెలలో పప్పు పచ్చడి వంటి వాటిని విడిచి కేవలం కూరతోనే భోజనం చేయడం- రెండో నెలలో కేవలం మజ్జిగతోనే భోజనం-

మూడోనెలలో పాలతోనే భోజనం చేయడం- నాల్గవనెలలో అసలు నూనె ఏ మాత్రమూ వాడని భోజనాన్ని చేయడం- రెండు ఆకుల ఆకుకూరలు కాయగూరలతో భోజనం చేయడం... అనే నియమాన్ని పాటించాలన్నారు.

నిద్రపోతున్న వంకతో దైవధ్యానం, శ్రీహరి తన తపశ్శక్తిని పెంపొందించుకోవడం-

మనకి భోజన నియమం, వ్యవసాయపు పనులు చేసుకోవడం... ఇన్నిటిని అందించేమాసాల సమాహారం చాతుర్మాస్యం అన్నమాట!

డా॥ మైలవరపు శ్రీనివాసరావు

అమ్మకు నివాళి



తొమ్మిది దశాబ్దాలపాటు అలుపెరగకుండా, చిరునవ్వును చెదరనీయకుండా పరిపూర్ణ జీవితాన్ని గడిపిన వేమూరి సీతారావమ్మ కన్ను మూశారు. కృష్ణాజిల్లా ఘంటసాల ఆమె జన్మస్థలం. దివంగత వేమూరి గోపాలరావుగారితో వివాహం తర్వాత ఘంటసాలపాలెంకు మారింది. ఆమెకు ఏడుగురు సంతానం.

స్వాతి పత్రికల అధినేత వేమూరి బలరామ్ పెద్ద కుమారుడు. జనార్దనరావు, వెంకటరామయ్య, తుమ్మల వెంకటరత్నం, మండవ ఉమామహేశ్వరమ్మ (లేరు), రావులపల్లి ఝాన్సీ, తుమ్మల భవాని (లేరు) ఆమె సంతానం. సామాన్యమైన రైతు కుటుంబానికి చెందిన సీతారావమ్మ పచ్చని కుటుంబాన్ని పండువెన్నెల్లా నడిపించారు.

కాలగమనంలో ఎదురైన అన్ని సంఘటనలనూ నిబ్బరంగా ఎదుర్కొన్న మాతృమూర్తి. నిండుగా, చిరునవ్వు చెదరనీయకుండా వచ్చినవారిని ఆప్యాయంగా పలకరించేవారు. ఆదరంగా కబుర్లు చెప్పేవారు.

బంధుప్రీతి ఎక్కువ. తనవారెవరు కనిపించినా ఆ సంతృప్తి ఆమెముఖంలో కొట్టొచ్చినట్లు కనపడేది. మాటల్లో చమత్కారం తొంగిచూసేది.

స్వాతి బలరామ్ సాక్షాత్తూ సరస్వతీ పుత్రుడు. లక్ష్మీ తనయుడు తనబిడ్డే అన్న కించిత్ అతిశయమో, అంతులేని ఆనందమో కాని ఆమెలో ఓ విరుపూ, మెరుపూ కనిపిస్తుండేవి.

నిశ్చింతగా, మిగతా లౌకిక విషయాలతో పనిలేదన్నట్లు వాస్తవిక దృక్పథంతో కనిపించే అమ్మ 'నేను లేకపోతే ఎలా' అని ఆఖరిరోజుల్లో పరితపిస్తూ, తప్పని వయోభారంతో తరలి వెళ్ళిపోయింది.

ఆత్మీయపూరితమైన ఆమె పలకరింపు, భావరహితంగా ఉండే ఆమె చిరునవ్వు చిరస్మరణీయం. ఎక్కడున్నా ఆమె ఆత్మకు శాంతికలగాలని, ఆమె చల్లని దీవెనలు అనుక్షణం అండగావుండాలని భగవంతుడిని ప్రార్థించడమే ఆమెకు అందించే నివాళి. ◆

కాఫీ-టిఫినూ-భోజనమూ

“చాల్లెండి ఇక కట్టిపెట్టండి. పెళ్ళాన్ని బెడ్‌మీదకు లాగేసేయడానికి ఏదో ఒక పుస్తకం తీసుకోవడం, అందులో శృంగారం గురించి ప్రచురించిన వ్యాసం చదవడం, వెంటనే ముగ్గులోకి దిగిపోవడం. మీకు మీ అమ్మానాన్నా 'శృంగారం' అని పేరుపెట్టి ఉంటే బాగుండేది...” అంటూ నవ్వుతూ భర్తవైపే చూస్తోంది ఆమె. ఇంతలో...

సూర్యశ్రీ

“భరించలేని తలనొప్పి ఓ చిట్కా వుంది. దాన్ని పాటిస్తే క్షణాల్లో నెప్పి మాయం. అదేంటో తెలుసా?

బరువు పెరుగుతున్నారా? డైటింగ్ తప్ప ఇంకేదైనా చేస్తారా? శ్రమనిపించినా భలే హుషారయిన వ్యాయామం ఒకటుంది చెప్పమంటారా?

ఏమిటీ పక్కింటి అమ్మాయి మిమ్మల్ని ఆంటీ అనిగాని అంకుల్ అనిగాని పిలుస్తోందా? మీ వయసు ముప్ఫయికి దగ్గరపడుతుందా? అప్పుడే అలా అనిపిస్తే ఎలా? సరే ఒక పనిచేయండి... మీ వయసు ఐదారేళ్ళు వెనక్కి వెళ్ళిపోతుంది ఎలాగంటారా?

ఆఫీసులో మరీ పని ఎక్కువైందా? ఒత్తిడితో సతమతమౌతున్నారా? ఏం ఫర్వాలేదు. ఒత్తిడి తగ్గించుకోండి... అదెలాగో చెప్పాలా?

ఈ సమస్యలన్నింటికీ ఒక్కటే ఔషధం. అదే శృంగారం! శరీరానికే కాదు మనసుకూ శక్తిని ఇచ్చే గోళీ, అదేనండీ టాబ్లెట్... పడకగదే సుమా. అదే ఆసుపత్రి, జీవిత భాగస్వామే డాక్టర్! అన్నీను...

వెంటనే ఎంచక్కా ఫ్రెషప్ అయిపోయి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయి, ఒకరిలో ఒకరు మమేకమైపోండి, అబ్బ! ఎంత ఫ్రెష్‌గా ఉందో కదూ!


అసలు విషయం మీకు తెలుసునా? శృంగారానుభూతుల వలన మనిషి శరీరంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్ హార్మోన్‌కు ఒత్తిడిని, శరీరంలోని అలసటను, తలనొప్పిని, అవిశ్రాంతమైన మనసును దూరం చేసే శక్తి ఉందని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరింకా ఆలోచిస్తున్నారేం? ముందుకు ఉరకండి”

సుందరం ఒక వారపత్రికలోని వ్యాసం చదువుతున్నాడు. అతను తెల్లని లాల్చీ, పైజమాలో ఉన్నాడు, అతని శ్రీమతి సౌందర్య అతని ఎదురుగా తెల్లని చీరలో తలలో మల్లెపూలతో అపర రతీదేవిలా పురుషుణ్ణి పడకకు ఆహ్వానించే రీతిలో ఉంది.

“చాల్లెండి ఇక కట్టిపెట్టండి. పెళ్ళాన్ని బెడ్ మీదకు లాగేసేయడానికి ఏదో ఒక పుస్తకం తీసుకోవడం, అందులో శృంగారం గురించి ప్రచురించిన వ్యాసం చదవడం, వెంటనే ముగ్గులోకి దిగిపోవడం. మీకు మీ అమ్మానాన్నా సుందరమని పేరుపెట్టకుండా 'శృంగారం' అని పెట్టివుంటే బాగుండేది” అంటూ భర్తని సమ్మోహనమైన చూపులతూపులతో చూస్తోంది.

“నేను చదివేది బూతు పురాణం కాదుగదా. ఎందుకంత ఆవేశపడతావ్. మనం బెడ్‌మీదకు ప్రవేశించే ముందు, ఇద్దరి మనసుల్లో శృంగారపుటాలోచనలు నింపుకుని రంగంలోకి దిగామే అనుకో ఇక చూస్కో...” అంటున్న అతన్ని మారు మాట్లాడనియ్యకుండా సౌందర్య “మీకు అసలు సిగ్గూ లజ్జా పెట్టనేలేదు దేవుడు. ఇవ్వాళ ఆదివారం, మీకూ నాకూ కంపెనీలకు శెలవు. పైగా ఇప్పుడేమో పట్టపగలు పన్నెండుగంటలు, చాల్లెండి పిచ్చి మేళం” అంటున్న ఆమె పెదవులపై తన కుడి అరచేయి ఉంచి సుందరం...

“అపురూపా మనం ఇవ్వాళ మ్యాట్నీ కార్యక్రమంలోకి వెళ్ళబోతున్నాం. ఆలుమగల కేళీవిలాసాలకు సమయము సందర్భం ఉండకూడదోయ్ డియర్. అబ్బో! నాకు మూడ్ వచ్చేసింది బాబూ అంటూ ఆమె మీద శృంగారదాడి మొదలెట్టేశాడు. ఇంతలో బెడ్ పక్కనే టీపాయ్‌మీద సెల్ మోగింది “ఫోన్ ఎత్తండి బాబూ'అనే రింగ్‌టోన్‌తో.



అందరూ నన్నే కోరుకుంటున్నట్లు కనిపిస్తోంది. అందుకే అమెరికా అధ్యక్ష పదవికి మళ్ళీ పోటీ చేస్తా. -డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

వెంటనే సుందరం “రాణీ ఏమిటే ఆ ఫోన్ చేసేవాళ్ళకి కూడా కాస్తంత ఇంగిత జ్ఞానం ఉండొద్దూ, ఇప్పుడా ఫోన్ చేసేది” అంటుంటే...

“సుందర స్వామీ ఇది మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటల సమయం, తమరు శృంగార తీరంలో విహరిస్తారని ఎవరనుకుంటారూ.... ముందు ఫోన్‌చూడండి” అంటూ సౌందర్య బట్టలు సవరించుకోసాగింది.

సుందరం సెల్ చూసినవెంటనే ఒక్కసారిగా సౌందర్యనుండి విడివడి “అమ్మో మా నాన్నగారు...” అనుకుంటూ “హలో నాన్నగారూ... ఏంటి ఫోన్ చేశారు? తమ్ముడి పెళ్ళి ఎప్పుడు నిర్ణయం చేశారు?” అన్నాడు.

“... ... ...”



“అలాగా, అంటే మా అపార్ట్‌మెంట్లోనే అందరూ వచ్చి వుండి, పెళ్ళి కార్యక్రమం కళ్యాణ మండపంలో ముగించేస్తారా?”

“... ... ...”

“అవునులే మూడు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్ కదా మాది. అలాగే రెండ్రోజుల్లో వచ్చేస్తారా అందరూ”

“... ... ...”

“బై నాన్నగారూ” అంటూ ఫోన్‌పెట్టేశాడు సుందరం. వెనకటికి తాయిలం కొనిపెట్టమంటే, పెద్దవాళ్ళు కొనకపోతే, చిన్నపిల్లవాడు మారాంచేసి అదో రకంగా ముఖం పెట్టినట్లుగా అతని ముఖం మాడిపోయింది కళావిహీనంగా. సౌందర్య అతని వాలకంచూసి మన్మథ బాణంలాంటి నవ్వు విసిరి “ఏమైంది రాజా” అంది గడ్డం పట్టుకుని.

పదిరోజుల్లో తమ్ముడి పెళ్ళి అనీ, తమ అపార్ట్‌మెంట్‌కి రెండురోజుల్లో అందరూ వచ్చి ఊళ్ళో కళ్యాణ మండపంలో పెళ్ళి చూసుకుని, పదహారు రోజుల పండగదాకా వుండి వెళ్తామని చెప్పారనీ సుందరం భార్యకు చెప్పి “నా పని గోవిందా! నాకు ప్రతీరోజూ సుందరాంగి పొందు లేకపోతే కాలం గడవదు, ఏమిటో...” అంటూ నుదురు కొట్టుకుంటున్న భర్తను కొంటెగా చూస్తూ...

“మా బాగా కుదిరింది కామేశ్వరరావుగారూ... తమరు కామప్రకోపం

కంట్రోల్ చేసుకోండి బాబూ'' అంది సౌందర్య.

విసుగూ విరామం లేని, పగలూ రాత్రీ తేడా లేని కౌగిలింతలూ సుందరం సౌందర్య సంసారంలోని ఒక విశేషం అయితే మరోటి ఇద్దరూ ఒకర్ని ఒకరు రకరకాల పేర్లతో సందర్భానుసారం సంబోధించుకోవడం మరో విశేషం.

"అంతా బాగానే ఉందిగాని కామినీ రెండురోజుల్లో పెళ్ళివారు వచ్చేస్తారు. పోనీ మన ఫ్లాట్స్‌లో మరో ఫ్లాట్‌ఖాళీగా ఉంది. పెళ్ళికోసం అద్దెకు తీసుకుందాం అని మా నాన్నగారితో అన్నానే అనుకో, ఆయన పాకిస్తాన్ ప్రెసిడెంట్ జనరల్ ముషారఫ్‌లాగా నాకు మరణదండన విధించినా విధిస్తారు. ఆయనకు చచ్చేంత కోపం. అది సరేగాని, ఈ రెండురోజుల్లో తీరిక దొరికినప్పుడల్లా పడకగదిలోకి నిన్ను లాగేస్తుంటాను, నాకు ఎదురు చెప్పకూడదు సుమా!

మరి నేను నీ పొందు లేకుండా ఉండలేనుకదే పెంకిపిల్లా... సుందరవదనా..." అంటూ సౌందర్య ముఖాన్ని దగ్గరకు లాక్కుని లిప్‌లాక్ చేసేశాడు ఆమెను మారుమాట్లాడనియ్యకుండా.

"మ్... మ్..." అంటూ భర్త నుండి విడిపించుకుంది ఎలాగో. వెంటనే సుందరం... ఒంపుసొంపుల వయ్యారీ... మనింట్లో పెళ్ళివారు ఉన్నన్నాళ్ళూ నాకు శృంగారపుటాకలి కలిగినప్పుడల్లా కొన్ని కోరికలు అడిగేస్తుంటాను. నువ్వు కాదనకుండా నన్ను చాటుకు లాక్కెళ్ళి వాటిని ఇచ్చేస్తుండాలి తెలిసిందా!"

"ఏం కోరికలు మదనా పాడుకోరికలు కోరకూడదు సుమా... బుగ్గలు కొరికేస్తాను, మళ్ళా మరిదిగారి పెళ్ళయ్యేవరకూ ఎవరికంటా పడకుండా బుగ్గలకు బ్యాండేజీతో పారిపోతావ్"అంది నవ్వులురువ్వుతూ.

"మనిద్దరికీ ఒక కోడ్ భాష ఉంటుంది.నేను ఉన్న పళంగా కాఫీ అన్నానే అనుకో నాతోపాటు నువ్వు చాటుకు వచ్చేసి నీ అధరామృతం అందించాలి. నేను వెంటనే దాన్ని తాగేసి అల్లరి మానేస్తాను.

రెండోది, టిఫిన్ కావాలి అన్నానే అనుకో వెంటనే నన్ను బాత్‌రూమ్‌లోకి లాక్కువెళ్ళి నీ శరీరంలోని





హారర్ తార

హారర్ చిత్రాల్లో అదరగొట్టేసే అంజలి అదే జోన‌ర్‌లో ముందుకు దూసుకువెళుతున్నది.

ప్రస్తుతం అరడజను చిత్రాలు ఆమె చేతిలో వున్నాయి. వాటిలో 'లీసా', 'గీతాంజలి 2' 'ఓ' సినిమాలు హారర్ సినిమాలే.

ఈ మధ్య 'ఓ'లో అంజలి ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. దీన్ని చూసినవారంతా 'ఓహో' అంటున్నారు.

రక్తం కక్కుకుంటూ, రివర్స్‌లోగల అంజలి పోస్టర్ సినిమాపట్ల ఆసక్తిని పెంచేస్తున్నది.

ఏమైనా 'హారర్ తార'గా అంజలి బ్రహ్మాండంగా గుర్తింపు పొందుతున్నది.

కైపెక్కించే భాగాలున్నాయ్ చూడూ వాటిని తనివి తీరా ముట్టుకోనివ్వాలి తెలిసిందా?

మూడోది, భోజనం కావాలి అని అడిగానే అనుకో. వెంటనే మన బెడ్‌రూమ్‌లోకి నన్ను లాక్కెళ్ళి చాలా తొందరగా మన ఇద్దరి బట్టలూ నలిగిపోకుండా సంగమం లైట్‌గా లాగించేయాలి.... తెలిసిందా?

ఇవన్నీ నీకు చెవిలో చెబుతాను, ఏం ఫర్వాలేదులే... ఒకవేళనేను కోరిక కోరిన సందర్భంలో ఎదురుచెప్పావనుకో అందరి ఎదురుగా నీపైట పట్టుకుని లాగేస్తాను, తెలిసిందా వయ్యారీ"అంటున్న భర్తనుచూస్తూ ఏం మనిషి బాబూ ఈయన అన్నపానాలు లేకపోయినా వుంటారుగాని పెళ్ళాం సరసన లేకపోతే అస్సలు ఉండలేరు. ఎలా గడుస్తాయో ఏమో ఇరవైరోజులు అనుకుంటూ....

"సరేలెండి కామరాజా, తప్పేదేముంది? కాని ఇల్లంతా పెళ్ళివారు ఉంటారు, నా చెల్లెలు మిమ్మల్నే టార్గెట్ చేసి గమనిస్తుంటుంది చూసుకోండి" అంది సౌందర్య.

అనుకున్న రోజు రానేవచ్చేసింది అతి వేగంగా, హైదరాబాదులో మెట్రో రైలంత వేగంగా. సుందరం తల్లీ, తండ్రీ, తమ్ముడూ, సౌందర్య తల్లీ, తండ్రీ, తమ్ముడూ, చెల్లెలూ, ఇంకా ముసలీముతకా ఓ పాతికమంది వచ్చేశారు. వాళ్ళ మూడు బెడ్‌రూముల అపార్ట్‌మెంట్‌లో మనిషి మనిషీ రాసుకుంటూ తిరగాల్సిన పరిస్థితి వచ్చేసింది.


ఇల్లంతా నిండిపోయింది. అడుగు ఖాళీ లేకుండా ఇల్లంతా చిందరవందరగా జోళ్ళ జతలు, విడిచిన బట్టలూ, తువ్వాళ్ళూ, బ్యాగ్‌లూ, సూట్‌కేస్‌లూ, గందరగోళంగా ఉంది ఇల్లంతా.

సుందరం, సౌందర్యా తమ ఇంట్లో శుభకార్యం జరిగేక పదహారురోజుల పండగదాకా శెలవులు పెట్టేశారు. ఇంట్లో నేను చూసుకుంటాను, మీరు కంపెనీకి వెళ్ళిపోండి. కావాలంటే పెళ్ళికి నాలుగు రోజులు సెలవు పెడుదురుగాని అన్నది సౌందర్య.

ఎందుకంటే మొగుడికి కాఫీ, టిఫిన్, భోజనం అందించే పని తప్పుతుందని, కాని అతను వింటేనా. ఒకరోజు భార్య గులాబీ రంగు సిల్క్‌చీర కట్టి చీరలో ఒదిగిపోయిన బొద్దు శరీరంతో అటూ ఇటూ తిరుగుతుంటే నాల్గుసార్లు కాఫీకావాలన్నాడు సుందరం.

"ఇదేమిటే చోద్యం... మీ ఆయన ఎన్నిసార్లు కాఫీ తాగుతాడేమిటీ?" అంది సౌందర్య తల్లి. కాఫీ అంటే కాఫీ కాదని ఆమెకు ఎలా చెప్పగలదు?

ఇంకోనాడు పాలపిట్ట రంగు కోటా చీర కట్టుకుని వయ్యారంగా తిప్పుకుంటూ తిరుగుతుంటే, భార్యని చూసి ఆమె చెవిలో భలేగా ఉన్నావే ఇవాళ భోజనం చెయ్యాలనుందనుకో కాని అంటూ ఏదో చెప్పబోతూ వుంటే దూరముగా పారిపోయింది. వెంటనే గట్టిగా సౌందర్యా టిఫిన్ పెట్టు నాకు అర్జెంట్‌గా అని అరిచాడు. వెంటనే ఎక్కడి నుంచి వచ్చిందో మరదలు పిల్ల వచ్చి ఇందాకనే కదండీ బావగారూ టిఫిన్ తిన్నారు.



అప్పుడే అరిగిపోయిందా? అంది ఎగతాళిచేస్తూ.

దీని దుంప పిలకెయ్య. ఇదెప్పుడు చూసిందీ తను టిఫిన్ తినడం అనుకుని "మీ అక్కకు తెలుస్తుందిలే వెళ్ళి చెప్పు" అన్నాడు.

వెంటనే లోపలకి వెళ్ళి సౌందర్యతో అదేమిటే అక్కా బావగారు ఇందాకనే టిఫిన్ చేసి మళ్ళీ టిఫిన్ కావాలంటున్నారు, ఆ టిఫిన్ ఏమిటో నీకు తెలుస్తుందన్నారులే, వెళ్ళి ఆయనగారికి టిఫిన్ పెట్టు" అంటోంది సుందరం మరదలు.

వెంటనే సౌందర్య వచ్చి సుందరం చెవులు మెలిపెట్టి అటూ ఇటూ చూసి తలుపు చాటుకు సుందరాన్ని లాక్కెళ్ళి టిఫిన్ తినిపించి వేసింది.

ఆ రోజు రాత్రి పది అవుతోంది. తెల్లారి మరిదిని పెళ్ళికొడుకుని చేయాలి. అందరూ హడావుడిగా ఉన్నారు ఆ రోజు సౌందర్య పింక్ కలర్ శారీ కట్టుకుని, నల్లని జాకెట్ ధరించింది.

చీరకూ జాకెట్‌కీ మధ్యన ఆమె నగ్న శరీరం పాల మీగడను తలపిస్తోంది, పొట్ట మధ్యలో మంచి ముత్యంలా నాభి మెరిసిపోతోంది. సరిగ్గా సుందరం చూపులు అక్కడ చిక్కుకుపోయాయి.

ఎవరూ చూడకుండా సౌందర్య దగ్గరకు వెళ్ళి అరేయ్ అర్జెంట్‌గా నాకు భోజనం కావాలి అన్నాడు చెవిలో. గుండె ఝల్లుమంది ఆమెకు.

ఇంతలో సుందరం తల్లి అటుగా వచ్చింది "ఏంట్రా అబ్బీ ఏం కావాలి? ఆకలేస్తోందా? నేను ఏదైనా పట్టుకొచ్చేదా?" అంది.

వెంటనే సౌందర్య కంగారుగా "అత్తయ్యగారూ ఆయన సంగతి నేను చూస్తాన్లెండి" అంటూ వంటింట్లోకి వెళ్తాంటే వెంటబడ్డాడు సుందరం, తలుపులేసి భోజనం వడ్డించింది సుందరానికి.

మర్నాడు ఉన్న పళంగా సుందరం సౌందర్య దగ్గరకు వచ్చి చాలా ఆందోళనగా "మా ఫ్రెండ్‌కి యాక్సిడెంట్ అయ్యిందట, ఐ.సి.యులో ఉన్నాడట. ఫోన్ వచ్చింది, మనం వెంటనే వెళ్ళి చూసిరావాలి, మళ్ళీ బ్రతికి ఉంటాడో లేదో, నీకు కూడా అతను బాగా తెలుసు..." అన్నాడు.

"ఎవరండీ ఆయన" అంది సౌందర్య.

"దారిలో చెబుతానులే పద..." అంటూ అక్కడ ఉన్న ఒక కారు ఎక్కించి పోనిచ్చేశాడు. ఒక ఫైవ్‌స్టార్ హోటల్ దగ్గర కారు ఆగింది. వెంటనే భార్యతో దిగి, చకచకా ఒక రూమ్‌లోకి వెళ్ళి బెడ్‌మీద కూర్చుని రిలాక్సింగ్‌గా... "అమ్మయ్య, మనం ఒక రెండు గంటలు మదన, చుంబన కార్యక్రమంలో విహరించాలి. మాకు తెలుసున్న వాళ్ళ హోటల్ ఇది..." అంటూ సౌందర్య చీర కొంగు పట్టుకున్నాడు సుందరం.


పెళ్ళయి మూడేళ్ళు కావస్తున్నా పిల్లలు పుడితే నీ అందచందాలు తరిగి, కరిగిపోతాయని, ముసలిదానివయిపోతావనీ సుందరం పిల్లలుపుట్టకుండాఏర్పాట్లు చేస్తూవుండడంతో సౌందర్య శరీరం మాత్రం కొత్తగా పెళ్ళయిన అమ్మాయి

లాల్ నీల్ జెండాల కలయికతో రాజ్యాధికారం దిశగా వెళ్ళేందుకు ఎన్నికల్లో పోటీ చేద్దామనుకుంటున్నా. -*గద్దర్, గాయకుడు*

శరీరంలాగే ఒంపుసొంపులతో అల రారుతోంది. వరసపెట్టి ఆమె శరీరం మీద నూలుపోగు లేకుండా చేసేశాడు సుందరం.

"ఏమిటండీ మరీనూ... మనిషన్నాక కొంచెమైనా దాపరికం ఉండాలి కదా. భార్యను పూర్తిగా నగ్నంగా చూసిన వేమన 'యోగి' అయిపోయాడు విరక్తితో, మీరూ అలాగే ఐపోతారేమోనని నాకు భయంగా ఉంది" అని ఆమె అంటోంటే ఆమె నోరు మూసేసి మదనకామరాజు అయిపోయాడు సుందరం.

సుందరం చేసే అల్లరి గమనిస్తూ, అది కాదు కాముడూ నన్ను ఎప్పుడూ



> ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. కాని తలసరి ఆదాయంలో తక్కువ స్థాయిలో వున్నాం.
>
> -రాజీవ్‌కుమార్, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్

చూడనట్లుగా ఏమిటీ పిచ్చి చేష్టలు. ఎప్పటికీ మీకు ఈ కార్యక్రమం విసు గనిపించదా? ఛీ నాకు అయితే విసు గొచ్చేస్తుంది బాబూ అంటుంటే "నా పని నేను చేసుకుంటాను. నువ్వు అలా బొమ్మలా పడుకుని ఉండిపో. అప్పు డప్పుడు మాట్లాడితే మాట్లాడు, లేదా నవ్వు అంతే... అంటూ సౌందర్యలో ఐక్యమైపోసాగాడు సుందరం.

ఈలోగా హోటల్ రూమ్ తలు పులు బాదుతున్నారు చాలా గట్టిగా. గబగబా లేచి లుంగీ చుట్టబెట్టుకుని లేచి తలుపులు తీశాడు సుందరం.

"పిట్టని ఎక్కడ పట్టుకొచ్చావ్! పద పోలీస్‌స్టేషన్‌కి. ఇక్కడ వ్యభిచారం జరుగుతోందని మాకు రిపోర్ట్ వచ్చింది పద" అంటూ పోలీస్ లాఠీతో తలుపు మీద కొట్టసాగాడు చాలా కోపంతో.

వెంటనే సుందరం వెనక్కు వెళ్ళి తన ప్యాంట్ జేబులో ఉన్న నోట్లకట్ట అతని చేతిలో పెట్టి అసలు విషయం గబగబా చెప్పాడు.

అతను చల్లబడి "సర్ మా యస్.ఐ గారికి తెలిస్తే గోలయిపోద్ది. మిమ్మల్ని దొడ్డిదారిన పంపించేస్తా వెళ్ళిపోండి" అని వేరేదారిలో హోటల్ బైటకు పంపే శాడు సుందరాన్ని సౌందర్యనూ.

బతుకు జీవుడా అనుకుంటూ ఇంటికి చేరుకున్నాడు సుందరం చెమటలు కక్కుకుంటూ.


"గుమ్మంలోనే సుందరం తల్లి ఎదురై "అబ్బాయ్... మీ స్నేహితుడికి ఎలా ఉందిరా? పాపం యాక్సిడెంట్ అయిందట గదా" అంటుంటే-

వెంటనే సౌందర్య కలగచేసుకుని "యాక్సిడెంట్ మీ అబ్బాయిగారి ఫ్రెండ్‌కి కాదండీ బాబూ, అక్కడకు వెళ్ళగానే మీ అబ్బాయిగారు ఆయన్ను చూసినవెంటనే, చెమట్లు కక్కుకుని పడిపోయారండి... అందుకే త్వరగా వచ్చేశాం" అంటూ భర్తను ఎవరికంటా పడకుండా లోపలికి లాక్కుపోయింది.

బెడ్‌రూమ్‌లో లోపలకు అడుగుపెట్ట డంతోనే సుందరం చెవులు పట్టుకుని మెలితిప్పుతూ... "మదనకామరాజా ఇవ్వాళగనుక మళ్ళీ మాంచి కాఫీ,టిఫిన్, భోజనమూ అని కేకేశావనుకో మర్యాద దక్కదు సుమా. ఒక చెవి పళ్ళతో పీకేసి నమిలి మింగేస్తాను. తెలిసిందా మదపిచ్చోడా..." అంటూ సుందరం లిప్స్‌కి లాక్ చేసేసింది పెదవులతో.

అంతే... ఇంకేమి మాట్లాడతాడు పాపం... అసలే షాక్ తిని ఉన్నాడు పోలీస్ దర్శనంతో.

"మ్... మ్మ్ అంటున్న సుందరాన్ని వదిలిపెట్టి "పోలీసులకు నన్ను కన పడనీయకుండా తప్పించుకుని తీసు కొచ్చావ్ కదా అందుకే ఈ బహుమతి, ఈ రాత్రికి ఎలాగో భోజనం పెడతా నులే" అంటూ గబగబా వెళ్ళిపోతున్న సౌందర్య వాలుజడ నాట్యం చూసి కైపెక్కిపోయిన సుందరం 'భోజనం కావాలి' అని అరవబోయి చెవులు నొప్పి పెట్టిన సంగతి గుర్తుకొచ్చాయి.





సత్యాన్వేషణ

గీతా ధ్యానం

పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్
అద్వైతామృతవర్షిణీం భగవతీ మష్టాదశాధ్యాయినీం
అంబ! త్వామనుసంధదామి భగవద్గీతే భవద్వేషిణీమ్॥

భగవంతుడగు శ్రీమన్నారాయణునిచే స్వయముగా పార్థునికొరకు ప్రబోధింపబడి, పురాణమునియగు శ్రీ వేదవ్యాసునిచే రచింపబడి, మహాభారత మధ్యములో నుండి, అద్వైతమను అమృతమును వర్షించుచు, భగవత్స్వరూపిణియై, పద్దెనిమిది అధ్యాయములతో కూడి, సంసారదుఃఖమును పోగొట్టునట్టి ఓ తల్లీ! భగవద్గీతా! నిన్ను నేను అనుసంధించెదను. ❒

ప్రత్యక్ష దానం

సాధారణంగా డబ్బున్నవారూ, అలాగే ఆధ్యాత్మిక భావన ఉన్నవారూ-ఎవరైనా దైవంకోసం చందా- అని అడగ్గానే వెంటనే సొమ్మురూపంలో విరాళాలని ఇచ్చేస్తూ ఉంటారు.

శాస్త్రం చెప్పిందేమంటే విరాళాన్ని- వస్తురూపం గానో, తన శరీర శక్తిని వినియోగిస్తూ ఆ పనిలో భాగస్వామి కావడంగానో, అన్నదాన సందర్భంలో ఆ రోజుకారోజు బియ్యాన్ని సమర్పిస్తూ ఆ బియ్యాన్ని ఎసట్లో (వేడివేడి నీళ్ళలో) పోసేవరకూ ఉండడమనే పద్ధతిలోనో- ఇస్తే అది ప్రత్యక్ష దానమవుతుంది.

దుర్వినియోగపడకుండా ఉంటుంది. ఇచ్చిన దగ్గర్నుండి మనకి దురాలోచనలు రాకుండానూ మనసు ప్రశాంతంగానూ వుంటుంది. ❒

సిద్ధశక్తి లభిస్తే...

మంత్రాన్ని మననంచేస్తే వ్యక్తికి సిద్ధి లభిస్తుంది. అలా మంత్రసిద్ధిని పొందిన వ్యక్తిని సిద్ధుడు అని పిలుస్తారు. అలాటి సిద్ధుడు భూమిని జయించాడంటే భూగర్భంలో (నేలమాళిగ) ఉండగలుగుతాడు.

నీటిని జయిస్తే జలస్తంభన విద్యతో నీటిలో ఉండిపోగలడు. ఎండని (తేజస్సు) జయిస్తే సూర్యుడు మండుతూ ఉన్న 12 గంటలవేళలో మధ్యాహ్నం బహిరంగ ప్రదేశంలో నిలబడి జపంచేసుకోగలడు. వాయువుని జయిస్తే శరీరంలోని వాయువుల్ని అదుపు చేసి ఎక్కువకాలం జీవించగలడు.

ఆకాశాన్ని జయిస్తే మనోనిగ్రహం (దేన్నీ కావాలనుకోకుండానూ, కావాలనుకున్నదానిని అక్కర్లేదను కోగల గట్టితనం)తో ఉండగలడు. ❒

{కోరికలను తీర్చుకుంటే తృప్తి కలుగుతుంది. కోరికలను జయిస్తే అంతులేని ఆనందం లభిస్తుంది.}

ఆషాఢంలో...

నిజమైన మంత్ర సాధకుడు (రోజూ మంత్రాలని ఉపాసిస్తూ ఉండేవాడు) మీకు కన్పడినట్లయితేనూ, ఆయన రోజూ అనుష్ఠానాన్ని చేస్తున్నాడని మీకు పరీక్షించగా తేలినట్లయితేనూ, ఆయన్ని యాచించి మంత్రోపదేశాన్ని పొందండి.

మంత్రోపదేశం అయింది గదా అని మరో గురువుని ఆశ్రయించి మరో మంత్రాన్ని తీసుకుందాం ఉపదేశంగా అనుకోకండి.

ఎన్ని మంత్రాలని మీరు ఉపదేశంగా తీసుకుంటే అంతగా మీకు సమయం లభించక, ఏవో కొన్నిటిని మాత్రమే మననం చేసుకోగలుగుతారు. మంత్రోపదేశం అనేది- ఒకే ఒక గురువు దగ్గర ఒకే ఒక మంత్రాన్ని పొందడంద్వారా ఫలిస్తుంది. ❒

ఆందోళన తొలగాలంటే...

కొందరు ప్రతి చిన్న విషయానికీ ఎక్కువగా ఆలోచిస్తూ తీవ్రమైన ఆందోళనకి గురవుతూ ఉంటారు. సహజంగా స్త్రీ, పురుషుల్లో స్త్రీలకి ఎక్కువ ఆందోళన ఉంటుంది. ఎక్కువశాతం ఆందోళనకి గురయ్యేది వారే.

ఆ సందర్భంలో దుర్గా స్తోత్రాన్ని చదివితే తప్పక ఆందోళన, కంగారు ఏం జరుగుతుందోననే భయం శరీరం వణకడం...వంటివి అన్నీ తొలుగుతాయి.

అందుకే పూర్వం రోజుల్లో స్త్రీలు ప్రతి నిత్యం దుర్గా స్తోత్రాన్ని చదవడమనే దాన్ని అలవాటుగా చేసేసుకున్నారు. ఆందోళన లేకుండా కుటుంబ జీవితాన్ని సాగించగలిగారు. ❒

హోమం గొప్పది

సాధారణంగా అనుకున్న పనులు సాధింపబడని సందర్భంలో యోగ్యులైనవారిద్వారా జపాలని చేయిస్తూ ఉంటారు. జపాలు ఫలితాన్ని ఈయవనే మాట నిజం కాదుగాని, జపాలకంటే హోమం... గొప్ప ఫలితాన్నిస్తుంది.


దానిక్కారణం దేవతలందరికీ ప్రీతిపాత్రుడైన అగ్ని మనం హోమంద్వారా వేసినప్రతి వస్తువునీ వెంటనే ఆ దైవానికి సమర్పించి మన విషయాన్ని ఆయా దేవతలకి వివరిస్తాడు కాబట్టి. 'అగ్నిముఖా వై దేవాః' దేవతలందరూ అగ్నిదేవుణ్ణి చూస్తూ వాళ్ళకి ఏమేం తెచ్చాడు? ఎవరెవరు ఇయ్యగా తెచ్చా?డంటూ భావిస్తూ ఎదురుచూస్తూ ఉంటారు. ❒

పేలాలు, అటుకులు, నవధాన్యాలు

హోమంలో పేలాలని వేసినట్లయితే కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి. అటుకులు వేస్తే పెద్దలతో గట్టి పరిచయాలేర్పడతాయి.

నవధాన్యాలు వేస్తే శరీరారోగ్యం కుదుటపడుతుంది. కేవలం నేతితోనే హోమంచేస్తే దేనికీ ఎదురు చూడాల్సిన అవసరమే ఉండదు.

మనలోనే దాగుండే సంతోషం



మన జీవితకాలంలో సుఖాలు, దుఃఖాలు కలగలిసిపోయి అనేక అనుభవాలు ఎదురవుతుంటాయి. మంచీ, చెడులు రెండూ మిళితమైపోతాయి. అవన్నీ కూడా అప్పుడప్పుడు గుర్తుకొచ్చి అలా అలా వెళ్ళిపోతుంటాయి.

అయితే బాధాకరమైన విషయం ఏమిటంటే, స్మృతులను వెనక్కుతిప్పడంలో మంచికంటే చెడు సంగతులే ఎక్కువగావుంటుంటాయి.ఏదైనా నిరుత్సాహపూరిత పరిస్థితి ఎదురైతే అప్పుడన్నీ జరిగిన చెడ్డ విషయాలే బుర్రలో తిరుగుతుంటాయి.

మూడ్ సరిగ్గా లేకపోయినా చెడే గుర్తుకువస్తుంది. విజయాలు, మంచి స్మృతులు తవ్వుకోవడం చాలా తక్కువ.మనస్సులోని ప్రతికూల ఆలోచనలు ప్రతి విషయాన్నీ చీకటిలో చూసేలా చేస్తుంటాయి.

సంతోషంగా వుండాలన్న ఆలోచన దృఢంగా వుంటే ఈ ధోరణిని అర్థంచేసుకుని సదరు ఆలోచనలకు స్వస్తిచెప్పాలి. మనస్సును ధృడపరచుకోవడం సులువుకాదు. కాని ప్రయత్నించాలి. ప్రతికూలత మనపై స్వారీ చేస్తుంటుంది.

పూర్తి కోరికను, ప్రయత్నాన్ని సాగిస్తూ వెళ్తుంటే మార్పు వస్తుంది. వ్యక్తిగతంగా స్ఫూర్తిని తెచ్చుకోగలగడం తొలిచర్య. స్ఫూర్తి, కోరిక అనేవి కేవలం మానసిక నిర్ణయాలు కాకూడదు. అవి మన స్ఫూర్తిగా, లోతుగా సాగాలి. పునరుత్తేజాన్ని కోరుకోవాలి. స్వాగతించాలి.

దేన్నయినా తరచూ కోరుతూ, అధికంగా పూర్తి ఏకాగ్రతను పెట్టినప్పుడు తప్పకుండా సాధ్యపడుతుంది. పగలంతా, రాత్రివేళ నిజాయితీగా ఆశిస్తున్న అంశాన్ని స్ఫురణకు తెచ్చుకోవాలి.

ఏదైనా ముఖ్యమైన పని పూర్తిచేయాలనుకున్నప్పుడు విభిన్న ప్రదేశాలలో అనేకసార్లు పదేపదే గుర్తుచేసుకుంటుంటాం. అదే టెక్నిక్‌ను మనం ఆశిస్తున్న అంశంపై కూడా ఉపయోగించాలి.

ఉదాహరణకు ల్యాప్‌టాప్ స్క్రీన్ సేవర్‌మీద పెట్టుకోవడం,కారులో సందేశం ఇలా ఇంట్లో ఎక్కడ దృష్టి ఎక్కువగా ఉంటుందో, ఆ ప్రదేశంలో చిన్న చిన్న నోట్స్ పెట్టుకుని ఆశించే అంశాన్ని గుర్తుచేసుకోవాలి. ఇలా కోరిక మనస్సులో ధృఢంగా పాతుకుపోయినప్పుడు ఇలాంటివన్నీ గుర్తుపెట్టుకోవాలి.

అది తప్పకుండా సాధ్యపడుతుంది. ఇవే అంశాలను ప్రతికూలతను పారదోలి సంతోషంగా సాగేందుకు పాటించాలి.

ప్రతికూలతపై పోరు

తరచూ చేసేపని ఏమిటంటే అనుకూలంగా ఉండాలని ప్రయత్నిస్తున్నప్పుడు ప్రతికూల భావాలను నొక్కిపెడతారు.ఈ ప్రయత్నం పురోగతివున్న భావనను క్లుప్తంగా ఇవ్వవచ్చునేమోకాని, ప్రతికూలత అవకాశంకోసం కాచుకునే వుంటుంది.

అది వారాలుగా, నెలలుగా చేసే హార్డ్‌వర్క్‌ను కొద్దిసెకన్లలో ధ్వంసంచేస్తుంది. కాబట్టి, ప్రతికూలతను కప్పిపుచ్చుకునేప్రయత్నంచెయ్యకూడదు.

జాగ్రత్తగా పరిశీలిస్తూ, నెమ్మదిగా, నిర్మాణాత్మకంగా దాన్ని తొలగించుకోవాలి. ఇందుకు సరైన మార్గం ఆశించే అంశాన్ని నిరంతర గైడ్‌గా ఉపయోగించుకోగలగడం. భావాలు, ఆలోచనలు, అవసరాలు, కోరికలు, చర్యలు అన్నింటి వెనుక ఆశించడాన్ని ఉంచుకోవాలి.

ప్రతికూలతతో స్వయంగా చర్చించుకోవాలి. మాట్లాడాలి.ఇవన్నీ వ్యక్తిగతవినాశనాలని, తమలోని మంచికి వెన్నుపోట్లని వివరించుకోవాలి. అవాంఛనీయ భాగాన్ని, మంచిని ఊహించుకుంటూతరిమికొట్టాలి.చెడునువదిలేసి అనుకూలతను దక్కించుకోవడం కోసం ప్రార్థనలు చేయాలి. ఈ నిరంతర ప్రక్రియ చీకటిని నెమ్మదిగా పారదోలుతుంది.

కృతజ్ఞతల జర్నల్

కృతజ్ఞతాపూరిత విషయాలతో ఓ జర్నల్‌ను తయారుచేసుకోవడం మంచి అలవాటు. ప్రతి మంచి విషయాన్నీ రాసిపెట్టుకోవాలి.

చిన్నదైనా, పెద్దదైనా మంచివిషయాలన్నీ రాతపూర్వకంగా ఉండాలి. ప్రతిరోజూ వీటిని రాసుకుంటుంటే, జీవితంలో అనేకానేక అనుకూల అంశాలు మనకు కనపడతాయి.

కుటుంబసభ్యులు, స్నేహితులు ఆనందాన్నిస్తారు. మానసిక పరిణతికి, పురోగతికి టీచర్లు కొంతమేర సాయపడతారు.

పెంపుడు జంతువులు ఎనలేని ప్రేమ కురిపిస్తాయి. పిట్టలు తమగానాలతో అలరిస్తాయి.

ప్రకృతి సేదతీర్చుతుంది. కనిపించని దైవం ఎన్నో అందిస్తాడు. ఇవన్నీ కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అంశాలు.కృతజ్ఞతలతో రాసుకున్నజర్నల్ మంచి ప్రపంచాన్ని సాక్షాత్కరింపచేస్తుంది.

ఏదోక విషయంపట్ల దృష్టి నిలిపి, కృతజ్ఞతలు తెలుపుకుంటూ, దాన్ని సాధించడంలోపెట్టిన కష్టాన్ని, చేసిన ప్రయత్నాన్ని ఊహించుకోవాలి. ఈ క్రమంలో చిన్న చిన్న విషయాలు అడ్డంకులుగా నిలవవు. అప్పుడు మనస్సు ఎప్పుడూ సంతోషంగానే వుంటుంది.

నష్టాలు, కష్టాలు

ఎప్పుడూ మన జీవితంలో నష్టం, కష్టం ఎదురైనా, అది చిన్నదైనా, పెద్దదైనా ఎంతగానో వికలపడుతూ వుంటాము.

దుఃఖంలో మునిగిపోయి, తిరిగి యధా స్థితికి వెళ్ళగలగడం కష్టంగా అనిపిస్తుంది. అయితే నష్టం అనేది ఎప్పుడూ స్థిరంగా తిష్టవేసుకుని కూర్చోదు. ఇదో మానసిక అనుభవం... అంతే!

ప్రతి ఒక్కరికీ ముగింపులేని కోరికలుంటాయి. కొన్ని భర్తీ అవుతూ, సంతోషాన్నిస్తాయి. ఏదైనా కోరిక తీరనప్పుడు దుఃఖంలో మునిగిపోతారు.

అసలు నొప్పి అంటూ కలగకుండా, బోల్డంత కాండంతో ఆహ్లాదం కావాలని కోరుకుంటూంటాం. ఈ ధోరణి బలహీనపరుస్తుంది.

ఎందుకంటే భర్తీ కాని అంశాల్ని డీల్ చెయ్యడానికి మానసిక సంసిద్ధత రాదు. ఇటువంటి మానసికస్థితి దిగులులో ముంచెత్తుతుంది. దిగులును, అసంతృప్తిని తట్టుకునే శక్తిని పెంచుకుంటే, నష్టాన్ని, సులువుగా ఎదుర్కోగలుగుతారు.

ఎప్పుడు ఏ కోరుకోని విషయం జరిగినా, అది అనివార్యమని అనుకుంటూ వుంటే చాలు.

ఎమ్.మానస



ధ్యానం

ఛాతిమధ్యలో 'అనహట' లేదా హార్ట్ చక్ర వుంటుంది. ఇదిమన ఎమోషన్లకు అసనం వంటిది. ప్రతికూల, అనుకూల భావాలన్నింటినీ అనుభవింపజేస్తుంది. అనహట చక్ర పనితీరు తక్కువ స్థాయిలో వుంటే స్వార్థం, కోపం, డిప్రెషన్, మూడ్ స్వింగ్స్‌వంటి ప్రతికూల భావాలు ఎదురవుతాయి.

అయితే, అది ఆశావహతీరు, ధోరణిలోవుంటే ఆ వ్యక్తిలో కరుణ, బేషరతు ప్రేమ, సంతోషం పొంగిపొర్లుతాయి. అన్నిపరిస్థితుల్లోనూ సంతోషంగా ఉండగల సామర్థ్యం కలుగుతుంది.

దీన్ని చేరుకోవాల్సిన అవసరం వుంది. అందుకోసం అనహాట చక్రపై ఏకాగ్రతగా ధ్యానం ప్రాక్టీస్ చేయాలి. ఆరంభించిన తొలిరోజుల్లో మెడిటేషన్ చాలా కష్టంగా వుంటుంటే అంతర్గత బ్లాకేజీలే ఇందుకు కారణం అవుతాయి. కాబట్టి మొదట్లో ఈ కేంద్రాన్ని తెరవడానికి దృశ్యాలను ఊహించుకోవాలి.

ముందుగా మనం ధ్యానముద్రలో కూర్చుని, అరగంటపాటు కొనసాగించాలి. పూర్తి సమయం సౌకర్యంగా కూర్చోవాలి. తదుపరి చర్య ఛాతినడుమ చక్రం తిరుగుతున్నట్లు దృశ్యాన్ని ఊహించుకోవాలి.

మృదువైన, తెల్లని కాంతి ఆవరించుకుని, ప్రేమ, క్షమాగుణం, సానుభూతులతో నింపేస్తున్నట్లు చిత్రించుకోవాలి. ఇదే ప్రక్రియను మళ్ళీమళ్ళీ కొనసాగిస్తుండాలి. చక్రం తెరుచుకుంటుంది. గాయాలు మానుతాయి.

దీంతో ప్రతికూల భావోద్రేకాల నుంచి స్వేచ్ఛలభిస్తుంది. అందరం చేసే పని సంతోషాన్ని తరచూ వెలుపలి ప్రపంచంలో వెతుక్కోవడం. వ్యక్తిగత అనుబంధాల నుంచి, సంపాదించిన వాటినుంచి వెతుక్కుంటాం. కాని, ఇదంతా సరైన చర్యకాదు.

సంతోషం మనలోనే వుంటుంది. మన చుట్టూనే పరిభ్రమిస్తుంది. దాన్ని అందుకోగలగాలి. అంతర్గతముగా, స్థిరంగా దాగున్న సంతోషాన్ని ఉద్దీప్తం చేసుకోవాలి. ఓ పద్ధతిగా, క్రమంగా ప్రతికూలభావాలపై యుద్ధం ప్రకటిస్తే విజయులు అవుతారు.

అప్పుడు సంతోషంకోసం వెతుక్కుంటూ పరిగెత్తాల్సిన పనిలేదు.

అది మనలోనే ఉంటుంది, మన వెంట సాగుతుంది. ఆ సంతోషమే జీవితానికి అన్నీ సమకూర్చిపెట్టగల సామర్థ్యాన్ని ఇస్తుంది.

Courtesy: VANITHA



నానితో ♥ నిత్య

సీరియల్

సౌయిరంలేకుండ

సుమారువందమీటర్ల దూరం నడిచాక కుడివైపుమలుపు తీసుకుని మరో యాభైమీటర్లదూరం వెళితే అక్కడ్నుంచి దివాణం శ్రీ ప్యాలెస్ బిల్డింగ్ బహు సుందరంగా కనిపిస్తుంది. గేటు దాటి లోపలికి వెళ్ళేకొద్దీ ఆ కట్టడపు గొప్పదనం తెలుస్తుంది. ఆ నిర్మాణం విశిష్టత చూసి ముచ్చటపడుతోంది నిత్య.

పాతకాలపుకట్టడపు సొబగులతో, ప్రత్యేకమైన రంగుల మేళవింపుతో, అటూఇటూ అంచుల్లోని కట్టడాలపైకి అల్లుకున్న బోగన్‌విల్లా లతలతో రెండుపక్కలా విశాలంగా పరచుకున్న నడవాలతో రాచరికపు ఠీవితో దర్శనమిస్తుంది.

దివాణం ముఖ్య భవనానికి అటూ ఇటూ మైదానంలా విస్తరించి ఉన్న ప్రాంతమంతా సువాసనలతో బాటు కళ్ళకి ఇంపుకలిగించే పూలమొక్కలతో నిండి ఉంది.

తీర్చిదిద్దినట్లుగా వరుసలో ఉన్న మొక్కల మధ్యభాగంలో కాలి బాటల్లా ఏర్పరచిన తోవలు, వాటికి అంచుల్లా ఏర్పరచిన మార్బుల్ పలకలు...

అటూ ఇటూ వృత్తాకారంలో ఏర్పరచిన రహదారులమధ్య స్థలంలో కృత్రిమంగా ఏర్పరచిన నీటి కొలనూ, దాని మధ్యభాగంలో నిలువెత్తు రాతిశిల్పం చుట్టూరా గుబురుల్లా పూలమొక్కలూ ... ప్రాంతానికి ఒక ఉద్యానవన శోభ సంతరించేలా చేస్తున్నాయి.

"జమీందారుగారు కాలం చేసిన తర్వాత మేడమ్‌గారే మొత్తం దివాణం బాధ్యతలని నిర్వహిస్తున్నారు. దీనితో బాటు తోటలూ, పొలాలూ, బయట ఊళ్ళల్లో ఉన్న ఆస్తులూ... అన్నీ" ఈ మాటతో మేడమ్ స్థాయి ఏంటన్నది నిత్యకు అర్థమైంది.

వందన ఇంకా ఏమైనా విషయాలు చెబుతుందా, వాటిని బట్టి మరిన్ని అంచనాలకు అవకాశం ఉంటుందా! అని చూసింది నిత్య.

కానీ వందన ఏం మాట్లాడలేదు. ఆమె సెల్‌ఫోన్ రింగ్ అవడంతో ఆ కాల్ అటెండ్ అవుతూనే నడిచింది.

పదినిమిషాల నడకలో శ్రీప్యాలెస్ భవంతి దగ్గరికి చేరుకున్నారిద్దరూ. బయట వరండాలో ఉన్న కుర్చీలను తుడుస్తూ పనిచేసుకుంటున్న ఒక వ్యక్తిని చూసి అతన్ని పిలిచింది వందన "ఈ అమ్మగారిని లోపలికి తీసుకెళ్ళి హాల్లో కూర్చోబెట్టు"

నిత్యవైపు తిరిగి చెప్పింది "మీరు వెళ్ళండి. మేడమ్‌కి మీరొస్తున్నట్లు తెలుసు. పది పదిహేను నిమిషాల్లో వస్తారు... నేను వెళుతున్నాను" వందన వెనక్కి వెళ్ళిపోయింది.

పనివాడు దారి చూపించగా లోపలికి నడిచింది నిత్య. తరాలనాటి సాంప్రదాయపు ఆనవాళ్ళు కనిపించేలా ఉన్న ఇంటీరియర్ డెకరేషన్ కొట్టొచ్చినట్లు తెలుస్తుంది. అన్నిపక్కలా దృఢమైన పాతకాలపు ఫర్నిచర్ నగిషీల తొడుగులతో ముచ్చట గొలుపుతున్నాయి.

విశాలమైన హాలులో రెండువైపుల నుంచీ పై ఫ్లోర్‌కు వెళ్ళేందుకు వెడల్పాటి మెట్లున్నాయి. మెట్లకి ఉన్న హ్యాండ్ రైలింగ్‌కి లోహపు తాపడాలో చేసిన నగషీ ఆకృతులున్నాయి.

హాలులో ప్రతీ కార్నర్‌లోనూ హస్తకళాకారుని పనితనానికి చిహ్నాల్లా ఉన్న ఉడ్ కార్వింగ్ పీసులు వన్నెలీను తున్నాయి. గోడలమీద ఏర్పరచిన తైలవర్ణ చిత్రాల్లో ఉన్న వ్యక్తులు ఆ వంశంలోనాలుగైదు తరాలను రిప్రజెంట్ చేసినవారిలా అనిపిస్తున్నారు.

నేల మొత్తం పరిచిన ఎర్రనితివాచీ అలా మెట్ల మీదుగా కూడా కొన సాగుతూ పైఫ్లోర్ వరకూ పరచబడి ఉంది.




హాలుకి ఎడమ వైపున్న స్థలంలో ఉన్న సోఫాల దగ్గరకునడిచికూర్చుంది నిత్య.

ఏ నిమిషమైనా మేడమ్ రావచ్చనే భావిస్తూ చుట్టూ పరిశీలనగా చూస్తున్న నిత్యకు మేడమీద ఎవరో మాట్లాడుతున్నట్లు అనిపించి తలతిప్పి చూసింది.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ మెట్లమీద నుంచి దిగుతున్న మేడమ్‌ని చూసి లేచి నిలబడింది నిత్య. తెల్లని పసిమిదేహం, మొహంలో తేజస్సు, కళ్ళల్లో కాంతి చూపులో తీక్షణ, నడకలో హుందాతనం... ఖచ్చితంగా ఈమే 'మేడమ్' అని నిర్ధారించుకుంది నిత్య.

పెద్దరికాన్ని వ్యక్తపరుస్తున్న కాటన్



చీర, మోచేతులు దాటిన జాకెట్టు, మెడలో సన్నటి గొలుసు, ల్యాన్ యార్డు తగిలించిన కళ్ళజోడు, వదులుగా వేసుకున్న ముడి... సింప్లిసిటీకి నిర్వచనం అనిపిస్తూనే ఉన్నతస్థాయిని వ్యక్తపరుస్తున్న ఆమె ఆకృతిని చూస్తే ఎలాంటివారికైనా భయమూ, భక్తి కలుగుతాయనిపిస్తుంది.

మేడమ్ అలా ఫోన్లో మాట్లాడుతూనే సరాసరి నిత్య దగ్గరకొచ్చింది. నిత్యవైపు పరిశీలనగా చూస్తూనే ఫోన్లోని వ్యక్తికి సూచనలు ఇవ్వడం పూర్తిచేసింది.

ఫోన్ డిస్కనెక్ట్‌చేసి సోఫాలో కూర్చుంటూమాట్లాడ్డంమొదలెట్టింది "నిత్యా...నీ వివరాలుచూశాను. నాకు ఓకే.." తలపైకెత్తి చూసి ఇంకా నిత్య నిలబడే ఉండడాన్ని గమనించి "కూర్చో... కూర్చో..."

నిత్య ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది.

జరిగిన కథ

2

నిత్య తల్లిదండ్రులు ఒక యాక్సిడెంట్‌లో గాయపడతారు ఆ విషయం ఆమె పెదనాన్న ద్విజ్ ప్రసూన్ ఆమెకు ఫోన్‌లో చెబుతాడు. ద్విజ్ ప్రసూన్ కొడుకు విక్రాంత్ వైజాగ్‌లో వుంటాడు.

ఆ కబురు తండ్రి ద్వారా నిత్యకు తెలియజేస్తాడు. వైజాగ్‌లోని కేర్ హాస్పిటల్లో ఆమె తల్లిదండ్రులు క్రిటికల్ కండిషన్లో వుంటారు.

చీఫ్ డాక్టర్ సుగుణాకరరావుని కలిసి తల్లిదండ్రుల పరిస్థితితెలుసుకుంటుంది ఇండియా వచ్చిన నిత్య. క్రిటికల్ కండిషన్లో నుంచి బయటపడ్డాడనుకున్న నిత్య తండ్రి నిద్రలోనే మరణిస్తాడు.

ఇక తల్లి బ్రతకాలంటే కొన్ని లక్షల రూపాయలు అవసరమని గ్రహిస్తుంది ఆమె. అరవిందపురం జమీందారు గారి దివాణంలో తాత్కాలిక ప్రాతిపదికన తీసుకునే కాంట్రాక్ట్ జాబ్‌కు కోటిరూపాయలుఇస్తారన్న యాడ్‌చూసి అప్లై చేస్తుంది నిత్య. ఆ ఇంటర్వ్యూలో అన్ని స్టేజీల్లోనూ సెలక్టయ్యాక ఫైనల్‌గా మేడమ్ దగ్గరకు బయల్దేరుతుంది. ఇక చదవండి.



కలసి వచ్చిన కాలం

బాక్సాఫీసు వద్ద బాజాలు మోగించిన సినిమాల ఖాతాలు అనేకం జమచేసుకున్న కత్రినాకైఫ్ ఈ ఏడాది తనకు బాగా కలిసి వచ్చిందంటూ సంబరాలు పోతున్నది. తన సినిమాల విజయం కొత్త ఊపిరి, ఉత్సాహాలను ఇస్తున్నాయంటున్నది.

"నా కెరీర్ విజయాల వెనుక బోల్డెంత కష్టం వుంది. మారే పరిస్థితులకు తగినట్లుమారుతూ, ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు వెళ్తేనే నిలదొక్కుకోగలం.

ఇది రంగుల ప్రపంచం. పూర్తిగా స్థిరపడ్డామని అనుకునేలోపే పరిస్థితులు మారిపోతుంటాయి.

నాకు మాత్రం ఇప్పటిదాకా అంతా సంతృప్తిగా సాగిపోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని చెప్పింది.

"ఇంతదూరం వచ్చాక నువ్వు చాలా సందేహాలతో ఉండి ఉంటావని నాకు తెలుసు... నీ డౌట్లు క్లియర్ చేసేలా నీకు కొన్ని విషయాలు చెప్పాలి.

ఇన్ని వడపోతల తర్వాత నిన్ను ఎంపిక చేశామంటేనే నీరోల్ ఎంత ముఖ్యమైనదో నీకు ఈసరికే అర్థమై ఉంటుంది" హాల్లో గోడవారగా నడుస్తున్న ఓ పనివాడ్ని పిలిచి కాఫీలు తీసుకురమ్మని చెప్పిందామె.

"నా పేరు జయప్రభ. వయసు అరవై నాలుగేళ్ళు ఒక పేదింట్లో పుట్టాను. చిన్నప్పుడే మా నాన్న చనిపోయారు. ఇంటర్మీడియట్ కాలేజీలో చదివాను.

తర్వాత ప్రైవేట్‌గా బి.ఎ. బిఇడి పూర్తిచేసి ఓ ప్రైవేటు స్కూల్లో పని చేశాను.ఆ సమయంలో అమ్మ లోకాన్ని విడిచింది. తమ్ముడిని బాగుచెయ్యడానికి పన్నెండేళ్ళు పట్టింది.

వాడిపెళ్ళి తర్వాత అమెరికా వెళ్ళిపోయేవరకూ నాకింకో ఆలోచనలేకపోయింది.అప్పటికి నావయసు ముప్పై దాటేసింది. అప్పుడు ఒంటరితనం తెలిసింది. అంతవరకూ ఎరగని భయం ఆవహించింది. నాకెవరూ లేరు, నాకోసం ఎవరూ రారన్న వాస్తవంబోధపడికలవరపాటుకి గురిచేసింది.

ఎవర్నయినా పెళ్ళి చేసుకుంటే తోడు దొరుకుతుందని అనిపించినా ఎవర్నీ దగ్గర చేసుకోలేకపోయాను"

మేడమ్ తన సంగతులు చెబుతూంటే నీటికీ, తన జాబ్‌కీ ఏంటి సంబంధం అయివుంటుందన్న ఆలోచన మెదిలినప్పటికీ దాన్ని పక్కకినెట్టేసి వింటోంది నిత్య.

"జమీందారుగారు ఈ పరిగణాల్లో ఒక మహారాజులెక్క.ఆయన మాటంటే కొన్ని లక్షలమందికి గురి. ఆయనఅండ ఉంటే బెంగలేకుండా బతికే జనాలే ఈ చుట్టుపక్కల ముప్పైగ్రామాల వాళ్ళంతా. వాళ్ళకోసం ఆయనా, ఆయన చెంత వీళ్ళూ అన్నట్లుగా ఉండేది..."పనివాడుతెచ్చి కాఫీ అందించాడు ఇద్దరికీ.



"అలాంటి జమీందారుగారింట ముప్పైఏళ్ళక్రితం ఒకదుర్ఘటన జరిగింది. దివాణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆయన భార్యా, ఇద్దరు పిల్లలూ సజీవదహనమైపోయారు..."

గోడకున్న నిలువెత్తు తైలవర్ణ చిత్రాన్ని చూస్తూ వింటున్న నిత్యకి ఈమాట వినగానే అయ్యో అనిపించింది. "ఏడాది గడిచినా ఆ షాక్ నుంచి జమీందారుగారు తేరుకోలేకపోయారు. అమితంగాప్రేమించే భార్యా...వంశాన్ని కొనసాగించాల్సిన పిల్లలూ, అర్థాంతరంగా అంతర్ధానమయ్యేసరికి పిచ్చిపట్టినట్లు అయిపోయారు. వ్యధతో కుమిలిపోయారు.

ఆరోగ్యాన్నినిర్లక్ష్యంచేశారు. ఆయన్ని చూసుకుంటూ బతుకుతున్న జనాలంతా భయపడిపోయారు.

ఎలాగైనా జమీందారుగారిని మళ్ళీ తేరుకునేలా చేసి బాగుచెయ్యగలగాలని అందరూ ఆశపడ్డారు..."

సెల్‌ఫోన్ రింగయితే దాన్నందుకుని కాల్ రిజక్ట్‌చేసి తన మాటల్ని కొనసాగించింది జయప్రభ.

"ఇంత పెద్ద జమీకి వారసత్వాన్ని ఇవ్వడం కోసం జమిందారుగారు మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని అందరూ పట్టుబట్టారు. మరో అమ్మాయిని పెళ్ళిచేసుకుని తెలీకుండానే ఆమె కలల్ని చిదిమేయడం తనకి ఇష్టంలేదనే ఉద్దేశ్యంతో ఆయన పెళ్ళిచేసుకోనని ఖరాఖండిగాచెప్పినా ఎవరూఒప్పుకోలేదు.

బతిమాలారు. కాళ్ళావేళ్ళాపడ్డారు. ఆయన కాస్త మెత్తబడి ఎవరైనా వితంతువుని కానీ, డైవోర్స్‌డ్ స్త్రీని కానీ వెతకమని చెప్పారు.

ఆ సమయంలో ఎవరో నా గురించి ఆయనకు చెప్పారు. ఆయన చాలా తర్జనభర్జనపడి చివరికి నాకు సమ్మతమైతే ఓకేఅన్నారు.ఇక నేను...ఇది నాకు ఎదురుచూడని అదృష్టం అనుకున్నాను. కలలో కూడా ఊహించని సౌభాగ్యం అనుకున్నాను. అలా జమిందారుగారి భార్యని అయ్యాను..."

ఈ వాస్తవ కథ వింటున్న కొద్దీ తెలియకుండానే జయప్రభ మీద గౌరవంపెరిగిపోతుంటే మరింత కుతూహలంగా వింటుంది నిత్య.

"నేను ఆయన భార్య స్థానంలోనికి వచ్చినదగ్గర్నుంచి ఏడాదిపాటు పూర్తి సమయాన్ని ఆయన ఆలనాపాలనకి వెచ్చించిమామూలుమనిషిగా తయారు చేశాను. నా సపర్యలవలన బాగా తేరుకున్న జమీందారుగారిని చూసి ఊరి జనాలు చాలా ఆనందించారు"

కొద్దిక్షణాలు తటపటాయిస్తున్నట్లు ఆగి మళ్ళీ కొనసాగించింది జయప్రభ.

"నేను ఊహించని గొప్ప స్థానాన్ని నాకు ఇచ్చిన జమిందారుగారి బాగోగులే నాకు ముఖ్యమని,ఆయన్ని ఆనందంగా ఉంచడమే నా ప్రథమ కర్తవ్యమని నా మనసులో స్థిరపడిపోయింది. ఆయన ఎప్పుడూ తన కోరికని చెప్పకపోయినా నేను గ్రహించాను.

వంశం నిర్వీర్యమైపోకూడదన్నది ఆయన ఆరాటం అని నాకర్థమైంది. ఒక బిడ్డని కని ఇవ్వడం నా కనీస బాధ్యత అని నా మనసుకి తోచింది"

పక్కనున్న వసారాలోంచి వినవచ్చిన శబ్దానికి కొద్దిక్షణాలు డిస్టర్బ్ అయినా తేరుకుని చెప్పడం కొనసాగించింది జయప్రభ.

"జమీందారుగారు మహదానందపడేలా ఆయన కోరిక తీర్చగలిగాను. నా కడుపున మగబిడ్డ పుట్టాడు. కానీ దురదృష్టం దారికాచింది. ఏడాది తిరక్కుండానే హెపటైటిస్-బీ జమిందారుగారిని దూరం చేసింది.

ఒక రకంగా మళ్ళీ నన్ను ఒంటరి

అమ్మాయిలకు స్వేచ్ఛ ఇవ్వండి, స్వేచ్ఛగా జీవించనివ్వండి. ఆ స్వేచ్ఛ కోసమే నేను ఇంట్లోనుండి పారిపోయి వచ్చా. -మల్లికా షెరావత్, నటి

తనం ఆవహించింది"

జయప్రభకి ఎదురైన పరిస్థితుల గురించి వింటుంటే నిత్య మొహంలో బాధ కనిపించింది.

"అప్పటినుంచీ ఒకే ఒక ధ్యేయంతో బతుకుతున్నాను.

నా కడుపున పుట్టిన జమీందారు బిడ్డని పెంచిపెద్దచేసి అతనిద్వారాకొన్ని తరాలపాటు ఈ జమీకి వారసత్వం నిలిచి ఉండేలా చేయాలి..."

శక్తికి మించిన బాధ్యతను చేపట్టి, పట్టువదలకుండా వాటిని నెరవేర్చాలని చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్న జయప్రభ కమిట్‌మెంట్‌కి జోహార్లు అనుకుంది నిత్య. కొంచెం ఎమోషనల్ అయిన జయప్రభ ఒక నిమిషం వ్యవధిలో నార్మల్ అయ్యింది.

"సో... నిత్యా. ఐయాం అగైన్ కన్ఫ ర్మింగ్ దట్ యూ హావ్ బీన్ సెలెక్టెడ్. అయితే పాస్‌పోర్ట్‌తో సహా నీ సర్టిఫికెట్లు మాకుఇవ్వాలి.ఆర్నెల్ల కాంట్రాక్టు పూర్త యిపోయినప్పుడు రిటర్న్ చేసేస్తాం.

నీకు అతి ముఖ్యమైన కండిషన్ గురించి చెప్పారు కదా... ఆర్నెల్ల పాటు ఖచ్చితంగా జాబ్ చెయ్యాలి. మధ్యలో మానేయడం కుదరదు. ఇంకా...మూణ్నాలుగురోజుల్లోజాయిన్ అయిపోవాలి. జాయిన్ అయిన రోజే అడ్వాన్స్ ఇస్తాం"

జయప్రభ చెప్తున్న వివరాలన్నీ బాగానేఉన్నాయి కానీ ఇప్పటికీ ఉద్యోగ బాధ్యతేంటన్నది అస్సలు అర్థం కాలేదూ, ఆమె కూడా చెప్పలేదు.

అదే విషయాన్ని జయప్రభని అడిగింది నిత్య. జయప్రభ సమాధానం చెప్పబోతూ ఆగింది. సోఫాలోంచి లేచి అక్కడే అటూ ఇటూ పచార్లు చేసింది. అటూ ఇటూ తిరుగుతూ సడెన్‌గా ఆగింది.

"నాతోబాటు రా..." ఇలా అంటూనే నడిచింది జయప్రభ. ఆమెని అనుస రిస్తూ నడిచింది నిత్య.

హాల్లో ప్రధాన ద్వారానికి ఎదురుగా వృత్తాకారంలో అటూఇటూ రెండు పక్కలా తివాచీలా పేర్చుతో ఉన్న మెట్లలో కుడివైపు వాటిమీదుగా చక చకా జయప్రభ నడుస్తుంటే ఆమె వేగాన్ని అందుకుంటూ నడిచింది.

రెండో అంతస్థులో కారిడార్ దాటాక ఎడమవైపున ఉన్న గదిని సమీపించి తలుపునెట్టింది జయప్రభ.

లోపలినుంచి ఎలాంటి అలికిడి వినరాకపోతుంటే విస్తుపోతూనే లోపలికి నడిచింది. గదిలో అన్ని వస్తువులూ చెల్లాచెదురుగా ఉన్నాయి. సర్దినవన్నీ తీసి అస్తవ్యస్తంగా పడేసినట్లు ఉంది.

అక్కడుండాల్సిన వ్యక్తులు లేనందున చిరాకుపడుతూనే సెల్‌ఫోన్ తీసి ఒక నెంబర్‌కు డయల్‌చేసింది జయప్రభ. "ఎక్కడున్నారు?' అవతలనుంచి ఎవరు మాట్లాడుతున్నారన్నది నిత్య ఊహకు అందలేదు.

"అక్కడికెందుకువెళ్ళారు?" చిరాకు స్థానంలో కోపం కనపడుతుంది.

"మీరందరూ ఇక్కడే ఉండి పనులు చేసుకోవాలి. అక్కడికి వెళ్ళొద్దని ఇది వరకే చెప్పాను. ఇకముందు నా పర్మిషన్ తీసుకోకుండా అక్కడికెళ్ళొద్దు" ఆమె గొంతులోంచి వెలువడే ప్రతీ మాట శిలాశాసనం లాంటిదని అర్థమైంది నిత్యకి.

ఫోన్ డిస్కనెక్ట్ చేసి వెనక్కి తిరిగి నడిచింది జయప్రభ. గబగబా మెట్లు దిగి ఆ భవనానికి ఎడమవైపున్న పాడవాటి వసారాలో ఆమె వడివడిగా నడుస్తుంటే ఫాలో అయ్యింది నిత్య.

వసారాలో ఆ చివరకు చేరుకునేకొద్దీ మాటలూ, శబ్దాలూ వినిపిస్తున్నాయి. చిట్టచివరి వరకూ నడిచి అక్కడ్నుంచి కుడివైపు మలుపు తీసుకుని మళ్ళా నడక సాగించాక ఎదురుగా ఉన్న ద్వారాన్నిదాటి నడిచిన జయప్రభ వెనకాలే నిత్య అడుగులేసింది.

పాతకాలపు సావిడిని దాటి ఎడమ దిక్కున ఉన్న తలుపు తెరిచి దాటారిద్దరూ. దీర్ఘ చతురస్రపు ఆకారంలో వున్న పాతకాలపు భవంతీ,

చుట్టూరా నడవా, ఆ కారిడార్‌కి ఆనుకుని అన్నివైపులా కలిపి సుమారు ఎనభై గదులూ, మధ్యలో విశాలమైన నడింవాకిలీ, అన్నివైపులా రాతిపలకల తాపడంతో ఉన్న నేలా... మరీ కొత్త సొబగులు లేకపోయినా సాంప్రదాయపు అందాలు సంతరించుకున్న తీరున ఉందా భవనం.

ఏడెనిమిది మంది పనివాళ్ళు తమ తమ పనుల్లో బిజీగా ఉంటూ, గట్టిగా మాట్లాడేసుకుంటున్న ఆ సమయంలో మేడమ్‌గారిని అక్కడ చూసి అందరూ ఎలర్ట్ అయిపోయి బిర్రబిగుసుకుపోయారు.

వాళ్ళందరూ దణ్ణంపెట్టి చేతులు కట్టేసుకుని నిలబడ్డారు.

నేను ప్రధాని అభ్యర్థిని కాదని నేనే ఎలా చెప్పగలను. -మమతా బెనర్జీ, సి.ఎమ్., పశ్చిమ బెంగాల్



చేత్తో సైగచేస్తూనే పనులు చేసుకొమ్మని సూచించింది జయప్రభ. దాంతో అందరూ పనివాళ్ళూ కుదురుగా కూర్చొని ఎవరిపనుల్లో వాళ్ళు లీనమయ్యారు. మేడమ్ అక్కడున్నారన్న వాస్తవం వాళ్ళనెవర్నీ స్థిమితంగా ఉండనివ్వడంలేదు.

"ఈ భవనం పేరు పంచవటి... దివాణంలోనూ, తోటా, పొలాల్లోనూ పనిచేసే అందరు పనివాళ్ళకూ నివాసంగా ఇచ్చిన స్థలం. దగ్గరదగ్గర నూటయాభైమంది పనివాళ్ళు కుటుంబాలతోనే ఉంటున్నారిక్కడ... పిల్లాజెల్లా కలిపి మూడునందల మంది నివాసం ఉంటారిక్కడ.

వాళ్ళందరికీ మూడుపూటలాఉచిత భోజనాలకోసం కామన్‌గా ఏర్పాటు చేసిన కిచెన్, డైనింగ్ ప్లేసూ కూడా ఇక్కడే ఉంది..." చెప్పదలచుకున్న విషయాలు మాత్రం వివరంగానే చెబుతుంది జయప్రభ.

ఈ ప్రదేశంలో ఉన్న సిట్యుయేషన్ ఏకంగా తను చెయ్యబోయే జాబ్‌కి



జ్ఞాపకాలన్నీ నాలోనే

'ధడక్'మనిపిస్తున్న యవ్వనరాశి జాన్వీకపూర్ అమ్మలేని లోటుఎప్పరూ. ఎప్పటికీపూడ్చలేనిదంటున్నది.

"ఎన్నోవిషయాల్లో అమ్మలేని లోటు స్పష్టంగా తెలుస్తున్నది. ఎంతో కష్టపడి వాటి నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నా. నా వల్ల కావడం లేదు.

అమ్మ జ్ఞాపకాలు నాతోనే చివరిదాకా వుంటాయి. అమ్మచేసే కొన్ని పనులు నా మనస్సులో బాగా నాటుకుపోయాయి. భవిష్యత్‌లో అన్నిరకాల పాత్రలూ చేయాలన్నది నా కోరిక" అని చెప్పింది.



మై స్కిన్‌కేర్

చర్మ పరిరక్షణ విషయంలో అత్యంత జాగ్రత్తగా వుంటానంటున్నది కైరా అద్వానీ. "చర్మ సౌందర్య పరిరక్షణ విషయంలో నాకు కొన్ని ప్రత్యేకమైన అలవాట్లున్నాయి. ప్రతిరోజూ ఏదోకటి అప్లయ్ చేస్తుండాలి. దుమ్ము, ధూళి పేరుకోకుండా చాలా జాగ్రత్త వహిస్తాను. షూటింగ్ నుంచి ఎంత ఆలస్యంగా వచ్చినా, బద్ధకించకుండా మేకప్ తొలగించుకుంటాను.

అలా చేస్తేనే నాకు నిద్రపడుతుంది. ఆహారం తినడానికైనా అశ్రద్ధ వహిస్తానేమో కాని, చర్మాన్ని క్లెన్స్ చేసుకోవడంలో మాత్రం అస్సలు రాజీపడను. సీజన్లకు అనువైన మాయిశ్చరైజర్లు వాడుతుంటా. ఒక్కమాటలో చెప్పాలంటే చంటి పిల్లలంత జాగ్రత్తగా చర్మాన్ని పరిరక్షించుకుంటాను" అంటూ వివరించింది.

కనెక్ట్ అవుతుందా అన్న ఆలోచన నిత్యలో మెదిలింది. కానీ ఎలాంటి కంక్లూజనూ దొరకడం లేదు.

అటూ ఇటూ ఏదో వెతుకుతున్నట్లు చూస్తున్న జయప్రభ ఆలోచనని అర్థం చేసుకున్న ఒకపని మనిషిముందుకొచ్చి చెప్పింది "అబ్బాయిగారు ఆ గదిలో ఉన్నారమ్మ..." కొద్ది క్షణాలు ఆగి మళ్ళీ అంది "అన్నం తింటున్నారమ్మా..."

ఇప్పుడే అబ్బాయిగారు తనని ఇంటర్వ్యూచేస్తారేమో అన్న ఆలోచన వచ్చి రాబోతున్న నవ్వుని ఆపుకుంది నిత్య. పనిమనిషి సూచించిన గదివైపు నడుద్దామా అనుకుంటూనే ఆగిమళ్ళా అటుతిరిగింది జయప్రభ.

సరిగ్గా ఆ సమయంలో ఆ గది లోంచి పెద్ద అరుపులు వినబడ్డాయి.

వెర్రికేకలు పెడుతూ, ఊగిపోతున్న ఓ పాతికేళ్ళ కుర్రాడిని వీల్‌ఛెయిర్లో తోసుకుంటూ ఓ గదిలోంచి వచ్చిందొక ఆయా.

స్థిరంగా కూర్చోలేక అటూ ఇటూ వాలిపోతున్న తనని సరిగ్గా కూర్చోపెడుతుందామె. మరో ఆయా ఆ కుర్రాడికి పెరుగన్నం తినిపించే ప్రయత్నం చేస్తుంటే అతను తిరస్కారంగా తోసేస్తున్నాడువద్దువద్దనే భావం వచ్చేలా అరుస్తున్నాడు.

నోటిచుట్టూ అంటుకున్న అన్నం మెతుకులూ, బట్టలనిండా చారికలు కట్టిన ఎంగిలి మరకలూ... అంతకు మించి చింపిరి తలా, మాసిన గడ్డం, దుమ్ము పట్టిన బట్టలూ, చింపేసుకున్న చొక్కా జేబూ, అడ్డ దిడ్డంగా మడతలుపెట్టిన లూజ్ ప్యాంటు అంచులూ...

ఎలా ఉంటే ఎవరూ ఇష్టపడరో అలా ఉన్నాడా అబ్బాయి.

అతని చేత అన్నం తినిపించడం ఒక బ్రహ్మ ప్రళయంలా తోస్తుంది ఇద్దరు ఆయాలకీ. కష్టపడి ఒకామె అతన్ని పట్టుకుని చేతులు చుట్టూ వేసి బంధిస్తే మరో ఆయా నోట అన్నం ముద్ద పెట్టడానికి ప్రయత్నించడం, అతను ససేమిరా సహకరించకపోవడం, మొహాన్ని తిప్పేసుకోవడం.

ఏదోలా కష్టపడి ముద్దని నోట కుక్కితే నేల ఉమ్మేయడం... ఒక గంట నుంచీ ఇదేతంతు నడుస్తుంది.

అంతలా సతాయిస్తున్నా తప్పనిసరి డ్యూటీ చేస్తున్నారు ఆయాలు.

జయప్రభని చూసి ఇంకొంచెం వెర్రెక్కినట్లు ప్రవర్తించాడా కుర్రాడు. "అమ్మా... చూడు వీళ్ళు... కొడుతున్నారు" అతి కష్టంమీద ఒక్కో అక్షరంలా పలుకుతున్న అతని మాటలు నిత్యకు మాత్రం అర్థంకావడం కష్టం అయ్యింది.

ఆయాల్లో ఒకామెదగ్గరకొచ్చి జయప్రభకి అభివాదం చేసింది "మేడమ్... బాబుని బుజ్జగించి అన్నం తినిపించాలన్న మా ప్రయత్నాలకు సహకరించడం లేదు. బాగా అల్లరి చేస్తున్నాడు.

ఇక్కడికి రావాలని పట్టుబట్టాడు. కనీసం ఇక్కడికొస్తే అన్నం తినిపించొచ్చని ఇలా తీసుకొచ్చాం. ఏదోలా ఆటపాటల్లోపెట్టి అన్నం తినిపించాక తీసుకుపోదాం అనుకున్నాం.."



నా సభలకు భారీగా జనంవచ్చారు.కాని ఓట్లువెయ్యలేదు. సొంత మెజారిటీలేని ముఖ్యమంత్రినవటం చాలా బాధగా వుంది.-కుమారస్వామి, కర్ణాటక సి.ఎమ్.

"ఆయాలు ఇద్దరుండీ బుజ్జగించలేకపోతున్నారా? వాడు ఇక్కడికి రావడానికి పంతం పడితే ఏదోలా మాటల్లో పెట్టి అక్కడే ఉంచాలిగానీ... మరోసారి ఇక్కడ చూస్తే ఊరుకోను. అన్నం తినడం పూర్తయ్యాక అక్కడికి తీసుకుపోండి. ఐనా వీడు ఇక్కడుంటే చంద్రావుఅక్కడేంచేస్తున్నాడూ?పిలవండి. చంద్రరావ్ ఎప్పుడూ బాబుతోబాటు ఉండాల్సిందే"

ఆయా ఇంకా ఏదో చెప్పాలని ప్రయత్నించింది కానీ ఆమె తర్వాత మాట్లాడదాం అన్నట్లు సంజ్ఞ చేసింది జయప్రభ. చేసేదిలేక ఆయా వెనక్కి నడిచి వెళ్ళిపోయింది.

"నాన్నా.. అల్లరి చేయకుండా బుద్ధిగా అన్నం తినేయాలి" జయప్రభ మాటల్ని విన్నట్లే తలూపి మళ్ళీ మామూలుగానే పిచ్చి అరుపులతో గోలచెయ్యడంలో మునిగిపోయాడు.

నిత్యకి కొంతమటుకు క్లారిటీ వచ్చిందిగానీ ఈ వాస్తవం ఇంకొన్ని కొత్తసందేహాలకు తావిచ్చింది. అసలు ఇంతవరకూ ఆమెకు తెలియకుండా ఉంచిన నిజం ఇప్పుడు బోధపడింది. మేడమ్ కన్న కొడుకు పరిపక్వతలేని మనస్తత్వంకలవాడని అవగతమైంది.

"పదవెళ్దాం" నిత్యతో అంటూ నడిచింది జయప్రభ. ఇక్కడి పరిస్థితులని ఆకళింపు చేసుకునేందుకు ఆ పరిసరాలని మరింత క్షుణ్ణంగా గమనిస్తూనే మేడమ్ వెనక నడిచింది నిత్య.

వచ్చినదార్లోనే వెనక్కి వెళ్ళి ముఖ్య భవనం లోపలికి నడిచి హాల్లో కూర్చున్నారిద్దరూ. "నీకు ఈపరికి అర్థమై ఉంటుంది... చూశావుగా" అంటూ ఆగింది జయప్రభ.

ఆమె మాటలు వింటూనే మరోపక్క ఆలోచిస్తుంది నిత్య. ఆ కుర్రాడి ఆలనాపాలనా తను చూడాలేమో. ఆ పనికి ఇప్పటికే చాలామంది ఉన్నట్లున్నారుగా? ఐనా ఆరునెలల్లో అయిపోయేదేం లేదు. ఆ కుర్రాడు ఉన్న పరిస్థితి బట్టి అతన్ని జీవితాంతం ఎవరో ఒకరు కనిపెట్టుకుని ఉండాల్సిందే...

"నాని... నా కడుపున పుట్టిన జమీందారుగారి వంశాంకురం..." జయప్రభ మాటల వెనుక తొక్కిపెడుతున్న బాధ ప్రస్ఫుటమవుతుంది.

"అసలు నాని పుట్టగానే జమిందారుగారు లోకాన్నిజయించినంతగాసంబరపడ్డారు. తనవల్ల వంశం నిర్వీర్యం కాకుండా నిలబడిందని ఆనందానికి లోనయ్యారు. హెపటైటిస్-బి అని ముందుగా గుర్తిచలేకపోవడంతో మేం తేరుకునేలోపు ముదిరిపోయింది.

ఇంకా ఉంది



ఆహన కుమ్రా

ఒకప్పుడు బుల్లితెరకే పరిమితమైన ఆహన కుమ్రా ఇప్పుడు సినిమాల్లో, వెబ్ సిరీస్‌లోనూ బిజీగా ఉంది. 'లిప్‌స్టిక్ అండర్ మై బుర్ఖా'లో ప్రశంసలు పొందింది. పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్ అన్నవారు ఎక్కువమందున్నారు. ఆమె వ్యక్తిగత విశేషాలు :

▸ **లిప్‌స్టిక్ అండర్‌మై బుర్ఖాలో:** నా పాత్రను 'బోల్డ్' అనకుండా అన్ కన్వెన్షనల్ అన్నవాళ్ళకు కృతజ్ఞతలు చెప్పుకుంటాను

▸ **అన్ కన్వెన్షనల్ పాత్రలు రాసే :** రచయితలకే కాదు, తీసే దర్శకులకూ క్రెడిట్ దక్కుతుంది

▸ **నా దృష్టిలో :** మన ప్లాన్లు అన్నీ ఫాలో అవ్వడం కష్టం, జీవితానికి దాని ప్లాన్లు దానికి ఉంటాయి

▸ **నా పాత్ర :** బాగా నచ్చింది. తన జీవితాన్ని ఇష్టం వచ్చినట్లు, అనుకూలంగా నడుపుకోగల పాత్ర

▸ **ఇంతకుముందుకంటే :** హీరోయిన్లకు ఇప్పుడు మంచి పాత్రల అవకాశాలు వస్తున్నాయి.మహిళాశక్తిని ప్రతిబింబించగలుగుతున్నారు. నటులతో సమానమైన వెయిటేజ్ దక్కించుకుంటున్నారు

▸ **నేను ఇప్పటికే :** థియేటర్‌లో పనిచేయగలుగుతున్నాను. నేను పద్నాలుగు సంవత్సరాల వయస్సు నుంచి థియేటర్ చేస్తున్నా

▸ **నా బికినీ ఫొటోల పోస్టింగ్స్‌కు:** రకరకాల వ్యాఖ్యానాలు వినపడుతుంటాయి. ఇవేమీ నన్ను ప్రభావితం చెయ్యవు. నాకు నచ్చినట్లు నేను సాగిపోతుంటా

▸ **తాజా వెబ్ సిరీస్ అనుభవాలు :** చాలా బావున్నాయి. నా టీమ్ ఎంతో చక్కగా పనిచేస్తున్నది. ఇద్దరే యాక్టర్లు. ఇటువంటి సెటప్‌లో ఎప్పుడూ పని చేయలేదేమో కొత్తగా ఉంది

▸ **నా జీవితంలోని టర్నింగ్ పాయింట్:** 'లిప్‌స్టిక్' సినిమా అనుకుంటున్నాను.ఇంతకు ముందు నన్ను నేను లిమిట్ చేసుకున్నాను. స్టీరియోటైప్ ముద్రంటే నాకు నిజంగా చాలా భయం

▸ **హీరోయిన్లు :** తమ ఇమేజ్‌ను సక్రమంగా మెయిన్‌టెయిన్ చేయాలన్నది నా అభిప్రాయం. కాని నటుల మాదిరి, తారలకు ఆప్షన్ ఉండదు. ఊరికే ముద్ర పడిపోతుంది.'లిప్‌స్టిక్' అలా కాదు.ఛాలెంజింగ్ రోల్

▸ **ఈ సినిమాలో:** సవాల్ చేసే సన్నిహిత సన్నివేశాలున్నాయి. ఇవి నన్ను నటిగా దృఢ పరిచాయి

▸ **భవిష్యత్తులో :** విభిన్న పాత్రల అవకాశం రాగలదని, చెయ్యగలనని ఆశిస్తున్నాను

▸ **నా తదుపరి ప్రాజెక్టులు :** 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అనే సినిమా చేస్తున్నాను. ఇంకొన్ని స్క్రిప్టులు కూడా చదువుతున్నాను

▸ **సినీ నేపథ్యం :** మహిళలకు హిందీ పరిశ్రమలో ఓ స్థానం దక్కించుకోవడం సులువైన సంగతి కాదు. నేను మంచి పాత్రలకోసమే ప్రయత్నిస్తున్నాను

WhatsApp





మీరు, ఎవరి జీవితాన్ని తాళంవేసి బంధించలేరని నిశ్చయంగా తెలుసుకోండి.

ఒకవేళ ఆ విధంగా చేయగలిగినా,వారిని మరణ సమయంలో బంధించి చావుని ఆపగలరా? ఎవ్వరికీ అలాంటి శక్తి లేదు. -త్రైలింగస్వామి

^

చెట్టునిండా పండ్లు వున్నా వాటిలో పండినదానిపై 'రామచిలుక' వాలుతుంది. కుళ్ళినపండువైపు పురుగు పాకుతుంది.

మన చుట్టూ వున్న ప్రపంచంలో మంచి, చెడూ రెండూ వున్నాయి. నీ స్వభావాన్ని అనుసరించి నచ్చినవైపుకు వెళతావు. భగవత్ చింతనతో స్వభావం శుద్ధి అవుతుంది.

^

అమృతసర్ నుండి ఓ విమానం కెనడాకు వెళుతోంది. దానిలో 103 మంది ప్రయాణీకులు ఉన్నారు. రాత్రి డిన్నర్ సమయం అవుతోంది. చూస్తే నలభై ఐదుమందికి మాత్రమే డిన్నర్ రెడీగా ఉంది. భోజనం ఏర్పాట్లలో అనుకోని పొరపాటు. సిబ్బంది చర్చించుకున్నారు.

ఐదు నిమిషాల తరువాత ఎయిర్ హోస్టెస్ అనౌన్స్‌మెంట్ ఇచ్చింది.

"మా సిబ్బంది చేసిన పొరపాటువల్ల 45 మందికి మాత్రమే డిన్నర్ అందుబాటులో ఉంది. జరిగిన దానికి క్షమించమని కోరుతున్నాము. ఎవరైతే తమ భోజనాన్ని ఇతరులకోసం వదిలివేస్తారో, వారికి కెనడా వెళ్ళేదాకా ఎంత తాగితే అంత మద్యం అందించబడుతుంది. ఏ విధమైన డబ్బూ చెల్లించవలసిన అవసరం లేదు"

ఎయిర్‌హోస్టెస్ ఓ గంటన్నర గడిచినతరువాత మళ్ళీ అనౌన్స్‌మెంట్ చేసింది.

"ఎవరైనా మనసు మార్చుకోవాలనుకుంటే ఇంకా 44 మందికి డిన్నర్ రెడీగా ఉంది"



^

మిథిలా నగరాన్ని జనక మహారాజు వారసులు పరిపాలిస్తున్న రోజులవి. తరాలు మారాయి. జనకుని బోధలను నెమరువేసుకుంటూ ఆయన చేసినట్లే అన్ని పనులు మూసపోసినట్లుచేసేవారు.

వినయంగా మెలిగేవారు. ఒకరోజు వారి రాజ్యానికి విశ్వామిత్ర మహర్షి వేంచేశారు. వారికి చక్కనిరీతి స్వాగత సత్కారములు ఏర్పాటుచేశాడు రాజు. సభలో వారిని ఉచితాసనము మీద ఆశీస్సులను చేశాడు. వినయం నిండిన మాట తీరుతో.

"ఋషివర్యా! అహం అంటే ఏమిటి?" అని అడిగాడు.

విశ్వామిత్రులవారు "రాజా! ఏమిటీ పిచ్చి ప్రశ్న?" అని గద్దించాడు. దాంతో రాజు తట్టుకోలేకపోయాడు.

మొహం ఎర్రబడింది. లోపల నుండి ఆవేశం తన్నుకొస్తోంది.

రాజు స్థితి చూసి నవ్వి "ఇదే రాజా! అహమంటే" జనకుడు చేసిన పనులు గుడ్డిగా అనుసరించటంవల్ల ప్రయోజనం లేదు. మీలో ఆత్మజ్ఞానం పొందాలన్న తపన వుండాలి. గురువు మీద, దైవంమీద అచంచల విశ్వాసం వుండాలి.

అప్పుడే అహంకారం వదులుతుంది అని వివరించాడు.

ఆయన పాదాలపై సాష్టాంగపడ్డాడు. రాజు నిండైన వినయంతో.

^

సుకుమారి ఓ కొత్త సిమ్‌కార్డు కొనుక్కుంది. భర్త వెంకటేశ్‌ను సర్‌ప్రైజ్ చేద్దామని కొత్త నెంబరుతో గొంతుమార్చి- "డార్లింగ్ ఎలా ఉన్నావు?" అని వంటింట్లోంచి ఫోన్ చేసింది.

వెంకటేశ్ : "ఆ రాక్షసి ఇంట్లోనే ఉంది. టైమూ, పాడు లేదా? ఫోన్ పెట్టేయ్" అన్నాడు. ఓ అరగంట తర్వాత ఐ.సి.యు.లో వెంకటేశ్ ఎడంకాలు పైకి వేళ్ళాడేసి వుంది. ♦

^

నరసింహమూర్తి దేవాలయ మండపంలో వేంచేసి వున్న స్వామీజీని దర్శించి వినయంగా తన కష్టం చెప్పుకున్నాడు.

"స్వామీ! నాకు కోపం చాలా ఎక్కువ. దాంతో పాటు ఆవేశంకూడా తన్నుకు వస్తుంది. నన్ను నేను అదుపులో పెట్టుకోలేకపోతున్నాను. మీరే నన్ను కాపాడాలి"

స్వామీజీ : "ఏది! ఒక్కసారి నీ కోపావేశాలు నాకు చూపించు"

నరసింహం : "ఇప్పుడు రావట్లేదు"

స్వామీజీ : "పోనీ కాసేపాగి చూపిస్తావా?"

నరసింహం : "అలా చేయలేను. ఎప్పుడొస్తుందో తెలీదు"

స్వామీజీ : "అంటే కోపం నీ సహజ గుణం కాదు. నీకు పుట్టుకతోటే రాలేదు. తల్లిదండ్రులు నీకిచ్చిన ఆస్తి కాదు. కోపం నీ సొంతమే ఐతే ఏ సమయంలోనైనా, ఏ మనిషిపైన అయినా, ఎక్కడైనా చూపించగలిగే వాడివి. అందుచేత అది నీలోకి ఎలా వచ్చిందో గమనించుకుంటే దాన్ని వదిలించుకోవచ్చు"

Life is a constant learning process

అనిల్



పండ్ల రుచుల్లో వ్యత్యాసాలెందుకు?

ఒక్కో పండు ఒక్కో రుచిలో వుంటుంది. కొన్ని పండ్లు బాగా తియ్యగా వుంటే, ఇంకొన్ని పుల్లగా, ఇంకొన్ని తీపి- పులుపులు కలగలిపి వుంటాయి.

ఒకే జాతి పండ్లు అయినప్పటికీ, రుచిలో వైవిధ్యం కనపడుతుంది. ఎందుకిలా? అంటే ఒక్కో పండు ఒక్కో రకమైన రసాయనాలతో మిళితం అయివుంటుంది. పచ్చిమామిడికాయ, నారింజ, నిమ్మజాతి పండ్లు తిన్నప్పుడు అవి పుల్లగా వుంటాయి.వీటిలో ఆమ్ల శాతం ఎక్కువగావుండడమే కారణం.

యాపిల్,పుచ్చవంటివాటిలో ఫ్రక్టోజ్ అనే చక్కెరవంటి పదార్థం ఎక్కువగా ఉండడంవల్ల ఇవి తియ్యగా వుంటాయి. ఇలా ఆ యా పండ్లలో వుండే పదార్థాల స్థాయినిబట్టి రుచి, తియ్యదనం మారుతుంటాయి.

పచ్చి కాయలు, పండుగా పక్వానికి వచ్చేటప్పుడు ఆమ్లాల స్థాయి, పిండి పదార్థాలు కలిసే తీరునుబట్టి రుచి వస్తుంది. మొక్కలు పెరిగిన నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ మార్పులనుబట్టి కూడా పండ్ల రుచులు మారుతుంటాయి. *

బొమ్మల పజిల్

ఈ బొమ్మల కింద ఖాళీలను తగిన పదంతో పూరించుము.

1. Pillow, 2. Tooth Brush, 3. Tub, 4. Note Book, 5. Cap, 6. School, 7. Tennis, 8. Television. *



పొదుపు అలవాటు

ప్రతి నెలలో ఎంతోకొంత పొదుపు చేయాలన్న సూత్రం పెద్దలతో పాటు పిల్లలకూ వర్తిస్తుంది.

నిజానికి, పెద్దయ్యాక దుబారా ఖర్చులు చేస్తున్నా, ఏవి కొనాలి, కొనకూడదు అన్న విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నా అందుకు కారణం చిన్నతనంలో ఇందుకు సంబంధించిన పునాదులు సరిగ్గా పడలేదని అర్థం. స్కూల్‌కు, కాలేజీలకు వెళ్ళే రోజుల్నుంచీ పెద్దవాళ్ళిచ్చిన పాకెట్‌మనీ నుంచికొంతైనా పొదుపు చేయగలిగితే,ఎదిగేకొద్దీ అది ఒక అలవాటుగా మారుతుంది.

భవిష్యత్‌లో చక్కని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి వారికిది అవసరం. పొదుపు నుంచి అవసరమైనప్పుడు ఎలా వాడుకోవాలి వంటి ఆర్థిక పాఠాలను చిన్నప్పటినుంచి వారికి చెప్తుండాలి. *

ఐస్‌క్రీమ్ కహాని

ఐస్‌క్రీమ్ అన్న మాట వినపడగానే పిల్లలు ఐసైపోతుంటారు. ఈ ఐస్‌క్రీమ్‌ని న్యూజిలాండ్, అమెరికా, ఆస్ట్రేలియా దేశస్తులు అత్యధికంగా తింటారు. ఐస్‌క్రీమ్ అత్యధికంగా తయారయ్యేదీ అమెరికాలోనే.

ఈ దేశంలో తొంభైశాతంమంది ఇళ్ళలోని ఫ్రిజ్‌లలో ఐస్‌క్రీమ్ ఎల్లవేళలా ఉంటుందట. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు అమెరికాతన సైన్యానికి ఐస్‌క్రీమ్‌లు అందజేసింది. అప్పటినుంచి వేసవి ఆహారంగా ఐస్‌క్రీమ్ గుర్తింపు పొందింది. 1988లోకెనడాదేశంలోని అల్‌బెర్టాలో అతిపెద్ద ఐస్‌క్రీమ్ తయారుచేశారు. దాని బరువు 24 టన్నులు. 4 కిలోల ఐస్‌క్రీమ్ తయారుచేయాలంటే 5½ లీటర్ల పాలుకావాల్సి వుంటుంది. *

విరామాలు వుండాలి

తరగతి పుస్తకాల ముందు పిల్లలు ఎంత ఎక్కువసేపు కూర్చుంటే ఇంట్లోని పెద్దలు అంతగా ఆనందిస్తుంటారు. కాని ఎప్పుడూ పాఠ్య పుస్తకాలతోనే గడిపేస్తుంటే కలిగే ప్రయోజనం తక్కువంటున్నారు నిపుణులు.

ఎంత తెలివితేటలు, చురుకుదనం గల పిల్లలైనా రెండుగంటలపాటు ఏకబిగిన చదివేశాక ఏకాగ్రత తగ్గిపోతుంది. కొద్దిసేపు రిలాక్సయ్యాకే తిరిగి చదువుకోవాలి. పదేపదే చదవమంటూ పిల్లల వెనుకపడుతుంటే చదువుపట్ల వున్న ఆసక్తి సన్నగిల్లే అవకాశాలుంటాయి. అలా బలవంతపెట్టినా పుస్తకమైతేవారి చేతుల్లో ఉండవచ్చునేమో కాని, ధ్యాస లగ్నంచేయలేకపోతారు.

ఏకాగ్రత బాగా కుదిరినంతవరకు చదువుకుని, కొంతసేపు విరామం ఇచ్చిన తర్వాత రిలాక్సయ్యాక చదువును పునఃప్రారంభించగల స్వేచ్ఛను పిల్లలకు ఇవ్వాలి. *

ఎడారి ఓడ

ఎడారి ప్రదేశాల్లో ఎటుచూసినా ఇసుక తప్ప ఇంకేమీ కనపడనట్లు వుంటుంది. ఈ ఇసుక నేలలో ఒంటెలే వాహనాలు. అందుకే వీటిని 'ఎడారి ఓడ' అంటుంటారు. ఎంత వేడి వాతావరణంలోనైనా ఇవి శరీర ఉష్ణోగ్రతను కోల్పోకుండా వుంటాయి. వారం, పదిరోజులదాకా నీరు తాగకుండానూ వుండగలవు. శరీరంలో నీరు మూడొంతులు కోల్పోయినా తట్టుకోగల విధంగా వాటి శరీర నిర్మాణం వుంటుంది.

ఒంటెలు వెనుక భాగంలో వుండే మూపురం వంటి ప్రదేశంలో ఆహారాన్ని, నీటిని నిల్వచేసుకుని, అవసరాన్నిబట్టి ఉపయోగించుకుంటాయి. ఈ మూపురంలో రెండు సంచుల వంటి భాగాలుంటాయి. ఎక్కువ రోజులు ఎడారిలో తిండి లేకుండా వుండాల్సి వస్తే, వీటిలో నిల్వగల ఆహారాన్ని కొద్దికొద్దిగా వాడుకుంటుంటాయి. S



సమర్థురాలు

గంగాపురంలో గోవిందశెట్టి అనే దొడ్డ వ్యాపారి ఉండేవాడు. అతని కొడుకు శ్రీమంతుడు అనేవాడు వట్టి దద్దమ్మ. వాడికి పెళ్ళీడు వచ్చినా బుద్ధి వికసించలేదు.

పెళ్ళిచేస్తే వాడిలో మార్పు వస్తుందని కొందరు సలహా ఇచ్చారు. డబ్బున్న వాడు కావటం చేత గోవింద శెట్టి తేలికగా శ్రీమంతుడికి సంబంధం చూసి, పెళ్ళిచేశాడు.

పెళ్ళికూతురు లక్ష్మి అందమైనదేగాక చురుకైనది కూడా. మనస్సు వికసించని శ్రీమంతుడు పెళ్ళిలోనే తన భార్యకేసి చూడలేక సిగ్గుపడి, భయపడ్డాడు కూడా. వాడి అమాయకత్వం చూసి, వాడు వెర్రి బాగులవాడని లక్ష్మివైపువాళ్ళు దిగులు పడ్డారు. లక్ష్మి మాత్రం తొణకలేదు.

తన భర్త కేవలమూ అమాయకుడేననీ, ప్రయత్నిస్తే అతన్ని మామూలు మనిషి చేయవచ్చుననీ ఆమె తన వాళ్ళకు ధైర్యం చెప్పింది.

శ్రీమంతుడు బావిలోకప్పలాగా తన ఇంటి వాతావరణం తప్ప ఇంకేమీ ఎరగడు. అతనికి ప్రపంచం మొహం తెలీదు. వాడు మారుతాడేమోనన్న ఆశతో గోవిందశెట్టి తన కొడుకునూ, కోడలినీ తీర్థయాత్రలు చేసి రమ్మని, వాళ్ళకు పుష్కలంగా డబ్బు ఇచ్చాడు. కోడలు సమర్థురాలని గ్రహించి, ఆయన వాళ్ళ వెంట మరెవరినీ పంపలేదు.

తన భార్య వెంట వెళ్ళటానికి కూడా శ్రీమంతుడు ఎవరో తెలియని మనిషి వెంటపోతున్నట్టు, భయపడ్డాడు. కాని ఇల్లు దాటాక కొత్తకొత్త చోట్లు చూడటమూ అతనికి సరదాగానే ఉన్నది.

ఖర్చు చెయ్యటానికి డబ్బున్నది గనక ప్రయాణం సుఖంగా సాగింది. అయితే ఈ కొత్త ప్రదేశాలలో శ్రీమంతుడికి లక్ష్మి ఒక్కతే ఆప్తురాలయింది.

తల్లి చాటు పిల్లవాడిలాగా అతను ఆమె కొంగు పట్టుకు తిరుగుతూ వచ్చాడు. తాను తప్పిపోతానని అతనికి చెడ్డ భయం!

ఒక ఊళ్ళో అంగడిలో మంచి ద్రాక్ష పళ్ళూ, అరటి పళ్ళూ కనిపించాయి. అవి చూడగానే శ్రీమంతుడికి తన నాయనమ్మ జ్ఞాపకం వచ్చింది. ఆమెకు ద్రాక్ష



పళ్ళూ, అరటిపళ్ళూ చాలా ఇష్టం. వెంటనే అతను లక్ష్మితో "ఈ పళ్ళు మా నాయనమ్మకు చాలా ఇష్టం. ఇంత మంచి పళ్ళు ఆమె ఎప్పుడూ తిని ఉండదు. మా తాతయ్య ఆవిడ కోసం ఆమడదూరం పోయి ద్రాక్ష పళ్ళు తెచ్చాడట" అన్నాడు.

"అలా అయితే, మనం తప్పక తిరుగు ప్రయాణంలో కొనుక్కుపోదాం" అన్నది లక్ష్మి.

"అంతదాకా ఆగటం దేనికి? మా ఊరి వాళ్ళెవరన్నా కనిపిస్తే వాళ్ళ చేతికిచ్చి ఇప్పుడే పంపవచ్చు"అన్నాడు శ్రీమంతుడు మొండిగా.

లక్ష్మి పరధ్యానంగా సరేనన్నది. శ్రీమంతుడు తీర్థప్రజల్లో తమ ఊరివాళ్ళు కనిపిస్తారేమోనని వెయ్యికళ్ళతో చూడసాగాడు.

అతన్ని ఒకచోట కూర్చోబెట్టి, లక్ష్మి పక్కనే ఉన్న కోనెట్లో స్నానం చెయ్యటానికి వెళ్ళింది. శ్రీమంతుడు దారినేపోతున్న ఇద్దరు మనుషులను పలకరించి, "మీది గంగాపురం కదూ?" అని అడిగాడు.

వాళ్ళు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. అందులో ఒకడు "అవును. ఏం?" అన్నాడు.

"నేను గోవిందశెట్టి కొడుకును, మా నాయనమ్మకు కొన్ని పళ్ళు పంపాలి. మీరేమీ అనుకోకుండా ఉంటే మీ ద్వారా పంపిస్తాను. ఏమంటారు?" అన్నాడు శ్రీమంతుడు.

"దానికేం భాగ్యం? ఆ పళ్ళేవో త్వరగా తీసుకురా. మేం వెళ్ళాలి" అన్నారు వాళ్ళు.


శ్రీమంతుడు పెద్ద పళ్ళ దుకాణంలోకి వెళ్ళి, పాతిక రూపాయలకు ఒక పెద్ద బుట్టనిండా ద్రాక్ష పళ్ళూ, అరటిపళ్ళూ కొనితెచ్చి, వాళ్ళకిచ్చి-

"వీటిని జాగ్రత్తగా మా ఇంటికి చేర్చండి. మీ మేలు మరువను" అన్నాడు.


వాళ్ళు పళ్ళు తీసుకుని వెళ్ళిపోగానే శ్రీమంతుడు లక్ష్మి దగ్గరికి తిరిగి వచ్చి, తాను చేసిన పని చెప్పాడు. లక్ష్మి నీరుగారిపోయి -

"ఇంకెప్పుడూ అలా తెలియని ముఖాలను నమ్మకు, జ్ఞాపకం ఉంచుకో" అన్నది.

తరువాత ఆ మనుషులు శ్రీమంతుణ్ణి వదలదలచలేదు. శ్రీమంతుడూ, లక్ష్మి మరో యాత్రాస్థలానికి వెళ్ళేటప్పుడు వాళ్ళు కూడా వెనకగా అక్కడికి వచ్చారు. కొత్తచోట లక్ష్మి శ్రీమంతుడూ ఒక సత్రంలో మంచి గది తీసుకుని అందులో బస చేశారు.



సేకరణ : చందమామ రావే



శ్రీమంతుడు సత్రం నుంచి ఒంటరిగా బయటికి రాగానే ఆ ఇద్దరూ అతనికి ఎదురుపడి, నవ్వుతూ పలకరించారు. వాళ్ళను చూసి శ్రీమంతుడు పరమానందంచెంది "గంగాపురం నుంచి ఎప్పుడొచ్చారు? మా నాయనమ్మ ఏమన్నది? మా ఇంట్లో అందరూ బాగున్నారా?" అని అడిగాడు.

"నువ్వు పంపిన పళ్ళు చూసి మీ నాయనమ్మ సంతోషంతో మూర్ఛపోయింది.

మీ నాన్న నీ తెలివికి సంతోషించాడు. పోతే మీ నాయనమ్మ నీకు ఒకమాట చెప్పమన్నది. యాత్రల నుంచి ఆమెకు ఓ వెండి పళ్ళెమూ, బంగారు లోటా కావాలట. వెంటనే పంపించమన్నది. మరి మేంవస్తాం" అన్నారువాళ్ళు.

"ఆగండి, ఆగండి. మీరు గంగాపురం ఎప్పుడు వెళుతున్నారు?" అన్నాడు శ్రీమంతుడు.

"ఇప్పుడే వెళుతున్నాం. ఇంకెవరి ద్వారా అయినా పంపించరాదా?" అన్నారు వాళ్ళు.

"అలా కాదు. ఇక్కడ నాకు మీరు కాక ఎవరున్నారు?" అన్నాడు శ్రీమంతుడు.

"అయితే త్వరగా ఆ వెండి పళ్ళెమూ, బంగారు లోటా ఇచ్చెయ్యి మరి!" అని వాళ్ళు అతన్ని తొందర చేశారు. శ్రీమంతుడు ఒక్క అంగలో సత్రంలోకివెళ్ళి, డబ్బుతో బయటికివచ్చాడు. ముగ్గురూ కలిసి బంగారంకొట్టుకు వెళ్ళి, ఒక వెండి పళ్ళెమూ, బంగారు లోటా నూటయాభై రూపాయలకుకొన్నారు.

వాటిని శ్రీమంతుడు ఆ మనుషులకిస్తూ తన కృతజ్ఞత తెలుపుకున్నాడు. వాళ్ళను పంపేసి శ్రీమంతుడు సత్రం గదికి తిరిగి వచ్చి "నువ్వు వట్టి అనుమానం మనిషివి. వాళ్ళు గంగాపురం నుంచి తిరిగి వచ్చారు" అంటూ వాళ్ళతో జరిగినదంతా భార్యకు చెప్పాడు.

లక్ష్మిసంచీతీసి చూస్తేఅందులో డబ్బులేదు. ఆమె నోటమాట రాలేదు. వాళ్ళు దొంగ వెధవలని నిరూపిస్తే తప్ప శ్రీమంతుడి కళ్ళు తెరుపుడు పడవు. అందుచేత ఆమె అతనితో -

"అవును, వాళ్ళు పెద్ద మనుషులే! ఈసారి వాళ్ళు కనిపిస్తే చెప్పు, వాళ్ళను మర్యాద చేయకపోవటం ఏం బాగుంటుంది?" అన్నది.

లక్ష్మి తన ఒంటిమీది నగలు కొన్ని అమ్మి మరొక యాత్రాస్థలానికి ప్రయాణం కట్టింది.

దొంగలకు ఈ దంపతులు కిక్కురుమనకపోవటం చూసి మరింత ఆశ పుట్టింది.

కొత్తస్థలంలో వాళ్ళిద్దరూ శ్రీమంతుడి కంట పడ్డారు. అతను వాళ్ళను ఆప్యాయంగా పలకరించి, ఎంతో మర్యాదగా తాము సత్రంలో బసచేసిన గదికి తీసుకువచ్చి, తన భార్యకు పరిచయం చేశాడు.

లక్ష్మి వాళ్ళను చూస్తూనే అమాయకంగా "రండి, రండి! గంగాపురంలో మా అత్తా, మామలు బాగున్నారా? మీరు మాకెంతో సహాయం చేస్తున్నారు" అన్నది. వాళ్ళు ఆమెను చూసి ఆ మొగుడికి తగ్గ పెళ్ళామే అనుకుని సంతోషించారు. ఆమె వారికి ఫలహారం పెట్టి "మీరు ఏమీ అనుకోకుండా మాకు మరొక్క సహాయం చెయ్యాలి" అన్నది.


"మేం మీకోసం ప్రత్యేకంగా ఏమీ చెయ్యటం లేదు. మళ్ళా త్వరలోనే గంగాపురం పోతాం. ఏమన్నా కబురు ఉంటే చెప్పండి" అన్నారు వాళ్ళు.

"అయితే వెళ్ళే ముందు ఒక్కసారి కనిపించండి" అని లక్ష్మి వాళ్ళను సాగనంపింది. తరువాత ఆమె పక్క గదుల్లో వాళ్ళకు దొంగల సంగతంతా చెప్పి, వాళ్లను పట్టుకోవటానికి ఒక నాటకం ఆడతాననీ, అందుకుగాను తనమామగారి వయసుగల ఒక పెద్ద మనిషీ, ఆయన తల్లిలా కనిపించే ఒక ముసలావిడా సహాయపడాలని కోరింది. వాళ్ళు సరేనన్నారు.

ఆమె వాళ్ళిద్దరినీ తీసుకుని వచ్చి, ఒక మంచం మీద కూర్చోబెట్టింది. వాళ్ళు అప్పుడే వచ్చినట్టుగా ఒక సంచీ, చేతి కర్రా, చెప్పుల జతా అక్కడే ఉంచింది. ఆమె శ్రీమంతుణ్ణి నోరు మెదపవద్దనీ, ఏం జరిగేదీ చూస్తూండమనీ గట్టిగా హెచ్చరించింది. కొంచెంసేపటికి దొంగ "పెద్దమనుషులు" గదిలోకి వచ్చారు. వస్తూనే కొత్తవాళ్ళను చూసి గతుక్కుమన్నారు.

"రండి, రండి! ఆగిపోయారేం? మీకు తెలుసుగా, వీరు మా మామగారు గోవిందశెట్టిగారు, ఆమె వారి తల్లి!" అన్నది లక్ష్మి.

దొంగ వెధవలు తత్తరపడుతూ, పారిపోయే ఉద్దేశంతో వాకిలికేసి చూశారు. కాని వాకిలికి అడ్డంగా



యమదూతల్లాగా నలుగురు మనుషులు, వాళ్ళకేసి కొరకొరా చూస్తూ నిలబడి ఉన్నారు.

లక్ష్మి నడుం బిగించి "మావారు ఇచ్చిన వెండి పళ్ళెమూ, బంగారు లోటా ఏంచేశారు? చెప్పకపోతే మీ వీపులు బద్దలవుతాయి" అన్నది.

"క్షమించండి! బుద్ధి గడ్డి తిన్నది. మాకు గంగాపురం తెలీదు. వీరిద్దరినీ మేం ఎరగం!" అంటూ వాళ్ళు లక్ష్మి కాళ్ళమీద పడ్డారు.


శ్రీమంతుడు పట్టరాని కోపంతో, "ఎంత మోసం! ఎంత మోసం!" అంటూ కర్రతో ఇద్దరి వీపులమీదా కొట్టాడు.

వాళ్ళు కాలి సత్తువకొద్దీ పారిపోయారు. లక్ష్మి తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు చెప్పుకున్నది. ఆది మొదలు శ్రీమంతుడికి తన భార్య తెలివితేటలపై గురి కుదిరింది.

ఆ విధంగా అతను భార్య ద్వారా లోకజ్ఞానం సంపాదించి మామూలు మనిషి అయ్యాడు.



బూర్లె నాగేశ్వరరావు



కామెడీ కథ

కలనైతే నేమి...?

సంవత్సర కాలంగా మామగారు పిల్చిన ప్రతి పండక్కి కొత్తల్లుడి హోదాలో భార్యతోపాటు బస్సెక్కిన బుచ్చిబాబు దీపావళి పండక్కి మాత్రం భార్య నొక్కదాన్నే బస్సెక్కించాడు. అదీ పండుగ రేపనగా.ముందురోజు సాయంత్రం.

'మీరు కూడా వచ్చే పనికదా" ఆశ చావక అడిగింది లకుమ. "ఎందుకురానూ... ముందు మీ బాబుని నా డిమాండు నెరవేర్చనీ. ఆ తర్వాత..." తన పట్టు వీడలేదు బుచ్చిబాబు.

సదరు బుచ్చిబాబుకి పెళ్ళికి ముందే మాంగా ర్నించి 'ఏమేం'రాబట్టాలో ఓ వెయిటింగ్ లిస్ట్ ఉంది. పెళ్ళిచూపుల్లో కట్నం.. లాంఛనాల విషయమై 'మ్యాచ్ ఫిక్సింగ్' అయ్యాక తన లిస్ట్‌ని లీక్ చేశాడు బుచ్చిబాబు. రాడో చేతి గడియారం... బ్రాస్‌లెట్... బైక్.

'ఓస్. ఇంతే కదా' అంటూ మాంగారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాడు. తీరా ముహూర్తం వేళకి "అన్నీ కుదిరా యల్లుడూ... ఒక్క బైక్ మాత్రం పెండింగు... పెళ్ళి కానీ! పెట్రోల్ కొట్టించి మరీ అప్పగించేస్తాను" అన్నాడు మాంగారు.

అన్నింటికీ మాంగారు 'ఎస్' అన్న తరువాత తను 'నో' అంటే బాగోదని మారుమాట్లాడకుండా తాళి కట్టేశాడు బుచ్చిబాబు. అదిగో... ఇదిగో అంటూ మాంగారు సంవత్సరకాలం దొర్లించేశారే తప్ప ఇంత వరకు బైక్ విషయం ఎత్తింది లేదు.

అందుకే దీపావళికి భార్యనొక్కదాన్నే పంపడం ద్వారా తన 'కోరిక' తీవ్రతను తెలియజేయాలను కున్నాడు. అలాగైనా మాంగారు దిగివస్తాడని ఆశ.

"మీ పట్టు వీడరుకదా! నేనీసారి గట్టిగానే అడుగు తానులెండి. చేరిన వెంటనే ఫోన్ చేస్తాను. చేతులు కాల్చుకోకుండా హోటల్లో భోంచేసేయండి" అంది లకుమ బస్సు కదలబోతుంటే.

"చేరిన తర్వాత కాదు. దీపావళి డిస్కౌంట్ ఆఫర్‌లో బండి కొనిపించి, ఆనక ఫోన్ చేయి" టార్గెట్ ఫిక్స్ చేసి... బస్సు బాడీ గుద్ది మరీ చెప్పాడు.

'తండ్రితో కుస్తీపట్టక తప్పదా...' అనుకుంటూ లకుమ "అలాగేలెండి" మూతి మెదుపుతూ అంది.

"ఏవండీ... నేనండీ" అవతలినుండి భార్య గొంతు వినిపించింది.

"నెంబర్ చూస్తూనే ఆ విషయం తెలిసివచ్చింది. చెప్పేడువ్" అన్నాడు విసుగునటిస్తూ.రిజల్ట్ పాజిటివా నెగెటివా అనే ఉద్వేగంతో కొట్టుమిట్టాడుతూ.

"నా ఏడుపు సంగతి సరే! నేను ఏడ్చేది వింటే మీరు నవ్వేయాల్సిందే" అంది లకుమ నవ్వుతూ.

"అంటే మీ నాన్న ఓకె అనేశాడా"

"ఒక్క ఓకే ఏమిటండీ. డబుల్ ఓకె. అనేలాచేశాను" అంతా తన గొప్పే అన్నట్టుగా అంది లకుమ.

"అంటే మా మాంగారు 'అతి'కిపోయి నాకోటి... నీకోటి రెండు కొనివ్వటంలేదు కదా" అనుమానంగా అడిగాడు.

"బండి ఒకటేనండి... కానీ రెండు బళ్ళపెట్టు"

"అర్థమయ్యేలా చెప్పు" అని టెన్షన్ పడుతూ అడిగాడు.

"మీకింకా అర్థంకాలేదా? బండికి డెబ్భయ్ ఐదు వేలవుతుందట కదా! ఇంకో డెబ్భయ్ ఐదు వేలేస్తే లక్షన్నరలో అదేదో కారేవచ్చేస్తుందట. కొత్తగా మార్కెట్‌లోకివచ్చినఆ కారు కొనిచ్చేస్తానంటున్నారు నాన్న" ఉద్వేగం నిండిన గొంతుతో అంది లకుమ. అదేదో పేరుచెప్పి 'అదేనా' అడిగాడు బుచ్చిబాబు.

"ఆ... ఆ... అదే అనుకుంటా"

"ఈజిట్... రియల్లీ... వ్వావ్.. వాటె 'ప్రెజెంట్' సర్‌ప్రైజ్" రకరకాల భావాలు పలికించాడు గొంతులో బుచ్చిబాబు. కాలు నిలువనిస్తుందా? అప్పటికప్పుడే బట్టలు సర్దుకుని బస్సెక్కేశాడు.

సాదరంగా ఆహ్వానించి షడ్రసోపేతంగా వండి వడ్డించారు అత్తగారు. ఆనందం మరీ ఎక్కువైపోతే ఆకలుండదు. ఆలోచనలు ఆ ఆనందం చుట్టూనే పరిభ్రమిస్తుంటాయి. పరధ్యానంగా తింటూ, "ఏం వడ్డించమంటారు అల్లుడుగారూ" అనడిగితే "కారు వడ్డించండి" అనేశాడు.

"చారు వడ్డించమంటే కుదురుతుంది గానీ... కారు వడ్డించలేం బావగారూ... అంతగా కావాలంటే

జొన్నకూటి మార్టిన్ ఫినెలై

కానిపెట్టగలం" మరదలు జోక్ చేయడంతో అందరూ పెద్దగా నవ్వేసరికి నాలిక్కరుచుకున్నాడు బుచ్చిబాబు.

డెలివరీ తీసుకోవడానికి వచ్చినవారితో 'కార్‌షాప్' కిటకిటలాడుతోంది. వరుస క్రమం ప్రకారం తమ వంతు వచ్చి, ప్రాసెసింగ్ పూర్తిచేసుకుని 'టెస్ట్‌రైడ్'కి వెళ్ళొచ్చిన తరువాత డబ్బు చెల్లించి కారు డెలివరీ తీసుకున్నారు. వస్తూ దారిలో సాయిబాబా గుడిలో పూజ కూడా కానిచ్చేశారు.

ఐవరీ కలర్‌లో తళతళలాడుతూ బుల్లి కారు. ఎంత ముద్దొస్తుందో! అసలు పండుగకు కారు కూడా తోడవడంతో పండుగ మరింత పసందుగా మారింది. ఆ ఆనందంలో భయాన్ని పక్కన పెట్టేసి ధీరుడిలా బాంబులు కాల్చి దీపావళిని ఎప్పటికంటే కూడా ఎక్కువగా ఆనందించాడు బుచ్చిబాబు.

మావగారి ఊరినుండి వచ్చాక 'కారులో ఆఫీసుకు వెళుతుండగా ట్రాఫిక్ జామ్ అయింది' ఎంతసేపు పడుతుందో? అనుకున్నాడు.

సిగ్నల్ పడినప్పుడల్లా కొంచెం కొంచెంగా కదులుతూ, మూడవసారి సిగ్నల్ పడినప్పుడుగాని ఆ చౌరస్తాని దాటలేకపోయాడు.

అప్పటికే పది అయిపోయింది... దారిలో ఇంకా ఇలాంటివి మరి రెండు సిగ్నల్స్ దాటాలి. ఇలా అయితే ఎప్పటికి ఆఫీసు చేరాలి? తలపట్టుకున్నాడు. అన్ని చౌరస్తాల్లోనూ పరిస్థితి అంతే అయింది. చివరికెలాగో ఆఫీసు చేరేసరికి పన్నెండు దాటింది.

"రా వోయ్ రా" ఎన్నడూ లేనిది బాస్ కూల్‌గా నవ్వి, "హాఫ్ డే ఉద్దేశ్యమంటే మధ్యాహ్నం రెండు గంటలకి వస్తే సరిపోయేది కదా" రిలాక్స్‌డ్‌గా రివాల్వింగ్ చెయిర్లో వెనక్కివాలి చేతిలో పెన్నాడిస్తూ అన్నాడు బాస్ భజగోవిందం.

"అదికాదా్సర్ ట్రాఫిక్" నసిగాడు బుచ్చిబాబు.

"నీదేవన్నా కార్ డ్రైవా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడానికి. నీ నైబర్ అహోబలం వచ్చేయ్‌లేదూ" నువ్వెందుకు రాలేవన్న ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు. ఈ క్రమంలో 'కార్ డ్రైవే'అని చెబితే బాగోదని సాహసించలేదు.

"బుద్ధిగా హాఫ్ డే మార్క్ చెయ్యి" చిద్విలాసంగా నవ్వాడు. నవ్వుతూనే కోపాన్ని వెళ్ళగక్కి కసి తీర్చుకోగల బాసానుభావుడు. తప్పుతుందా? కారు కొన్న సందర్భాన్ని పురస్కరించుకుని లంచ్ అవర్‌లో అందరూ బుచ్చిబాబు చుట్టూ చేరారు.

"నోరు తీపి చెయ్‌నోయ్" అన్నారు.

పుల్లారెడ్డి నుండి అటెండర్‌చేత స్వీట్లు రప్పించి 'సెలబ్రేట్' చేయక తప్పలేదు.

అహోబలంతో స్కూటర్‌మీద వెళ్ళేటప్పుడు తొమ్మిదిన్నరకు బయలుదేరితే ఎంచక్కా టైమ్‌కి ఆఫీసు చేరుకునేవాడు.

కారు పుణ్యమాని ఇప్పుడు అంతకంటె గంటన్నర ముందు బయలుదేరాల్సివస్తుంది.

ఆ విధంగా ఉదయం ఇంటిదగ్గర శ్రీమతితో గడిపే సమయం తరిగిపోవటమే కాకుండా ఆమెకు

అభినందించు
అసూయపడకు
అదృష్టవంతుడవుకా!

పొద్దుపొద్దున్నే లేవాల్సిన దుస్థితి. అంతర్మథనంలో పడిపోయాడు. కానీ కారు డ్రైవ్ మీది సరదాతో 'కారిబ్బందులు తప్పించుకోలేం...' అనుకుని సరిపెట్టుకుని, రోజూ ఎనిమిదిగంటలకే బయలుదేరి ఆఫీసుకు సకాలంలో చేరుకుందాం' అని ఫిక్సయిపోయాడు.

ఆ రోజు పే డే కావడంతో మిత్రులంతా ఎప్పటిలా మందు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిపోతే ఇబ్బంది. వద్దులెద్దూ" అన్నా కూడా వినలేదు.

ఎంత మితంగా ఉందామన్నా మిత్రుల ప్రోద్బలం.. నీ కెపాసిటీ ఇంతేనా... ఇంకొక్క పెగ్గు ట్రైచెయ్... లాంటి మాటలకు రెచ్చిపోయి రెండుపెగ్గులు ఎక్కువే తాగాడు. కార్యక్రమమంతా ముగిసేసరికి పదిన్నర అయ్యింది. దారి పొడవునా చూసుకుంటూ జాగ్రత్తగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చినా చివరికి ఓ చోట మూల టర్నింగ్‌లో కాపు వేసిన 'డ్రంకెన్ డ్రైవ్' పోలీసులకు చేతికి చిక్కనే చిక్కాడు.

బ్రీతింగ్ ఎనలైజర్‌లో మోతాదుమించి చూపించడంతో కారు తాళాలు లాక్కుని అక్కడే ఓ పక్కగా నిలబడి వున్న ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ దగ్గరికి తీసుకుపోయాడు కానిస్టేబుల్.

"సార్! ఏదో జీతాల రోజని మిత్రుల బలవంతం మీద..." నసిగాడు బుచ్చిబాబు.

ఇన్స్‌పెక్టర్ ఏ కళనున్నాడో 'సరే పో...' అంటూ కారు తాళాలు వున్న కానిస్టేబుల్ కేసి ఏదో సైగ చేశాడు. కీస్ తీసుకోవడంకోసం ఆ కానిస్టేబుల్‌దగ్గరకు వెళితే... 'రెండువేలు తియ్యి" అన్నాడు.

మారుమాట్లాడకుండా రెండువేలు సమర్పించుకున్నాడు.మరోసారి పట్టుబడితే జైలు తప్పదు హెచ్చరించాడు కానిస్టేబుల్ తాళాలు అందిస్తూ.

బుద్ధిగా తలూపాడు. 'ఇదంతా వాళ్ళవల్లే...' అని మిత్రుల్ని తిట్టుకుంటూ ఇల్లు చేరుకున్నాడు.

మందు ప్రభావాన ఆలస్యంగా పడుకోవడంతో మరుసటిరోజు ఆఫీసుకి చాలా ఆలస్యమయిపోయింది. బాస్ క్యాబిన్‌లోకి రిజిస్టర్ వెళ్ళిపోవడంతో ఏం ఎక్స్‌ప్లనేషన్ చెప్పాలా అని ఆలోచించుకుంటూ బాస్ రూమ్‌లోకి వెళ్ళబోతుంటే "ఇంకా రాలేదా్సర్..." అన్నాడు ప్యూను.

వరదలు వచ్చినా... వాగులు పొంగినా టైమంటే టైమే అనే బాస్ భజగోవిందం ఇంకా రాకపోవడమా? మొదటిసారి ఆశ్చర్యంలో మునిగిపోయాడు. ఆఫీసులో కూడా మంది పల్చగా ఉన్నారు. పది దాటిపోయినా చాలామంది రానేలేదు.

సాహస అనుభవాలు

పైసా వసూల్ పిల్ల ముస్కాన్‌సేథి తన తొలి బాలీవుడ్ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి చేసేసి, ఇదో అభ్యాస అనుభవం అంటూ ఆనందంగా చెపుతున్నది. దక్షిణాదిలో ఇప్పటికే రెండు సినిమాలు చేసిన అనుభవం ఉన్నది.

"కాలేజీ అమ్మాయి పాత్ర.తాజా గాలి పీల్చుకున్నట్లు ఫీలయ్యాను. పాత్రలోకి సులువుగా ప్రవేశించగలిగాను. బుల్లెట్ రైడ్ చేయడం కష్టంగా అనిపించింది. రెండుసార్లు పడిపోయా. గన్ ఎలా హ్యాండిల్ చేయాలో కూడా నేర్చుకున్నాను.

దుబాయ్ ఎడారిలో షూటింగ్ చాలా కష్టం అయింది. ఏదేమయినా ఇది సాహసపూరిత ఆరంభం" అని చెప్పింది.



"అవునూ మనవాళ్ళంతా ఏరి? మూకుమ్మడిగా సెలవుగానీ పెట్టేయలేదు కదా..." అని అడిగాడు ప్యూన్ పుల్లారావుని.

"లేద్సార్! ఇప్పుడే అందిన తాజా కబురు ఏమిటంటే అంతా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్నారట... మీకు తెలుసా! మన చండశాసనుడిది కూడా అదే పరిస్థితి" నవ్వాడు ప్యూన్.

"అంటే నగరంలోని అన్ని డైరెక్షన్లలోని రోడ్లూ జామ్ అయిపోయాయా? అదెలా?" ఆశ్చర్యంగా అడిగాడు బుచ్చిబాబు.

"జాను సార్. అదేదో బడ్జెట్ కారు వచ్చిందట కదా! అంతా టూ వీలర్స్ అమ్మేసి ఇప్పుడా కారుమీద పడ్డారట. దాంతో నగరంలో గత పదిరోజులలో కనీసం లక్ష కార్లు అదనంగా రోడ్డుమీదికి వచ్చి పడ్డాయట. ట్రాఫిక్‌జామ్‌కాకపోతే ఏమౌతుంది సార్" తత్వం బోధపరచినట్లుగా చెప్పాడు పుల్లారావు.

లక్ష వాహనాలా? వెట్టి నవ్వొకటి నవ్వాడు బుచ్చిబాబు. ఇప్పటికే ట్రాఫిక్‌తో విలవిల్లాడుతున్న నగరం ట్రాఫిక్ గతి ఏం కాను? ముప్పేదో ముప్పేట దాడి చేయబోతున్నంతగా కలత చెందాడు బుచ్చిబాబు.

టూ వీలర్‌కి, ఫోర్ వీలర్‌కి మధ్య ధరలో పెద్దగా తేడా లేకపోవడంతో బైక్ కొనదలచుకున్నవాళ్ళంతా కారువైపే మొగ్గు చూపారు. కారంటే... సరదా లేనిదెవరికి? ఆల్‌రెడీ బైకు ఉన్నవాళ్ళు అమ్మేసి ఫోర్ వీలర్ కొనేస్తున్నారు.

ఈ ధోరణి చూస్తుంటే 'అడ్వాన్స్‌డ్' కంట్రీస్‌లోలా ఇక్కడ కూడా ప్రతి ఇంటికీ కారు అయిపోతుందేమో అన్న భయం పట్టుకుంది. ఇది సంతోషించదగిన పరిణామమో... విచారించదగిన పరిణామమో అర్థంగాకుండా ఉంది.

ఇరవై నాలుగ్గంటలూ రోడ్లమీద కార్లే కార్లు! కార్ల ర్యాలీ జరుగుతుందా అనిపించేలా. గంటలతరబడి ట్రాఫిక్ జామ్‌లు... పెట్రోల్‌బంకుదగ్గర క్యూలు... పార్కింగ్ ప్లేస్‌లు నిల్లు... చలాన్లు ఫుల్లు... తారుమారైన ఆఫీసు వేళలు... ఎప్పుడు ఆఫీసుకొస్తే అప్పట్నించే 'ఎయిట్ అవర్స్' కౌంట్ డౌన్. నిశ్శబ్దంగా కార్ల విప్లవం!

ఈ పరిణామంతో రాష్ట్రం అతలాకుతలం అయిపోయింది. ఛేధింపశక్యంకాని పద్మవ్యూహం అయిపోయింది ట్రాఫిక్. కార్లు ఎందుకు కొన్నామా అని అందరూ తలలు పట్టుకునే స్థితికి వచ్చారు. కారు కొనుక్కున్నామన్న ఆనందం లేదు. అమ్మేద్దామంటే కొనే నాథుడు లేడు. ట్రాఫిక్‌జామే జాము.

ట్రాఫిక్ సమస్యను గురించి ఆలోచించేదెవరు? దీంతో కార్ల యజమానులంతా ఓ సంఘంగా ఏర్పడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే దిశగా తగిన చర్యలు చేపట్టమని సంబంధిత అధికారులను ఆశ్రయించారు. 'మావల్లకాదంటూ' వాళ్ళు చేతులెత్తేశారు.

"అవసరమయితే మా ఉద్యోగాలకు రాజీనామా చేసేస్తాం" అనేశారు.

దీంతో ప్రభుత్వం తలపట్టుకుంది. తక్షణమే సత్వరచర్యలు చేపడుతూ, 'శని, ఆదివారాలు మినహాయిస్తే మామూలు రోజుల్లో ఎవ్వరూ కార్లు వాడరాదని, కేవలం ప్రభుత్వ అధికారిక హోదాల్లో పని చేసేవారు మాత్రమే...

అదీ ప్రభుత్వ వాహనాలు మాత్రమే ఉపయోగించాలని కొత్త జీవోను తెచ్చింది. అంతా కార్లను ఇళ్ళల్లో పెట్టేశారు.

టూ వీలర్స్ అట్టిపెట్టుకున్నవాళ్ళు వాటిని బయటకు తీశారు. లేనివాళ్ళు కొత్తవి కొన్నారు. స్తోమత లేనివాళ్ళు పాతవాటిని బేరం చేశారు.

ట్రాఫిక్ అదుపులోనికి వచ్చింది. రోడ్లు విశాలమయ్యాయి. ట్రాఫిక్ జామ్ ఊసే లేదు. పొల్యూషన్ కూడా తగ్గుముఖం పట్టింది.

సంస్కరణల దిశగా సమాజం కూడా చేయి కలపటంతో ప్రభుత్వం ఒడ్డున పడింది.

బుచ్చిబాబు ఇప్పుడు తన స్వంత ఖర్చుతో ఓ బైక్ కొనుక్కున్నాడు. ఇంటిదగ్గర తొమ్మిదిన్నరకే బయలుదేరినా కార్లు లేని రోడ్లమీద హాయిగా ప్రయాణిస్తూ సకాలంలో ఆఫీసుకు వెళ్ళగలుగుతున్నాడు. కాకపోతే కారు కొన్న సరదా తీరకముందే కారుకి కవర్ కప్పివేయాల్సిరావడం అతడ్ని చాలా బాధిస్తూనే ఉంది.

శని, ఆది వారములు మాత్రం భార్యతో కలిసి షి'కారు' పోతున్నాడు. మిగతా రోజుల్లో బైకుతో సరిపెట్టుకుంటున్నాడు.

అదేపనిగా ఫోన్ రింగ్ అవుతోంటే మెలకువ వచ్చింది బుచ్చిబాబుకి. నిద్ర మత్తులోనే సెల్ అందుకుని "హలో" అన్నాడు.

"మీకో గుడ్‌న్యూస్. బైక్ గురించి నాన్ననని అడిగేశాను. ఇంకా బైక్ ఏమిటమ్మా అల్లుడిగారికి కారే కొనిచ్చేస్తానంటున్నారు నాన్న. వింటున్నారా!" ఉరకలేస్తున్న ఆనందం లకుమలో.

"ఏమిటీ... అంతా కలలో లానే..." అసలే తెల్లవారిఝాము కల! భయం చుట్టుముట్టింది.


"నో..."అంటూ పక్కలో బాంబు పడ్డట్టుగా అరిచి, "లకూ... నా లక్కువి కదూ. మనకి కారు వద్దే. బైక్ అయితే నువ్వు నా వెనుక కూర్చొని... నా నడుం చుట్టూ చేతిని వేసుకుని అబ్బ ఆ ఇంటిమసీసే వేరు" అన్నాడు గట్టిగా.

"దర్జాగా కారు కొనిస్తానంటే... ఏమిటా పిచ్చి వాగుడు. ముందు ఆ నిద్రమత్తును వదిలించుకోండి" అంటూ మరోమాటకు అవకాశం లేకుండా కాల్ కట్ చేసేసింది లకుమ.

బుచ్చిబాబు తలపట్టుకున్నాడు. కలలోనైతేనేమి.. కారిబ్బందులను కళ్ళకు కట్టినట్టు తెలియజేసిన 'కల'కు థ్యాంక్స్ చెప్పుకుని ముంచుకురాబోయే పెనుముప్పును నిలువరించేందుకుగాను తక్షణమే మామగారి ఊరికి ప్రయాణమయ్యాడు బుచ్చిబాబు. (S)

భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని జగన్‌ని ఎన్.డి.ఎ.లోకి రమ్మని ఆహ్వానిస్తున్నాను.

-రామ్‌దాస్ అథవాలే, కేంద్రమంత్రి






ఆడిషన్ బలహీనత

బలహీనత గురించి అడిగితే, 'ఆడిషన్' అంటూ ఠక్కున చెప్పింది సొట్టబుగ్గల తాప్సీ.

"నేను దర్శకుడు చెప్పేదాన్ని అర్థంచేసుకుని, దాన్ని అనుసరించి నటిస్తుంటాను. అన్ని జోనర్లలోనూ మంచి నటిగా పేరు తెచ్చుకున్నాను. అయితే నేను వైఫల్యం చెందిన విషయం ఉంది. అది ఆడిషన్. ఇప్పటికీ ఆడిషన్‌లో సక్సెస్ కాలేను.

సినిమాల ఆడిషనే కాదు, యాడ్ ఫిల్మ్స్ ఆడిషన్లు కూడా ఫెయిలయిన సందర్భాలున్నాయి" అంటూ నవ్వులు జిమ్మింది సొగసులాడి తాప్సీ.


ప్రతీ వారం శ్రీ బాపు బొమ్మ

SEX AND సైకాలజీ

Use those fantasies while having sex with her



డా॥జి. సమరం

ఎల్.ఎస్. గుంటూరు

రెండు నెలల్రకితం మా అబ్బాయికి పెళ్ళి చేశాం. ఇంతవరకు అతను అమ్మాయితో శారీరకంగా ఒకటి కాలేకపోయాడు. అమ్మాయి చెప్పినట్లుగా మొదటి వారం-పదిరోజులు ఏదో ట్రైచేశాడట. కాని ఇప్పుడు అసలు దగ్గరకే రావడంలేదట.

బెడ్‌మీద పక్కకి తిరిగి పడుకుంటాడట. అసలు ఏమైనదీ అబ్బాయిని అడిగితే సరిగ్గా ఏమీ చెప్పడు. సెక్స్‌గురించి మావాడికి అవగాహన లేదనుకుంటున్నాను. అందువల్లే వాడు సెక్స్‌లో పాల్గొనలేకపోతున్నాడని నా అనుమానం. సెక్స్ గురించి అవగాహన ఆడపిల్లలోకంటే మగ పిల్లల్లో ఎక్కువ అవసరమా? సెక్స్ అవగాహన లేని మగపిల్లవాడు సెక్స్ చేయలేడా?

సెక్స్ గురించి అవగాహన ఆడపిల్లలకి, మగపిల్లలకి ఇద్దరికీ కావాలి. ఇద్దరిలోనూ అనేక భయాలు, అనుమానాలు ఉంటాయి.

సెక్స్ కావాలనే కోరిక ఉంటే సరిపోదు అవగాహనా రాహిత్యంవల్ల వాళ్ళల్లో ఉండే అనుమానాలు, భయాలు తెలియని స్ట్రెస్‌ని కలిగిస్తాయి. స్ట్రెస్ ఉన్న వాళ్ళల్లో సెక్స్‌లో పాల్గొన్నప్పుడు స్ట్రెస్ హార్మోన్లు వెంటనే విడుదలై సెక్స్‌ని దెబ్బకొడతాయి.

సెక్స్‌గురించి అవగాహన ఉన్నప్పుడు అనుమానాలు, భయాలు తొలగి మనస్సు ఫ్రీ అవుతుంది. ప్రశాంతంగా ఉంటుంది. అటువంటప్పుడు వాళ్ళల్లో కలిగే సెక్స్ స్పందనలు చక్కగా విజృంభించి సక్సెస్‌ఫుల్‌గా సెక్స్‌లో పాల్గొనేటట్లు తోడ్పడతాయి.

మగవాళ్ళల్లో తెలియని భయం, కంగారు ఉన్నప్పుడు స్ట్రెస్ కలిగి అంగస్తంభన లేకుండా అవుతుంది. ఒక ఫెయిల్యూర్ మరొక ఫెయిల్యూర్‌కి కారణమవుతుంది. దాంతో మరింత స్ట్రెస్ అంతర్లీనంగా పెరిగిపోయి సెక్స్‌లో పాల్గొనకుండా చేస్తుంది. చాలామందికి సెక్స్‌లో ఫెయిల్యూర్‌కి ఇదే కారణం.

ఫెయిల్యూర్ అయ్యేకొద్దీ వాళ్ళల్లో సెల్ఫ్‌కాన్ఫిడెన్స్ పోతుంది. సెల్ఫ్ మోటివేషన్ లేకుండా అవుతుంది. దాంతో సెక్స్‌కి దూరం అవుతారు.

ఇటువంటివాళ్ళకి సెక్స్ గురించి సరైన విజ్ఞానాన్ని కలిగించి మోటివేట్ చేయడానికి కౌన్సిలింగ్ ఎంతగానో తోడ్పడుతుంది అనటంలో సందేహంలేదు.

మీ అబ్బాయిని, మీ కోడలిని డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళి కౌన్సిలింగ్ చేయించండి. తప్పకుండా వాళ్ళు సక్సెస్‌ఫుల్‌గా శృంగారంలో పాల్గొంటారు.

ఎన్.ఆర్.కె. విశాఖపట్నం

వయస్సు వచ్చిన మగపిల్లవాడు అమ్మాయిల నగ్న చిత్రాన్ని చూడటానికి ఉత్సుకత చూపిస్తారు. పోర్నో వీడియోలు చూస్తారు.

అమ్మాయిలు ఆ విధంగా అబ్బాయిల నగ్న చిత్రాలు చూడటంగాని, పోర్నో వీడియోల యెడల ఆసక్తి చూపడంగాని నాకు కనపడలేదు.

ఒకవేళ అటువంటి అమ్మాయిలు ఉన్నప్పటికీ చాలా తక్కువే ఉంటారనుకుంటాను. ఎందుకని అమ్మాయిలు నగ్న చిత్రాలపట్ల ఆసక్తి చూపరు? వాళ్ళల్లో మగవాళ్ళల్లోకంటే సెక్సువల్ ఫీలింగ్స్ తక్కువగా ఉంటాయా? వాటిగురించి వివరించండి.

మగవాళ్ళల్లో, ఆడవాళ్ళల్లో సెక్సువల్ ఫీలింగ్స్ సమానంగానే ఉంటాయి. కాని మన సమాజంలో ఏ స్త్రీ అయినా మగవానితో సమానంగా సెక్సువల్ ఫీలింగ్స్ కనబరిస్తే బరితెగించిన ఆడదని అంటారు.

సెక్స్‌లో మీది ఏ పద్ధతి!

స్త్రీ, పురుషులిరువురికీ ఎలా ఏడవాలో ఎవరూ నేర్పరు. నవ్వటంకూడా ఎవరూ నేర్పరు. సెక్స్‌ని ఎవరు దగ్గరుండి నేర్పించరు. ఎవరికి వారు తమకు సహజంగా వచ్చిన సెక్సీ విషయాన్ని ఆనందిస్తారు. సెక్స్ అనేది అన్ని జీవులకు అవసరం.

అందులో సెక్స్‌లో పాల్గొనే తీరు ఆ జీవులలో ఒకేలా వుంటుంది. కాని జంతువులనుండి పరిణమించిన మనుషులలో సెక్స్‌లో ఒకే రకంగా పాల్గొనటం వుండదు. మనుషులంతా ఒక్కటే అయినా వారు సెక్స్‌లో పాల్గొనే తీరు ఒకేలా వుండదు.

ఒక్కొక్కరివి ఒక రకమైన ఇష్టాలు. సెక్స్‌ని ప్రారంభించటం దగ్గరనుండి సెక్సీ భంగిమల వరకు, సెక్స్‌కి వేదికగా ఎంచుకునే చోటు మొదలుకుని సెక్సీ ఊహాలు, ఆలోచనలవరకు అన్నీ భిన్నమైనవే. పైగా సెక్స్ ఇద్దరికీ సంబంధించినది.

అందులోని స్త్రీ ఇష్టాలు, పురుషుడి ఇష్టాలు మారే అవకాశముంది. వారి వారి ఆలోచనలు, సెక్స్‌ని అనుభవించే తీరులనుబట్టి మళ్ళీ రకరకాల భంగిమలు వుంటాయి. భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుతమైన సెక్సీ గ్రంథం 'కామసూత్ర' అందులో ఎన్నో రకాల భంగిమలను వర్ణించారు.

అయితే తమ సెక్సీ జీవితకాలంలో అన్ని రకాల భంగిమలలో ప్రయోగాత్మకంగా సెక్స్‌ని అనుభించామని ఎవరూ చెప్పలేరు. ఆ ప్రయోగాత్మక భంగిమలకు అవసరమైన సమయం కేటాయించలేరు. వాటిలోకి వెళ్ళటానికి వీలైన సెక్స్ శక్తి చాలామందికి వుండదు. అందుకే క్రమంగా తమకు సులభంగా సెక్స్ అనుభవాన్ని అందించే భంగిమల్లోనే పాల్గొంటారు. మనసులో కొత్తదనపు కోరికలు వుంటాయి. కాని ఆ ప్రయోగాలను అమలు చెయ్యగలిగినవారి సంఖ్య బహుతక్కువ.


సెక్స్‌లో పాల్గొనటానికి ఒక ప్రత్యేక కదలిక కావాలనుకోనివారు, సెక్స్ సమయంలో సంగీతం పెట్టుకునేవారు, మొదటి రౌండ్ పూర్తవగానే మత్తు ఆవహించినట్టు అనిపించినా, ఆ నిద్రలో నుండి త్వరగా కోలుకుని తిరిగి రెండవ రౌండ్ సెక్స్‌కి తయారయ్యేవారు సెక్స్‌లో ప్రయోగాలకు ఇష్టపడేవారు.

వీరు ఎటువంటి భంగిమకైనా సిద్ధం. అయితే వీరికి ఒక భంగిమ వీలైనంత త్వరగా బోర్‌కొట్టి కొత్త భంగిమలకు మనసు ప్రోత్సహిస్తుంది.

సెక్స్‌లో తమ పద్ధతి ప్రకారమే పాల్గొనాలనుకునేవారు రెండవ రకం. సెక్స్‌లో ఎంత సమయం గడపాలి, ఎంత వేగంగా జరపాలనేది వీరు నిర్ణయించుకుంటారు. తాము చెప్పినట్లే భాగస్వామి సెక్స్‌లో పాల్గొనాలన్నది వారి ఆలోచన.

సెక్స్‌లో తన శక్తియుక్తులు, సామర్థ్యం ప్రదర్శించాలనుకుంటారు. ఈ తరహా లక్షణాలు కలిగిన అమ్మాయిలు తాము పైన వుండి పురుషుడు కింద వుండే భంగిమను ఇష్టపడతారు. నిలుచున్న భంగిమలో సెక్స్ కోరుకునేవారు మూడవ రకం.

వీరికి భాగస్వామితో ఎదురుగా నిలబడి, నిలువెత్తు అద్దంలో చూసుకుంటూ సెక్స్‌లో పాల్గొనాలని



Courtesy : MAXIMINDIA

వుంటుంది. ఈ భంగిమలో అయితే భాగస్వామి ఆనందపు అనుభవాలను ముఖంలో ప్రత్యక్షంగా చూడగలమన్నది వీరి ఆలోచన.

ఇటువంటి ఆలోచనలు జంటలో ఇద్దరికీ వుంటే స్నానాల గదిలో కలిసి స్నానం చెయ్యటం దగ్గరనుండే రొమాన్స్ మొదలవుతుంది. ఈ తరహాకి చెందిన అమ్మాయిలు వెల్లికలా పడుకుని పాదాలను ఎత్తి అతని భుజంమీదుగా అవతలికిపెట్టి తనలోకి రమ్మని అతగాడిని ప్రోత్సహిస్తారు.

నాలుగోరకంవారు తమంత తాముగా చొరవ తీసుకోవటానికి ఇష్టపడరు. అలాగని సెక్స్ విషయంలో స్పందనలు వుండక వుండవనుకునేందుకు వీలులేదు. భాగస్వామి చొరవ తీసుకోవాలనుకుంటారు. ఒకసారి ఆ చొరవకు వారి శరీరం స్పందిస్తే ఇక ఆ స్త్రీ, పురుషులను రొమాన్స్‌లో ఆపలేరు.

ఈ తరహా మనుషులు సాంప్రదాయ సెక్సీ భంగిమనే ఇష్టపడతారు. సెక్సీ కలల విషయంలోనూ వీరిది భిన్నత్వమే. తాను ఎక్కడో చిక్కుకునిపోతే ఎవరో పురుషుడు వచ్చి రక్షిస్తున్నట్లు కొందరు ఆడవారికి తరచుగా కలలు వస్తే, ఇతరులు ఎవరో చూస్తుండగా సెక్స్‌లో పాల్గొన్నట్లు, ఎవరో తనని అత్యాచారం చేస్తున్నట్లుగా మరికొందరు ఆడవారికి కలలు వస్తాయి.

అపరిచితులతో సెక్స్‌లో పాల్గొనే కలలు కనే స్త్రీ, పురుషులున్నారు. ఈ కలల ప్రభావం కూడా వారి సెక్స్ జీవితాలమీద పడుతుంది. ◆

అందువల్ల ప్రతి స్త్రీ తనలోని ఫీలింగ్స్‌ని యుక్త వయసు వచ్చినప్పటినుంచే పూర్తిగా అదుపు చేసుకుంటుంది. ఇక నగ్న చిత్రాల విషయం తీసుకుంటే ఈ విషయంలో ఆడ-మగ మనస్తత్వాల తేడా ఉంది.

పురుషుడు స్త్రీని అర్ధనగ్నంగానో, నగ్నంగానో చూడాలని ఆసక్తి కలిగి ఉంటే స్త్రీ మాత్రం మగవాడిని ఫుల్ డ్రెస్‌లో, హ్యాండ్‌సమ్‌గానే చూడాలని అనుకుంటుంది. పురుషుడు స్త్రీ జననేంద్రియాలని చూడాలని కుతూహలపడతాడు.

అయితే స్త్రీ మాత్రం పురుష జననేంద్రియాలని చూడటానికి ఏమాత్రం ఆసక్తి చూపదు.

అందుకనే పురుషుడు స్తంభించిన పురుషాంగాన్ని ఎగ్జిబిట్ చేస్తే స్త్రీ కామోద్రేకం చెందేబదులు ఛీదరించుకుంటుంది. గట్టిపడిన పురుషాంగంతో అంగ ప్రవేశం జరపాలని కోరుకుంటుందితప్ప స్తంభించిన అంగాన్ని ప్రదర్శించాలని కోరుకోదు.

ఇందుకనే అర్ధనగ్న, నగ్న చిత్రాల విషయంలో స్త్రీ పురుషుల మనస్తత్వాలు తేడాగా ఉంటాయి.

శృంగార విషయంలో పురుషుడు తనకి ఇష్టమైనదే స్త్రీకి కూడా ఇష్టమనుకుంటే శృంగారం బెడిసికొడుతుంది. అందుకని సెక్స్ విషయంలో స్త్రీ పురుషుల మనస్తత్వాన్ని తెలుసుకోవడం అవసరం.

ఆర్.ఎమ్. కడప

పురుషుల్లోని అతి సెక్స్‌కి పరాకాష్ఠగా 'రేప్' అనుకోవచ్చా?

సెక్స్ అతిగా (హైపర్ సెక్సువాలిటి) ఉంటే రేప్ చేస్తారనుకోవడం తప్పు. రేప్‌చేసేవాళ్ళల్లో తక్కిన వాళ్ళల్లోకంటే సెక్స్ ఏమాత్రం ఎక్కువగా ఉండదు. వీళ్ళకి ఎటువంటి విలువలు ఉండవు. సామాజిక కట్టుబాట్లని గౌరవించరు.

స్త్రీలన్నా గౌరవం ఉండదు. వాళ్ళ దృష్టిలో స్త్రీ కేవలం కామానికి పనికివచ్చే వ్యక్తి. స్త్రీకి వాళ్ళు ఎటువంటి విలువ ఇవ్వరు. అందుకే రేప్ చేయడం, చంపేయడం ఉంటుంది. వీళ్ళు యాంటీ సోషల్ సైకోపాథ్స్. వీళ్ళు పైకి మామూలుగానే ఉంటారుగాని ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రవర్తిస్తారో చెప్పడం కష్టం.

ఎస్.డి. కావలి

నాకు పెళ్ళి అయ్యి ఐదుసంవత్సరాలైంది. ఇంత వరకు గర్భం రాలేదు. డాక్టర్‌కి చూపిస్తే చిన్నాపరేషన్ చేశారు. అందులో వచ్చిన బిట్స్‌ని టెస్ట్‌కి పంపించారు. అందులో నా గర్భాశయంలో టి.బి. ఉందని వచ్చింది. అందువల్లే గర్భం రావడంలేదని అన్నారు.

టి.బి. జబ్బు ఊపిరితిత్తులకి వస్తుంది కదా, గర్భాశయానికి రావడం ఏమిటి?

టి.బి. (క్షయ) వ్యాధి ఊపిరితిత్తులకే కాదు, శరీరంలో ఏ అవయవానికి అయినా రావచ్చు. గర్భాశయానికి క్షయ వ్యాధి వచ్చినప్పుడు గర్భం రాక పోవడం సహజమే. మీరు టి.బికి చికిత్స పొందితే త్వరలోనే గర్భం వస్తుంది.

డా॥ జి.సమరం వాసవ్య నర్సింగ్‌హోమ్ బెంజిసర్కిల్ విజయవాడ 520 010 ఫోన్ 0866-2472370 E-mail drsamaram@hotmail.com www.gsamaram.com

సీరియల్

పరదేశీ ప్రేమకథ

ఆ అమ్మాయి వాడి చేయి తనని పట్టుకోగానే తన చేయిని చురుకుగా మెలితిప్పి వాడి మణికట్టుని పట్టుకుంది.

వాడు గుంజిన వేగాన్ని తనకు అనుగుణంగా మలుచుకుని వేగంగా కదిలి నడుము ఒక పక్కకు వంచుతూ మరోచేత్తో వాడి చొక్కాని పట్టుకుని వాడిని అమాంతం ఎత్తి దూరంగా విసిరికొట్టింది. అప్పుడుగాని ఆ యువకులకు అర్థం కాలేదు తాము తలబడుతున్నది బేలగా ఏడ్చే అబలతో కాదు, జూడో లాంటి యుద్ధవిద్యలు నేర్చుకున్న సబలతో అని.

గొర్లి శ్రీనివాసరావు

క్లాసులో ఉన్న మాస్టారు అది చూసి గబగబా అక్కడికి వెళ్ళి ఆ యువకులను తిట్టి అక్కడనుంచి వెళ్ళగొట్టాడు. వాళ్ళు ఆ అమ్మాయిలవైపు కోర చూపులు చూస్తూ వెళ్ళారు.

మాస్టారు ఆ అమ్మాయిలతో అనునయంగా మాట్లాడి అక్కడనుంచి పంపివేశారు.అదంతాచూసిన మార్వాడీ టూరిస్టులకు వికాస్ అంతకుముందు చెప్పిన మాటలు స్పష్టంగా అర్థమయ్యాయి.

అంత గొప్ప చరిత్ర గల, మన జాతి గర్వించేలాంటి గొప్ప విశ్వవిద్యాలయానికి ఇలాంటి చీడపురుగులు చేరితే ఎలా అని బాధపడ్డారు వాళ్ళు.

"ఈ మధ్య వైస్ ఛాన్సలర్ స్ట్రిక్ట్‌గా ఉంటే ఆయన దగ్గర కూడా ధర్నా చేశారు. హాస్టళ్ళలో అనధికారంగా కొందరు ఉంటున్నారు. సెలవుల్లో కూడా హాస్టల్ మూసివేయడానికి ఒప్పుకోరు. ఎవరైనా గట్టి వి.సి. రావాలి ఈ పరిస్థితి బాగుపడాలంటే" అంటూ నిట్టూర్చాడు వికాస్.

"ఈ శాంతినికేతన్ చరిత్ర వింటూ ఉంటే ఎంతో గర్వంగా అనిపిస్తుంది మాకు. కానీ ఇలాంటి పరిస్థితులు చూస్తుంటే రోత కలుగుతుంది. ఏం చేయాలి" అన్నాడు మార్వాడీ నడివయస్కుడు.

"చూడు బేటా, ఇంట్లో బొద్దింకలు ఉంటే, పురుగుల మందు కొట్టి వాటిని తరిమెయ్యాలిగాని ఇల్లు వదిలిపోకూడదు కదా! అలాగే ఈ అద్భుతమైన ప్రదేశంలో చీడపీడ ఉంటే దాన్ని వదిలించాలి కానీ, ఈ ప్రదేశాన్ని ద్వేషించకూడదు బేటా" అన్నాడు వీల్ చైర్‌లో ఉన్న వృద్ధుడు.

"కరెక్ట్‌గా చెప్పారు బాబా" అంటూ వికాస్ ఆయన పాదాలను తాకి నమస్కరించాడు.

"అవును బాబా. మీరు చెప్పింది నిజమే. వీళ్ళను చూసి మనం డిప్రెషన్‌కి లోనవ్వకూడదు. ఇలాంటి వాళ్ళను తరిమికొట్టాలి. నేను చీఫ్ మినిస్టర్ గారికి లేఖ రాస్తాను. మన వాళ్ళందరితోనూ రాయిస్తాను" అన్నాడు మార్వాడీ నడివయస్కుడు.

వృద్ధుడు సంతృప్తిగా తల ఊపాడు.

అమ్మాయిలను ఏడిపించాలి అనుకుని తామే పరాభవానికి గురయిన యువకులలో అవమానంవల్ల కలిగే క్రోధం హెచ్చింది.

వాళ్ళందరూ ఆ రోజు క్లాసులు మానేసి హాస్టల్‌కి పోయి మంతనాలు మొదలుపెట్టారు. ఆ హాస్టల్‌లో చాలామంది బయటివాళ్ళు ఉంటారు. వాళ్ళకు శాంతినికేతన్‌కి ఏ సంబంధం ఉండదు.

నిజానికి వాళ్ళు అక్కడ ఉండడం నిషిద్ధం కూడా. అయినా నిబంధనలను తుంగలోకి తొక్కేసి-

"మేము లోకల్, ఈ శాంతినికేతన్ మాది..." అంటూ అమదర శాంతినికేతన్ అని టాగోర్ రాసిన పాటనే ఉటంకిస్తుంటారు.

స్ఫూర్తిని రగిలించి గర్వకారణంగా ఉండాలి అన్న సదుద్దేశంతో టాగోర్ రచించిన ఆ పాటని అలా తమకనుకూలంగా వాడుకుంటూ, తమకుమాత్రమే శాంతినికేతన్‌లో ఉండే హక్కు ఉందని వక్రభాష్యం చెప్పుకుంటూ, బయటినుంచొచ్చే అమాయకులను ఆటపట్టించడం, వికృతచేష్టలు చేసి వాళ్ళను హింసించడంలాంటివి చేస్తుంటారు కొందరు.

శాంతినికేతన్‌లో మహర్షి దేవేంద్రనాథ్, ఆయన కుమారుడు రవీంద్రనాథ్‌ల అంశలు ఉన్నట్లే అంతకు ముందే డెకాయిటీ చేసిన భుభన్ డాకట్ అంశ



జరిగిన కథ 3

లేడీస్ హాస్టల్‌వైపుకు ప్రఫుల్‌ను తీసుకువెళ్తాడు బెనర్జీ. అక్కడ అతనికి తారసపడిన బెంగాలీ సుందరిపై మనసుపారేసుకుంటాడు. షాపింగ్ చేస్తుండగా ఓ షాపులో తన స్నేహితురాలు సోహిణి, ఇంకా కొందరు ఫ్రెండ్స్‌తో ప్రఫుల్‌కి కనబడుతుంది బెంగాలీ సుందరి.

తనని పరిచయం చేసుకుంటాడు ప్రఫుల్. తనపేరు 'శర్మిష్ట' అని చెబుతుంది బెంగాలీ సుందరి. ఆమె ఎకనమిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేస్తుంటుంది. తను పీజీలో ఫైన్ ఆర్ట్స్‌లో జాయిన్ అయ్యానని చెబుతాడు.

లవ్‌లో పడ్డావంటూ స్నేహితురాళ్ళంతా ఆమెదగ్గర ట్రీట్ తీసుకుంటారు. శర్మిష్టను ప్రేమలో పడేసినవాడి అంతు చూడాలనుకుంటాడు బిప్లవ్. చూడటానికి నిరక్షర కుక్షిలా అన్పించిన వికాస్, శాంతినికేతన్ గురించి ప్రఫుల్‌కి, ఇంకా అక్కడికి వచ్చిన కొందరు టూరిస్ట్‌లకు వివరించి చెబుతాడు.

ఆమ్రకుంజ్ గొప్పతనాన్ని తెలియజేస్తాడు వికాస్. అక్కడి కొందరు లేడీ స్టూడెంట్స్‌ను మగపిల్లలు ర్యాగింగ్ చేస్తారు. అందులో ఒక అమ్మాయిని చేయిపట్టుకుని లాగుతాడు ఓ యువకుడు. ఇక జరిగేది చదవండి.

కూడా ఇటువంటి దుర్మార్గుల రూపంలో ఇంకా ఉన్నట్లు భావించాల్సి ఉంటుంది.

ఏది ఏమైనా శాంతినికేతన్ ఒక అద్భుతం. మన దేశానికి గర్వకారణమయిన శాంతినికేతన్‌ని రాబోయే తరాలకు మరింత స్ఫూర్తిమంతంగా అందించాల్సిన బాధ్యత మనందరిదీ అనే భావాన్ని టాగోర్ అమదర శాంతినికేతన్ గీతంలో పొందుపరిచిన విషయం ఎప్పుడైతే గ్రహింపుకొస్తుందో అప్పుడే ఇలాంటి నీచ సంస్కృతిని ఎదుర్కోవడం తమ బాధ్యతగా విశ్వభారతి యూనివర్శిటీలోని ప్రతి ఒక్క విద్యార్థి, ప్రతి ఒక్క టీచర్ కంకణబద్ధులవుతారు.

ఆ రోజు గొడవకు కారణమైన యువకుడి పేరు అలోక్ సహా. అతను ఒక చిన్న సైజ్ గ్రూప్ లీడర్ లాంటివాడు. అతని తండ్రి కొలకొత్తాలో ఒక ఛోటా రాజకీయనాయకుడు.

అతను వీధి గూండా స్థాయి నుంచి ఎదిగినవాడు. తండ్రిని చూసి నేర్చుకున్నాడు అలోక్. మనిషి విలువను మనీలో కొలవడం, 'షి'కి విలువ మనీలో లెక్కకట్టడం అలవాటు అయ్యాయి అతనికి.

డబ్బు సంపాదించడానికి గూండాగిరీ చేస్తుంటాడు. వచ్చిన డబ్బు తేలికగా వచ్చేది. అందుకే ఆ మనీ అంతే తేలికగా ఖర్చుపెట్టేవాడు. అతను ఖర్చుపెట్టే డబ్బులకు తగ్గట్లు అతనిచుట్టూ తిరిగే మిత్ర బృందం కూడా ఏర్పడింది.

"అలోక్ దా, నిన్ను అది చాలా అవమానపరిచింది. దానిని అంతకుమించిన అవమానం చెయ్యకపోతే మన పరువు పోయినట్లే" అంటూ అలోక్ సహాని రెచ్చగొట్టాడు పార్థో.

"శాను. దాని పొగరుమీద కొట్టాలి మనం... దానికి దాని ఫ్రెండ్స్‌కి మనమేంటో తెలియాలి. అది ఈ క్యాంపస్‌లో తల ఎత్తుకుని తిరగకుండా చెయ్యాలి" అన్నాడు సమర్జిత్.

"అదే ఆలోచిస్తున్నానురా, మీరే సలహా ఇవ్వండి, దాన్ని ఏంచేస్తే బాగుంటుందో. దాన్ని ఎట్టి పరిస్థితిలోనూ విడిచిపెట్టేది లేదు..." ఖచ్చితమయిన స్వరంతో చెప్పాడు అలోక్.





అదే తీరు

'బరేలికి బర్ఫి' విజయం తాను సినిమాలు ఎంపిక చేసుకునే తీరూ, ధోరణిని ఏమాత్రం మార్చలేదంటున్నది పొడగరి కృతీసనన్. అయితే, తనకు ఆఫర్లు ఇచ్చే సినిమాల తీరుమారిందని, సినిమాల ఎంపికలో ఎక్కువ ఆప్షన్లు ఉంటున్నాయని చెప్తున్నది.

"కాని సినిమాల ఎంపిక సమయంలో నా ప్రాధాన్యక్రమాలు, నా ఆలోచనలు కూడా అలాగే వున్నాయి. స్క్రిప్టుతో నేను కనెక్ట్ అయినా, పాత్ర గొప్పగా వున్నా నేను ఎంచుకుంటాను. ఈ రెండింటి విషయంలో నేను మొదటినుంచి ఒకే మాదిరి వున్నాను" అని తెలిపింది పొడుగుకాళ్ళ సుందరి కృతీసనన్.

"ముందు వాళ్ళగురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. తర్వాత దాన్ని ఏం చెయ్యాలో అదే చేద్దాం" అన్నాడు మరాండి. అతను వాళ్ళందరిలోకి నెమ్మదిగా మాట్లాడాడు. కానీ అతనే వాళ్ళందరికంటే కుయుక్తులతో పథకం వేసే శక్తిగలవాడు. అలోక్‌కి అతని మాట అంటేనే బాగా గురి.

"సరేరా, నువ్వు కనుక్కుని చెప్పు. అప్పుడు మనం ఏంచేయాలో నిశ్చయించుకుందాం" అన్నాడు అలోక్.

"సరే" అన్నాడు మరాండి. గంజాయి కలిసివున్న లోకల్ మేడ్ సిగరెట్లు తాగుతూ మత్తులో మునిగాడు అలోక్. మరాండి పార్థని వెంటబెట్టుకుని హాస్టల్ రూమ్ నుంచి బయటకు నడిచాడు.

కళాభవన్ లోపల కొత్తగా చేరిన ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులకు కళాభవన్‌లో ఉన్న వసతులన్నీ పరిచయం చేస్తున్నాడు బెనర్జీ. ఆ విద్యార్థులలో చాలామంది గాడ్యుయేషన్ చేయడానికి వచ్చిన వాళ్ళు.

దేశంలోని నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చారు. అయిదుగురు పిజి చేయడానికి కూడా వచ్చారు. వారిలో ప్రఫుల్ కూడా ఉన్నాడు. కళాభవన్ గురించి అందరికీ అర్థమయ్యేలా, ఇంగ్లీషు హిందీ కలగలిపి మాట్లాడుతున్నాడు బెనర్జీ.

"దేశంలోని ఒక అత్యుత్తమ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఉన్నారు మీరు. ఇది దేశంలో మాత్రమే కాదు ప్రపంచంలోనే అత్యుత్తమమని మీ అంతట మీకే అర్థం అవుతుంది. ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాత కళాకారుల పేరిట కొన్ని స్టూడియోలు ఉన్నాయి. అవి విద్యార్థులకు వారానికి ఏడురోజులు, రోజుకి ఇరవైనాలుగుగంటలు అందుబాటులో ఉంటాయి.

ఇక్కడ పనిచేసుకోవడానికి, మీ క్రియేటివిటీని సానపెట్టుకోవడానికి మీరెప్పుడు కావాలంటే అప్పుడు నిరభ్యంతరంగా రావచ్చు, పోవచ్చు. పూర్తి స్వేచ్ఛ ఉంది. ఎందుకంటే ఈ కళాభవన్ సృజనాత్మకత వికసిస్తుందని నమ్ముతుంది" అన్నాడు బెనర్జీ.

"ఇటువైపు ఇవి చూడండి శిల్పకళ నేర్చుకునే విద్యార్థులకోసం ఈ స్టూడియో. దీనిలో వాళ్ళకి కావలసిన అన్ని వస్తువులు అందుబాటులో ఉంటాయి.

ఈ స్టూడియోని రామ్‌కింకర్ బైజ్ అభివృద్ధి చేశాడు. ఆయన సృష్టించిన శిల్పాలను పరిశీలించవచ్చు. మీ సీనియర్ విద్యార్థులు సృష్టించిన కొన్ని శిల్పాలు అక్కడక్కడ మన క్యాంపస్‌లో మీకు దర్శనమిస్తాయి" అన్నాడు బెనర్జీ.

విద్యార్థులంతా కళ్ళు పెద్దవిచేసి ఊపిరి బిగబట్టి అతను చెప్పే ప్రతిమాట శ్రద్ధగా వింటున్నారు. అక్కడ శిల్పాలు తరచితరచి చూస్తుంటే ఎన్నోకథలు చెప్పగలవిగా ఉన్నాయి. ఎన్నోరకాల భావావేశాలను కలిగించేలాగా, స్ఫూర్తిని రగిలించేలాగా ఉన్నాయి.

"ఈ గోడలపైన చిత్రాలను చూడండి. ఇవి నందలాల్ బోస్ చిత్రించాడు. ఈగోడలకు శోభగా అలంకరించిన ఈ చిత్రాలలోని డెప్త్ చూడండి. వాటిలోని ప్రతి మనిషిని ఎంతచక్కగా చిత్రించాడో చూడండి. చాలా స్వల్పమైన తేడాలతో అనల్పమైన అర్థాన్ని వైవిధ్యాన్ని స్ఫురింపచేసేలా ఉన్న ఆ చిత్రాలకంటే మేలైనవి వేయాలి మీరు.



అది మీకో ఛాలెంజిలా భావించి కష్టపడండి. ఇక్కడ మీరు పరీక్షల చదువు చదవరు. సర్టిఫికెట్ల కోసం మీ సమయం ఖర్చుచేయరు. మీలోని కళాతృష్ణను తీర్చుకోవడానికి ఇక్కడకు వచ్చారు. మీ దాహం తీర్చడానికి ఇక్కడ తియ్యటి కొబ్బరి నీళ్ళు సిద్ధంగా ఉన్నాయి. కావలసినంత దాహం తీర్చుకోవచ్చు" అన్నాడు బెనర్జీ.

అందరూ తమ చేతులు చరిచి తమ హర్షాన్ని ప్రకటించారు. గ్రాడ్యుయేషన్ విద్యార్థుల్లో అలోక్‌తో గొడవపడిన ఈశాన్య రాష్ట్రాల అమ్మాయిలు కూడా ఉన్నారు. అలోక్‌ని విసిరికొట్టిన అమ్మాయి ధైర్యంగానే ఉంది కానీ, ఆమె స్నేహితులుమాత్రం జరిగిన సంఘటనను మరిచిపోలేకపోతున్నారు. దాని పర్యవసానం ఎలా ఉంటుందో అని భయపడుతూ ఉన్నారు.

బిప్లవ్ తన మిత్రులతోపాటు క్యాంటీన్‌కొచ్చాడు. ఆ క్యాంటీన్ ఒకప్పుడు శాంతినికేతన్‌లో పనిచేసిన ఒక జపనీస్ కుటుంబసభ్యులు నడుపుతున్నారు.

అక్కడ రుచి శుచి ఉండే ఆహారం దొరుకుతుందని మంచి పేరు. క్యాష్ కౌంటర్ దగ్గర ఒక స్త్రీ కూర్చుని ఉంది. ఆమె వెనుకగా గోడపైన పెద్ద బ్లాక్ అండ్ వైట్ చిత్రం ఒకటి ఉంది. అది ఆ జపనీస్ ఫొటో.

దానికింద అతని వివరాలు సంక్షిప్తంగా రాసి ఉన్నాయి. ఆ హోటల్‌లో వాతావరణం కూడా పల్లెలను గుర్తుకి తెచ్చేలా ఉంది. సిమెంట్ బల్లలు, రాతి టేబుల్స్, చిన్ని చిన్ని పర్ణశాలలుగా విభజించబడి ఉంది ఇంటీరియర్. గోడలు లేని చుట్టు గుడిసెల్లా ఉన్నాయి అవి. అటువంటి వాటిలో కూర్చుని టిఫిన్ ఆర్డర్ చేశారు బిప్లవ్ అండ్ కో.

"సౌబిక్, ఏమయినా వివరాలు తెలిశాయా?" అడిగాడు బిప్లవ్.

"లేదు, శర్మిష్ఠ ఫ్రెండ్స్‌లో మా చెల్లి కూడా ఉంది. ఆమెను విషయం కనుక్కోమని చెప్పాను. ఈ రోజు సాయంత్రానికి మనకు వివరాలు తెలుస్తాయి" అన్నాడు సౌబిక్ అప్పుడే వెయిటర్ తెచ్చి ఇచ్చిన వేడి వేడి చోళే బటురా ప్లేట్ తన దగ్గరకి లాక్కుంటూ.

"నా అనుమానం, శర్మిష్ఠ ఊరికే అబద్ధం చెప్పివుంటుంది. ఆమెకి నువ్వంటేనే ఇష్టం!" అన్నాడు ప్రసేన్‌జిత్. చోళేబటుర రుచినాస్వాదిస్తూ.

"నో నాకే విషయమూ స్పష్టంగా తెలియాలి. శర్మిష్ఠపై ఎవడి చూపైనా పడితే ముందు వాడి కళ్ళు పెరికేస్తాను" అన్నాడు బిప్లవ్.

తనముందు ఉన్న టిఫిన్ ప్లేట్‌ని అతను తాకనైనా తాకలేదు. అతని నోట్లోని చేదు ఇంకా తొలిగిపోలేదు. ఒకసారి అనుమానం వస్తే దాన్ని పూర్తిగా తొలిగించుకోకపోతే చాలా కష్టం. అది పెనుభూతమై ఎప్పుడు మళ్ళీ

సింగిల్ జి.ఎస్.టి. శ్లాబ్ రేటు అమలు సాధ్యం కాదు. కాంగ్రెస్ పార్టీ చేసే ఆ ప్రతిపాదన హాస్యాస్పదం. -పీయూష్ గోయల్, కేంద్రమంత్రి

తిరగబడుతుందో తెలియదు.

"మాకు వదిలెయ్ ఆ బిప్లవ్‌దా ఈ సాయంత్రంలోపల మనకు పూర్తి వివరాలు తెలుస్తాయి. నువ్వు ఈలోగా నార్మల్‌గా ఉండు. లేని పోని ఆలోచనలతో నీ మనసు పాడు చేసుకోకు" అంటూ ఉచిత సలహా ఒకటి ఇచ్చాడు సాబిక్.

ఇప్పుడు అంతా సాబిక్ చెల్లిపైన ఆధారపడి వుంది. ఎప్పుడో సాయంత్రందాకా ఎందుకు. ఇప్పుడే ఫోన్ చేసి కనుక్కుంటే సరిపోతుంది కదా అనుకున్నాడు బిప్లవ్.

"సాబిక్ సాయంత్రందాకా వెయిట్ చెయ్యలేనురా. ఇప్పుడే కనుక్కో. ఫోన్ చెయ్ చెల్లికి..." అన్నాడు బిప్లవ్.

తినడం ఆపి జేబులోనుంచి మొబైల్ తీశాడు సాబిక్. వేడివేడిగా చోళే తింటే ఉండే మజా వేరు. కానీ ఈ బిప్లవ్‌గాడు వదిలేలాలేడు. చెల్లిని కనుక్కుని చెప్తే ఒక పనైపోతుంది అనుకున్నాడు సాబిక్.

"తన చెల్లి నెంబర్‌కి డయల్ చేసి ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని మళ్ళీ తినడానికి ప్రయత్నించాడు. కానీ ఫస్ట్ రింగ్‌కే సాబిక్ చెల్లి కాల్ ఆన్సర్ చేసింది. దాంతో నోట్లో పెట్టుకోవాల్సిన బటురముక్క చేత్తోనే పట్టుకుని "హలో రీతూ, నేనడిగిన సమాచారం కనుక్కున్నావా?" అడిగాడు సాబిక్.

మిత్రబృందం అందరూ తినడం ఆపి చెవులు రిక్కించారు. బిప్లవ్‌కైతే టెన్షన్‌తో తల పేలిపోయేలా ఉంది. అతనికి ఒళ్ళంతా చెవులైనట్లు అనిపించింది. మొత్తం ప్రాణశక్తి అంతా చెవులలోనే కేంద్రీకృతం అయిందా అనిపించింది అతనికి.

స్పీకర్ ఆన్ చేయకపోయినా రీతూ మాటలు స్పష్టంగా వినిపించాయి అతనికి. "హా కనుక్కున్నా. ఆమె ఎవరినో ఇష్టపడుతుందట. నిన్న రాత్రి కొంత మంది ఫ్రెండ్స్‌కి చిన్న ట్రీట్‌కూడా ఇచ్చిందట. అయితే ఆ అబ్బాయి పేరు, వివరాలు ఇంకా తెలియలేదు. కాకపోతే అతను కొత్త అడ్మిషన్ అని బెనారెస్ నుంచి వచ్చాడని తెలిసింది" అంది రీతూ.

"పేరు.. పేరు.. అడుగు. అడ్రస్ అడుగు. అడుగు... అడుగు..." అంటూ ప్రాంప్ట్ చేశాడు బిప్లవ్.

ఇక ఈరోజుకి చోళా బటూరా తినే అవకాశం లేదు. ఈ ముక్క గనుక తింటే వీడు నా గొంతు పిసికి ఇప్పటివరకు తిన్నదంతా కక్కిస్తాడు. ఇది శోక సమయం. నవ్వుతూ కూడా కనబడకూడదు అనుకున్నాడు సాబిక్. ఇతర మిత్రులు కూడా తమ ప్లేట్లను చివరి చూపు చూసి వదిలేశారు.

"రీతూ, వాడిపేరు కనుక్కో ప్లీజ్. నీకు తెలుసు కదా బిప్లవ్ బాగా అప్‌సెట్ అయ్యాడు. వాడు అప్‌సెట్ అయ్యాడంటే నేనుకూడా అయినట్లే. నువ్వు త్వరగా వాడి వివరాలు కనుక్కుంటే బాగుంటుంది" అన్నాడు కొంచెం సెంటిమెంట్, కొంచెం అన్న అనే అధికారం వాడుతూ.



"అలాగే దాదా, కనుక్కుంటాను. వీలైతే అతని పిక్ కూడా పంపిస్తాను. నాకు ఏమిస్తావురి"అంది రీతూ.

బిప్లవ్ వైపు చూశాడు సాబిక్, ఏం చెప్పను అన్నట్లు. "మంచి పార్టీ ఇద్దాం" అన్నాడు బిప్లవ్.

పార్టీ అంటే అబ్బాయిలు గంతులేసుకుంటూ పడి పడి పనిచేస్తారు.

అభివృద్ధి, రాజకీయం వేరువేరు. రాజకీయ తేడాలకు వీధుల్లో పోరాడతాం, అభివృద్ధికి కలిసి అడుగులు వేస్తాం. -నితిన్ గడ్కరీ, కేంద్రమంత్రి

మందు మజా ఉంటుందని, అమ్మాయిలకి అంత సీన్ ఏముంది. వాళ్ళకు అంత కిట్టదేమో అనుకున్నాడు సాబిక్. అతని ముఖంలోకి చూశాడు బిప్లవ్. పార్టీ సరిపోదు అన్న సంకేతం కనబడింది, "మంచి గిఫ్ట్ ఇస్తామని చెప్పు" అన్నాడు.

"రీతూ నీకు మంచి గిఫ్ట్ ఇస్తాడు మన బిప్లవ్" అన్నాడు సాబిక్ అందరి సందేహాలకు అతీతంగా ఉండేలా చెప్తూ.

"అదే, ఏం గిఫ్ట్" అంది రీతూ.

"అరే రీతూ నువ్వు చాలా నసపెడుతున్నావు. నీకు మంచి గిఫ్ట్ ఇస్తాడు. ఇక నువ్వు నీ శ్రద్ధ అతని పిక్ పంపడం అనే పనిమీద పెట్టు" అన్నాడు సాబిక్ కొంచెం కరుకుగా.

"సరే, కనుక్కుంటాను..." అంది రీతూ, కాల్ కట్ చేస్తూ.

ఫోన్ టేబుల్‌పైన పెట్టి మిత్రులందరివైపు చూశాడు సాబిక్. అప్పటికే అందరూ సామ్రాజ్యాలు కోల్పోయిన మారాజుల్లా విషణ్ణవదనాలతో శూన్యంలోకి చూస్తున్నారు. తనుకూడా దిగులుగా ఫేస్ పెట్టుకుని బిప్లవ్‌వైపుకి తిరిగాడు సాబిక్. అతను చెప్పే తదుపరి ఆదేశాలు ఏమయివుంటాయో ఊహించడానికి ప్రయత్నంచేస్తూ.

"అయితే ఎవడో ఉన్నాడు! నా శర్మిష్ఠపైన ఎవడో కన్నువేశాడు! వాడి పేరు తెలియకపోయినా వాడు బెనారస్ నుంచి వచ్చాడని తెలిసింది.

గుడ్, ఈ వివరాలతో మనం అడ్మిషన్స్ సెక్షన్‌కి వెళ్ళి బెనారస్ నుంచి వచ్చిన ఆ న్యూ అడ్మిషన్‌గాడెవడో కనిపెట్టాలి. ఆ శంతను యూనివర్శిటీ అడ్మిషన్ సెక్షన్‌లో పనిచేస్తున్నాడు కదా! వాడు మీలో ఎవరికి బాగా తెలుసు?" అడిగాడు బిప్లవ్.

ప్రసేన్ జిత్ చెయ్యిపైకి ఎత్తాడు.

"శంతను నాకు బాగా క్లోజ్. ఇప్పుడే కనుక్కుంటా. సీట్లో ఉన్నాడంటే అయిదు నిముషాల్లో మనకు కావలసిన డీటైల్స్ ఇస్తాడు వాడు" అన్నాడు సీరియస్‌గా.

"గుడ్! వెంటనే కనుక్కో! వెళ్దాం" అన్నాడు బిప్లవ్ జేబులోనుంచి సిగరెట్ ప్యాకెట్ తీసి, ఒక సిగరెట్ నోట్లో పెట్టుకుని లైటర్ కోసం వెతుక్కున్నాడు. ఈ లోగా సాబిక్ తన లైటర్ తీసి బిప్లవ్ సిగరెట్ వెలిగించాడు.

ఈలోగా ప్రసేన్ శంతనుకి ఫోన్ చేసి మాట్లాడాడు. శంతను కంప్యూటర్ సెక్షన్‌లోనే ఉన్న విషయం తెలుసుకుని తమకు కావలసిన విషయం చెప్పి వివరాలను ప్రింట్ చేసి ఇమ్మన్నాడు.

వారెవ్వా! వారియర్

ఒక్క సినిమాలో నటించి, షూటింగ్ సమయంలోనే ఓ పాటలో కన్నుగీటి సంచలనం సృష్టించిన ప్రియా ప్రకాష్ వారియర్‌కు ఆఫర్లమీద ఆఫర్లు వచ్చేస్తున్నాయట. సినిమాల సంగతలా వుంచితే, ఇతరత్రా సంపాదన కుప్పలుతెప్పలుగా వున్నట్లుంది.

ఈ అమ్మాయి ఇన్‌స్టాగ్రామ్‌లో ఆరులక్షల మందికిపైగా అభిమానులున్నారు. దాంట్లో ప్రియ చేసే ప్రతి పోస్ట్‌కూ ఎనిమిది లక్షల రూపాయలదాకా డబ్బు వస్తుందట. అంతటి క్రేజ్ కొట్టేసిన ఈ మలయాళి బొమ్మ తాజాగా ఓ వాణిజ్య ప్రకటనల సంస్థతో యాడ్ ఫిల్మ్‌కోసం ఒప్పందం కుదుర్చుకున్నదట. అందుకు పారితోషికం ఎంతో తెలుసా? అక్షరాల కోటిరూపాయలు!



"శంతనుదా, మేము ఇప్పుడే వస్తున్నాము. పది నిముషాల్లో నీ దగ్గర ఉంటాము. మేము వచ్చేసరికి మాకు వివరాలు ప్రింట్ చేసిన కాగితం ఇవ్వాలి. చాలా ఇంపార్టెంట్" అన్నాడు ప్రసేన్ జిత్.

శంతను ఓకే అని చెప్పిన తర్వాత, "టిక్ టిక్" అంటూ కాల్ కట్‌చేసి మొబైల్ ప్యాకెట్‌లోకి నెట్టాడు.

వాళ్ళ మధ్య జరిగిన సంభాషణ అంతా విన్నారు. వెంటనే కూర్చున్న చోటినుంచి లేచి క్యాంటీన్ బయటకు నడిచారు. బిప్లవ్ బిల్ పేచేసి వాళ్ళ వెనుకగా వెళ్ళాడు. అంతా మౌనంగా నడిచారు విశ్వభారతి అడ్మిషన్స్ సెక్షన్ ఉన్నచోటికి.

దారిపొడవునా బిప్లవ్ కళ్ళు శర్మిష్ఠతో చనువు పెంచుకుంటున్న ఆ అజ్ఞాతవ్యక్తి ఎవరై ఉంటారా అన్నదానిపైనే ఉంది. తమచుట్టూ తిరుగుతున్న ఎంతోమంది న్యూ అడ్మిషన్స్‌లో అతనుకూడా ఉండి ఉంటాడా? అతను తనకన్నా దేనిలో అధికుడు? ఎందుకు శర్మిష్ఠ అతనితో మాట్లాడింది?

పదినిముషాల్లో అడ్మిషన్స్ జరిగే సెక్షన్ ఉన్న చోటికి వెళ్ళిపోయారు మిత్రబృందం. అక్కడికి చేరుకోగానే శంతనుకి కాల్ చేశాడు ప్రసేన్‌జిత్. అతని కాల్ కట్ చేశాడు శంతను.

కొద్దిసేపు వెయిట్ చేశారు మిత్రులు బయట ఉన్న ఒక చెట్టుకింద. కొంచెంసేపటికి శంతను బిల్డింగ్‌నుంచి బయటకు వచ్చి అటూఇటూ చూశాడు ప్రసేన్‌జిత్‌కోసం. శంతనుని చూసిన ప్రసేన్‌జిత్ చెట్టుకింద నుంచునే చేయి ఊపి 'శంతను దా' అంటూ గట్టిగా పిలిచాడు.

శంతను వచ్చి ప్రసేన్ జిత్‌కి తన ప్యాకెట్‌లోనుంచి తీసి ఫోల్డ్ చేసి ఉన్న ఒక పేపర్ ఇచ్చాడు "థ్యాంక్స్ బ్రో" అన్నాడు ప్రసేన్‌జిత్.

"ఏమైంది, ఎవరికోసమన్నా వెతుకుతున్నారా?" అడిగాడు శంతను కుతూహలంగా.

"ఏమీ లేదులే, నీతో మళ్ళీ వివరాలు చెప్తాలే. ఇప్పుడు కాస్త అర్జెంట్ పని ఉంది వెళ్ళాలి" అన్నాడు ప్రసేన్‌జిత్.

"ఓకే, నేను వెళ్తా" అని అందరికీ బై చెప్పి తన సెక్షన్‌కి వెళ్ళిపోయాడు శంతను.

శంతను కొంతదూరం వెళ్ళగానే అతను ఇచ్చిన పేపర్ మడత విప్పి చూశాడు. దానిలో పద్దెనిమిది పేర్లు, వాళ్ళు చేరిన కోర్సులు, వాళ్ళు వచ్చిన ఊరు పేరు ఉంది. అన్నింటిలో బెనారస్ అని ఉంది. అంటే తాము అడిగినట్టు బెనారస్ నుంచివచ్చిన న్యూ అడ్మిషన్స్ అన్నీ కలిపి పద్దెనిమిదే అన్నమాట.

అయితే వాళ్ళల్లో తమకు కావలసినవాడు ఎవరని ఎలా తెలుస్తుంది..? ఆ పేపర్‌ను ప్రసేన్‌జిత్ చేతిలోనుంచి లాక్కుని చూశాడు బిప్లవ్.

చిలిపి ?

మనిషికి తన చావు రోజు ముందే తెలిస్తే ఏం చేస్తాడు?
క్యాలెండర్‌లో ఆ రోజు పేజీని చించివేస్తాడు.

'ఆడపడుచు'లకు రక్షణ కల్పిస్తాం అంటే?
ఆడవాళ్ళలో పడుచుపిల్లలకు అని అర్థం!!

ఇంటికి దీపం ఇల్లాలే. మరి ఆఫీసుకు?
స్టెనో.

ఉంగరాలెందుకు?
బస్ టిక్కెట్ పెట్టుకోనేందుకు.

'తాగుబోతు' కామెంట్ ప్లీజ్?
రోడ్డుకిరుప్రక్కలా నడచువాడు.

ఓటుహక్కు లేనివాడు ఎవరు?
దేవుడు.

ఆడవాళ్ళకు పైటలు ఎందుకు?
పొయ్యిమీద సామగ్రిని దింపుకోవడానికి.

ఉద్యోగస్తుని ఊతపదమేమిటి?
'నెలాఖరు'

నీవు ఎవరిని చూసి జాలిపడతావు?
ఎక్కడో చివరి కంపార్ట్‌మెంట్‌లో ఉన్న గూడ్సు రైలు గార్డుని చూసి.

'మహిళామండలి' ఎందుకు?
పట్టుచీరల ప్రదర్శనకు.

పాసింజర్ రైళ్ళు ఎందుకు?
సన్యాసులు దేశాటన చేసేందుకు.

ఎలా తెలుస్తుంది? ఈ పేర్లలో ఒకడు తనకు కావలసిన మనిషి, వాడెవరో తనకి ఎలా తెలుస్తుంది? ఎంతసేపు ఆలోచించినా ఏమీ అర్థం కాలేదు అతనికి. ఉన్నట్టుండి ఒక ఐడియా ఫ్లాష్ అయింది అతని మైండ్‌లో.

"సాబిక్, చెల్లికి ఫోన్ చేసి వాడు ఏ కోర్స్‌లో చేరాడో తెలుసేమోకనుక్కో" అన్నాడు బిప్లవ్.

"సాయంత్రందాకా ఉంటే వాడి పిక్ కూడా పంపిస్తాను అందికదా. దానికి కొంత టైమ్ ఇస్తే బాగుంటుంది. మాటిమాటికి ఫోన్ చేస్తే ఆ గిఫ్ట్‌పైన దాని అంచనాలు పెరిగిపోయే ప్రమాదము ఉంది" అన్నాడు సాబిక్.

"పరవాలేదులే! అడుగు, అడుగు" అన్నాడు బిప్లవ్.

చేసేదిలేక మరోసారి రీతూకి ఫోన్ చేశాడు సాబిక్. రెండు మూడు రింగ్స్ అయినా ఆమె ఆన్సర్ చేయలేదు. కాల్ కట్ చేయబోయాడు సాబిక్. అప్పుడు ఆన్సర్ చేసింది రీతూ.

"దాదా అతని పేరు ప్రఫుల్" అంది.


"ఓకె. నేను అతని పేరు కోసం కాదు, అతను ఏ కోర్స్‌లో చేరాడు అని అడుగుదామనుకున్నాను" అన్నాడు సాబిక్.

"ఆ విషయం నాకు ఇంకా తెలియదు. నాకు తెలిసిన సమాచారం నీకు ఇస్తున్నా. సాయంత్రం లోపల నాకు నచ్చే మంచి గిఫ్ట్ రెడీ చేసుకో. నాకు గిఫ్ట్ నచ్చకపోతే అతని పిక్ మీకు ఇవ్వను" అని కాల్ కట్‌చేసింది నిర్మొహమాటంగా!

"ఇది భూభన్ డకాత్ కంటే డేంజర్. మనల్ని నిలబెట్టి దోచుకుంటోంది. డే లైట్ రాబరీ" అన్నాడు సాబిక్ విసుగ్గా! "ఏం చెప్పింది?" అడిగాడు బిప్లవ్ అసహనంగా!

"అతని పేరుమాత్రం తెలిసిందట. కోర్స్ ఇంకా తెలియదు. మంచి గిఫ్ట్, ఆమెకు నచ్చింది తీసుకోవాలట. లేకపోతే మనకు కోపరేట్ చేయదట" అన్నాడు సాబిక్.

ఇంకా ఉంది



నగరీకరణ, ప్రకృతి వనరుల ధ్వంసం మానవాళి మనుగడకు ముప్పుగా పరిణమిస్తోంది.
-విక్రమ రణిల్ సింఘే, శ్రీలంక ప్రధాని

నేనెవరో తెలుసా!

ప్రతి ఏటా అక్టోబర్ మాసం వస్తున్నదంటే ప్రపంచమంతా ఆసక్తితో ఎదురుచూసేది, మేధావివర్గం చర్చించుకునేది నోబెల్ బహుమతుల గురించే. ఈ సంవత్సరం ఏ రంగంలో ఎవరిని నోబెల్ బహుమతి వరిస్తుందనే దానిమీద ఎవరి అంచనాలు వారు వేసుకుంటుంటారు.

నోబెల్ బహుమతి అందించే విజ్ఞానశాస్త్ర రంగాల అంశంలో అంత పెద్దగా వివాదాలు ఎప్పుడూ తలెత్త లేదు కాని నోబెల్ శాంతి, నోబెల్ సాహిత్య బహుమతుల విషయంలోమాత్రం ప్రతి ఏటా ఏదో ఒక రకమైన వివాదం వినిపిస్తుంటుంది.

ఆ రెండు బహుమతులను అగ్రరాజ్యాలు తమ రాజకీయాలకు అనుగుణంగా మలచుకుంటున్నాయనేది ఫిర్యాదు. అగ్రరాజ్యాల సూచనలమేరకు నోబెల్ కమిటీలు పనిచేయటాన్ని తప్పుపడుతుంటారు చాలామంది. ఈ వివాదం ఈ సంవత్సరం తారస్థాయికి చేరింది.నోబెల్ సాహిత్య బహుమతికి మేము ప్రత్యామ్నాయ బహుమతిని ఇవ్వాలనుకుంటున్నాం అంటూ ఒక సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

నోబెల్ సాహిత్య బహుమతి ఎంపిక సక్రమంగా జరగటంలేదని, ప్రపంచంలోని ఇతర భాషలలో వస్తున్న సాహిత్యాన్ని పరిగణలోకి తీసుకోకుండా కేవలం తమకు పరిచయమున్న ఆంగ్ల భాషలోని సాహిత్యానికే పట్టంకడుతున్నారని అంటున్నారు.

నిజమే...ప్రపంచంలోని వేలకొలది భాషలలో అద్భుతమైన సాహిత్యం వస్తుంటుంది. అయితే ఆ సాహిత్యం ఇతర భాషలలోకి తర్జుమా కానందున ఆభాషా ప్రాంతం దాటి బయటకు వెళ్ళటం లేదు. మిగిలిన భాషలదాకా ఎందుకు!

తెలుగు భాషలో నోబెల్ సాహిత్య బహుమతికి అర్హత గలిగిన సాహిత్యం ఎంత రాలేదు.

విశ్వనాథ సత్యనారాయణ సాహిత్య సృష్టి నోబెల్ సాహిత్య బహుమతికి అర్హమైనదే. కాని ఎన్నడూ కనీసం పరిశీలనకు కూడా వెళ్ళలేదు.

అసలు భారతదేశంలో నోబెల్ సాహిత్య బహుమతి పరిశీలనకు వెళ్ళిన సందర్భాలు రెండే రెండు. ఒకటి భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు.

అప్పుడు బెంగాలీ భాషలో రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గీతాంజలి ఇంగ్లీషులోకి తర్జుమా అయ్యి సాహిత్య నోబెల్ పరిశీలనకు వెళ్ళటమే కాక ఆ బహుమతిని గెలుచుకుంది.

స్వతంత్ర భారతదేశంలో తిరిగి నోబెల్ సాహిత్య బహుమతికి పరిశీలనకు వెళ్ళిన పేరు ఒక తెలుగు సాహిత్యకారుడిది. భారతదేశం నుండి నోబెల్ బహుమతికి వెళ్ళటం రవీంద్రుడి తర్వాత అదే.

2004 సంవత్సరంలో సాహిత్యంలో నోబెల్ పురస్కారానికి నామినేటైంది. బహుమతి అందుకోలేక పోయినా వారు పరిశీలించిన ఆ పుస్తకంలోని పేదల బతుకు పోరాటఅంశం ప్రపంచ దృష్టికి వెళ్ళింది.

నోబెల్ కమిటీ పరిశీలించిన ఆ అంశం ఆ తర్వాతే గ్రీకు భాషలోకి అనువదించబడింది. పలుఇతరభాషల్లోనూ వెలువడింది.ఐతే ఆ తెలుగు వాడికి రావాల్సినంత గుర్తింపు దేశంలో వచ్చిందా! అనేది సందేహమే. ఆయన జీవితం, కవిత్వం రెండూ భిన్న శైలికి సంబంధించినది కావటమే గుర్తింపు రాకపోవ టానికి కారణమేమో తెలియదు.

కొందరు కవులులాగా తనది తాను మార్కెటింగ్ చేసుకోవటంచేతకాకపోవటమూ కారణం అయివుండవచ్చు. ఏమైనా ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ, మిగిలిన ఉద్యోగుల్లాగా రొడ్డకొట్టుడు జీవిగా కాక తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాహిత్యపరంగా సంపాదించుకోవటం గొప్పవిషయం. ఆయన పుట్టింది కోస్తాలోని ఒక జిల్లాలో. ఆయన ఇంటిపేరు కోస్తాలోని మరో జిల్లా పేరు.

డిగ్రీ చదువుకుంది తన ఇంటి పేరు కలిగిన పట్టణంలోనే. డిగ్రీ చేసింది సైన్స్‌లో, ఆపైన మద్రాసు వెళ్ళి చదివింది న్యాయ శాస్త్రం.చివరికి చేరింది ప్రభుత్వంవారి పంచాయితీ విభాగంలో.ఆయనలోని సాహిత్య సామర్థ్యానికి, ఆయన చేసిన ఉద్యోగానికి ఏమాత్రం పొంతన లేదు.

ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ, ప్రభుత్వ ఉద్యోగులకు అలవడే అవలక్షణాలేవి అంటించుకోకుండా తన కథలు, తన కవితల లోకంలో విహరిస్తూ ఆడుతూ పాడుతూ ఉద్యోగ బాధ్యతలను నిర్వహించాడు.

ఒకవైపు మున్సిపల్ కమిషనర్‌గా పట్టణ పౌరుల యోగక్షేమాలను గమనిస్తూనే మరోవైపు సాహిత్యం ద్వారా వారి జీవన విధానాలను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కుటుంబపరంగా ఆయనకి సంస్కృతం అబ్బింది. నైతిక, సాంస్కృతిక వాఙ్మయంలో పట్టు వచ్చింది.అదే సమయంలో తెలుగుమీద పట్టు వుంది. అటు ఛందోబద్ధ కవితలు రాశాడు. ఇటు నవీన సాహిత్యరీతిలో కవితలు అల్లాడు.

ఆయన రాసిన పద్ధతి ఏదైనా ఆయన రచనల్లో ప్రతిబింబించింది, ఆయన ఎంచుకున్న ప్రధాన అంశం ప్రకృతి-సామాన్య ప్రజల స్థితిగతులు. బహుశ ఉద్యోగిగా తొలినాళ్ళలో ఆయన పనిచేసిన తూర్పు గోదావరి జిల్లాలోని ప్రకృతి అందాలు, తాను పుట్టి, పెరిగిన, చదువుకున్న జిల్లాలలోని ప్రజల కష్టాలు కలగలిపి రచనలు చేశారేమో! ఆరు దశాబ్దాలపాటు సాగిన ఆయన సాహిత్య సేవలో సమకాలీన కవులందరిచేత ప్రశంసలు అందుకున్నాడు.

ఆధునిక కవి అని కొందరితో, యుగకవి అని మరి కొందరితో పిలిపించుకున్నవాడు.

కవిత్వం జనంలోకి వెళ్ళాలేగాని తాను వెళ్ళాల్సిన అవసరంలేదన్నది చాలాకాలం ఆయన నమ్మిన అంశం. ప్రభుత్వ ఉద్యోగిగా ఆంక్షలు పాటించాల్సిన నియమాలుకూడా ఆయన్ని ప్రజల్లోకి సాహిత్య సమావేశాలలోకి రానివ్వలేదేమో!

తెల్లటి పంచకట్టుతో ధగధగా మెరుస్తూ, ఎంతో గంభీరంగా కనిపించేవారు. ఆయన్ని పలకరించటం కూడా కష్టమని తప్పుకునేవారు. అభిమానులు కూడా ఆప్తులుగా మారలేని సముద్ర గాంభీర్యం ఆయనది. ఆ విషయం ఆయనే ఒకసారి చెప్పుకున్నారు.

'సముద్రంలాంటి నేను ఒకరి దగ్గరకు వెళ్ళి కూర్చోలేను, పర్వతంవంటి నేను ఎవరికి వంగి సలాం చెయ్యను' అనే అర్థంలో తన వ్యక్తిత్వంగురించి చెప్పుకున్నాడు. జాతీయ జెండాకుండాల్సినంత గర్వం, పొగరు నాది అని చెప్పుకోవటంద్వారా ఆయన వ్యక్తిత్వం ఎటువంటిదో తెలియచేస్తుంది.

ఆయనలోని కవిని కీర్తించినవారిలో విశ్వనాథ, శ్రీశ్రీ వంటి భిన్న ధృవాలవారుండటం గొప్ప విశేషం. ప్రపంచ దేశాల సాహిత్యాన్ని ప్రభావితంచేసిన కవి అని విశ్వనాథ కొనియాడగా నా మహాప్రస్థానం సంస్కృతంలోకి అనువదించగలిగిన పండితుడు ఆయన ఒక్కడే అని శ్రీశ్రీ పొగిడాడు.

ఇక ఆయనలోని కవికి అంతకుమించిన సర్టిఫికేట్లు మరేవి అక్కరలేదు.

'ముత్యాల ముగ్గు' సినిమాని తెలుగువారు మరువలేరు. అందులోని జమిందారు బంగళాకి సొంతదారు ఆయన భార్య.

ఆ సినిమాలోని ఒక చక్కని, అర్థవంతమైన పాట ఆయన రాసింది వాడుకున్నారు దర్శకులు. భార్య ఆయన కవిత్వాన్ని ఇంగ్లీషులోకి అనువదిస్తూ ఉండేది. ఆ సాహిత్య దంపతులు సోషల్ సర్కిల్‌లో చాలా బిజీబిజీగా కనిపిస్తుండేవారు.

కవిత్వంపట్ల తనకున్న మక్కువను 'నన్ను కత్తితో పొడిస్తే రక్తం కాదు... కవిత్వం కారుతుంది' అంటూ గర్వంగా చెప్పుకున్నారు ఆయన.

ఇంతకీ...

1. ఆ కవి పేరేమిటి?

2. నోబెల్ సాహిత్య కమిటీ పరిశీలించిన ఆయన రచన ఏది?

ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు పోస్ట్‌కార్డ్‌పై రాసి స్వాతి చిరునామాకు **4 ఆగష్టు 2018** తేదీలోగా పంపించండి.
కరెక్టు సమాధానాలు రాసినవారిలో లాటరీ పద్ధతి ద్వారా ఒకరిని విజేతగా ఎంపికచేసి ₹ 500/- నగదు బహుమతిని అందజేస్తాం.

20.7.2018 సంచికలో ప్రచురించబడిన 'నేనెవరో తెలుసా!' శీర్షిక సమాధానాలు : 1. జయంతి రామయ్య పంతులు, 2. ఆంధ్ర సాహిత్య పరిషత్తు.
విజేత : జి.వి.మురళీమోహన్‌రావు
శ్రీలక్ష్మి దశగణపతి స్వామి ఆలయం
కోటరామచంద్రపురం, శివాలయం వీధి
తూర్పుగోదావరి జిల్లా
533 255.

రామసీత

బాగా మరగబెట్టిన పాలరంగులో వుంటది రామసీత శరీరం. ఎర్రటి శిల్కుగౌను, రెండు జడలు. చెవులకి బుట్టలోలకులు. పదేళ్ళ వయసున్న ఆ రామసీత మెడలో మెరుస్తా వేలాడ్తుంటాయి బంగారపు మంగళసూత్రాలు.

పసలపూడి వూరి చివరున్న స్మశానం, కర్రి మందారెడ్డిగారి పొలం దాటేకా వెదురుపాక (ఆ వూరి పేరు) వెళ్ళే దారిలో వున్న ఆ పాతికెకరాల తోటలో కోట లాంటి ఇల్లు రామసీతాళ్ళది.

దాన్నంతా 'మల్లిడి దొరారెడ్డిగారి తోట'అంటారు. దొరారెడ్డిగారంటే రామసీత వాళ్ళ తాత. రోజూ ఆ తోటలోంచి,సవ్వారీ బండిమీద బయల్దేరి మేడ చెల్లాయమ్మగారింటెదురుగా వున్న మా స్కూలు ముందు దర్జాగాదిగే రామసీతని రెప్పార్పకుండా చూస్తారంతా. ఐతే, ఎవరికేసీ కన్నెత్తి చూడని సీత, నా దగ్గరికొచ్చి జబ్బమీద చెయ్యేసి మరీ పలకరిస్తది.

చాలా చనువుగా చాలా విషయాలు మాటాడేస్తుంటది. నాతో అలాగ సిల్లోబొల్లోమంటా వుండే ఆ సీతనే రెప్పార్పకుండా చూస్తుంటాడు నా క్లాసుమేటూ. ఆ రామసీత మెడలో తాళి కట్టిన భర్తా అయిన చంద్రారెడ్డి.

ఆవేళ మధ్యాన్నం ఇంటర్వెల్ ఇచ్చినప్పుడు స్కూలు వెనకాలున్న సపోటా చెట్టెక్కి, దోరగా పండిన కాయలకోసం వెతుకుతూ వుంటే పరువానికొచ్చిన కాయొకటి లోపలెక్కడో ఆకుల మధ్యలో దాకుని కనిపించేటప్పటికి గబుక్కునొంగి తెంపేసేను.

సరిగ్గా అదే టైములో 'అబ్బా' అంటా వినిపించిందో అరుపు. కిందకి దూకి చూస్తే... పరుగెట్టుకుంటా వచ్చిన సీత తన గుప్పెట్లో వున్న పొట్లం నాకిచ్చింది. అందులో ఏముందో చూసుకోకుండా దాన్ని జేబులో పెట్టుకున్న నేను నా చేతిలో వున్న పరువానికొచ్చిన సపోటాకాయని కాకి ఎంగిలి చేసి అందివ్వబోతుంటే వద్దు మామూలుగా ఎంగిలి చేసిందే పెట్టమన్నట్టు సైగల్తో చెప్పింది.

'సరే' అనుకుంటా కొరికిన ఆ సపోటాకాయ పెచ్చు అందిస్తే దాన్నినోట్లో పెట్టుకునమల్తా ఇష్టంగా తింటన్న రామసీతనే చూస్తా గోడ దగ్గర నిలబడ్నాడు చంద్రారెడ్డి.

మా వూరికీ, రాంపురానికీ మధ్యలో బంగ్లాతోట అనేసి నాలుగు కొంపలున్న శివారుంది. రోజూ అక్కడ్నించొచ్చే అంబటి జీవరత్నమ్మ మేష్టారు నన్ను దగ్గరకి పిల్చి "చింతా అప్పారెడ్డిగారింట్లో జున్ను పాలిస్తానన్నారు... ఎళ్ళి కొంచెం తెచ్చిపెడ్తావేంట్రా అబ్బా" అన్నారు.



వంశీ

మా ఇంట్లోంచి ఇత్తడి తపేళా తీసుకువెళ్ళి ఆ పాలట్టుకొచ్చి మేష్టారికిచ్చొస్తున్న నన్నుసపోటా చెట్టు దగ్గరకి రమ్మని పిల్చింది సీత. వెళ్తే "ఇందాకట్నించి చూస్తన్నాను ఎక్కడికెళ్ళేవింతసేపూ?" అంటా విసుక్కుని చిన్నస్టీలు డబ్బాలో వేసుకొచ్చిన ఇమిర్తీలు నాకు పెడ్తున్నప్పుడు, ఆ సీత ముంజేతి మీదా, మోకాలి కిందా శరీరం కమిలిపోయుండటం జూసి, ఏంటనడిగేను. "మా ఆయన చెప్పింది నమ్మికొట్టేరు ఇంట్లో... వీపు మీద బాగా తట్లు తేలినియ్యి" అనేటప్పటికి అదోలాగయిపోయింది మనసు.

ఆవేళ ఏంచేస్తున్నా సీత వంటి మీద దెబ్బలే గుర్తుకొస్తున్నాయి. చివరికి దీపాల వేళప్పుడు అనుకున్నాను... ఇంకెప్పుడూ రామసీతతో మాటాడకూడదని.

అక్కడ్నించి, ప్రతిరోజూ నా దగ్గరకొస్తున్న సీత పలకరించే ప్రయత్నాలు తెగవేస్తుంటే నన్ను కానట్టు ఎటో చూస్తా వెళ్ళిపోతున్నాను.

నేనారకంగా మసులుకుంటుంటే తెగ కోపమొచ్చేస్తుంది రామసీతకి. దూరంనించి మమ్మల్నే చూస్తున్న చంద్రారెడ్డి మట్టుకి నెమ్మదిగా మా వెనకనించే నడుచుకుంటా ఎళ్ళిపోతున్నాడు. కాఫీహొటేలు రాజు 'విన్నానులే ప్రియా... కనుగొన్నానులే ప్రియా' అన్న కొత్తపాట పాడ్తున్నప్పుడల్లా ఆడిదగ్గరకెళ్ళిపోయి వినేసేకా, మళ్ళీ పాడించుకోవాలనిపిస్తది.

నిన్న మధ్యాన్నం ఆళ్ళ హొటేలు పక్కనించెళ్తుంటే నన్ను దగ్గరికి పిల్చిన రాజు "నేను పాడ్తున్న పాట వున్న ఆ సినేమా రాంపురం రాజుగారి హాల్లోకొచ్చింది ఎళ్దామా?" అన్నాడు.

"సినేమా పేరేంటి?" అన్నాను.

'బందిపోటు దొంగలు'

'సరే' అన్న నేను ఆ వేళ రాత్రి పిచ్చితాతారెడ్డి షాపులో అద్దికి తీసుకున్న సైకిలు రాజు తొక్కుతా వుంటే, వెనకాల కేరేజీ మీద కూర్చున్నాను. రెండో ఆట సినేమా మొదలయ్యింది.

విన్నానులే ప్రియా పాట అయ్యేకా నా చెవిదగ్గర నోరుపెట్టినా హొటేలురాజు "ద్రాక్షారంలో నాక్కొంచెం పనిబడింది... మనూరోళ్ళు చాలామందొచ్చేరీ వేళ ఎవడి సైకిలెనకాలన్నా ఎక్కేసి ఎళ్ళిపో"అంటా పరుగులాంటి నడకతో బయటికెళ్ళిపోయేడు.

ఆటయిపోయింది. హాలు బయటికొచ్చి చూస్తే ఇవ్వేళ మా ఊరోడు ఒక్కడూ రాలేదు. ఆకాశం నిండా మబ్బులు మూసుకుపోతున్నాయి. ఒకటే ఈదురుగాలి, బస్టాండు, రామకృష్ణా హొటలు సెంటరూ దాటుతుంటే కరెంటు పోయింది.

మనిషన్నోడు లేడు, కటిక చీకటి ఈ రాంపురం దాటాలంటేనే ఇంకా చాలా దూరమెళ్ళాలి. తర్వాత మా వూరు పసలపూడెళ్ళాలంటే ఇంకో మైలు పైన. బితుకు బితుకుమంటా కొట్టుకుంటున్నాయి గుండెలు. 'ఏం విన్నానులే ప్రియా పాటో ఎందుకొచ్చేన్రా దేవుడా' అనుకుంటా నడుస్తున్నాను.

గాంధీ డాక్టరు గారి హాస్పిటలూ, క్రిష్టియన్



కాంపౌండూ దాటేనో లేదో కుడిపక్కన దూరంగా పెద్ద మంట. అప్పుడు గుర్తొచ్చింది. అది స్మశానం. ఒకటే భయం, గుండె దడ, అరుద్దామంటే నోరు పెగలడం లేదు, అడుగులు ముందుకేస్తున్నాను అనుకుంటున్నానుగానీ అక్కడే ఉండిపోతున్నాను. ఉచ్చా పేడా బందయిపోతున్నాయి. ఊపిరాడ్డం లేదు, తడారిపోయిన గొంతులో గుటక పడ్డంలేదు... పక్కనే సవ్వారీ బండాగింది ఇంతలో. నచ్చి ఎక్కమంటన్నాడు బండోడు. గబగబా ఎళ్ళేనో, పడతా లేస్తా ఎళ్ళేనో మొత్తానికెళ్ళి బండెక్కేసేను. ఆ బండి కుష్టురోగుల బంగళా అదీ దాటేసేకాగానీ నేను మామూలు మనిషినవ్వలేదు.

బండిలోపలున్న ఇద్దరు ముసలోళ్ళ మధ్యలో కూర్చునున్న ఆడమనిషి "బందిపోటు దొంగలు సినేమాకెళ్ళొస్తున్నాం మేం" అంది.

చైను తెగిన గుడిగంట గోడకి కొట్టుకుని నేల మీద పడ్డ సౌండు గుండెల్లోంచి... ఆ మనిషి రామ సీత. వర్షం భోరుమంటా కురుస్తుంది. బండి లోపల ముసలోళ్ళిద్దరూ మొద్దు నిద్రల్లోనే వున్నారు. ఎర్రరంగు జేబురుమాలిచ్చిన సీత "దీంతో నీ ముఖం తుడుచుకుని నాకిచ్చెయ్" అంది. ఎందుకంటే ఏదో అంటదని, తను చెప్పినట్లు చేసేను. బండి ఫర్లాంగెళ్ళేకా వర్షం ఆగిపోయింది. ఊరి కాలవదిగువలో బండాపమని దిగిపోయేను.

రామసీత స్కూలుకొచ్చి వారం దాటేసింది. మొన్న బండి తోలిన పాలేరోడు సీత నన్ను బండెక్కించుకున్న సంగతి ఇంట్లో చెప్పేసుంటాడు. దాంతో చావగొట్టి గదిలోకి తోసేసి తాళం కప్పేసి స్కూలు మానిపించేసుంటారు అనుకుంటా నడుస్తున్నాను. బండ్రేవు గట్టుమీద కాపరముండే రావాలప్ప ఊళ్ళో ఎవరిళ్ళల్లో అన్నా పెళ్ళిళ్ళూ పేరంటాలయితే పిండివంటలు మాగొప్పగాచేస్తది.ఆవేళ సవ్వారీ బండెక్కెళ్ళిపోతుంటే "ఎక్కడకెళ్తన్నావే అప్పా?" అన్నాను.

"మల్లిడి దొరారెడ్డిగారి తోటలోకిరా బాబా" అంది.

"అక్కడ నీకు పనేంటే?" అన్నాను.

"బోల్డన్ని పిండివంటలు చేయ్యాల్రా...ఆళ్ళ పాప రామసీత పెద్దమనిషయ్యింది గదా?"



అంది. అంతే... నా ఆలోచనలన్నీ పటాపంచలైపోయినియ్యి, అదా సంగతీ!!!... తెలీక ఎన్ని తప్పుడు కతలల్లేను. మరైతే పెద్దమనిషైపోయిన రామసీతతో ఇంతకుమునుపులాగ మాటాడకూడదేమో ఇప్పుడు... మరెలా మాటాడాలి? మరేవని పలకరించాలి?

రామసీత స్కూలుకి రాటంలేదు. ఆళ్ళ తోటలోకి నేనెల్దావా అంటే ఆ మనిషిబాగుకోసం ఎళ్ళకూడదనొట్టేసుకున్నాను. కర్ణాటకలో పొలాలు చవగ్గా వస్తన్నాయంట, కొని వ్యవసాయం చెయ్యడానికని, మా కుటుంబాన్ని అక్కడికి తీసుకెళ్ళిన మానాన్న అది లాసు రాడంతో అయిదేళ్ళ తర్వాత మళ్ళీ వెనక్కి తీసుకొచ్చేసేడు మమ్మల్ని.

ఆవేళ శివరాత్రవ్వటంతో రాజేశ్వరస్వామిగుడి నిండా జనం. ఆ జనంలో ఎర్రచీర, మెడలో సూత్రాల తాడుతోవున్న ఆ అమ్మాయి నన్ను చూసి ఆకాశంలో మెరుపులాగ నవ్వింది.

చూసిన నాకు మతిపోయింది... గౌనులో సీతకీ, ఈ సీతకీ అసలు సంబంధం లేదు. అందమే సీత... సీతే అందం.

తన చుట్టూ వాళ్ళింట్లో జనమే వున్నారు. వాళ్ళెవరూ నన్ను చూడకుండా నేను సీతని చూస్తున్నాను. అలా చూస్తానే 'ఈ చంద్రారెడ్డేడీ?' అనుకుంటన్నానో లేదో ఏడుపుగొట్టు మొకంతో నడుచుకుంటా వస్తున్నాడు దూరాన్నుంచి.

'ఆడికిప్పుడు కనపడితే ఎదవ పెంట' అనుకుంటా ఇంకో మూలకిపోయి సర్దుకుంటుండగా నా దగ్గర కొచ్చిన సీత "రేపు చీకటి పడ్డాకా మా తోట ఎదురు గుండా వున్న చింతచెట్టు కిందకొచ్చి నిలబడేం" అనేసి మాయమైపోయింది.

చీకటి, చలిగాలి, ఆకాశంనిండా మబ్బులు వేసుకొచ్చిన సైకిల్ని మందారెడ్డిగారి షెడ్లో జేరేసి ఆ చీకట్లో నడుచుకుంటా మల్లిడి దొరారెడ్డిగారి తోట ముందున్న ఆ చింతచెట్టు కిందకెళ్ళి నిలబడ్డాను.

గంటయింది, రెండు గంటలయ్యింది. ఏ అలికిడీ లేదు. "అసలొస్తదా ఆ మనిషీ? ...తేడా మనిషి కాదు గానీ, బయల్దేరుతుంటే ఇంట్లో జనం ఏవన్నా అడ్డుకున్నారా? లేకపోతే ఆ చంద్రారెడ్డేవన్నా ఫిటింగుపెట్టేడా? అర్థంగాటంలేదు... వచ్చి చాలాసేపైపోయింది.

ముద్దుల చిత్రణ

తన '24 కిసెస్' సినిమా గురించి హెబ్బాపటేల్ వివరణలు, సమర్థతలతో సాగిపోతున్నది.

ఈ సినిమా టైటిల్‌పట్ల కృతజ్ఞతలూ చెప్పుకుంటున్నది. సినిమా టైటిల్ విన్నవారిని గబుక్కున ఆకర్షిం చేస్తున్నది. టైటిల్‌నుబట్టి సినిమాలో బోల్డన్ని ముద్దులుంటాయన్న కబుర్లూ వినిపిస్తున్నాయి.

"మీడియా విద్యార్థినిగా నటిస్తూ ప్రొఫెసర్‌ప్రేమలో పడే పాత్ర నాది. ఇప్పటిదాకా గ్లామరస్ పాత్రలూ, పక్కింటి అమ్మాయి పాత్రలు చేస్తూ వచ్చాను.

ఇది వాటికి భిన్నంగా నా స్వంత పరిధిలో నేనుండే పాత్ర. నేను చెయ్యగలనా! లేదా! అని మొదట్లో భయపడ్డాను. పూర్తిగా కథ వివరించాక కన్విన్స్ అయ్యా. ప్రతి ముద్దు సన్నివేశాన్నీ చాలా కళాత్మకంగా, జస్టిఫై చేస్తూ చిత్రించారు" అంటూ ముద్దుల్ని సమర్థించు కున్నది హెబ్బాపటేల్.

...దెయ్యాలు తిరిగే వేళ ఇది" అనుకుంటుండగా 'ఢభ్' మన్న సౌండు.

గుండాగినంత పనయ్యింది... ఏంటా అని జూస్తే... చింతచెట్టు పక్క గట్టు మీదున్న తాడిచెట్టుమీంచి రాలిన తాటిపండు కిందున్న బోదికాలవలో పడింది.

ఆ సీత ఇంకా రాడం లేదేంటీ అనుకుంటుండగా రెండు దీపాలు కనిపించినియ్యా కటిక చీకట్లో.అటే చూస్తున్నాను. ఏ చప్పుడూ లేకుండా ఆ రెండు దీపాలూ దగ్గర కొచ్చేస్తుంటే భయం భయంగా చూస్తున్నాను. నా పీల గుండికాయ ఆగిపోయే లాగుంది. దీపాలు బాగా, ఇంకా బాగా దగ్గరకొచ్చేస్తుంటే ఏ చప్పుడూ లేని ఆ చీకట్లో పక్కోళ్ళకున్కాడా విన బడేలాగ చప్పుడు చేస్తుంది గుండెకాయ. ఇంకా బాగా దగ్గరకొచ్చేసిన దీపాలు నా ముందునించే వెళ్ళిపోయినియ్యి. తీరా చూస్తే జట్కాబండి గూటికి ఎడాపెడా బిగించిన కిరసనాయిలు దీపాలయ్యి. చూపు వెళ్ళిపోతున్న జట్కామీంచి ఈ పక్కకి తిప్పుతా అలాగుండిపోయేను.



జమిలి ఎన్నికల ప్రతిపాదన రాజ్యాంగ వైపరీత్యం.
-అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్ నేత

తెల్లచీర కట్టుకున్న మనిషి సరాసరి నా పక్కకే వస్తంది... ఇందాకటి జట్కాలాంతర్లంత స్పీడుగా వచ్చేస్తుంటే దెయ్యమేమో అని పరిగెట్టుకుంటా పారిపోతున్న వాణ్ణల్లా 'అబ్బూ' అన్న పిలుపుకి ఆగిపోయేను. బాగా దగ్గరకొచ్చేసి నాకు అరంగుళం దూరంలో నిలబడ్డ సీత "నిన్ను చూసి అయిదేళ్ళయ్యింది గదా?" అంది.

"అవును... చీకట్లో నిన్ను చూసి దెయ్యమేమో అనుకున్నాను" అన్నాను.

నవ్వేసిన సీత "ఈ తోటలో నన్ను దెయ్యంలాగ చూడాలనుందా నీకూ... ముందెప్పుడన్నా అలా కనపడతానేమో... చూద్దాం" అంటా నవ్వేసి, అరనిమిషం పాటు ఏం మాటాడకుండా వుండిపోయి, ఆ తర్వాత మొదలెట్టింది...

"శోభనం నాడు రాత్రి, అతను దగ్గిరికొస్తుంటే, ఓ మూలకెళ్ళిపోయి, నువ్వు తుడుచుకునిచ్చిన జేబురుమాల్ని చూసుకుంటా వుండిపోయేను... ఈ జేబుగుడ్డ ఆ అబ్బుగాడిది గదా? అన్నాడు.

గుడ్డ నాదే తను తుడుచుకునిచ్చేడంతే అన్నాను. ఏవర్థమయిందోగానీ చాలా గొడవ చేసేడా రాత్రి" అంది. "చిన్నప్పుడే నీకతను సూత్రాల తాడు కట్టేడు... నువ్వతని భార్యవి సీతా" అన్నాను.

"నన్నడిగి కట్టేడా?... నువ్వు కూడా అలాగ మాటాడతావేంటీ?" అంది.

"ఇప్పుడేవంటావు సీతా?"

"నాకిష్టమైనోడితో నేను కాపరం చెయ్యాలనుకుంటున్నాను. ఇంట్లోకూడా ఇదే ముక్క చెప్పేను"

"ఏ ముక్క సీతా?"

"తెల్లారేకా ఏం చెప్పేడో అతను... దీపాల వేళప్పుడు నా దగ్గరకొచ్చిన మా అమ్మ అడిగితే... నాకా చెంద్రారెడ్డి నచ్చలేదు... నల్లమిల్లి సూరాయమ్మగారి అబ్బునిచ్చి మారుమనువు చెయ్యండి అన్నాను"

"దానికేవన్నారు సీతా మీ వోళ్ళు?"

"ఒళ్ళంతా వాతలు పెట్టి వారంరోజులపాటు చీకటి కొట్లో పెట్టేరు"

"సరే... చివరి మాటగా నువ్వేం చెప్తావు?"

"నాకా చంద్రారెడ్డి వద్దు నువ్వే కావాలి నువ్వే... వచ్చెయ్ నీకోసమే చూస్తుంటాను ఒకవేళ నేను చచ్చిపోతే దెయ్యమై నీకోసమే ఎదురుచూస్తుంటాను అబ్బూ!!" అంటా ఆ సీత నామీదపడి ఏడ్డం నలుగురు పాలేళ్ళొచ్చి కర్రల్తో నన్ను చావగొట్టటం ఒకేసారి జరిగినియ్యి.

దూర ప్రాంతాల్నుంచి లారీలో దిగిన రౌడీగుంపొకటి "మీవోణ్ణీ వూళ్ళోంచి అర్జంటుగా పంపించెయ్య పోతే చంపేస్తాం" అని వార్నింగిస్తా ఆళ్ళు చేసిన అల్లరికి తెగ భయపడిపోయేరు మా ఇంటిల్లపాదీ.

మా పూరోళ్ళు "సిరిసిరిమువ్వ" సినిమా తీస్తున్నారని తెల్సి మద్రాసు ట్రస్టుపురంలో వున్నాళ్ళ ఆఫీసుకెళ్తే, నిర్మాతల్లో ఒకడైన నల్లమమిల్లి భాస్కరెడ్డిగారు ఈవూళ్ళో ఏంపని చేస్తావన్నారు.

నేను రాసిన మంచుపల్లకీ, కర్మసాక్షి నవలలూ, పత్రికల్లో ప్రింటయిన కొన్ని కథల కటింగ్సూ చూపించి "ఏదైనా పత్రికాఫీసులో సబ్ఎడిటర్ పని దొరుకుద్దేమోనని వచ్చేను" అన్నాను.

"ఆ పనొద్దులేగానీ ఎవరైనా డైరెక్టర్ దగ్గర అసిస్టెంటుగా చేరు... రైటరువి గాబట్టి ఫ్యూచరుంటది" అంటా పని దొరికేదాకా వాళ్ళాఫీసు పెంట్ హౌస్‌లో వుండమన్నారు.

బాపుగారి దగ్గర చేరదామంటే విక్టరీ మధుసూదన రావుగారి దగ్గర దొరికింది అసిస్టెంటు డైరెక్టర్ పని. ఇక్కడ్నించి మొదలైన నా సిన్మాప్రయాణంలో పరిచయమైన ప్రతీ ఆడమనిషిలోనూ రామసీతని వెతికే ప్రయత్నం చేసేనుగానీ ఎక్కడా కనపడలేదా సీత.

1982లో డైరెక్టరయ్యేక నేను పరిచయం చేసిన చాలామంది ఆడోళ్ళలో ఆ రామసీత ఎక్కడైనా కనపడిద్దేమో అని చూస్తే మచ్చుకక్కాడా కనబడలేదు. పసలపూడిలో పద్మావతి అక్కగారి పెదబాబు(అసలు పేరు చింతా వెంకట సత్య రాజేంద్రరెడ్డి) ఫోన్‌చేసి "మనూళ్ళో నీకూ,టి.సుబ్బరామిరెడ్డిగారికీ సన్మానం చేద్దామనుకుంటున్నాం. ఏవంటావ్?" అన్నాడు.

"అంత పెద్దోళ్ళ పక్కనెందుకంటే ఐనా సన్మాలకీ అదీ నేను చాలాదూరం గదా?" అన్నాను.

దాంతో మళ్ళీ ఆళ్ళెవరూ ఈ పనిమీద నాకు కబురు చెయ్యలేదు.

సినిమా... అవస్థలు, ఆనందాలు, ఇబ్బందులు, ఇరకాటాలు.వీటిల్లోపడికొట్టుకుంటా,ములిగితేల్తున్న నేను, రామసీత ధ్యాసలోంచి పక్కకొచ్చేను. పోను పోను రామసీతని మర్చిపోయేను. ముందు మా నాన్న తర్వాత మా అమ్మా కాలం చేసినప్పుడు కూడా నేను పసలపూడి వెళ్ళలేక పోయేను.

వూళ్ళో నా వాళ్ళంటా ఎవరూ లేకపోడంవల్లఅక్కడ సంగతులు నాకేంతెలీకుండాపోయినియ్యి. చూస్తుండగానే పాతికేళ్ళు గడిచిపోయినియ్యి.

చెల్లూరు స్కూల్లో నాతోపాటు ఆరూ, ఏడూ క్లాసులు చదివిన కొవ్వూరి త్రినాధరెడ్డి ఫోన్ చేసేడా వేళ. బలభద్రపురంలో కోళ్ళ ఫారాలూ ఇంకా చాలా వ్యాపారాల్లో బిజీ అంట తను, ఇప్పుడు వైయస్సార్ సీపీలో వున్నాడంట అంతకుముందు కాంగ్రెసంట.

బాగుందిగానీ, నాకు ఫోన్ చెయ్యడానికి కారణమేంటన్నాను."ఏప్రిల్ పదిహేనో తారీఖుని మన పసలపూడి ఎలిమెంటరీ స్కూల్లో మనతోపాటు ఐదోక్లాసు దాకా చదువుకున్నోళ్ళందరం పోగవుతున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఫంక్షనికి నువ్వొచ్చితీరాలి. ముందే చెప్తున్నాను ఆవేళ నీకు చిన్న సన్మానంలాంటిది కూడా అనుకుంటున్నాం నువ్వొప్పుకోవాలి మరి" అన్నాడు.

అదే స్కూల్లో నాతోపాటు కలతిరిగిన రామసీతా, ఆనాటి కతలూ, ఆనాటి గొడవలూ అమాంతంగా గుర్తుకొచ్చేసి నన్ను వూపిరి సలపకుండా చేసేటప్పటికి మనసంతా అదోరకంగా తయారయిపోయింది. ఆవేళింకే పనీ చెయ్యబుద్ధవ్వలేదు. మనసంతా రామసీతే... శిరస్సునించి సిరిపాదం దాకా రామసీతే... రాత్రి త్రినాధరెడ్డికి ఫోన్‌చేసి "సరే త్రినాదూ... ఒకరోజు ముందే వస్తాను" అన్నాను.

ఏప్రిల్ 14 ఆవేళ.

రాజమండ్రి ఎయిర్‌పోర్ట్ కొచ్చిన త్రినాధరెడ్డి నన్ను రిసీవ్‌చేసుకుని కారెక్కించుకున్నాడు. కదిలిన ఆ కారు వేమగిరి వంతెన దగ్గరకొచ్చేకా ఎడంపక్కకి తిరిగి పసలపూడి వేపెళ్తుంది. మైక్‌సెట్టు గోపాళం గారబ్బాయి రామారెడ్డి చేస్తన్నాడంట ఈ ఫంక్షను... నేనుండడానికి ఊళ్ళో చింతా బ్రాహ్మణరెడ్డిగారి మేడలో గది ఏర్పాటుచేసేరంట... చిన్నప్పుడు మేవెరిగినోళ్ళెవరూ బతికి లేరంటిప్పుడు.

యండమూరి ప్రభాకరం మేష్టారు, స్వరాజ్యరెడ్డీ, హోటేలు గోపాలరావూ, భూతవైద్యాలు చేసే వెలగల గోపాళం, లాకుల కిందుండే భోగం భాస్కరం గారూ ఇలా పెద్దోళ్ళంతా కాలం చేసేసేరంట.

'అప్పుడు నన్ను చంపించడానికి గుంటూరు ఏరియాల్నించి రౌడీల్ని తీసుకొచ్చిన రామసీతాళ్ళ మాయ్య, ఆళ్ళ నాన్న, అమ్మ ఆళ్ళంతాకూడా కాలం చేసేసుంటారు గదా... మరైతే ఆ భర్త చంద్రారెడ్డితో వున్న రామసీతేం చేస్తుందిప్పుడు?...

ఆళ్ళ పిల్లలేం చేస్తున్నారు? ఇవన్నీ అడగాలనుకున్నానుగానీ, అడిగితే పాత కథలెక్కడెత్తుతాడో అని అడగలేదా త్రినాధరెడ్డిని.

ద్వారపూడి వంతెనెక్కి కుడిపక్కకి తిరిగిన కారు ఇప్పనపాడు లాకులు దాటుతుంది.

సీతగురించే ఆలోచిస్తున్న నా మనసు ఏదోలాగయిపోతుంది. ఇంకీ జన్మకి మళ్ళీ కలుస్తానోలేదో ఈ రాత్రికి ఆళ్ళ తోటలోకెళ్ళి రామసీతని కలవాలి. ఈ ఆలోచన మనసులో చాలా బలంగా వుండబట్టే ఈ ప్రోగ్రాము ఒప్పుకున్నాను.

బాగా చీకటి పడింది వూళ్ళో. ఇన్నోవా ఒకటి కాలవగట్టుదిగొస్తుంటే హోండా యాక్టివా సుబ్బారాయుడి గుడిమలుపు తిరుగుతుంది. ఒకప్పుడు వెలిగిన బ్రాకెట్ ఆదిరెడ్డిగారిల్లిప్పుడు భోరుమని ఏడుస్తా పడిపోడానికి సిద్దంగా వుంది.

మహేంద్ర ట్రాక్టర్ నడుపుకుంటా వస్తున్నాడు తేతలి రాము. పంచాయితీ సెంటర్ దాటి కుడిపక్కకి తిరిగితే ఆనాడు ఒకటే సందడిచేసిన చెల్లాయమ్మగారి మేడవుండేచోట ఖాళీస్థలం కనిపించింది. 'ఐతే ఆ మేడ కూలిపోయిందన్నమాట' అనుకుంటా బుచ్చిరాజు కిళ్ళీకొట్టు దగ్గర్నించి ఎడంపక్కకి తిరిగి పెద్దవీధీ, తూర్పు పేట రామాలయం. స్మశానం దాటితే...

నల్లటి చీకటి. ముందుకి, బాగా


నిజం లేదు

ఇటీవల అమెరికా సెక్స్ రాకెట్‌కు సంబంధించి తనపై వచ్చిన వదంతులపట్ల మొదటిసారి నోరు విప్పింది రెజీనా. తనకు సంబంధంలేని విషయాల్లో నిజానిజాలు తెలుసుకోకుండా వదంతులు లేపారంటూ ఆవేదన వ్యక్తంచేసింది.

ఇప్పటిదాకా ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నకు సుదీర్ఘంగా సమాధానం ఇచ్చింది.

"కొన్నింటికి స్పందించకపోవడమే గొప్ప స్పందనగా భావిస్తున్నాను. అసలు ఏమాత్రం నిజంలేని ఆరోపణలపట్ల అనవసరంగా నేనెందుకు స్పందించాలి. చేసే పనిలో నిజాయితీ ఉన్నప్పుడు ఇక, ఏ విషయం గురించీ ఆలోచించనవసరంలేదని పరిశ్రమకు వచ్చాక నేను నేర్చుకున్నాను" అని వివరించింది రెజీనా కసెండ్రా.





2014 నుండి అభివృద్ధి బాగానే జరుగుతోంది. కాని అభివృద్ధి ఫలాలు అందరికీ అందటంలేదు.

-అమర్త్యసేన్, నోబెల్ విజేత

ముందుకి నడుచుకుంటా వెళ్తుంటే ఒకటే గాలి. దారిపక్కనే బాతులోళ్ళ కేంపు, పొలంగట్లమీద పొడుగాటి తాడిచెట్లు ఇంకాస్త ముందుకెళ్తే ఆ చీకట్లోనే కనిపించింది ఆనాటి మల్లిడి దొరారెడ్డిగారి తోట.

ఆనాడా చీకట్లో చూసినట్టే వుందీ అదే దారి ఏం మారలేదు. ఎవరన్నా వున్నారా అని చూసుకుంటా వెళ్తున్నానుగానీ, నరమానవుడున్న అలికిడి లేదు.

అలా ముందుకి బాగా లోపలకెళ్తే కనపడింది ఆనాటి పాతకోట. కిటికీ దగ్గరకెళ్ళి తొంగిచూస్తే లోపలెక్కడో మిలుకు మిలుకుమంటా దీపం. అలాగ చాలాసేపు చూస్తావుండిపోయిన నేను ఎప్పటికో "సీతా" అన్నాను. సమాధానం లేదు.

"నేను సీతా అబ్బుని"

అంతే... ఘల్ ఘల్ మంటా దగ్గరైన మువ్వల పట్టాల చప్పుడు. పాతకాలం బర్మాటేకు తలుపులు చప్పుడు చేస్తా తెరుచుకోడంతో ఆ గుడ్డివెలుగులో నిలబడుంది సీత.

అడుగులో అడుగేసుకుంటా లోపలకెళ్ళేను.

రెప్పార్పకుండా, తలతిప్పకుండా, అసలేమాత్రం కదలకుండా నన్నే చూస్తుంది. అలా చూస్తానే "ఎన్నేళ్ళకి చూసేను నిన్ను... నాకు తెల్సు ఎప్పటికైనా నువ్వు వస్తావని" అంటుంది.

"ముసలిదానివై పోతావనుకున్నాను. అవ్వలేదు సీతా నువ్వు" అన్నాను.

"నువ్వయిపోయేవబ్బూ" అంటా నవ్వింది.

"ఇంట్లో ఎవరూ లేరా?" అన్నాను.

నవ్వేసిన సీత "మనకే ఇంతింత వయసులొచ్చేస్తే ఆళ్ళింకా ఎక్కడుంటారు?... ఎప్పుడో ఎళ్ళిపోయేరు" అంది.

"మరి మీ ఆయన చంద్రారెడ్డి?"

"నీతో నాకు సంబంధం వుందంటా, చిన్నప్పుడే నేను చెడిపోయేనంటా, నాకు నరకమంటే నరకం చూపించి ఎళ్ళిపోయి, ఎప్పుడన్నా వస్తుంటాడు"

"కరెంటేలేదు...ఏంటీ కిరసనాయిలు దీపాలు?"

"చంద్రారెడ్డి కరెంటుబిల్లుకట్టలేదని తీసేసేరు"

ఒంటరిగా వుంటున్న ఆ సీతనే చూస్తుంటే జాలేసింది "ఒంటరిగా వుంటున్నావు భయం వెయ్యటం లేదా?" అన్నాను.

"ఆ తోటలోనే పుట్టి పెరిగిన నాకు భయమేంటి" అంటా నా కళ్ళల్లోకే చూస్తా నాకు దగ్గరగా వచ్చి నన్ను దక్షిణంవేపున్న ఉయ్యాలబల్ల వేపు నడిపించుకుంటా తీసుకెళ్ళి కూర్చోబెట్టి "భోజనం చేశావా?" అంది. "లేదు" అన్నాను.

"అయ్యో వంట చేస్తాను" అంటా లేస్తుంటే వద్దంటా ఆపేను.

"భలేవోడివే ఉప్మా అన్నా చేస్తాను" అంటా వంటగదిలోకెళ్ళి ఐదు నిమిషాల్లో చేసేసి పళ్ళెంలోవేసి పట్టుకొచ్చింది. తింటుంటే మా గొప్పరుచి.

తన గుండెల్లో నా మీదున్న ప్రేమంతా ఈ ఉప్మాలో కలిపేసింది మరి.

ఆ ఉయ్యాల బల్లమీద తనపక్కనే కూర్చుని తింటున్న నా కాళ్ళు తీసి తన ఒళ్ళో పెట్టుకుంటా "నాకోసం ఆ బ్రాహ్మణరెడ్డిగారింటి దగ్గర్నుంచి నడుచుకుంటా ఇంతదూరం వచ్చేవా? కాళ్ళు లాగుతున్నాయి గదా?" అంటా వాటిని నొక్కుతా వుంటే ఆ సుఖం ఆ హాయి మామూలుగా లేదు.

ఉప్మా తినేసేకా తన చీరచెంగుతో నా మూతి తుడుస్తున్నప్పుడు జుట్టుని జూసి "తలకి నూని రాసి ఎన్నాళ్ళయింది?" అంది.

"గుర్తులేదు చాలా ఏళ్ళే అయ్యింది" అన్నాను.

"ఏం మనిషండి బాబూ" అంటా లోపలికెళ్ళి కొబ్బరినూనె తీసుకొచ్చి రాసింది. బాల్య స్నేహితురాల్ని వదిలెళ్ళడం నా వల్లగావటం లేదు.

"రేపొస్తాను సీతా" అన్నాను.

అదోలాగ నవ్వేసినా రామసీత "అంటన్నావు గానీ. ఈ జన్మకి రాలేవులే" అంది.

"అలాగనెయ్యొద్దు సీతా... రేపు పగలే వచ్చేస్తాను చూస్తుండు" అంటుంటే నవ్వేసిన సీత "వచ్చేవులే పేద్ద...ఇలా నా దగ్గరికిరా" అంటా నేనొచ్చేలోగా తనే వచ్చేసి మైమరిచిపోతా కౌగిలించుకుంది నన్ను.

బాదంచెట్టు కొమ్మలు ఒక్కసారిగా వూగడం మొదలెట్టాయి. రెండు పరజలు (ఒకరకం పిట్టలు) అరుచుకుంటా వెళ్ళిపోతున్నాయి.

ఇంతకు ముందెప్పుడూ ఎరగని హాయి... ఇంత అద్భుతమైన హాయిని పుట్టేకా ఎరగను. ఆ హాయిని అనుభవిస్తా అలాగే వుండిపోవాలనిపిస్తుంది.

"ఈరోజు కోసం ఎన్నేళ్ళనించి ఎదురుచూస్తున్నానో తెలుసా అబ్బూ... చాలు ఈ జన్మకి" అంటున్నా సీత గొంత జీరబోయింది పోను, పోను మూగబోయింది. కళ్ళనిండా నీళ్ళతో. ఊపిరెగబీలుస్తా వున్నా మనిషిని మెల్లగా ముద్దెట్టుకుని, మృదువుగా వదిలిపెట్టి ఆ ముదురు చీకట్లో నడుచుకుంటా ముందుకెళ్ళిపోయేను.

రామసీతని నాతోపాటు తీసుకెళ్ళిపోయి పెళ్ళి చేసుకుందామన్న నిర్ణయానికొచ్చేసేను. ఆ చంద్రారెడ్డొచ్చి ఏవన్నా అల్లరిచేస్తే వూరిపెద్దల మధ్య పెడదాం అనుకుని, అదే విషయం సీతతో మాటాడదామని బయల్దేరుతుంటే అప్పుడే కారుదిగిన త్రినాథరెడ్డి "ఎక్కడికెళ్తన్నావ్?" అన్నాడు.

"వెదురుపాక వేపు" అన్నాను.

"ఫంక్షన్ మధ్యాహ్నాంన్నుంచే మొదలైపోద్ది ఈ లోపలేవచ్చేస్తావుగదా... ఐనా నేనివేళ పనేం పెట్టుకోలేదులే నీకూడా వస్తాను పద" అన్నాడు.

విషయం రేపొద్దుటెలాగా పబ్లిక్కవుద్ది. అందులోకీ గొడవగానీ అయితే ఈ త్రినాథరెడ్డి అవసరం బాగా వుంటది గాబట్టి సరే రమ్మన్నాను.

బయల్దేరిన మా కారు మల్లిడిదొరారెడ్డిగారితోటలో కెళ్ళి ఆ కోటముందు ఆగగానే దిగిన నేను అక్కడ జరుగుతున్నది చూసి అలాగుండిపోయేను.

రెండు ప్రొక్లైనర్లు నేలమట్టం చేసేస్తున్నాయా కోటని.షాకయిపోయిచూస్తా "ఇదేంటీ!" అన్నాను.

"చంద్రారెడ్డి రాజమండ్రీలో ఎవరో రియల్ ఎస్టేటోళ్ళకి అమ్మేసేడిదంతా... ఆళ్ళు ప్లాటింగ్ చేసుకుంటున్నారు" అన్నాడు త్రినాథరెడ్డి.

"మరి లోపలున్న రామసీత?" అన్నాను.

"రామసీతా?... ఇంకెక్కడి రామసీత... తను చనిపోయి అయిదేళ్ళయింది గదా?"

"ఏంటీ!"

"అయిదేళ్ళ క్రితం ఇదే ఇంట్లో చనిపోయింది రామసీత. తను పోలేదు చంద్రారెడ్డే అనుమానిస్తా చంపేసేడని అనుకుంటారు మనూళ్ళో" అంటా ఇంకా ఏదో చెప్తున్నాడా త్రినాథరెడ్డి.

"వచ్చెయ్ నీ కోసమే చూస్తుంటాను. ఒకవేళ నువ్వొచ్చేలోగా నేను చచ్చిపోతే దెయ్యమై నీకోసం ఎదురుచూస్తుంటాను!" అన్న రామసీత మాటలు గుర్తుచేసుకుంటున్న నా కళ్ళల్లోంచి నాకు తెలియకుండానే వస్తున్నాయి కన్నీళ్ళు.



ఎంతో మారిపోయా

మిస్ ఇండియా పోటీ తనలో ఎంతో మార్పును తెచ్చిందంటున్నది రకుల్‌ప్రీత్‌సింగ్.

"మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నప్పుడు టైటిల్ గెలవడమే లక్ష్యంగా వుండేది. కాని, ఆ పోటీ నాలో ఎన్నో మార్పులు తీసుకువచ్చింది.నా ప్రవర్తన, మాట తీరు, ఆలోచనావిధానం అన్నీ మారిపోయాయి.

కొత్తవారితో కలిసి పనిచేస్తున్నప్పుడు చాలా నేర్చుకుంటాం. ఇప్పుడూ అంతే- కొత్త వ్యక్తులతో పనిచేస్తున్నప్పుడు,వాళ్ళను గమనిస్తూ,ఎంత కష్టపడాలో అర్థం చేసుకుని ముందుకు సాగుతుంటా" అని తెలిపింది.

హెల్త్ బిట్స్


Courtesy : HEALTH ACTION

కాంతితో చికిత్స

మనం ఎక్కడ వున్నా కాంతినుండి తప్పించుకోలేం. ఇంటి లోపలకంటే తక్కువ. ఇంటి బయట కాంతి అధికం. అవి రెండూ మనం నియం త్రించలేం. కాంతిని పరిమితంగా, మనం కోరుకున్న స్థాయిలో శరీరం మీద ప్రసరింపచేస్తే అది చికిత్సగా మార్గమవుతుంది.

అలా కాంతిని ఉపయోగించటాన్ని 'లైట్ థెరపీ' అని అంటారు.

ముఖ్యంగా మానసిక అనారోగ్యా లకు కాంతి ఒక చికిత్సా మార్గం. ఈ చికిత్సలో కాంతిని నేరుగా ముఖం మీద పడేలా చేస్తారు.

కాంతిని కళ్ళలో వెయ్యరు. ఒకచోట కూర్చుని కాంతిని 10-15 నిమిషాలపాటు ముఖం మీద వేస్తారు ప్రారంభంలో.

ఆ తర్వాత క్రమంగా దానిని 30-45 నిమిషాలకు పెంచుతారు.

ఇలా చేయటంవల్ల కుంగుబాటు లక్షణాలకు దూరం అవుతారు.

కాంతి ప్రభావం శరీరం మీద వుంటుంది. హార్మోన్ల ఉత్పత్తి ముఖ్యంగా మెలటోనిన్ స్థాయిని తగ్గించటం కాంతిద్వారా సాధ్యమవు తుంది. కాంతి ప్రభావాన శరీరం లోపల నడిచే 'జీవగడియారాన్ని' ప్రభావితం చెయ్యగలుగుతారు.

నిద్ర సమస్యలు, హార్మోన్ల సమ స్యలకు ఈ చికిత్సా విధానం తగినది అన్నది పెరుగుతున్న విశ్వాసం. ◆



శుక్లం తొలగిస్తే...

కంటికి వచ్చిన శుక్లాలను నిర్లక్ష్యం చెయ్యకండి. శుక్లం తొలగింపు చేసు కుని ఎక్కువ కాలం జీవించండి అంటున్నారు కంటివైద్యనిపుణులు. ముఖ్యంగా ఆడవారు, 70 సంవత్స రాలు దాటిన వారిని, శుక్లంతో బాధ పడుతున్నవారిని దాదాపు 75 వేల మందిని గుర్తించారు.

వీరిలో 41 వేలమందికి ఆపరేషన్ చేసి శుక్లాలను తొలగించారు.

శుక్లాల తొలగింపుతో మరణం దాదాపు 60 శాతం తగ్గింది. కంటికి, ఆయుర్దాయానికి సంబంధం ఏమి టన్న సందేహం కలగటం సహజం. అయితే కంటి చూపు మందగిస్తుంది శుక్లంతో. చూపు తగ్గితే ఇంటిలో వస్తు వులు సరిగ్గా కనపడక ప్రమాదాలకు గురవుతుంటారు. చూపు బాగుంటే ఆత్మస్థైర్యం వస్తుంది. అటూ ఇటూ తిరగగలుగుతారు.

కంటిచూపుకు భయపడి ఒకచోటు నుండి కదలక కొన్ని రకాల శ్వాస క్రియ, నాడీ సంబంధిత అనారోగ్యా లను కొనితెచ్చుకుంటారు.

చూపు సరిగ్గా లేక కింద పడి కాళ్ళు విరగ్గొట్టుకుంటారు. దీనితో ఆరోగ్యం దెబ్బతిని త్వరగా మరణిస్తారు. కంటి చూపుకి ఆరోగ్యానికి వున్న సంబంధం అది. అందుకే శుక్లాలు తొలగింపు అవసరం అంటారు. ◆


మీకు తెలుసా!

మెనూపాజ్ వయసు తగ్గుతోంది. సాధారణంగా మెనూపాజ్ వయసును 45 నుండి 55గా పరిగణిస్తారు.

అయితే ఇటీవల జరిపిన ఒక సర్వేలో భారతీయ మహిళలలో నాలుగు శాతం మహిళలు ఇరవై తొమ్మిది నుండి ముప్పై నాలుగేళ్ళ మధ్యలోనే మెనూపాజ్‌కి గురవుతుం డగా మరో ఎనిమిది శాతంమంది ముప్పై ఐదు నుండి ముప్పై తొమ్మిది ఏళ్ళలోనే ఆ స్థితికి చేరుతున్నారు.

ఇదంతా పట్టణీకరణ జీవన విధా నంతో వస్తున్న మార్పు అనేది పలు వురి అభిప్రాయం.

చిన్నవయసులోనే మోకాళ్ళ నొప్పులు, ఎముకల బలహీనత కని పిస్తున్నది మన దేశ మహిళలలో. ◆



మెడనొప్పి సమస్యా

సరైన పద్ధతిలో ఉపయోగించాలి శరీర భాగాలను. అలా కాక దుర్విని యోగం చేస్తే ఇబ్బందులు తప్పవు.

అలా వచ్చేదే మెడనొప్పి. ఎంతమేర మెడ వంచి ఎంతసేపు వుండవచ్చు అనేది కొందరు మరచిపోతే, మెడ పక్కకు వంచి కంప్యూటర్ దగ్గర, ఆఫీ సులో పనిచేస్తారు మరి కొందరు.

అలా చేసినందున వచ్చిన తల నొప్పుల నుండి బయటపడేందుకు భుజాన్ని రిలాక్స్‌చేసి తలను కుడి భుజం మీదికి బాగావంచి అరనిమిషం అలాగే వుంచండి.

ఆ తర్వాత అదే విధంగా రెండో వైపుకి తలను వంచండి. ఇలా నాలు గైదుసార్లు చేయండి.

అవసరమైతే చేతులతో పట్టుకుని మెడను పక్కకు సాగదీస్తున్నట్టుగా వంచండి. మెడను ముందుకు సాగి నట్టుగా వంచి కుడి ఛాతి మీదకు తీసుకువెళ్ళాలి.

అరనిమిషం తర్వాత అదే విధంగా ఎడమ ఛాతిమీదికి మెడను మెల్లగా సాగదీస్తూ వంచాలి. ఇలా నాలుగైదు సార్లు చెయ్యటంద్వారా మెడనొప్పి తగ్గుతుంది. అయితే మెడను సక్ర మంగా పొజిషన్‌లో వుంచటంమాత్రం మరచి పోవద్దు.

వేట

స్సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ భారత పర్యటనకివచ్చి రెండురోజులు అవుతోంది. రెండు దేశాల మధ్య అనేక ఒప్పందాలు కుదిరాయి.

రెండు దేశాల స్నేహం ఎలా పెరుగుతోందో, వ్యాపారం కూడా అలానే వృద్ధి చెందేలా అన్ని నిర్ణయాలు తీసుకున్నారు.

ఘనంగా చివరగా సౌత్ ఆఫ్రికన్ ప్రెసిడెంట్‌కు సిమ్లాలోని మంచు కొండల్లో వీడ్కోలు విందు ఏర్పాటుచేశాడు భారత ప్రధాని. ఆ ఏర్పాట్లన్నింటినీ తనే దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నాడు ధర్మేంద్ర.

భారత ప్రధానమంత్రి, సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ ఉదయాన్నే సిమ్లా వస్తారు.

మధ్యాహ్నం లంచ్ చేసిన తరువాత సిమ్లాకి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కుఫ్రీ చేరుకుంటారు. అక్కడ జరగబోతున్న ఇంటర్నేషనల్ స్కీయింగ్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం చేస్తారు.

ఆ తరువాత కాసేపు స్కీయింగ్ రిసార్ట్‌లో గడిపి సాయంత్రం చీకటి పడేలోపు వెను తిరిగి విమానంలో ఢిల్లీ చేరుకుంటారు.

వారి లంచ్ ఏర్పాట్ల దగ్గర నుండి ప్రయాణపు ఏర్పాట్ల వరకు ఏది ఎప్పుడు ఎలా జరగాలో నిర్దేశిస్తున్నాడు ధర్మేంద్ర. సౌత్ ఆఫ్రికన్ ప్రెసిడెంట్‌కి స్కీయింగ్ అంటే అంతులేని ఇంట్రెస్ట్ కావటంతో ఈ ప్రోగ్రామ్‌ని ఏర్పాటుచేశారు.

ఇద్దరు డిగ్నిటరీలు రోప్ వే మీద హైయ్యెస్ట్ పాయింటుకు చేరుకుంటారు. అక్కడ టోర్నమెంట్ ఆరంభ వేడుకలో పాల్గొని తిరిగి కిందకు దిగుతూ ఒక్కొక్క స్లోప్ దగ్గర ఆగుతారు.

జరుగుతున్న టోర్నమెంట్లో ఆటగాళ్ళ ప్రోగ్రెస్ చూస్తూ వెనక్కి తిరిగి వస్తారు.

వారిద్దరూ ఎక్కడెక్కడ ఆగే అవకాశం ఉందో ముందే ఊహించి వారిని కవర్ చేసేలా ముందే కమాండోలకు స్టేషన్ పాయింట్లు ఇచ్చాడు.

వారు అన్నిరకాలుగా తయారయ్యారు. అన్ని ఏర్పాట్లూ జరిగాయి. "ఇక మీరు వెళ్ళిరండి..." అన్నాడు ధర్మేంద్ర కమాండో యూనిట్‌తో.

"మరి మీరు?" అడిగారు వారు.

"ఇంత చలిలో ఈ సైపు తాగటంలో మజా

పుట్టగంటి గోపీకృష్ణ

(19)

జరిగిన కథ

అవినాష్ కోరికపై మౌర్య హోటల్లో అతని పేరున బుక్‌చేసివున్న రూమ్‌కి వెళ్ళి అవినాష్ పేరుమీద వచ్చిన కవర్‌ని తీసుకుంటాడు కుమార్. అతనితోపాటు సర్కార్ వుంటాడు.

ఆ కవరులోవున్న సింబల్, అంకెల గురించి ఫోన్‌లో అవినాష్‌కి చెబుతాడు కుమార్. పాకిస్తాన్ గూఢచారి డేవిడ్ పంపిన మెయిల్‌ని డికోడ్ చేస్తాడు అవినాష్.


తన ప్రాణాలకు తెగించి డేవిడ్ ఏదో సహాయం చేయాలనుకుంటున్నాడు. నీ వెళ్ళి అతన్ని కలవమని లక్ష్మికి చెబుతాడు అవినాష్.


ధర్మేంద్ర అణుబాంబును పేల్చాలనుకున్న కుట్ర గురించి చెప్పి అది ఫెయిలైంది కనుక ప్లాన్ బి అమలుచేసే ప్రయత్నంలో వున్నాడని లక్ష్మికి చెబుతాడు డేవిడ్.

గుడినుండి కారులో వస్తున్న ధర్మేంద్ర, తన డ్రైవర్ ప్లేస్‌లో వున్న అవినాష్‌ను చూసి అదిరి పడతాడు.

పోలీస్ వ్యాన్ వస్తుండటంతో అవినాష్ అక్కడినుండి తప్పించుకుంటాడు.

ఇక తర్వాత జరిగింది చదవండి.





ఉందోయ్. కాసేపు ఈ వెదర్‌ని ఎంజాయ్ చేసి వస్తాను. మీరు వెళ్ళిరండి..." కూరుకుపోతున్న కాళ్ళను మంచులోనుండి పైకి లాక్కుంటూ అన్నాడు ధర్మేంద్ర.

అందరూ వెళ్ళిపోయాక ఒంటరిగా నిలబడి పోయాడు ధర్మేంద్ర. అక్కడే ఉన్న ఒక పైన్ చెట్టుకు ఆనుకుని నిలబడి తన పైపు వెలిగించి ఆలోచనల్లో మునిగిపోయాడతను.

ఎటుచూసినా తెల్లటి మంచు శాంతికి ప్రతీకలా స్వచ్ఛంగా కనిపిస్తోంది.

అలాంటి తెల్లటి మంచుమీద ఎర్రటి రక్తపు మరకలు పడితే ఎలా ఉంటాయో ఊహిస్తున్నాడు ధర్మేంద్ర. తన ఇన్నాళ్ళ ప్రణాళికకు అంతిమ రూపు ఇవ్వాల్సిన సమయం వచ్చింది.

ధర్మేంద్ర తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చటంలో ఎప్పుడూ వెనకడుగు వేయలేదు.

ఆర్మీలో జనరల్‌గా పనిచేసినపుడు దేశాన్ని రక్షించటానికి ఎంతగా ప్రయత్నించాడో, ఇప్పుడు ప్రధానమంత్రికి నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్‌గా అంతే నిబద్ధతతో పనిచేస్తున్నాడు.

కానీ తన చిన్ననాటి స్నేహితుడు ప్రధానమంత్రి అవుతున్నాడు అంటే ఎంతో ఊహించుకున్నాడు ధర్మేంద్ర. ప్రధానమంత్రి ఆ పదవికి ఎన్నిక కాక ముందు ఇద్దరూ కలిసి ఈ దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళాలంటే ఏమేమి చెయ్యాలో ఎన్నెన్నో ప్రణాళికలు వేసుకున్నారు.

ఎవరూ ఊహించనట్లు తన స్నేహితుడు ప్రధాని అయ్యాడు. కానీ తాము అనుకున్న పని ఒక్కటే చెయ్యలేకపోతున్నాడు. దానికి కారణం ఏదైనా కానీ అతను కూడా ఒక మామూలు రాజకీయనాయకుడిలా మారిపోయాడు.

బయటకు తను నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ అయినా ఇద్దరూ సన్నిహితంగా ఉన్నపుడు మిగిలిన అన్ని విషయాల్లో ప్రధానికి సలహా ఇచ్చే చనువు ధర్మేంద్రకి ఉంది.

ఆ చనువుతోనే ప్రధానికి, అతన్ని అడ్డుపెట్టుకుని జరుగుతున్న అవినీతి చర్యల గురించి వివరించాడు. ప్రధానమంత్రి క్యాబినెట్‌లో ఉన్న మంత్రుల అవినీతి భాగోతాలను రుజువులతో సహా, ప్రధాని ముందు ఉంచాడు ధర్మేంద్ర.

"ఏమీ చెయ్యలేం ధర్మేంద్రా! నువ్వు చెప్పిందంతా నిజమే. కానీ ఈ రాజకీయనాయకులను ఎదిరించి ఏమీ చేయలేం. ఇంతకుముందు మనం అనుకున్నట్లు రాత్రికి రాత్రి ఈ దేశాన్ని బాగుచెయ్యలేం..." నిర్వేదంగా అన్నాడు ప్రధాని.

"ఇంతమంది అవినీతిపరుల మధ్య కూర్చుని నువ్వు మాత్రం ఏమి చెయ్యగలవు? అందుకే ఈ రుజువులన్నీ నీకిస్తున్నాను. వారందరినీ ఒక్క వేటుతో తొలగించు. ఈ రుజువులు చూశాక ఎవరూ ఎదురు తిరగటానికి ఉండరు" ప్రాధేయపడ్డాడు ధర్మేంద్ర.

"ఈ పదవిలోకి రాకముందు ఎన్నో అనుకుంటాం.

రాత్రికి రాత్రి దేశాన్ని మార్చే విప్లవం రాదు.

వీరందరినీ కాదనుకుంటే మరికొందరిని కూడ గట్టుకోవాలి. అప్పుడు వారు మాత్రం అవినీతిపరులు కాకూడదని ఏముంది? ఉన్న వనరులతో నెమ్మదిగా ముందుకు సాగటమే మన ముందున్న మార్గం..." చెప్పాడు ప్రధాని.

ప్రధాని పదవికి తన స్నేహితుడు లొంగిపోయాడని అర్థమయింది ధర్మేంద్రకి.

అతను కోపంతో రగిలిపోయాడు. ధర్మేంద్రకి కోపంవస్తే ఉచ్చనీచాలన్నీ మరచిపోతాడు.తనకోపాన్ని మొత్తం వ్యవస్థమీద చూపించబోయాడు.

ఈ రాజకీయ వ్యవస్థను మొత్తం ఒక్క వేటుతో తొలగించదలచుకున్నాడు. అందుకే న్యూక్లియర్‌బాంబ్‌ పేల్చి క్యాన్సర్‌లా తయారయిన రాజకీయ వ్యవస్థకు శస్త్రచికిత్స చేయాలనుకున్నాడు. అయితే అనుకోని కారణాలతో అది విఫలమయింది.

అది విఫలమయ్యాక కానీ తను చేయబోయిన పని ఎంత దారుణమయిందో అతనికి అర్థంకాలేదు. విధ్వంసం సృష్టించి తన కోపం ప్రదర్శించేకంటే తనే మార్పుకు ఎందుకు కారణం కాకూడదని అనిపించింది. అవును. ఈ ప్రధానమంత్రిని తొలగించి తనే ఎందుకు ప్రధాని కాకూడదు?

కానీ తనలాంటి రాజకీయాల్లో లేని వ్యక్తికి ప్రధాని అయ్యే ఛాన్సు ఎలా వస్తుంది? అప్పుడు అతనికి తన దగ్గర రాజకీయ నాయకులమీద ఉన్న అవినీతి రుజువులు గుర్తుకు వచ్చాయి. వాటి ద్వారా వారిని బ్లాక్‌మెయిల్ చేసి సచ్ఛీలుడయిన తను సరాసరి ప్రధాని కావచ్చు. తను చూపించే రుజువులు చూశాక ఏ మంత్రి కూడా తనకు పోటీ రాడు.

అందుకే అతను మొత్తం రాజకీయ వ్యవస్థను టార్గెట్‌చేయటం మాని... ప్రస్తుతం ప్రధానమంత్రిని హత్యచేయటానికి తన కుట్రని పరిమితం చేశాడు.

దానికి ముహూర్తం మరుసటి రోజుగా నిర్ణయించాడు. ఇంతలో ఒక కారు అటు వస్తూ అతనికి కనిపించింది. ఆ కారు సరాసరి వచ్చి అతను నిలబడిన ప్రదేశానికి దగ్గర్లో ఆగింది.



అందులో నుండి ఒక వ్యక్తి కిందకు దిగాడు.

ధర్మేంద్ర దగ్గరకు వచ్చి అతని పక్కన నిలబడి తను కూడా సిగరెట్ వెలిగించుకున్నాడు.

"అందరూ చేరుకున్నారా?" అని పక్కన నిలబడిన అతన్ని అడిగాడు ధర్మేంద్ర.

"మొత్తం నలుగురు"

"అందరూ ఒకే యూనిట్‌కి చెందినవారా?"

"అవును మౌంటెన్ ఎలైన్ కమాండో యూనిట్ షార్ప్ షూటర్లు. వారి గురి తప్పదు"

"రేపు ప్రధానమంత్రి, సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ కొండమీద హయ్యస్ట్ పాయింటు నుండి కిందకు దిగివచ్చే సమయంలో నాలుగు ప్రదేశాల్లో ఆగుతారు. ఆ ప్రదేశాల నుండి స్కీయింగ్‌చేసే వాళ్ళ విన్యాసాలు స్పష్టంగా కనిపిస్తాయని అవి సెలెక్ట్ చేశాను.

మామూలు జనాలు గుమిగూడే ప్రదేశాలకు కొద్దిగా దూరంగా వాటిని ఉండేలా జాగ్రత్త తీసుకున్నాను" అంటూ ఒక మ్యాప్ తీశాడు ధర్మేంద్ర.

"ఇది స్లోప్ నెంబర్ ఏడు. ఇక్కడ వారు ఆగుతారు. ఆ తరువాత స్లోప్ నెంబర్ పదకొండు, పదమూడు, పదహారుల్లో కూడా ఆగుతారు.

ఆ నాలుగు ప్రదేశాల్లో నలుగురు షార్ప్ షూటర్లను ఉంచు. మావాళ్ళ నుండి వాళ్ళకు ఇబ్బందులు రావు. ఎందుకంటే వారిని వేరే ప్రదేశాల్లో మోహరిస్తున్నాను. సరేనా?"

"సరే..."

"ఏ మాత్రం పొరపాటు జరగకూడదు" అయిపోయిన పొగాకు పైపు నుండి వదిలిస్తూ అన్నాడు ధర్మేంద్ర.

"మామీద నమ్మకం ఉంచండి" అని చెప్పాడు ఎదుటి వ్యక్తి.

"ఇప్పుడయినా మించిపోయింది లేదు. పోలీసుల దగ్గరకు వెళ్ళి ఆ ధర్మేంద్ర చేసిన దుర్మార్గాల గురించి చెప్పేద్దాం..." అంది లక్ష్మి.

"పోలీసులు కాదు కదా, ఏ అధికారి కూడా మన మాటలు నమ్మడు" చెవులకు ఉన్న ఇయర్ ఫోన్స్ తీసి అన్నాడు అవినాష్.

"ఇయర్ ఫోన్స్ తగిలించుకుని ఏం చేస్తున్నావ్?" అడిగింది లక్ష్మి.

"ఎఫ్.ఎమ్. రేడియోలో వార్తలు వింటున్నాను"

"ఇప్పుడు మనం ఏం చెయ్యాలి. ఇలా ఖాళీగా కూర్చుంటే ఆ ధర్మేంద్ర తను చేయాల్సింది చేసేస్తాడు" అంది లక్ష్మి.

"ముందు మనం సిమ్లా వెళ్ళాలి"

"అక్కడకి ఎందుకు?"

"ఎందుకంటే ఇప్పుడు ధర్మేంద్ర అక్కడే ఉన్నాడు కాబట్టి. రేపు భారత ప్రధానమంత్రి, సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ అక్కడకు వెళ్ళబోతున్నారు. దానికి కావలసిన ఏర్పాట్లుచూడ్డానికి అతను అక్కడే ఉన్నాడు"

"ఇలా ఇక్కడ ఏ పనీ లేకుండా కూర్చునేకంటే అదే నయం..." అంది లక్ష్మి.

ఇద్దరూ ఫ్లాట్‌కి తాళంవేసి బయటకు వెళ్ళిన పది నిమిషాలకు సునీల్ సర్కార్ టీమ్ ఆ ఫ్లాట్‌ని చుట్టుముట్టారు. ఫ్లాట్‌కి తాళం వేసి ఉండటంతో తాళం పగులగొట్టి లోపలకు నడిచాడు సునీల్ సర్కార్.

లోపల ఎవరూ లేరు.

గ్యాస్‌స్టవ్ బర్నర్‌మీద చెయ్యి పెట్టి

ప్రజలకు భావస్వేచ్ఛ వుండాలి. చర్చల్లో, సంప్రదింపుల్లో వారు పాల్గొనాలి. ఆ లక్షణాలుంటేనే అది మంచి పాలన. -మురళీమనోహర్ జోషి, బి.జె.పి. నేత

చూస్తే అది ఇంకా వేడిగా ఉంది.

"షిట్... జస్ట్ మిస్సయ్యాం" అన్నాడు సునీల్ సర్కార్.

"వాళ్ళు ఇక్కడ ఉన్నారని మీకు ఇంత ఖచ్చితంగా ఎలా తెలిసింది" అడిగాడు అతని పక్కన ఉన్న వ్యక్తి.

"ఊర్లో ఉన్న ట్యాక్సీ డ్రైవర్లందరికీఅవినాష్,లక్ష్మి ఫోటోలు ఇచ్చాను. వారిద్దరిలో ఎవరు కనిపించినా తెలియచేయమని చెప్పాను. ఆ లక్ష్మి ఊరి బయట ఉన్న ఒక చర్చ్‌కి వెళ్ళి వెనక్కి వచ్చింది"

"ఆ అమ్మాయి పేరు లక్ష్మి అయితే చర్చికి ఎందుకు వెళ్ళింది?"

"ఇప్పుడు అదా ముఖ్యం? చర్చి నుండి వెనక్కి వచ్చేటప్పుడు ఆమె ఎక్కిన ట్యాక్సీ డ్రైవర్ కాస్త స్మార్ట్ ఫెలో. మనమిచ్చిన ఫోటోలో అమ్మాయే తన ప్యాసింజర్ అని గుర్తించాడు"

"ఆ అమ్మాయి అంత అజాగ్రత్తగా ట్యాక్సీ ఎక్కి ఈ ఫ్లాట్ దగ్గర దిగిందా?"

"లేదు.ఆ అమ్మాయి తన జాగ్రత్తలో తను ఉంది. మార్కెట్ దగ్గర దిగి ఇక్కడ వరకు నడిచి వచ్చింది. కానీ మన ట్యాక్సీ డ్రైవర్ స్మార్ట్ అనిచెప్పాను కదా. ఆ అమ్మాయిని ఫాలో అయ్యి ఈ ఫ్లాట్ అడ్రస్ తెలుసుకున్న తర్వాత మనకి ఫోన్ చేశాడు"

ఇంతలో ఫ్లాటంతా వెతుకుతున్న ఒక వ్యక్తి, "సార్ ఇది చూడండి..." అంటూ ఒక మ్యాప్ తెచ్చి సునీల్ సర్కార్‌కి ఇచ్చాడు.

అది సిమ్లా మ్యాపు. దానిమీద కొన్ని పాయింట్లు ఎర్ర ఇంకుతో గుర్తుపెట్టి ఉన్నాయి.

"మైగాడ్! వీళ్ళు సిమ్లాలో ఏదో చెయ్యబోతున్నారు" అన్నాడు సునీల్ సర్కార్.

"సిమ్లాలోనా? అక్కడేం చేస్తారు?"

"ఇడియట్. రేపు మన ప్రధాన మంత్రి, సౌత్ఆఫ్రికా ప్రెసిడెంట్‌తో కలిసి సిమ్లా వెళ్తున్నాడు. వీళ్ళు కూడా అక్కడకు అర్జంటుగా బయలుదేరారు అంటే...?" అన్నాడు సునీల్ సర్కార్. ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

ఆ తరువాత క్షణాల్లో అందరూ బయటకు పరుగెత్తారు.

సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ ఉడుంబే చేతుల మీదుగా సిమ్లా పక్కన ఉన్న కుఫ్రీలో కొండమీద స్కీయింగ్ టోర్నమెంట్ ఓపెనింగ్ జరిగింది. ఆ తరువాత భారత ప్రధానమంత్రితో కలిసి కాసేపు కబుర్లు చెప్తూ గడిపాడు ఉడుంబే.

ఇంతలో ఒకరొకరుగా స్కీయర్లు తమ విన్యాసాలు చూపించటానికి తయారవుతున్నారు. కుఫ్రీలో మొత్తం పదహారు స్లోపులు ఉన్నాయి. దాదాపు నాలుగున్నర కిలోమీటర్ల దూరంలో ఈ స్లోపులు ఉంటాయి. ఒకదానికొకటి సంబంధంలేని ఈ స్లోపుల్లో తమని బ్యాలెన్స్ చేసుకుంటూ ఎవరు ఎంత త్వరగా కిందకు దిగి వస్తారన్న దానిని బట్టి పాయింట్లు ఉంటాయి.

స్లోపుల్లో స్కీయర్లు చేసే విన్యాసాలు చూడటానికి వీలుగా రోప్‌వే ఉంది. దానిలో కిందకు దిగుతూ రెండు దేశాల నాయకులు మధ్యలో అక్కడక్కడా ఆగి జరుగుతున్న టోర్నమెంటును చూడటానికి అధికారులు ప్లాన్ చేశారు.

అలా వారు ఆగే ప్రదేశాలను తనే సెలక్ట్ చేసిన ధర్మేంద్ర ఆ మలుపుల్లో నలుగురు షార్ప్ షూటర్లను ఏర్పాటు చేశాడు. ధర్మేంద్ర ఆ ఇద్దరు నాయకులకు కొద్దిగా వెనుక ఉండి అన్ని విషయాలనూ పర్యవేక్షిస్తున్నాడు.

అతనే ప్రధాన మంత్రికి హానిచేస్తాడని ఎవరూ కలలో కూడా ఊహించలేరు కాబట్టి అతను తను అనుకున్న ప్లాను అనుకున్నట్లు అమలుచేస్తున్నాడు.

ఇద్దరు నాయకులు లేచి బయలుదేరారు.

వారిని రోప్‌వే వైపు నడిపించాడు ధర్మేంద్ర.

హయ్యెస్ట్ పాయింటు నుండి కిందకు ప్రయాణిస్తున్న రోప్‌వే బాక్స్‌లో ఇద్దరు నాయకులు, ధర్మేంద్ర తప్ప ఎవరూ లేరు.

కావాలనుకుంటే ఇప్పుడు భారత ప్రధానమంత్రిని అవలీలగా ఒక్క బుల్లెట్‌తో చంపగలడు ధర్మేంద్ర. కానీ, ఆ తరువాత తనే ప్రధాని కావాలన్న అతని లక్ష్యం నెరవేర్చుకోవటం కుదరదు. అందుకే ఇంత సెటప్ అవసరం అయ్యింది.

> తెలుగువారు చక్కని సంస్కృతి,ఆధ్యాత్మికచింతన కలిగినవారు. దేశ ప్రగతిలో వారి పాత్ర ఎనలేనిది.
> -జస్టిస్ బి.రాధాకృష్ణన్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి





పాత్ర మారింది

తన రాబోయే కామెడీ సినిమా గురించి రిచా పనయ్ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నది. 'రక్షక భటుడు' తారను కదిలిస్తే, ఎన్నో కబుర్లు విప్పింది. "నేను యాడ్ ఏజెన్సీ ఓనర్‌గా నటించాను. ఇటువంటి పాత్ర పోషించడం ఇదే తొలిసారి.

ఇంతకు ముందు గ్రామీణ యువతిగా బబ్లీ పాత్రలో పోషించాను. ఈసారి నా పాత్ర పూర్తిగా మారిపోయింది.

విభిన్న షేడ్స్‌ను వెల్లడిస్తుంది. దర్శకుడు శ్రీధర్ సీపన సెట్స్‌లో ఎన్నో నేర్పించారు. సులువుగా చేయగల సౌకర్యం కల్పించారు. నా నిజజీవితానికి భిన్నమైన పాత్ర"అంటూ గడగడా ఊదరగొట్టేసింది రిచా పనయ్.

దశదిశలా నవ్వులు కురిపించే

కామెడీ కథల పోటీ





ఒక్కో కథకి నజరానాగా ₹10 వేలు బహుమతి

అలా పది కథలకు లక్ష రూపాయల బహుమతులు

నవ్వగలిగిన ఏకైక ప్రాణి మనిషి ఒక్కడే! నవ్వు మానవజాతికే గొప్ప వరం. 'నవ్వు, నవ్వించు' అన్నారు. నవ్వు ఓ గొప్ప టానిక్. శరీరంలో ఎక్కడ నలతగా వున్నాసరే, నవ్వితే ఆ నొప్పి తగ్గుతుందనేది ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయవేత్తల పరిశోధనల్లో తేలింది. అందుకే నవరసాలలో ఒకటైన నవ్వును అందరికీ పంచేందుకే ఈ కామెడీ కథల పోటీ. ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచే ఈ ఛాలెంజీ పోటీలో రచయిత(త్రు)లందర్నీ పాల్గొనవలసిందిగా కోరుతున్నాం.

: నిబంధనలు :

మీ కామెడీ కథ, స్వాతి సపరివార పత్రికలో బొమ్మతో సహా, ప్రచురణలో రెండు పేజీలుమాత్రమే రావాలి.అనగా మీ వ్రాతప్రతి **ఆరు అరఠావులకు** మించకుండా వుండాలి. కాగితానికి ఒకవైపున మాత్రమే రాయాలి. ప్రతి అరఠావుకు సుమారుగా ఇరవై ఐదులైన్లు ఉండాలి.

ప్రచురణకు తీసుకున్న ప్రతి కథకు ₹2000

1. కామెడీ కథలఎంపికలో స్వాతి సంపాదకునిదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు. ఈ పోటీ గడువు తేదీని పొడిగించేందుకుగానీ, పోటీని రద్దు చేసేందుకుగానీ, స్వాతి పబ్లికేషన్స్ యాజమాన్యానికి సర్వహక్కులూ ఉన్నాయి. 2. అనువాదాలూ, అనుకరణలు, ఇతర పత్రికలకి పంపబడి పరిశీలనలో ఉన్న రచనలను పంపవద్దు. 3. కామెడీ కథలు తమ స్వంతమే అని, అముద్రితమని, తమ స్వదస్తూరితో రాసిన హామీపత్రాన్ని విధిగా జతపరచాలి. 4. బహుమతి యోగ్యం కానివాటిని సాధారణ ప్రచురణకు తీసుకునే హక్కు మాకుంది.

5. ప్రచురణార్హం కాని కథలను తిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవరు జతపరచాలి. 'కామెడీ కథల పోటీ'కి అని కవరుమీద స్పష్టంగా రాయాలి.

మీ కామెడీ కథలను- ఎడిటర్, స్వాతి సపరివార పత్రిక, అనిల్ బిల్డింగ్స్, సూర్యారావుపేట, పోస్ట్‌బాక్స్ 339, విజయవాడ 520 002కు పంపాలి

కామెడీ కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ : 10.8.2018

రోప్‌వే ఆగింది. ముందుగా దానినుండి కిందకు దిగిన ధర్మేంద్ర ఇద్దరు నాయకులకు దారి చూపిస్తూ స్లోప్ నంబర్ ఏడు వైపు నడిచాడు.

అక్కడనుండి చూస్తుంటే ఎత్తునుండి దూసుకు వస్తున్న ఆటగాళ్ళు కనిపిస్తున్నారు. లాఘవంగా మెలికలు తిరుగుతూ ఒకరి తరువాత ఒకరు దూసుకు వస్తున్నారు. నాయకులు ఆటగాళ్ళను చూస్తుంటే ధర్మేంద్ర పరిసరాలను పరీక్షిస్తున్నాడు.

ఒకపక్క ధర్మేంద్రకి చాలాసేపటి నుండి షైపు పీల్చకపోవటంతో ఏర్పడిన చిరాకు తలనొప్పిగా మారుతోంది.రెండుదేశాల డిగ్నిటరీలను ఎదురుగా పెట్టుకుని షైపు వెలిగించే ధైర్యం అతను చేయలేకపోయాడు.

చుట్టూ తెల్లటి పరదా కప్పినట్లు ఎటు చూసినా మంచు. మధ్యలో అక్కడక్కడా నిటారుగా పెరిగిన పైన్ వృక్షాలు.

అయిదారు నిమిషాలయినా తను నియమించిన షార్ప్ షూటర్ ఎక్కడ ఉన్నాడో ధర్మేంద్ర పసిగట్టలేకపోయాడు. ఇలాంటి పనులు చేసే కమాండోలు మంచు ఉన్న పరిసరాల్లో ఎవరికీ కనపడకుండా పూర్తి తెల్లటి డ్రెస్ వేసుకుంటారు.

అందుకే వారిని ఈ పరిసరాల్లో గుర్తించటం అసాధ్యం. అయిదారు నిమిషాలు గడిచినా అతను ఎదురు చూసిన రైఫిల్ షాట్ వినపడలేదు. ఇద్దరు నాయకులు తిరిగి రోప్ వే వైపు నడుస్తున్నారు.

తప్పక తను కూడా వారికంటే ముందు నడిచి రోప్ వే ఎక్కాడు ధర్మేంద్ర.

అదే సమయంలో మొదటి షార్ప్ షూటర్ ఉండాల్సిన ప్రదేశానికి చేరుకున్నాడు సునీల్ సర్కార్. అతనికి గత కొన్ని నిమిషాల్లో తెలిసిన విషయాలు జీర్ణం చేసుకోవటానికి మనసు నిరాకరిస్తోంది.



అయినా తన ధర్మం నిర్వర్తించాలి కాబట్టి తన ఆలోచనలను పక్కనపెట్టి వేగంగా మొదటి షార్ప్ షూటర్ కోసం వెతికాడు. ఎక్కువ వెతకనవసరం లేకుండానే వెతుకుతున్న వ్యక్తి కనిపించాడు.

అయితే అప్పటికే అతని స్పృహ తప్పి ఉంది. అతన్ని అదుపులోకి తీసుకుని రెండవ షార్ప్ షూటర్ కోసం వెతుకుతూ బయలుదేరాడు సునీల్ సర్కార్. రోప్ వే ఆగిన ఏ ప్రదేశంలో కూడా ధర్మేంద్ర ఎదురు చూసిన రైఫిల్ షాట్ వినపడలేదు.

ఆఖరుగా స్లోప్ నంబర్ పదహారు దగ్గర ఆగారు ఇద్దరు నాయకులు.

ధర్మేంద్ర మనసులో తన ఈ ప్రణాళిక కూడా ఎక్కడో బెడిసికొట్టిందన్న ఆలోచన మొదలయింది. అయినా ఆశ చంపుకోలేక చుట్టూ చూశాడు.

దూరంగా తెల్లటి మంచుగుట్టలా ఉన్న ప్రదేశంలో ఒక సన్నటి నల్లటి చార కనిపించింది. మరింత పరీక్షగా చూస్తే అది దాక్కున్న ఒక మనిషి ఆనవాలు అని అర్థం అయింది. నల్లటి వస్తువు రైఫిల్ బ్యారెల్ అని కూడా అర్థం అయింది. కానీ..ఆ రైఫిల్‌లో కదలికలేదు. అది పేలే సూచన కూడా కనపడటంలేదు.

ఇంతలో ఇద్దరు నాయకులు రోప్ వే వైపు వెళ్ళారు. అయితే ఈసారి ధర్మేంద్ర వారిని అనుసరించలేదు. అతను లేకుండానే వారిద్దరు రోప్ వే ఎక్కి తదుపరి డెస్టినేషన్ వైపు వెళ్ళిపోయారు.

ఇంకా ఉంది

కాంగ్రెస్ పూర్వ వైభవంకోసం పోగొట్టుకున్నచోటే వెతుక్కోవాలన్నది లక్ష్యంగా పర్యటిస్తున్నాను.

-ఊమెన్ చాందీ, ఎ.పి. కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్

ఫర్ U

వెబ్‌సైట్ రీడింగ్

ఈ మధ్యకాలంలో ప్రింట్‌లో చదివేవారి శాతం తగ్గిపోతున్నది. వార్తా పత్రికల్ని సైతం డిజిటల్‌లో వెబ్‌సైట్లలో చదివేస్తున్నారు.

అయితే, వెబ్‌సైట్లలో చదివేవారితో పోల్చితే కథలు, కథనాలు, విషయాలు, ప్రధాన అంశాలు ప్రింట్ మీడియాలో చదివితే బాగా గుర్తుంటాయని అధ్యయనాల్లో గుర్తించారు.

ఆన్‌లైన్‌లో చూసినప్పుడు వాణిజ్య ప్రకటనలు, అనుసంధాన విషయాలు, ఇ-మెయిల్స్‌వంటివి అనేకముంటాయి. మామూలు పేపర్లతో పోల్చితే వెబ్ పేజీలు మానసికంగా చిందరవందర, గందరగోళానికి కారణం అవుతుంటాయి. అంతే కాదు- పరోక్షంగా మరో ప్రమాదమూ వుంది.

ఆన్‌లైన్ రీడింగ్ ఇంటర్నెట్ టెంప్టేషన్‌కూ దారితీసి, సమయాన్ని అనవసరంగా వృధాపుచ్చగలదు. ◆

బహుప్రయోజనకారి

చిలకడదుంపలు తినడంవల్ల అనేక ప్రయోజనాలు దక్కుతాయి. డయాబెటిస్, స్థూలకాయం, గుండె సంబంధిత రుగ్మతలను తగ్గించడంలో ఉపకరిస్తుంది. ముఖ్యంగా బరువు తగ్గించడంలో సాయపడుతుంది.

శరీరంలోని అదనపు కొవ్వులను కరిగించడంలో, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును తొలగించడంలో ఉపయోగకరమైనది. శరీరానికి అవసరమైన పోషకాలు వీటిలో వుంటాయి.

రోగనిరోధకశక్తిని పెంపొందిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పీచు అధికంగా వుంటుంది కాబట్టి మలబద్ధకాన్ని దూరం చేయగలదు. రాత్రి భోజనంలో చిలకడదుంప తింటే మంచిది. అయితే వాటిని ఉడకబెట్టి లేదా గ్రిల్‌చేసి తినవచ్చు. ◆



Courtesy : VANITHA

Keep your eyes, ears and minds open. You will learn a lot.

అల్లం టీ

టీలో అల్లం వేసుకుని తాగడంవల్ల అనేక ప్రయోజనాలున్నాయి. రక్త ప్రసరణ మెరుగవుతుంది. రక్తనాళాల్లోని అడ్డంకులు తొలగిపోయి, గుండె ఆరోగ్యం బావుంటుంది. అలసటగా వున్నప్పుడు ఓ కప్పు అల్లం టీ తాగడంవల్ల చురుకుదనం కలుగుతుంది.

అల్లంలోని జింజిబర్ అనే పదార్థం హానికర బ్యాక్టీరియాను నశింపజేసి,జీర్ణ వ్యవస్థను, ఇన్‌ఫ్లమేషన్ వల్ల కలిగే నొప్పులు, మంటలు,దురదలను తగ్గించడంలో ఉపకరిస్తుంది.

కీళ్ళు, కండరాల నొప్పునుంచి పరిరక్షించే గుణం వుంటుంది. ◆

ఉపవాసం ఓకే

ఉపవాసం మంచిదే. శాస్త్రీయంగా అనేక పరిశోధనలు ఈ విషయాన్ని రుజువు చేశాయి కూడా. కొత్త పరిశోధనల్లో మరిన్ని విషయాలు గుర్తించారు. కొద్ది సమయం నిరాహారంగా వుండడం వల్ల పేవుల్లోని మూలకణాల పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది.

ఈ మూలకణాల సామర్థ్యం తగ్గితే ఉదర సంబంధిత ఇన్‌ఫెక్షన్ల నుంచి కోలుకోవడం కష్టం. వయస్సు పెరిగేకొద్దీ సహజంగానే వీటి ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంటుంది.

ఉపవాసం చేసినప్పుడు వీటి పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. ◆

సర్వరోగ నివారిణి

అరటిపండు వల్ల కలిగే ప్రయోజనాలు అనంతం. వీటిలో ప్రొటీన్లు, ఐరన్, మెగ్నీషియం, ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ప్రతిరోజూ అరటిపండు, పాలు తీసుకుంటుంటే అనేక ప్రయోజనాలు దక్కుతాయి.

మలబద్ధకం, గ్యాస్ సమస్యలు వుండవు. వీటిలోని పీచు జీర్ణక్రియకు సహకరిస్తుంది.పెరుగులో అరటిపండు కలుపుకుని రెండు, మూడు రోజుల పాటు ఉదయాన్నే తింటుంటే నాలుకపై పుండ్లు తగ్గిపోతాయి.

ఏడెనిమిది రోజులపాటు పాలు, అరటిపండు తీసుకుంటుంటే నరాల బలహీనతనుంచి ఉపశమనం లభిస్తుంది. రక్తపోటుగలవారు ప్రతిరోజూ అరటిపండు తింటుండాలి.

దీనివల్ల రక్తంలో వ్యర్థాలు తొలగిపోయి, రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఒత్తిడిగా,కంగారుగా ఉన్నప్పుడు బాగా పండిన అరటిపండులో యాలకుల పొడి కలిపి తీసుకుంటే ప్రశాంతంగా ఉంటుంది.

దీర్ఘకాలిక వ్యాధులు ఏమైనా ఉన్నప్పుడు అరటిపండు, పాలు, జీరలు తయారుచేసుకుని రోజూ ఉదయం, సాయంత్రం భోజనం తర్వాత తీసుకుంటుంటే ఉపశమనంగాఉంటుంది. రాత్రి సమయంలోకంటే ఉదయంవేళ తీసుకుంటే మంచిది. ◆

సుఖనిద్ర

నిద్ర వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఎంత చెప్పుకున్నా పెద్దజాబితా ఉంటూనే ఉంటుంది. విషయాలను తరచూ మర్చిపోతూ వుంటే చాలినంత నిద్రపోవడంలేదని అర్థం.

నిద్రలో అవయవాలన్నీ విశ్రాంతిగా వుంటాయి. మెదడు తన పని చేసుకుంటూ పోతుంది.

నిద్ర సరిగ్గా పోకపోతే ఈ ప్రక్రియ కొనసాగదు. అప్పుడు జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుంది. అలాగే చాలినంత నిద్ర లేకపోతే బరువు పెరుగుతారు.

నిద్ర చక్కగా పోవడంవల్ల ఆకలిని, ఎక్కువ క్యాలరీలు తినాలన్న కోరికను కలిగించే హార్మోన్లను నియంత్రణలో ఉంచుతుంది. నిద్ర లేనప్పుడు ఈ నియంత్రణ సాధ్యపడదు.కాబట్టి వేళ ప్రకారం నిద్రించాలి.

వారఫలం

జూలై 26 నుండి ఆగష్టు 1, 2018 వరకు

పిడపర్తి వీరేశ్వరశాస్త్రి, పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్యశాస్త్రి
సెల్ : 94921 56064



మేషం: అశ్విని, భరణి, కృత్తిక 1వ పా. ఈ వారంలో వృత్తి, ఉద్యోగ విషయకంగా తొందరపాటుతనం ఉండకుండా సాగండి. సంతానపు అవసరాలను తీర్చుట వంటివి ఉంటాయి. ఆరోగ్య విషయకంగా స్వల్ప జాగ్రత్తలు వహించండి. ఆర్థికంగా ప్రయోజనాలు బంధుమిత్రులనుండి అదనంగా ఏర్పడగలవు. నిరుద్యోగులకు మంచి సమయం. ఈ రాశివారికి శుక్ర, శని, ఆది, సోమవారాలు అనువైనవి.



వృషభం: కృత్తిక 2, 3, 4పా, రోహిణి, మృగశిర 1, 2 పా. వారారంభంలో అష్టమ చంద్రునిచే అన్నిటా చిన్నతరహా ఒత్తిడులను ఎదుర్కోవలసి వచ్చినా శనివారంనుండి ప్రయోజనాలను ఏర్పరచుకోగలరు.రానివాటికై చేయు యత్నాలందు లౌక్యాలు పాటించుకోండి. ఆర్థికంగా ప్రయోజనాలను ఇచ్చు పనులను చేపట్టుకోగలరు.వృత్తి, ఉద్యోగాలందు మీ ఆలోచనలకు గుర్తింపులేర్పడతాయి. పూర్వమందు నిలచిన విదేశీ వ్యవహారాలు వంటివి పూర్తికాగలవు. అనారోగ్యాలు తగ్గుతాయి. ఈశ్వరారాధాన తప్పనిసరిచేయండి- ఉత్తమ ఫలితాలు ఏర్పడతాయి. ఈ రాశివారికి ఆది, సోమ, బుధవారాలు అన్ని పనులు చేపట్టుటకు చాలా అనువైనవి.



మిథునం: మృగశిర 3, 4పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా. శుక్ర, శని వారాలందు అష్టమ చంద్రదోషమైన చంద్రమంగళ యోగంచే మంచి భోజన వసతులు, విశేష వాహనయానములు కొందరికి ప్రతికూలాంశాలు తగ్గుట వంటివి ఉంటాయి. గ్రహణమున చూడక గ్రహణ శాంతికి,శివాలయ అభిషేకాలకు ప్రాధాన్యతనీయవలసి ఉంటుంది. దీర్ఘకాలిక ప్రయోజనాలను ఏర్పరచు పనులను ఈ వారం వాయిదా వేయుట మేలవ్వగలదు. మీ బాధ్యతలను ఇతరులకు అప్పగించకండి.



కర్కాటకం: పునర్వసు 4వ పా, పుష్యమి, ఆశ్లేష. వారారంభంలో మీకు ఉత్సాహంగా ఉండుటయేకాక, మేలునివ్వగలవు. సమర్థతను చాటుకునేందుకు అవకాశాలు ఏర్పడతాయి. ఇతరులకు సహకరించగల్గుతారు.వాహన, గృహ వసతులకై చేయు యత్నాలు ఉపకరిస్తాయి.ఆరోగ్య పరిరక్షణా చర్యలు అవసరమవ్వగలవు. వృత్తి, వ్యాపారాలందు స్వయంపర్యవేక్షణలు అవసరం. ఆదిత్యారాధన తప్పనిసరి చేయండి.



సింహం: మఘ, పూర్వఫల్గుని, ఉత్తరఫల్గుని 1వ పా. పట్టుదలలతో వ్యవహరించుకోవలసి ఉంటుంది. స్వయంకృషితో వ్యవహరించుకోవాలి. ఆదాయం సంతృప్తికరం. ఖర్చులందు ఏకాగ్రతలు అవసరం. పనులను విజయవంతంగా పూర్తిచేయగలరు. గృహంలో కొన్ని మార్పుచేర్పులకు శ్రీకారం చుట్టగలరు. ఆదిత్య, దుర్గారాధనలు ఉపకరిస్తాయి. ఈ రాశివారికి శుక్ర, శని, ఆది, సోమవారాలు అనువైనవి.



కన్య: ఉత్తరఫల్గుని 2, 3, 4పా, హస్త, చిత్త 1, 2పా. లాభమందు బుధా దివ్యయోగంచే ఈ వారం అనుకూలదాయకమైనది. అవకాశాలు కలిసివస్తాయి. నూతన బాధ్యతలు స్వీకరించు సూచనలు గలవు. గురుబలంచే ఆదాయం సంతృప్తికరం. శుభకార్య వ్యవహారాలందు ఉత్సాహంగా వ్యవహరించుకోగలరు. వృత్తి, ఉద్యోగాలందు అధికారులను మెప్పించగల్గుతారు. చెల్లింపులు, అకౌంట్స్ వంటి విషయాలందు ముందు జాగ్రత్తలు తప్పనిసరిచేయండి. ఇతరులను విశ్వసించి పెట్టుబడులుంచకండి. ఆది, సోమ, బుధవారాలు అనువైనవి. ఈశ్వరారాధనలు మేలు.



తుల: చిత్త 3, 4పా, స్వాతి, విశాఖ 1, 2, 3పా. ఈ వారంలో ఏర్పడు గ్రహణం మీరు చూడకూడదు. శనివారం తప్పనిసరి శివాలయ దర్శన, అభిషేకాదులకు ప్రాధాన్యతనీయండి. ఖర్చులు, ఆదాయాలు సరిసమానంగా ఉంటాయి. కొత్త పరిచయాలు ఉంటాయి. మీ బాధ్యతలను ఇతరులకు అప్పగించకండి. ఆధిపత్యధోరణిచే కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి రావచ్చును. బంధుమిత్రుల రాకపోకలు, నూతన అగ్రిమెంట్లు చోటుచేసుకునే సూచనలున్నాయి.అయినవారికి సాయం అందించు సూచనలున్నాయి. ఈశ్వరారాధనలు ఉపకరిస్తాయి. ఈ రాశి వారికి గురు, బుధవారాలు అన్ని పనులు చేపట్టుటకు చాలా అనువైనవి.



వృశ్చికం: విశాఖ 4వ పా, అనూరాధ, జ్యేష్ఠ. ఈ వారమందు లగ్న, భాగ్య రాజ్యాధిపతుల సంబంధం, చంద్రగ్రహణం మీకు విశేషప్రయోజనాలను ఇవ్వగలవు. అనుకున్నది సాధించుకొనేందుకు దార్లు దొరుకుతాయి. సమర్థతపై నమ్మకం పెరుగుతుంది. కుటుంబం, వృత్తి, వ్యాపారాలందు పరిచయస్తులచే ప్రయోజనాలు పొందుతారు. ఆరోగ్య సమస్యలను అధిగమించగలరు. సమయానికి- అవసరాలకు తగినట్లు డబ్బు అందుతుంది. ఇతరులనుండి వూహించని విధంగా గౌరవాలు పొందుతారు. ఈశ్వరాధన మరవకండి. గురు, శుక్ర, బుధ వారాలు అనువైనవి.



ధనుస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పా. సంతాన అనుకూలతలచే మనోవేదన ఎక్కువ ఉండగలదు. ఆరోగ్య విషయాలందు శ్రద్ధ అవసరం. ఇతరుల లోపాలు గుర్తించి విమర్శించుటచే బంధు, స్నేహ వర్గవిరోధాలు పెరుగు సూచనలు ఉన్నాయి. ఊహించుకోని విధంగా కొన్ని ముఖ్య కార్యక్రమాలు వాయిదాపడు సూచనలున్నాయి. వృత్తి, ఉద్యోగాలందు అధికారులచే సాయం ఏర్పడగలదు. నవగ్రహారాధనలు, శ్రీరామ జయ రామ జయ జయ రామ అను మంత్ర పఠన అవసరం. ఈ రాశివారికి శుక్ర, శని, బుధవారాలు అనువైనవి.



మకరం: ఉత్తరాషాఢ 2, 3, 4పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2పా. ఈ వారంనందు మీ రాశిలో గ్రహణమేర్పడడం శుక్రుడు శత్రు క్షేత్రగతుడగుటచే కుటుంబ వ్యవహారాలందు సంయమనాలు అవసరం. వృత్తి, ఉద్యోగ, వ్యాపార వ్యవహారాలు సాధారణతలతో సాగుతాయి. కొన్ని పనులు వాయిదా పడగలవు. కుటుంబమున ఇష్టాయిష్టాలు వ్యక్తపరచునప్పుడు లౌక్యాలు అవసరం. ఆదాయ, వ్యయాలందు సంతృప్తి చెందగలరు. ఈ రాశివారికి శుక్ర, శని, బుధవారాలు అనువైనవి.



కుంభం: ధనిష్ఠ 3, 4పా, శతతార, పూర్వాభాద్ర 1, 2, 3పా. ప్రణాళికాయుతంగా సాగుచు చేపట్టిన పనులను పూర్తిచేసుకోవాలి. ఖర్చులకు తగినట్లుగా ఆదాయాలుంటాయి. ఎదుటివారి ఆంతర్యమును గ్రహించి వ్యవహరించుకోవాలి. ఆరోగ్యం బావుంటుంది. భావవ్యక్తీకరణాలందు లోపాలుండకుండా చూసుకోవాలి. విదేశీ ప్రయాణాలకై చేసుకుంటున్న ప్రయత్నాలను కొంతకాలం వాయిదావేయండి. మీరు సుబ్రహ్మణ్యారాధనలు చేసుకోవాలి. గురు, ఆది, సోమవారాలు అనువైనవి.



మీనం: పూర్వాభాద్ర 4వ పా, ఉత్తరాభాద్ర, రేవతి. ఈ వారమున మీరు ప్రయత్నకార్యాలను అనుకూలింపచేసుకుంటారు. లాభమందు చంద్రమంగళయోగం, చంద్రగ్రహణం విశేషప్రయోజనాలను ఇస్తాయి. అవకాశాలు కలిసి వస్తాయి. ఆదాయాలు సామాన్యంగా ఉన్నా అవసరాలు తీరుతాయి. వస్తు కొనుగోళ్ళనందు మొహమాటాలకు తావివ్వకుండా సాగాలి.ఆప్తులనుండి సహాయ సహకారాలు పొందుతారు. ఈ రాశివారికి గురు, శుక్ర, శని, బుధవారాలు ఎంతో అనువైనవి.

మౌనంద్వారానే మనం చెడ్డ మాటల
నుండి బయటపడగలము.

పోషకాలతో నింపాలి

వంటగదిని పోషకాలతో నింపుకోవాలి. కొన్నిసార్లు మంచి ఆహారం తినడం ఛాలెంజింగ్‌గా ఉంటుంది. మంచి పదార్థాలన్నీ అందుబాటులో వుంచుకున్నప్పుడు, త్వరితంగా తయారుచేసుకునే వీలవుతుంది. వాటన్నింటినీ ఎలా వాడుకోవాలన్న అవగాహన వుంటే చాలావరకు మేలు.

వంటగదిని ఫేవరెట్ పోషకాలతో నింపేయాలి. అప్పుడు ప్రతిరోజూ పోషకాహారాన్ని తినే అవకాశాలు సులువు అవుతాయి. తరిగిన కూరగాయలు, గుడ్లు, చికెన్ వంటి వాటిని ఫ్రిజ్‌లో ఎప్పటికప్పుడు నింపుకుంటుంటే పోషకాలతో నిండిన ఆహారాన్ని శీఘ్రంగా, సులువుగా తయారుచేసుకునే వీలుంటుంది.

హైరానాపడాల్సిన అవసరం వుండదు. సప్లిమెంట్లపైన ఆధారపడడంకంటే పోషకాహారంపైన ఆధారపడడం అన్నివిధాలా శ్రేయస్కరంగా వుంటుంది.

* కూరగాయలు ఎంత ఎక్కువగా బ్రేక్‌ఫాస్ట్‌తో భాగంచేసుకుంటే అంతమంచిది.ఆకుకూరలుఎక్కువగా తినాలి. ఇంట్లో తయారుచేసుకునే స్మూథీలు ఆరోగ్యభరితమైనవి.



ఇక రోజులన్నీ మీవే

ఉదయం లేస్తూనే అనుకూల దృక్పథం కలిగి వుంటే ఆరోజంతా ఉత్సాహంగా, సందడిగా సాగుతుంది. చురుగ్గా వుండాలంటే తగినశక్తి కావాలి. ఆహారం అలవాట్లు సరిగ్గా లేకపోతేగనుక శక్తిస్థాయిలు సన్నగిల్లిపోతాయి

ఎముకలు, జాయింట్లకు పని జరుగుతుంది. సరైన ఆహారం తింటే శరీరం ఆరోగ్యవంతంగా వుంటుంది.మనస్సుఉత్సాహంగాఉంటుంది. ఏ వయస్సు వారికైనా పోషకభరితం అయిన పదార్థాలు అవసరం. అందుకు తగినట్లు ఆహారపు ఛాయిస్‌లు వుండాలి. వయస్సు పెరుగుతున్న కొద్దీ పోషకాల అవసరం మరింత పెరుగుతుంది.

దురదృష్టవశాత్తూ వయస్సు పెరిగేకొద్దీ ఆకలి తగ్గిపోతుంది. ప్రొటీన్లు తీసుకోవడం తగ్గిపోతుంది. ఎముకలు, కండరాల శక్తి సన్నగిల్లుతుంది.

చాలినంత పోషకాలను తీసుకోవడం కొంచెం కష్టమే కావచ్చు. అయితే ఆహారంలో ఉదయం వేళ బ్రేక్‌ఫాస్ట్‌లో క్యాల్షియం, విటమిన్ డి ప్రొటీన్లు చేర్చుకోవడంవల్ల సత్ఫలితాలుంటాయి.

▶▶ దృఢమైన ఎముకలకోసం

ఎముకలు బలంగా వుండాలంటే శరీరానికి విటమిన్-డి,క్యాల్షియంలుఅందాలి.చాలినంత క్యాల్షియం తీసుకోకపోతే శరీరం పళ్ళు, ఎముకల్లోని క్యాల్షియంను తీసుకుంటుంది. అస్టియోపోరోసిస్, ఆస్టియోపెనియా స్త్రీ, పురుషులు ఇద్దరినీ ప్రభావితం చేస్తుంది.

ఈ ప్రభావాలు మహిళలపై ఎక్కువకాగా, యాభై ఏళ్ళు పైబడిన మగవారు ప్రతి నలుగురిలో ఒకరు అస్టియోపోరోసిస్‌కు గురయ్యే అవకాశాలుంటాయి.

ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా వుండేందుకు క్యాల్షియం సహాయపడుతుంది. ప్రముఖ ఖనిజాన్ని శరీరం గ్రహించడానికి విటమిన్ డి అవసరం. ఈ పోషకాలను ఆహారంలో భాగంచేసుకోవడంసులువు. బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవచ్చు.

సింపుల్‌గా, తాజా పదార్థాలతో నింపుకోవచ్చు. చీజ్‌తో ఆమ్లెట్, పాలకూర, పుట్టగొడుగులు తినాలి. పానీయాల విషయానికి వస్తే విటమిన్ డి, క్యాల్షియా లున్నవి అనేకం లభిస్తాయి.

ఆరెంజ్ జ్యూస్, బాదంపాలు వంటివి తీసుకోవాలి. ఇక పాలలో వుండే లాభాల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆవుపాలలో ప్రయోజనాలు ఎక్కువనే సంగతిని ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు.

▶▶ ప్రొటీన్లు

శరీరం ప్రొటీన్లనుండి కండరాలను నిర్మించుకోవడానికి జరిపే ప్రక్రియ ప్రొటీన్ సింథసిస్. వయస్సు పెరుగుతున్నకొద్దీ ప్రొటీన్ సింథసైజ్ చేసే సామర్థ్యం తగ్గుతుంటుంది. దీంతోపాటు హార్మోన్ల మార్పులు, వయస్సు పెరిగాక వ్యాయామాలు తగ్గిపోవడంవంటివి వయస్సు సంబంధిత కండరాల నష్టానికి దారితీస్తాయి. అదే ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకుంటుంటే మంచి మార్పులు వస్తాయి.

మామూలుగా శారీరక బరువును అనుసరించి కిలోగ్రాముకు 1.5 గ్రాముల ప్రొటీన్ అవసరం అవుతుంది. దానికి రెండింతల ప్రొటీన్ తీసుకునేవారిలో కండరాల ప్రొటీన్ సింథసిస్ మెరుగవుతుందని నిపుణులు తెలియజేశారు.

ప్రొటీన్లు అత్యధికంగా లభించే ప్రొటీన్ ఛాయిస్‌లు అనేకం ఉన్నాయి. గుడ్లు, ఛీజ్, మీట్స్, పెరుగు తింటుండాలి. చికెన్ లేదా ఛీజ్‌లతో లేదా చియా గింజలు లేదా సోయా పౌడర్‌ల స్మూథీతో పాటు ఛీజ్ లేదా చికెన్, రెండు గుడ్లు తీసుకుంటే బ్రేక్‌ఫాస్ట్‌లో చాలినంత ప్రొటీన్లు అందినట్లే.

జాయింట్లకు ఇన్‌ఫ్లమేషన్ ప్రధాన శత్రువు. వాపు, నొప్పులకు కారణం అవుతాయి. ఇన్‌ఫ్లమేషన్ పెంచే పదార్థాలు తినవద్దు. రిఫైండ్ కార్బొహైడ్రేట్స్.. అంటే వైట్ బ్రెడ్, పేస్ట్రీల వంటి ఇన్‌ఫ్లమేటరీ పదార్థాలు తినడాన్ని బాగా పరిమితం చేసుకోవాలి.

వేపుడు పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్, మార్గరైన్‌లూ తగ్గించాలి. వీటి స్థానే తాజాపండ్లు, ఫ్యాటి ఫిష్, ఆకుకూరలు, టమోటాలు, తాజాపండ్లరసాలు, కూరగాయరసాలు తీసుకోవాలి. వీటిని ఇంట్లోనే తయారుచేసుకుంటుంటే అంతగా ఖర్చుకాదు. బ్లెండర్ లేదా జ్యూసర్ అందుబాటులో వుంచుకుంటే చాలు.

ఉదాహరణకు రెండు కప్పుల నీరు, రెండుకప్పులు తాజా పాలకూర, కొద్దిగా కీర, అరకప్పు టమోటారసం బ్లెండ్ చేసి బ్రేక్ ఫాస్ట్‌లో తీసుకుంటే కావాల్సినన్ని పోషకాలు దక్కుతాయి. తోడుగా ఓ రెండు ఉడికించిన గుడ్లు తింటే చాలు.

ఆలయం



సూర్యప్రసాదరావు

"అయ్యగారూ... నమస్కారం" శివాలయంలో శివపురాణం చదువుతున్న నేను తల ఎత్తి చూశాను! ఎదురుగా ఆలయ ప్రధాన ధర్మకర్త బుచ్చిగారు కనిపించారు.

"కూర్చోండి! ఏ పనిమీద వచ్చారో చెప్పండి!" నేను కూర్చున్న చాపనే చూపాను.

అప్పుడు తనతోబాటు తీసుకువచ్చిన పదేళ్ళ కుఱ్ఱవాడిని చూపించారు. "ఈ పిల్లవాడు పౌరోహిత్యం నేర్చుకోవాలనుకుంటున్నాడు!"

"వీడో అనాథ! తల్లీదండ్రీ, కులంగోత్రం తెలియనివాడు. అక్కడక్కడా బిచ్చమెత్తుకుంటుంటే వీడి స్పష్టమైన గొంతువిని, వాచకం విని అడిగాను. పౌరోహిత్యం నేర్చుకోవాలని ఉందని అన్నాడు.మీకేమీ అభ్యంతరం లేదుగా!" సందేహంగా అన్నాడు.

"వీడికి ఉపనయనం చేసి స్మార్త విద్యాభ్యాసం మొదలుపెడతాను!" అని చేయబోయే కార్యాచరణ వివరించాను.

"మీకు జ్ఞాపకముందో లేదో... సరిగ్గా పాతిక సంవత్సరాల క్రితం ఇలాగే ఒక బాలుడిని మీకు అప్పగించాను. మంచి మార్కులతో, మంచి చదువులతో ఇప్పటికి గొప్పవాడై ఉండాలి! చాలా సంవత్సరాలైంది అతన్ని చూసి"

నా ముఖంలోకి దీక్షగా ప్రశ్నార్థకంగాచూస్తున్న బుచ్చయ్యగారికి వెంటనే సమాధానం చెప్పాను. "అవును బుచ్చయ్యగారూ! వాడి పేరు రాజా! మన స్కూల్లో టెంత్ క్లాస్‌లో స్కూల్ ఫస్ట్‌గా వచ్చాడు. పట్టణంలో ఇంటర్ చదువుతూ అప్పుడప్పుడూ వచ్చేవాడు. తరువాత కనిపించలేదు!" జ్ఞాపకాలపుటను తిరగవేయడం ప్రారంభించాను.

బుచ్చయ్యగారే నాకూ, వాడికీ జీవితం ప్రసాదించారు. ఎక్కడో ఓ మారుమూల కుగ్రామంలో ఉపాదానం చేసుకుంటూ జీవనోపాధి ఇవ్వని ఓ శివాలయంలో అర్చకత్వం చేసుకుంటూ ఓ ఇంటిముందు 'భవతే భిక్షాం దేహి' అని నిలబడి యాయావారం చేసుకుంటున్నాను. తిథి వార నక్షత్ర వర్జ్య, దుర్ముహూర్త, రాహుకాల యమగండాల గురించి ఆశువుగా వివరించడంచూసి, నన్నాదరించి బుచ్చయ్యగారే శివాలయానికి రప్పించారు.

"అయ్యగారూ! ఐదెకరాలస్థలంలో నిర్మించబడిన అతిపురాతన శివాలయం! ఈ గుడికి వ్యవసాయ ఫలసాయం ఉంది. అతీగతీ పట్టించుకునే వారు, నిత్య ధూపదీపనైవేద్యాలు పెట్టేవారు లేక శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై సంపూర్ణ అధికారాలు మీకు అప్పగిస్తాను. కావలసిన సదుపాయాలన్నీ సమకూరుస్తాను. ఈ గుడికి ఉన్నత స్థితి కల్పించండి! మాలో భక్తిభావం పెంపొందించండి.

సంప్రదాయ సంస్కారాల విలువలు తెలియచెప్పండి! ఆధ్యాత్మిక ఆలోచనలు కలిగించండి!" బుచ్చయ్యగారు గుడితాళం చెవులు, ఒక పనిమనిషిని, ఒక తోటమాలిని నాకు అప్పగించారు. చప్పున నా జాతక చక్రం జ్ఞప్తికివచ్చింది. కేతు మహర్దశ ప్రారంభమైంది.

భక్తిభావంతో, అర్చనతో నా జీవనోపాధికి భుక్తి లభిస్తుందని అర్థమైంది. అదే పరమార్థంగా భావించితే జీవన్ముక్తి లభిస్తుందని గ్రహించాను. దేవాలయ ప్రాంగణంలోనే ఔట్ హౌస్‌లో నివాసమేర్పరచుకొని, పరిసరాలను, దేవాలయాన్ని పూజాదికాలకు సిద్ధం చేయడానికి వారం రోజులు పట్టింది.

ఓ శుభముహూర్తాన ధర్మకర్తల మండలి సమక్షంలో భ్రమరాంబా సమేత మల్లిఖార్జున స్వామి వారి నిత్య అర్చన ప్రారంభించాను. విఘ్నేశ్వరపూజతో నిర్విఘ్నంగా పునరుద్ధరణ ప్రారంభమైంది. అప్పటికి నా వయస్సు నలభై ఏళ్ళు... మా ఆవిడకు ముప్పై ఏడేళ్ళు!

మాకు సంతానం కలుగలేదు. ఇద్దరం శివార్పణతోనే కడతేరాలనుకున్నాము. ఓరోజు పూజాదికాలు పూర్తైన బుచ్చయ్యగారు పదేళ్ళ పిల్లవాడిని వెంటబెట్టుకువచ్చారు.

"అయ్యగారూ! ఈ మధ్యనే వీడి అమ్మ చనిపోయింది. తండ్రి ఇల్లు వదిలిపెట్టి ఎటో వెళ్ళిపోయాడు. వీడి అన్న కూలిపనికోసం పట్నం వెళ్ళిపోయాడు. వీడికి చదువుకోవాలని ఉంది. మంచి మార్కులు వస్తాయి. అన్నం లేకపోయినా చదువు ఉంటే చాలు! వీడిని గుడిలో ఉండనివ్వండి! మీరు పెట్టే ప్రసాదం తిని చదువుకుంటాడు! మీకు చేదోడువాదోడుగా ఉంటాడు. ఆలయనిర్వహణలో సహాయసహకారాలు అందిస్తాడు!" బుచ్చయ్యగారు వివరించారు.

ట్రంక్ పెట్టెతో వచ్చినవాడు గుడిలో ఓ మూల సర్దుకున్నాడు.

మాతోబాటే తెల్లవారు ఝామునే నిద్రలేచేవాడు. తోటమాలికి సాయపడేవాడు. బావి దగ్గర తలారా స్నానం చేసి బట్టలు ఉతుక్కునేవాడు. తడి బట్టల



తోనే ప్రదక్షిణలు చేసేవాడు. దీపారాధన మొదలుపెట్టి పూజాదికాలు ఆరంభించేసరికి ప్రథమ భక్తుడిగా పరమేశ్వరుని కొలిచేవాడు.

సంకల్పం చెప్పడం రెండు మూడురోజుల నుండి దీక్షగా వింటున్నాడేమో... నాతోబాటు... "భరతవర్షే... భరతఖండే... మేరో దక్షిణదిగ్భాగే!' అంటూ స్వరం కలిపేవాడు. స్పష్టమైన ఉచ్చారణతో, చక్కని గాత్రంతో వాడు చదువుతుంటే మంత్రాలు కూడా మనోహరంగా శ్రవణానందకరంగా వినిపించేవి!

వాడు ఏకసంధాగ్రాహియని గ్రహించగలిగాను. ఒక్కసారి జాగ్రత్తగా వింటే ఏ మంత్రమైనా జ్ఞాపక ముంచుకోగలిగే ధారణాశక్తి వాడికి ఉంది! ఉదయం పూట ప్రసాదం, మధ్యాహ్నం స్కూల్లో భోజనం,రాత్రిపూట ప్రసాదాలతో కడుపు నింపుకునే వాడు. రాత్రి పదివరకూ చదువుకునేవాడు.ఓ రోజు "నాకు మంత్రాలు నేర్పండి! మీలాగా పరమేశ్వరుని సేవ చేసుకుంటాను!" అని ఆశగా అడిగాడు.

అది మొదలు వాడునాతోపాటు అనేక మంత్రాలు చదవడం ప్రారంభించాడు. నమక చమకాలు నేర్చుకున్నాడు. అభిషేక నిర్వహణలో మెలకువలు తెలుసుకున్నాడు. వాడి భక్తిభావాల చొరవ వలన అష్టాదశ శక్తిపీఠ వివరాలు, ద్వాదశ జ్యోతిర్లింగ శ్లోకములు గుడి గోడలనలంకరించాయి.

శివస్తోత్ర, దుర్గా స్తోత్రములు భక్తులకందుబాటులోకివచ్చి భక్తులచేత పారాయణం ప్రారంభింప చేశాయి. వాడు వచ్చిన తరువాతే దేవాలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహాలు ప్రతిష్ఠింపబడ్డాయి.

నవగ్రహ స్తోత్రాలు దర్శనమిచ్చాయి. దేవాలయానికో మైక్‌సెట్టు శివస్తోత్రములు, సంబంధించిన కీర్తనలు, పాటలు భక్తి భావనాతరంగాలను సుదూరప్రాంతాలకు వీనులవిందుగా ప్రసారంచేయ సాగాయి.ఫలితంగా భక్తులు విపరీతంగా ఆకర్షించబడ్డారు.హుండీఆదాయం,విరాళాల వెల్లువ పెరిగింది.

ఆదివారం, సెలవురోజుల్లో వాడికి మధ్యాహ్న భోజనం దొరికేది కాదు! ప్రసాదాలతోనే వాడు కడుపు నింపుకునేవాడు.

"వాడూ మన బిడ్డలాంటి వాడు కదండీ! అన్ని విషయాలలోనూ మీకు వాడు చేదోడువాదోడుగా ఉంటున్నాడు గదా! వాడికి ఇంత అన్న ప్రసాదం పెడితే బాగుంటుందని నాకనిపిస్తుందండీ!" శ్రీమతి ఆవేదన వ్యక్తం చేసింది.

నేను వాడికోసం అడుగుదామనుకున్న వరాన్ని ఆమే వాడికి స్వయంగా ఇస్తానంటే... నేనెందుకు కాదంటాను! అప్పటినుండీ వాడికి భోజనం పెట్టేవాళ్ళం! మాతోబాటు వాడు కూడా గుప్పెడు మెతుకులు తింటున్నాడు. వాడి ధారణాశక్తి వలన, ఏకాగ్రత వలన, కఠోర దీక్ష వలన పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు.



ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న పట్టణంలో ఓ గవర్నమెంటు జూనియర్ కాలేజీలో, సునాయాసంగా అడ్మిషన్ సాధించగలిగాడు.

రిజర్వేషన్ సౌకర్యం వలన ఓ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వసతి, భోజన సదుపాయాలు అందుకోగలిగాడు. దీంతో కడుపు నిండా తినగలిగే అవకాశం చేజిక్కించుకున్నాడు.

నిర్విఘ్నంగా చదువు కొనసాగించాడు. పట్టణం నుండి వారానికో పదిహేను రోజులకోసారి దేవాలయ దర్శనం చేసుకునేవాడు. ప్రసాదం తిని ఓ రాత్రి హాయిగా నిద్ర చేసేవాడు. ఆ సమయంలోనే అనేక ఆధ్యాత్మిక, సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన పుస్తకాలు తెచ్చేవాడు.

దేవాలయదర్శనంలో నిక్షిప్తమైన అర్థాలను, అర్చన పూజాదికాలలోని అంతర్గత పరమార్థాలను నేను తెలుసుకుని భక్తులకు తెలిపే అపూర్వ అవకాశాలనెన్నింటినో అందించేవారు. "ఆత్మ ప్రదక్షిణ వలన,

గర్భగుడిలో శక్తికి కేంద్రమైన దైవం చుట్టూ ప్రదక్షిణలు చేయడం వలన గతిజశక్తి కలుగుతుందని, శరీరము, ఆత్మ చైతన్యవంతమౌతాయని" గ్రహించగలిగాను.

"దైవంముందు దీపారాధన చేయడం వలన అజ్ఞాన అంధకారం నుండి విముక్తి లభించి జ్ఞానజ్యోతి వెలుగుతుందని తెల్సుకున్నాను. మూడు వత్తులతో చేసే దీపారాధన మూడు లోకాలలోని చీకట్లను పారద్రోలుతుందని, ప్రతి దినము చేయవలసిన నిత్యాగ్నిహోత్ర ఆరాధనకు దీపారాధన ప్రత్యాయమని" పదిమందికీ చెప్పగలిగాను.

కర్పూరానికి అలసటను దూరం చేసే తత్త్వముంది. దైవం చుట్టూ కర్పూరం వెలిగించి హారతి రూపంలో వర్తులాకారంలో త్రిప్పడం వలన వృత్తాకారములో విడుదలైన శక్తి నాలుగు దిశలకూ కాంతి తరంగాల రూపంలో విస్తరిస్తుంది. అరచేతులతో మనం హారతి తీసుకోవడం వలన శక్తి తరంగాలు శరీరంలోకి ప్రవేశించి చైతన్యపరుస్తాయని గ్రహించగలిగాను.

ధ్యాన కేంద్రానికి 'పిరమిడ్' రూపాంతరంగా భావిస్తారు. పిరమిడ్ ఆకారములోనున్న శఠగోపంగా తలపై ఉంచడం వలన ఆత్మజ్ఞానానికి ప్రతీకమైన సహస్రార చక్రం చైతన్యవంతమౌతుంది. మానసిక

తాజా అందాలు

'ధృవ', 'గౌతమిపుత్రశాతకర్ణి' సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో తళుక్కుమన్న తార ఫరాకరిమాయిని ప్రేక్షకులు గుర్తించలేదేమో కాని, సినీ నిర్మాతలు మాత్రం బాగానే గుర్తుపెట్టుకున్నారు.

రాబోయే అఖిల్ సినిమాలో ప్రత్యేక పాటకోసం ఈమెతో చర్చలు సాగుతున్నాయి. ఇంతకుముందు సినిమాల్లో ఫరా పర్‌ఫార్మెన్స్ ఈ చిత్ర దర్శకుడికి బాగా నచ్చేసిందట. హాలెండ్‌లో పుట్టి, పెరిగిన ఈ సౌందర్యరాశి తాజా అందాలు పాటకు ప్రత్యేకంగా నిలుస్తాయని భావిస్తున్నారు.

ప్రశాంతత కలుగుతుందని శారీరక శాంతి సిద్ధిస్తుందని గ్రహించాను.

వాడు అందించిన అమూల్య సాహిత్య పఠనం వలన దైవత్వానికి మానవత్వానికి అవినాభావ సంబంధముందని గ్రహించి త్రికరణశుద్ధిగా ప్రచారం చేయగలిగాను. 'భక్తితో కూడిన ఆహారం' ప్రసాదమౌతుంది! భక్తితో గూడిన జలం తీర్థం అవుతుంది.

భక్తితో గూడిన ఆకలి 'ఉపవాస'మౌతుంది. భక్తి అంటే సంగీతం కీర్తన అవుతుంది. భక్తి ఉంటే ప్రయాణం తీర్థయాత్ర అవుతుంది. భక్తి ఉంటే పని 'కర్మ' అవుతుంది.



భక్తి ఉంటే ఇల్లు దేవాలయం అవుతుంది. భక్తి ఉంటే మనిషి భక్తుడిగా పిలవబడతాడు!" డిగ్రీ ఫస్ట్ ఇయర్ సమ్మర్ హాలిడేస్‌కు వచ్చినవాడు మళ్ళీ కనిపించలేదు.

> ఎన్నికల్లో ఓట్లకోసం భారతప్రభుత్వం నన్ను వెంటాడుతున్నది. నన్ను భారత్‌కి తెప్పిస్తే ఓట్లు రాలతాయని అనుకుంటున్నారు.
> -విజయ్ మాల్యా, బ్యాంక్ రుణాల ఎగవేతదారుడు

వాడి వివరాలు తెలియలేదు. ఎక్కడో గొప్పవాడై, గొప్ప చదువు చదివి, గొప్ప పదవినలంకరించి ఉంటాడని నా ప్రగాఢ నమ్మకం.

నాకు అర్చనై ఐదు సంవత్సరాలు వచ్చేశాయి. భగవంతుని సేవలో పాతికేళ్ళు పాతికరోజుల్లా గడిచిపోయాయి. బుచ్చయ్యగారు జ్ఞాపకం చేయడంతో రాజా మళ్ళీ జ్ఞాపకమొచ్చాడు. ఎక్కడ ఉన్నాడో? ఎలా ఉన్నాడో? ఏం చేస్తున్నాడో?

మూడు రోజుల తరువాత ఓ సాయంత్రం ఐదు గంటల సమయంలో దేవాలయం ముందు మూడు కారులాగాయి.

అందులోనుండి బుచ్చయ్య గారు, హైస్కూలు హెడ్మాస్టరు, కొందరు టీచర్లు, గ్రామముఖ్యులు, స్ఫురద్రూపంగల నడివయస్సున్న భార్యాభర్తలు, ఇద్దరు కుమారులతో గుడిమెట్లు ఎక్కి వచ్చారు.

శివానందలహరి చదువుకుంటున్న నేను తల ఎత్తి చూశాను.

"నమస్కారం... అయ్యగారూ!" బుచ్చయ్యగారు అభివాదం చేశారు.

"శివార్పణం!" యధాలాపంగా అనేశాను.

"వీరు... మన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్! సతీ సమేతంగా శివార్చన చేయించుకుందామనివచ్చారు!" వచ్చిన వారిని పరిచయం చేశారు.

తెల్లని లాల్చీ పైజమాలో, చామన ఛాయలో, చురుకైన చూపులతో విశాలమైన ఫాలభాగంతో విజ్ఞాన ఖనిలా కనిపిస్తున్నాడు. భార్య కంచిపట్టు చీరల్లో ఆహ్లాదంగా కనిపించింది.

కుమారులిద్దరూ... రూపంలో వస్త్రధారణలో వారి జీవనశైలిని ప్రతిబింబిస్తున్నారు.

"అయ్యగారూ! నమస్కారం! నా పేరు రాజేంద్ర ప్రసాద్! ఈమె నా శ్రీమతి, వీరు ఇద్దరూ మా కుమారులు" వైస్‌ఛాన్సలర్ గారు తమ కుటుంబసభ్యులను పరిచయం చేశారు. ఆకుపచ్చ చీరలో ఆమె వనదేవతలా ఉంది. కుమారులు వులుగడిగిన ముత్యాల్లా ఉన్నారు.

వారు అందించిన పూజాసామాగ్రి అందుకొని అభిషేకం, అర్చన ప్రారంభించాను. "ఇంటి పేరు... గోత్రనామాదులు చెప్పండి బాబూ!"

ఆయన చెబుతుంటే బాగా పరిచయమున్న గోత్రనామాదులనిపించాయి. ఆ కంఠస్వరం కూడా సుపరిచితమైన గొంతులా ఉంది. అష్టోత్తర, శత నామావళి చెబుతుంటే ఆయన స్వరం నన్ను అనుసరించడం గమనించాను.

అంత స్పష్టంగా, తప్పులు లేకుండా చదవడం అసాధ్యం! అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్న అతని మొహం చిన్నతనంలో తన దగ్గరే పెరిగిన అనుభూతి బలపడుతోంది. అతని మంత్రపఠనం అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తుంది.

అతడు కనులు మూసుకొనే ఏకాగ్రతగా ధ్యానంలో ఉన్నట్లున్నాడు! పూజ పూర్తయింది.

ఇక మంత్రపుష్ప పఠనం మిగిలి ఉంది. అందరి చేతుల్లో పుష్పములు ఉంచాను. మంత్ర పఠనం ప్రారంభించాను.

"రాజాధిరాజాయ ప్రసహ్యాసాహినే..."

నాకంటే హెచ్చు స్వరంతో, శృతి లయబద్ధంగా కోయిల గానంలా మంత్రపుష్ప పఠనం వాడి నోట వింటుంటే... నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను...

సందేహం... లేదు... వాడు...రాజానే... నా రాజానే! ఆత్మనివేదన పూర్తయిన వెంటనే వాడు కళ్ళు తెరిచాడు. నన్ను చూశాడు.

"ఒరేయ్! రాజా... నా రాజా... నువ్వేనా... నువ్వేనా నా రాజా!' ఆనందం పట్టలేక గట్టిగా అరిచి గర్భగుడిలోంచి హారతిపళ్ళెంతో వెలుపలికి వచ్చాను.

"నేనే... అయ్యగారూ! నేనే... నేనే మీ రాజాను! ఐదు సంవత్సరాలు మీ ప్రసాదంతోనే కడుపు నింపుకున్నవాడిని... ఈ శివాలయంలోనే జీవితం సాగించినవాడిని... ఈ ఆలయం అణువు అణువునా... అంతర్భాగమైనవాడిని... నేనే అయ్యగారూ నేనే... ఆ రాజాను... మీరాజాను..." దగ్గరగా వచ్చేశాడు.

అంత పెద్దమనిషి పాదాభివందనం చేయబోయాడు. "శివార్పణమస్తు!" అంటూ భుజాలు పట్టి పైకి లేపి గుండెలకు హత్తుకున్నాను.

"అయ్యగారూ! అయ్యగారూ!" చిన్న పిల్లవాడిలా నన్ను ఆబగా అల్లుకుపోయాడు.

"రాజా! రాజా! ఎన్నాళ్ళకు చూడగలిగాను! ఎంత గొప్పవాడివైనావురా!" ఆనందభాష్పాలతో వాడి లాల్చీ తడిచిపోతే వాడి కన్నీళ్ళతో నా ఉత్తరీయం తడిసిపోయింది. 'పుత్రాధిచ్ఛేత్ పరాజయం' పరిష్వంగంలో నేను, పితృగాఢ పరిష్వంగంలో వాడు సమయం చూసుకోలేదు.

ముందుగా నేనే తేరుకున్నాను.

"వీడే... బుచ్చయ్యగారూ! రాజా! సరిగ్గా పాతికేళ్ళ క్రితం మీరు నాకు అప్పగించిన అనాథ బాలుడు రాజా... వీడే! చూడండి! ఎంత గొప్పవాడైనాడో? చూడండి! వీడేనండీ.

నేడు...మన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్!" గర్వంగా అందరికీ పరిచయంచేశాను.

"రాజానా... మన రాజానా... మన రాజా యేనా... ఈ వైస్ ఛాన్సలర్!" బుచ్చయ్య గారు ఆనందంగా కళ్ళు తుడుచు కున్నాడు.

"అవునండి! నేనే. మీ రాజాను! మీరే అయ్యగారికి నన్ను అప్పగించారు. పాతిక సంవత్సరాల క్రితం ఈ శివాలయాన్ని నివాసం చేయించారు.

డిగ్రీ మొదటి సంవత్సరం చివరివరకూ ఇక్కడికి వచ్చేవాడిని! తరువాత వీలు పడలేదు" క్షణం విరామమిచ్చి వివరణ కొనసాగించాడు.

"పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవడంతో కుదిరేది కాదు. ఎమ్.ఏ.లో గోల్డ్ మెడల్ సంపాదించాను. పి.హెచ్.డీలో మరో బంగారు పతకం అందుకున్నాను. అతి చిన్న వయస్సులో వైస్ ఛాన్సలర్ పదవి అందుకునే అదృష్టాన్ని దక్కించుకున్నాను.

దానికి కారణం అయ్యగారు ప్రసాదించిన మంత్ర పఠనం, ధారణ శక్తి, జ్ఞాపకశక్తి... నన్ను ఇంతవాడిని చేశాయి! అంతా మీ చలువే! మీరు పెట్టిన భిక్షే!" చిన్నపిల్లవాడిలా కళ్ళు తుడుచుకున్నాడు.

భార్యాపిల్లలూ నాకు నమస్కరిస్తుంటే... 'ఇష్ట కామ్యార్థ ఫలసిద్ధిరస్తు' దీవించాను.

రాజా దేవాలయమంతా అందరినీ త్రిప్పి చూపించాడు. ఎక్కడ తినేదీ... ఎక్కడ పడుకునేది... ఎక్కడ చదువుకునేదీ... ఎక్కడెక్కడ ఏ ఏ పనులు చేసేవాడో అణువణువునూ చూపించాడు. ఆనందం అంబరమైంది. అనురాగం అర్ణవమైంది.

అంతా సంధ్యా సమయం దీపారాధన చేసేంత వరకూ ఉన్నారు. హారతిపళ్ళెంలో రాజా పదివేల రూపాయల దక్షిణ వేశాడు.

"అయ్యగారూ! ఇది హుండీలో వేయకండి! నాలాంటి ఎందరో అభాగ్యుల కడుపు నింపే ప్రసాదానికి వినియోగించండి!

అధికపోషకాహార విలువలు ఉన్న గుప్పెడుప్రసాదం అనాథల ఆకలి తప్పకుండా తీరుస్తుంది. సంవత్సరానికోసారినేను కూడా ఈ ప్రసాదం ఆరగిస్తాను. విరాళమిస్తాను!" గద్గద స్వరంతో అన్నాడు. "హెడ్ మాస్టర్ గారూ! మన హైస్కూల్‌కు కూడా పదివేల రూపాయల విరాళం ఇస్తాను. నాలో విజ్ఞానకాంతులు నింపి మరోజన్మ ప్రసాదించిన బడిలో ఎందరో అభాగ్యులు తమ ఉజ్జ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి!

ప్రతీ ఏటా నా రెండు దేవాలయాలకు పదివేల రూపాయలు ఉడతా భక్తి సహాయమిస్తాను.

గుడి అనే ఈ ఆలయం ఒకటి... బడి అనే ఆ ఆలయం రెండవది!"

రాజా ప్రకటించిన నిర్ణయానికి అందరూ హర్షధ్వానాలు చేశారు. "నా ఒక్క కోర్కె తీర్చరా... రాజా!" ఆర్తిగా అన్న నావైపు చూశాడు.

"ఒక్కసారి మంత్రపుష్పం చదవరా! నీ స్వరం వినాలని ఉంది. అర్చన పూర్తిచేస్తాను"

"తప్పకుండా చదువుతాను అయ్యగారూ!" తన్మయంగా తలాడించాడు.

పూజాది కార్యక్రమాలు పూర్తిచేశారు. అందరి చేతుల్లో పుష్పములుంచాను. వాడు కళ్ళు మూసుకున్నాడు. రెండు చేతులు కట్టుకున్నాడు. సస్వరంగా, శృతిలయ తాళగతులు తప్పకుండా... హాయిగా... కమ్మగా... వీనుల విందుగా... వీచే మలయ మారుతంలా ప్రారంభించాడు.

'ప్రాప్తే వసంతేతి కాలికే... పలికే కుహూగీతికా... రాగ నరసీరుహ మాలికా' అనిపించే కోయిల గానంలా వాడు చదువుతున్న మంత్రపుష్పానికి అంతా మంత్ర ముగ్ధులమైపోయాం...

'రాజాధిరాజాయె ప్రహ్య సాహినే
నమో వయం వైశ్రవణాయ కూర్మహే!'


అదే జోరు

పెళ్ళయితే కెరీర్‌కు బ్రేక్ అన్న నానుడిని పటాపంచలు చేస్తున్నారు నవతరం నాయికలు. కెరీర్‌లో పరుగు లంకించుకున్న సమంత పెళ్ళి తర్వాత నెమ్మదిస్తుందేమోనన్న అనేకమంది సందేహాలకు చెల్లుచీటి ఇచ్చింది.

పెళ్ళికి ముందు తెలుగు, తమిళ పరిశ్రమల్లో ఎలా అయితే బిజీగా వుందో, పెళ్ళి తర్వాతా అలాగే వుంది. చేతినిండా రెండు భాషల చిత్రాలూ వున్నాయి. భర్త నాగచైతన్యతో కలిసి పెళ్ళి తర్వాత మొదటిసారిగా నటిస్తున్నది.

ఎంత బిజీ అయినా సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉంటోంది. వినికిడిలో ఎంతో ఇబ్బందిపడే చిన్నారులకు చేయూత అందిస్తున్న సంస్థకు తన వంతు సాయం అందించింది.





కొత్త టెక్నాలజీవల్ల వున్న ఉద్యోగాలు ఊడవు, కొత్తవి సృష్టించబడతాయి.
-రవిశంకరప్రసాద్, కేంద్రమంత్రి

కాంప్లిమెంటైనా,



బెంగుళూరులో జన్మించిన మలయాళీ భామ నిత్యామీనన్ ఆసక్తులు మొదటినుంచీ వేరుగా వుండేవి.జర్నలిజంలో గ్రాడ్యుయేషన్ చేసింది. నేపథ్యగానం ఆమెకు ఇష్టం.అలా అలా అనుకోకుండా చిత్రసీమకు చేరింది. 'అలా మొదలైంది' ఆమె సినీ ప్రయాణం. క్యూట్‌గా, పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను దక్కించుకున్న నిత్య తనకు ఇష్టంవచ్చినట్లు తాను ఉండేందుకు ప్రయత్నిస్తుందే తప్ప ఎవరో ఏదో అనుకుంటారన్నట్లు అస్సలు ఉండదు. ఆమెతో ఇంటర్వ్యూ విశేషాలు :

మీ బాల్యం ఎలా సాగింది?

నేను మధ్యతరగతి కుటుంబంలో పెరిగాను. మిగతా పిల్లల మాదిరి కాకుండా బాల్యంలోనే బాధ్యతగా వుండేదాన్ని. నేను ఏడాది వయస్సున్నప్పుడే నాకు అందే ర్యాక్స్‌లో బట్టలు వరసలు పెట్టేదాన్నని మా అమ్మ చెప్తుంటుంది.

సాధారణంగా ఆ వయస్సు పిల్లలు అందిన వాటిని కిందకు లాగేస్తుంటారు కదా. గోడలమీద రాయడం, చిందరవందర చేయడం లాంటివి ఏవీ చేసేదాన్ని కాదట.నాటీగా అస్సలు ఉండేదాన్ని కాదు. పద్ధతిగా, పొందిగ్గా వుండేదాన్నంటారు.

బాల్యంలోనే నటించారేమో కదా?

అవును. కాని, నన్ను నేను బాలనటి అనుకోలేను. ఒక్క సినిమా చేశాను. అప్పుడు నాకు పదేళ్ళు. ఇప్పుడు పూర్తి అనుభవాన్ని గుర్తుచేసుకోలేను. ఎలా జరిగిందన్నది ఓ కథ. కొన్ని విషయాలు జీవితంలో అలా సాగిపోతాయి. సినిమా పేరు 'ది మంకి హు న్యూ టూ మచ్'. టబు చెల్లెలి పాత్ర.

సినిమా తొలి ఛాయిస్‌గా అనుకోలేదేమో?

అవును. ఇటీవలి కాలందాకా అస్సలు అనుకోలేదు. ఓ రెండేళ్ళక్రితందాకా సినిమాలపట్ల నాకు ప్రధాన ఫోకస్ లేదు. ఇక్కడ ఉన్నందుకు పెద్ద సంతోషంగా ఏమీ ఫీలయ్యేదాన్ని కాదు.

రెండు,మూడేళ్ళక్రితంకూడా జీవితంలో మరేదైనా కోర్సుకు మారాలని భావించాను. సినిమా ప్రొఫెషన్ కాగలదని అస్సలు అనుకోనేలేదు. రెండేళ్ళక్రితమే ఇదే నా వృత్తి అని రియలైజ్ అయ్యాను.

కెమెరా వెనుక పనిచేయాలన్నది కదా మీ కోరిక?

అవును. నందినీరెడ్డి 'అలా మొదలైంది' సినిమా కోసం అడిగినప్పుడు నాకు అసలా దృష్టి లేదు. సినిమాటోగ్రఫీకి అప్లయ్‌చేసి వున్నాను. అదే చెప్పాను. షూటింగ్ రెండు నెలలకు మించి పట్టదని ఆమె నన్ను కన్విన్స్ చేసింది. తిరిగి చదువుకోవడానికి వెళ్ళిపోవడంతో ఒప్పుకున్నాను.

భాష ఇబ్బందులు ఎదురవలేదా?

మేము బెంగుళూరులో సెటిలైన కేరళవారిమి. కన్నడ, తమిళం నాకు బాగా వచ్చు. మలయాళం కంటే ఈ రెండు భాషలే బాగా వచ్చు. కాబట్టి బహుళ భాషలు నాకు సులువైపోయాయి.

కామెంట్ అయినా పట్టించుకోను



Photographs : Kunal Daswani Courtesy : JFW

సినిమా ఎంపికలో మీ ప్రాధాన్యం?

స్క్రిప్టు. నా పాత్ర. కొన్నిసార్లు నా మనస్సు మాట వింటాను. కొన్నిసార్లు ప్రాజెక్టును వివరించిన తీరు ఆకర్షణీయంగా వుంటుంది. అలా ఒక్కో ప్రాజెక్టుకు ఒక్కో ప్రాధాన్యం అన్నమాట.

మహిళలపట్ల పరిశ్రమ తీరు గతంలోకంటే ఇప్పుడు మారిందని భావిస్తున్నారా?

నిజాయితీగా చెప్పుకోవాలంటే పరిశ్రమ నన్నెప్పుడూ చెడ్డగా ట్రీట్ చెయ్యలేదు. సినిమాలో భాగం అయినంతమాత్రాన నా సిద్ధాంతాలతో నేను రాజీపడలేను. సినిమాల్లో అయినా, ఇతరత్రా అయినా నాపట్ల ఎడ్వాంటేజ్‌గా తీసుకున్న సందర్భాలు లేవు.

పాటలు పాడడం మీకు ఇష్టంకదా?

చాలా. నేను నటనలోకి అడుగుపెట్టక ముందు నుంచీ పాడుతున్నాను.

మీ కొత్త ప్రాజెక్టు 'ప్రాణ'గురించి ఏంచెప్తారు?

ఇది ఒకే యాక్టర్ సినిమా. ఆసక్తికరమైన ప్రాజెక్టు. ఫీమేల్ లీడ్ చుట్టూ కథ తిరిగే తొలి సినిమా. ఒకేసారి నాలుగు భాషల్లో షూటింగ్‌చేస్తున్నందువల్ల నాలుగు సన్నివేశాల్లో నటించాలి. నాలుగు భాషల్లో డైలాగులు చెప్పాలి. ఇదంతా చాలా కొత్త అనుభవం.

'దిగాళ్ నెక్స్ట్‌డోర్ ఇమేజ్'గురించి ఏం చెప్తారు?

ఇది నాలో ఒక భాగం మాత్రమే.కాబట్టి ఓ నటిగా ఓ పర్సనాలిటీకే అతుక్కుపోయి వుండడం నాకు ఇష్టంలేదు. ఎన్నో కోణాలు వెలికి రావాల్సి వుంటుంది. చాలామంది యాక్టర్లు ఓ పాత్ర సక్సెస్ అయితే అదే, ట్రైప్‌కాస్ట్‌కు అతుక్కుపోతుంటారు. కాని, ఓ నటిగా విభిన్న సబ్జెక్టులకు ఎక్స్‌పోజ్ కావాలన్నది నా కోరిక.

మీరు మీడియాతో ఎక్కువగా మాట్లాడరు, సామాజిక మాధ్యమాలకు కూడా దూరంగా ఉంటారు. ఎందుకని అలా చేస్తారు?

సామాజిక మాధ్యమంలో ఎవరైనా నెగెటివ్‌గా వున్నారు అంటే, ప్రాథమికంగా వాళ్ళు నెగెటివ్ పర్సనాలిటీలు కావచ్చు. జీవితం పరిపూర్ణంగా లేని వాళ్ళు కావచ్చు. నాది మంచి జీవితం.

నా చుట్టూ విషయాలపై డీసెంట్‌గా రియాక్టయ్యే తత్వం నాది. సోషల్ మీడియాలో లేకపోవడం నాకు సంతోషాన్ని, ప్రశాంతతను ఇస్తుందని భావిస్తున్నాను. ఇతర వ్యక్తుల అభిప్రాయాలు నన్నేమీ ఇబ్బందిపెట్టవు- అది కాంప్లిమెంట్ కావచ్చు, కామెంట్ కావచ్చు. ఫామ్‌లో ఉన్నప్పుడు స్క్రూటినీ అనేది సహజం.

పని ఒత్తిడినుంచి ఎలా రిలాక్సవుతుంటారు?

ఇంట్లో గడపడానికి ఇష్టపడతాను. కొన్నిసార్లు ప్రయాణాలు చేస్తాను. కొత్తవారిని కలవడం నాకు ఇష్టం. ఇతర దేశాలకు వెళ్ళినప్పుడే ఇది సాధ్యపడుతుంది. ప్రకృతిలో సేదతీరడం నాకు ఇష్టం అంటూ ముగించింది నిత్యామీనన్.

అయినపూరి సుజాత

మనిషిలో మనిషి

సీరియల్

నిద్రపోతే గొడవ చేస్తుందని కార్తికేయకు తెలుసు. కాని నిద్ర ఆపుకోవటం కార్తికేయకు సాధ్యంకాలేదు. చాలా రోజులుగా తను మానవనిద్రకు దూరమయ్యాడు.మనిషిగా సాదూభాయ్ శరీరంలో ఉండగా నిద్రించిందే చివరినిద్ర. తర్వాత ఇంతవరకు సుఖనిద్ర ఎరుగడు.

ఎడతెరిపిలేని ప్రయాణంతో అలసిన మనసు వేరే. అందుకే నిద్ర ఆపటం సాధ్యంకాలేదు. అలా బెడ్‌మీద వాలగానే గాఢనిద్రలోకి జారుకున్నాడు. తిరిగి మెలకువ వచ్చేసరికి తెల్లవారుజాము. సంజనా వెచ్చటి శ్వాస తన ముఖాన్ని తాకుతుంటే మెలకువ వచ్చేసింది. అర్థమైంది.

గదిలో బెడ్‌లైటు వెలుగుతోంది. ప్రశాంతమైన నాలుగోసమయం. టైమ్ ఎంతో కరక్ట్‌గా తెలీదు. ఎప్పుడు వచ్చిందోగాని ఓ కాలు తనమీద వేసి కావలించుకుని ప్రశాంతంగా నిద్రపోతోంది.

తెల్లటి నైటీలో దేవకన్యలా మెరిసిపోతోంది. ఆమె ఎదభారాల వత్తిడికి నరాలు జివ్వుమంటున్నాయి.

ప్రేమగా ముంగురులు సవరించి ముద్దాడాడు. పెదవుల స్పర్శకు నిద్రమత్తు వదిలి కనురెప్పలు ఎత్తి చూసింది సంజనా.

"ఎప్పుడొచ్చావ్?" హస్కీవాయిస్‌తో అడిగాడు.

"ఎప్పుడంటే... ఎప్పుడో. నువ్వు నిద్రపోతున్నావ్. ఎంత పిలిచినా లేవలేదు. పాపం ప్రయాణంలో అలసిపోయుంటావ్. నేను వేరే నీకు శ్రమ కల్పించటం ఎందుకులే అని ఇలా నీ పక్కలోచేరి నిద్రపోయాను" అంటూ నవ్వింది.

ముత్యాలసరంలా మెరుస్తున్న ఆమె పలువరుస, నవ్వితే నవరత్నాలు ఒలికినంత అందం. ఆమె కళ్ళలో మెరుపులు చూసి ఇక ఆగలేక ముద్దులతో అభిషేకిస్తూ మీదకు లాక్కున్నాడు.

అంతే... మిగిలిన రాత్రి సరే. ఎప్పుడు తెల్లారిందో కూడ బావమరదళ్ళు ఇద్దరికీ గుర్తులేదు. పరిచారికలు తను కనబడక కంగారుపడి ఎక్కడ రాజావారికి రిపోర్ట్‌చేస్తారోనన్న భయంతో బెడ్ దిగి వేగంగా అంతఃపురంలోకి వెళ్ళిపోయింది సంజనా.

ప్యాలెస్ చేరిన రెండోరోజు సాయంకాలం పళని శ్రీ కుమారశక్తి పీఠానికి ఫోన్ చేశాడు కార్తికేయ. అది స్వామీ సత్యానంద పర్సనల్ నెంబర్ కాదు. పీఠంలోని ఎంక్వయిరీ నంబరు. ఎవరో ఫోన్ లిఫ్ట్ చేశారు.

"హలో... యార్ నింగ? ఎన్నావేండుం?" అని అడుగుతున్నాడు.

"హలో సామి. నేను చెంచునాయుడ్నప్పా. నెల్లూరు నుండి మాటాడతా ఉండా" నెల్లూరు యాసలో చెప్పాడు కార్తికేయ.



"చెప్పండి. ఏం కావాలి?" ఈసారి తెలుగులో అడిగాడు అవతలి వ్యక్తి.

E-mail: Suryadevaranovelist@gmail.com

"గురువుగారు స్వామీజీతో మాట్లాడాలప్పా"

"చెప్పండి. వారితో ఏం పని?"

"పని ఉండాదప్పా. ఈడ నెల్లూరులో పెన్నాతీరాన రంగనాధసామి ఆలయముండాది గదా. ఆలయ కమిటీ మెంబర్ని మాటాడతావుండాను. ఇసయం ఏందంటే మా నెల్లూరు జనం స్వామి దర్శనంకోసం ఆయన దైవ ప్రసంగాలకోసం ఆసక్తిగా ఎదురుచూస్తా ఉండారు. పది దినాలు స్వామిని నెల్లూరుకి ఆహ్వానించాలని ఫోన్ జేసినా. ఇది మా కమిటీ నిర్ణయమప్పా. ఓసారి ఫోను గురువుగారికివ్వు మాటాడతాను"

"క్షమించాలి. ప్రస్తుతం స్వామివారు పీఠంలో లేరు"

"లేరా. యాడికి పోయుండారు?"

"కుంభకోణం శ్రీ ఆది కుంభేశ్వరస్వామిఆలయం కళావేదిక వద్ద పక్షం దినాలు గురువుగారి దైవ ప్రవచనాలు జరుగుతున్నాయి. ఇంకో వారందినాలు అక్కడే ఉంటారు"

"అట్టనా సామి. ప్రసంగాలు ఎన్ని గంటలకి ఆరంభమవుతాయి?"

"రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రసంగిస్తారు. అది ముగిశాక మీరు ఏర్పాటుచేసుకోవచ్చు"

సూర్యదేవర రామ్‌మోహనరావు

జరిగిన కథ 37


హోటల్ ఖాళీచేసి వెంటనే జీప్‌లో పర్లాకిమిడికి బయలుదేరతాడు కార్తికేయ.

తను వుండే వీధిమలుపు దగ్గరికి రాగానే గ్రైనేడ్ శబ్దంతోపాటు కాల్పుల శబ్దం వినపడుతుంది కార్తికేయకి.

కార్తికేయ అక్కడికి చేరుకునేసరికి దుండగులు తప్పించుకుంటారు. సంజనా కార్తికేయను చూసి మహదానందపడుతుంది.

మలయాళ మాంత్రికుడు భైరవేశ్వర్ ద్వారా సత్యానంద్ దుర్మార్గాలతోపాటు సంజనా ప్రాణశక్తిని పట్టుపురుగురూపంలోకిమార్చి మంత్రనిర్మితమైన గాజుపంజరంలో బంధించి ఆ పంజరాన్ని మసాయా అనే అగ్నిపర్వతం బిలంలోకి పంపించేశాడని తను మణిసిద్దుల వారి సహాయంతో సంజనాని బతికించగలిగానని జరిగినదంతా చెబుతాడు కార్తికేయ.

పళని వెళ్ళి స్వామి సత్యానందను కలవాలనుకుంటున్నానని కార్తికేయ చెప్పేసరికి- సడెన్‌గా ఆ దొంగస్వామి ముఖంలోని షాక్ నేను చూడాలి. కాదనకు నేనూ వస్తానంటుంది సంజనా. ఇక జరగబోయేది చదవండి.



"మంచిది సామి. అట్టనే సేద్దాం. నేరుగా గురువు గారితో మాటాడి నేను ప్రోగ్రాం డేట్లు కరారు జేసుకుంటాగాని ఏది వారి సెల్ నంబరివ్వు"

అవతలివ్యక్తి నెంబరు చెప్పగానే- లైన్ కట్ చేశాడు కార్తికేయ. ఆ నెంబరు తమవద్ద ఉన్నదే. కావాలనే ఆ నెంబర్‌ను కాంటాక్ట్ చేయలేదు. విషయమర్థమైంది చాలు. సో... స్వామీజీ సంగతి తేల్చుకోవడానికి కుంభకోణం పోయిరావాల్సిందే. అదే సమయంలో ఆ దుర్మార్గుడికెలాంటి అనుమానం రాకూడదు.

"ఏమైంది బావా... వాడు ఎక్కడున్నాట్ట? మనం ఎప్పుడు బైల్దేరాలి?" అడుగుతోంది సంజనా.

"వాడిప్పుడు కుంభకోణంలో ఉన్నాడు. పక్షం దినాలు స్వామి ప్రవచనాల కార్యక్రమం జరుగుతుందక్కడ. రేపే మన ప్రయాణం. తమిళనాడులోని కుంభకోణం మన డెస్టినేషన్" చెప్పాడు.

"ఎలా? కార్లో వెళ్దామా?"

"ఊహూ. ఫ్లైట్‌లో చెన్నై వెళ్దాం. అక్కడ నా ఫ్రెండ్ ట్రావెల్ ఏజన్సీ నుంచి కారు తీసుకుని రోడ్ మార్గంగా ప్రయాణం" అంటూ వివరించాడు కార్తికేయ.

ప్లాన్ చేసుకున్న ప్రకారమే మరునాడు ఫ్లైట్‌లో చెన్నై చేరుకున్నారు సంజనా, కార్తికేయలు ఇద్దరూ.



బయలుదేరేముందు మేనల్లుడికి చాలా జాగ్రత్తలు చెప్పారు రాజావారు.

"అవన్నీ నేను చూసుకుంటాలే మావయ్యా. మేం వచ్చేసరికి ఇక్కడ మనం అనుకున్న పనులు పూర్తి చేయండి చాలు" అన్నాడు కార్తికేయ.

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో దిగేసరికి కార్తికేయ మిత్రుడు మాసిలామణి రిసీవ్ చేసుకోడానికి వచ్చున్నాడు. ఇద్దర్నీ నందనంలోని తన ఇంటికి తీసుకెళ్ళాడు. హోటల్లో స్టే చేస్తామని చెప్పినా వినలేదు. మాసిలామణి భార్యపేరు శంబగం. వారికి ఇద్దరు పిల్లలు. చక్కని ఫ్యామిలీ. మాసిలామణి సొంత ఊరు ఉసిలంపట్టి గ్రామం.

అక్కడ వ్యవసాయ భూములున్నాయి. భూస్వామి కుటుంబం. తల్లిదండ్రులు అన్నదమ్ములు అంతా స్వగ్రామంలోనే ఉంటారు. ఆ కుటుంబంలో బాగా చదువుకుంది మాసిలామణి ఒక్కడే.

వ్యాపారంమీద ఇంట్రస్ట్‌కొద్దీ తను చెన్నైలో ఉండి సొంతంగా ట్రావెల్ ఏజన్సీ నిర్వహిస్తున్నాడు. కొంత కాలం కార్తికేయ చెన్నై కాలేజీలో చదివాడు. ఇద్దరూ క్లాస్‌మేట్స్ రూమ్‌మేట్స్‌గా ఉండేవారు... అప్పటి స్నేహం ఇద్దరిదీ.అయినాకూడా సంజనాను తన గర్ల్ ఫ్రెండ్‌గానే ఆ కుటుంబానికి పరిచయం చేశాడు కార్తికేయ. అసలు విషయాలేమీ చెప్పలేదు.

ఆ రోజు వాళ్ళింట్లోనే ఉన్నారు. రాత్రికి దేవి థియేటర్లో సినిమా చూశారు. వాస్తవానికి మరునాడు ఉదయమే బావామరదళ్ళిరువురూ కుంభకోణం బయలుదేరాలి.కాని ఆ రోజు మాసిలామణి దంపతుల చిన్న కూతురు మూడేళ్ళపాప పంచవర్షం పుట్టినరోజు.

సాయంత్రం ఫంక్షన్ వుంది రాత్రికి పార్టీ ఉంది. బంధువులంతా వస్తారు. రాకరాక వచ్చివెళ్ళిపోవడం ఏంటి. ఉండి తీరాల్సిందేనంటూ మాసిలామణి దంపతులు పట్టుబట్టడంతో కాదనలేక ఆగిపోయారు.

కథ బావుంటే చాలు

మంచి కథలు వస్తే, అందుకు కారణాల విశ్లేషణ చేస్తూ కూర్చోవడం కీర్తి సురేష్‌కు అస్సలు నచ్చదట. కథలు జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాల్సిందే. ఒక్కో సినిమా చేస్తున్నకొద్దీ బాధ్యత పెరుగుతూ వస్తుంది. దానికి అనుగుణంగా కథల ఎంపిక సాగాలి.

అలా అని జాగ్రత్త పేరుతో, మంచికథ అనిపించినా ఇది నా దగ్గరకే ఎందుకు వచ్చింది, నేనే ఎందుకు చేయాలి వంటి విశ్లేషణలు చేసుకుంటూ కూర్చోకూడదు. నా వరకు నేను కథ బావుందని మనస్సుకు అనిపిస్తే ఇతరత్రా కారణాలేవీ వెతుక్కోను" అని తెలిపింది కీర్తి.

దేశంలోని అన్ని మతాలు, భాషలవారి పార్టీ కాంగ్రెస్. అది ముస్లిమ్ పురుషుల పార్టీ అనటం అభ్యంతరకరం. -ఆనంద్ శర్మ, కాంగ్రెస్ నేత



చాలా హ్యాపీగా జరిగిపోయిందా రోజు. సాయంత్రం గ్రాండ్‌గా పార్టీ జరిగింది. అక్కడ స్పెషల్ అట్రాక్షన్ కార్తికేయ సంజనాల జంట అంటే ఆశ్చర్యంలేదు. ఆడవాళ్ళే అసూయ పడేటంత అద్భుత సౌందర్యరాశి సంజనా. అమ్మాయిల చూపులు కార్తికేయ వెంటే పరుగులు తీశాయి. ఎవరా అమ్మాయి ఎవరా యువకుడు అంటూ అతిథులంతా గుసగుసలు పోవటం తప్ప అసలు విషయం ఎవరికీ తెలీదు.

మరునాడు అంటే చెన్నైచేరిన మూడోరోజు మాసిలామణి తన ట్రావెల్ ఏజన్సీనుంచి ఎ.సి. బెంజ్ కారు ప్రయాణానికి ఏర్పాటు చేశాడు. డ్రయివర్ని పంపిస్తానంటే వద్దన్నాడు కార్తికేయ.

చెన్నైనుంచి కుంభకోణం వెళ్ళే రూట్ మ్యాప్ తీసుకుని ఉదయం తొమ్మిదిగంటలకి చెన్నై నుంచి బయలుదేరారు. స్టీరింగ్ కార్తికేయ తీసుకున్నాడు. కార్తికేయ సంజనాలిరువురూ కూడా డ్రైవింగ్‌లో ఎక్స్‌పర్ట్‌లు. కార్లో ఎసి ఉండటంతో ప్రయాణం అలసట తెలీకుండా సాగింది.

సాయంత్రం నాలుగు గంటలకి కుంభకోణం పొలిమేరను సమీపించింది కారు. ప్రయాణంలో కొంతదూరం సంజనా కారు నడిపినా అప్పటికి డ్రైవ్ చేస్తోందిమాత్రం కార్తికేయ.కుంభకోణం సిటీ లిమిట్స్‌లోకి వచ్చేశారు. ఊరు కనిపిస్తోంది. ఉన్నట్టువుండి సంజనాకు ఓ సందేహం ఏర్పడింది.

"బావా అంతా బాగానే ఉందిగాని స్వామీజీ ప్రవచనాలంటే భక్తజనం చాలామందే ఉంటారు. మీడియావాళ్ళు ఉండొచ్చు.అలాంటిచోట వాడ్ని అంతం చేయటం వీలవుతుందా... కాదు గదూ... మరి ఏం చేద్దామని?" అంటూ అడిగింది.

చిన్నగా నవ్వాడు కార్తికేయ.

"సంజూ. నరకాసుర సంహారానికి శ్రీకృష్ణుడు బయలుదేరినప్పుడు ఇలాగే సత్యభామను వెంటబెట్టుకు బయలుదేరాడు గాని ఎలా చంపాలని ముందే ప్లాన్ చేసుకుని పోలేదు.

యుద్ధంలో అలసిపోతే సత్యభామ విల్లందుకుని నరకుడ్ని అంతం చేసింది. ఇక్కడ సమస్య ఏమంటే యుద్ధంలేదు. పోరాటం లేదు. స్వామీజీ తన చేతులకు మట్టి అంటకుండా ఎలా నిన్ను చంపాలని చూశాడో అలాగే మన చేతులకూ మట్టి అంటకుండా వాడ్ని మట్టుపెట్టాలి. చూద్దాం. ఏదో ఒక అవకాశం రాకపోతుందా" అన్నాడు.

"అంతేనంటావా బావా. అయితే మనం రెండు మూడు రోజులు ఇక్కడే స్టే చేయాలేమో. మన ఉనికి

వాడికి తెలిస్తే ప్రమాదం కదూ?"

"లేదు సంజా. మనం కుంభకోణంలో స్టే చేయటంలేదు. పని పూర్తిచేసుకుని వెంటనే వెళ్ళిపోదాం"

"కాని ఎలా?"

కార్తికేయ సమాధానం చెప్పలేదు.

అప్పటికే కుంభకోణం వీధుల్లోకి ఎంటరైపోయింది కారు. ఆది కుంభేశ్వరుని ఆలయానికి దారి కనుక్కుంటూ కారును ముందుకు పోనిస్తున్నాడు.

ఆది కుంభేశ్వరుని ఆలయంమీదుగానే ఆ ఊరికి 'కుంభకోణం' అనే పేరు వచ్చింది. చాలా పురాతన ఆలయం. కుంభం అంటే 'కుండ'. ద్రోణం అన్నా కుండ. కుండలో వెలసిన శివుడుగాబట్టి స్వామిని 'కుంభేశ్వరుడు' అన్నారు.

ఇక కోణం అనడానిక్కారణం ఈ ఆలయానికి (కుంభకోణం ఊరిని చుట్టి) తొమ్మిది కోణాల్లోనూ కొన్ని కిలోమీటర్ల పరిధిలో ప్రసిద్ధి చెందిన నవగ్రహాల ఆలయాలున్నాయి. కాబట్టి దీన్ని 'కుంభకోణం' అన్నారు. అలాగే ఇక్కడ ఇతర దేవతల ఆలయాలు కూడ చాలానే ఉన్నాయి.

క్రమంగా ఆది కుంభేశ్వరస్వామి ఆలయ వీధిలో గుడిని సమీపిస్తోంది కారు. అప్పటికే స్వామి ప్రవచనాలు ఆరంభమయ్యాయి. ఆయన స్పీచ్ మైక్‌లో అద్భుతంగా వినవస్తోంది.

కుంభేశ్వరుని మాడ వీధుల్లో ఉత్తరదిక్కు వీధినానుకుని విశాలమైన సభాప్రాంగణముంది. స్వామివారి కళావేదిక చాలా పెద్ద మండపం. అది ఉత్తర ఫేస్‌గా వీధినానుకుని ఉంది.

ఆ వేదిక నాట్య నాటక ప్రసంగాది ప్రత్యేక ప్రోగ్రామ్‌లకోసం ఉపయోగిస్తుంటారు. క్రతువులు యాగాలవంటి విశేష కార్యక్రమాలు కూడా ఈ ప్రాంగణంలోనే జరుగుతుంటాయి.

స్వామి సత్యానంద ప్రసంగాలకోసం వేదిక ఎదురుగా షామియానాలు లేపి వరుసలు తీర్చి కుర్చీలు ఉంచబడ్డాయి. చాలామంది భక్తులు కుర్చీలనలంకరించి భక్తిశ్రద్ధలతో స్వామివారి స్పీచ్ వింటున్నారు. ఈ సభాప్రాంగణాన్ని చుట్టి నాలుగువైపులా వీధులున్నాయి.దూరంగా ఉండగానే లౌడ్ స్పీకర్లలో వినవస్తున్న స్వామీజీ వారి గొంతును గుర్తుపట్టింది సంజనా.

కార్తికేయ మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. ప్రాంగణాన్ని చుట్టి వెలుపలు వున్న వీధుల్లో కారును చక్కర్లు కొట్టిస్తున్నాడు. అవకాశాలు ఒక్కోసారి మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. అప్పుడప్పుడూ మనం వాటిని వెతుక్కుంటూ వెళ్ళాలి.

ఇప్పుడు కార్తికేయ చేస్తున్న పని ఇదే. త్వరగా ఏదో ఒక అవకాశం కలిసిరావాలి. లేదంటే కుంభకోణం వదిలి త్వరగా బయటికి పోలేరు.



తిరిగిన వీధిలోనే మళ్ళీ తిరుగుతున్న గ్రీన్‌కలర్ హంసలాంటి బెంజ్‌కారు ఎవరిదో లోపల ఎవరువున్నారో ఎందుకు తిరుగుతున్నారో తెలీక స్థానిక ప్రజలు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

తూర్పువైపు వీధిలోకి వస్తూండగానే కార్తికేయ ఎదురుచూసిన అవకాశం కళ్ళముందు కన్పించింది. ఎడంపక్క సందులో ఎడంపక్క డాబా ఇంటి అవతల ఖాళీ స్థలంలో చాలామంది గుమిగూడి కన్పించారు. రోదన ధ్వనులు కూడ విన్పించాయి.అంతే- ఇక ఆలోచించలేదు కార్తికేయ.కారును నేరుగా ప్రాంగణం సమీపంలోకి పోనిచ్చి ఇవతలగా ఆపాడు.

"ఏం చేద్దాం బావా?" అడిగింది సంజనా. "కారు దిగి నేరుగా వేదికవద్దకు వెళ్ళు..." చెప్పాడు.

"వెళ్ళి...? నువ్వు రావటం లేదా?"

"వస్తాను. కాస్త వెనగ్గా వస్తాను. కంగారుపడకు. నిన్ను చూడగానే వాడి ముఖంలో షాక్ చూడాలనుందన్నావ్‌గా. చూడు. ఒంటిగానే వెళ్ళు.



నే వచ్చేవరకు అక్కడే ఉండు. ఏం జరిగినా అక్కడినుండి కదలకు. అడగాలనుకున్న మాటలు నిర్భయంగా అడిగెయ్. కాని మన వివరాలు మాటల్లో దొర్లకుండా చూడు. మీడియావాళ్ళు కూడా ఉన్నట్టున్నారు. ఎవరికీ మనమీద అనుమానం రాకూడదు" అని హెచ్చరించాడు.

"ఓకే బావా. కాని నువ్వు మాత్రం నా వెనకే త్వరగా రావాలి.ఓకేనా?"

> **కుమారస్వామి ప్రమాణస్వీకారానికి పలు ప్రతిపక్ష పార్టీలు ముఖ్య నేతలు వచ్చినా కూటమి ఏర్పాటుకు వేదిక సిద్ధంకాలేదు. -దేవగౌడ, మాజీప్రధాని**

"ఓకే" అన్నాడు కార్తికేయ.

కారు దిగి డోర్‌మూసింది సంజనా. అక్కడినుంచి నడుచుకుంటూ ఆవరణవైపు కదిలింది. అప్పటికి కనుచీకటి పడే వేళయింది. వీధి లైట్లు వెలిగాయి. సభాప్రాంగణమంతా విద్యుద్దీప కాంతులతో పట్టపగల్లా ఉంది. స్వామి సత్యానంద ప్రసంగం మైక్ సెట్లలో అద్భుతంగా వినవస్తోంది.

ఆయన భక్తి ప్రవచనాల్లో విశేషం ఏమంటే ఆధ్యాత్మికమైన ఏదో ఒక విషయాన్ని తీసుకుని అందులోకి ఇతిహాసాలు పురాణాలు వేదాలనుంచి అనేక ఉపమానాలు ఉదాహరణలు కలబోసి కించిత్తు హాస్యం కూడా రంగరించి విషయం సూటిగా శ్రోతల హృదయాలను తాకేట్టు చెపుతుంటాడు.

అందుకే ఆయన ప్రసంగాలు ఎప్పుడు విన్నా కొత్తగానే ఉంటాయి. ఆయన ప్రసంగం తమిళంలో అనర్గళంగా సాగుతోంది. అలా కాసేపు వింటూ వుండిపోయాడు కార్తికేయ.

సంజనాకు ఇంగ్లీషు, హిందీ, ఒరియా, తెలుగు భాషలు మాత్రమే వచ్చు తమిళం అస్సలు రాదు. స్వామి జ్ఞానానంద ఏం చెపుతున్నాడో శ్రోతలు ఏం వింటున్నారో ఏమీ అర్థంగావటంలేదు.

అర్థంగాని విషయాల గురించి ఆలోచించకూడదుగాబట్టి అవేమీ పట్టించుకోలేదు సంజనా. నేరుగా షామియానా కిందకు వచ్చేసింది. కుర్చీల వరుసల మధ్య దారిలో చకచకా నడుస్తూ వేదికవైపు సాగింది. సభికుల దృష్టి ఒక్కసారిగా ఆమెవైపు తిరిగింది.

మీడియావాళ్ళు కూడా ఆశ్చర్యపడి చూస్తున్నారు. ఎవరీ అమ్మాయి? ఏమా అందం? ఏమా సోయగం? మెరుపు తీగ ఒకటి చీరకట్టి స్వామి ప్రసంగాలు వినడానికి వస్తోందా! లేక దేవలోక అప్సరస దిగివచ్చిందా! మతులు పోగొట్టుకుని అబ్బురపడి సంజనావంక చూస్తున్నారు. సూర్యుని అనుసరించే సూర్యకాంత

పుష్పాల్లా శ్రోతల కళ్ళు ఆమెను అనుసరిస్తున్నాయి. సంజనా ఇవేమీ పట్టించుకోవడంలేదు.

విసవిసా కళావేదిక ముందుకొచ్చేస్తుంది. వేదిక మధ్య పద్మాసనంలో కూర్చుని మైక్‌లో ప్రసంగిస్తున్న స్వామి సత్యానంద దూరంలో ఉండగానే సంజనాని గమనించాడు. కాని గుర్తుపట్టలేదు.

ఎవరో అమ్మాయి అనుకున్నాడు. నేరుగా ఆమె వేదికవైపు రావటం గమనించాక పరీక్షగా చూసి గుర్తుపట్టాడు. అంతే ఆయన ముఖంలో షాక్. ఎంతగా అంటే కత్తివేటుకు నెత్తురు చుక్కరాలనం తగా పాలిపోయింది ముఖం.

ప్రసంగం ఆగిపోయింది. తత్తరపాటుతో ఆమెనే చూస్తుండిపోయాడు. ఆయన గాభరాను సంజనా గుర్తించింది.ముఖంలో షాక్ స్పష్టంగా తెలుస్తోంది.

స్వామి సత్యానంద వెనక కాస్త ఎడంగా శిష్యులు పదిమంది అర్ధచంద్రాకారంలో తలోచోట చేతులు కట్టుకుని బొమ్మల్లా నిలబడున్నారు. వాళ్ళు ఆయన శిష్యులేకాదు. అంగరక్షకులు కూడా.

అంతా సంజనావంకే చూస్తున్నారు. వేదిక నుంచి పదడుగుల దూరంలోకి ఎదురుగా వచ్చి నిలబడింది సంజనా. స్వామి సత్యానందనే సీరియస్‌గా చూస్తూ నిలబడింది. తన కళ్ళను నమ్మలేకపోతున్నాడు స్వామీజీ. ఆమె వెనక ఇంకా ఎవరన్నా వస్తున్నారేమో నని ఆయన కళ్ళు వెతుకుతున్నాయి.

అలాంటి జాడ ఎక్కడ లేదాయె. పర్లాకిమిడినుంచి రాకుమారి ఒంటిగా ఇలా కుంభకోణం రావటం స్వామీజీకి ఏమాత్రం అంతుబట్టడంలేదు. విభ్రాంతుడై చేష్టలు దక్కి చూస్తున్నాడు. పైకి శాంతంగా వున్నా సత్యానంద గుండెలు అసహనంతో మండి పోతున్నాయి. ఎంత ఖర్చు చేశాడు.

ఎన్ని ప్లాన్లు వేశాడు. అయినా చావకుండా సలక్షణంగా సంజనా ఇలా తన ముందుకు రావటం ఇది ఆమె అదృష్టమో లేక తన చేతకానితనమో అర్థంగావటం లేదు. తను ఒక్కతే వచ్చుంటే మాత్రం ప్రాణాలతో కుంభకోణం దాటిపోనివ్వడు.

ఇదే తన చివరి ప్రయత్నమవుతుంది. సంజనా నమస్కరిస్తుందని ఆశించాడు. ఆమె సీరియస్‌గా నిలబడే ఉంది. తను ఎక్కువసేపు మౌనంగా ఉండటం మంచిదికాదు. శ్రోతలు సందేహించే ప్రమాదం ఉంది. అందుకే తన మనసులో చెలరేగే ఆలోచనలు ముఖంలో ప్రతిఫలించకుండా జాగ్రత్తపడుతూ ముఖంనిండా చిరునవ్వు పులుముకున్నాడు.

"రాకుమారీ మీరేమిటమ్మా ఇక్కడ? నమ్మలేక పోతున్నాను.అదీ ఒంటరిగా ఇలా" పలకరించాడు.

మైక్‌సెట్ ఆన్‌లోనే ఉన్నందున ఆ మాటలు అందరికీ విన్పిస్తున్నాయి.

"ఔను స్వామీజీ. నేనూ నమ్మలేకున్నాను. జీవితంలో ఓ రోజు ఇలా ఒంటరిగా మీ ముందుకు రావలసొస్తుందని ఊహించలేదు. కాని తప్పలేదు. మీరేమో మా ఊరికి రానైతిరి"అంది దరహాసంతో సంజనా.

"అవునమ్మా... చూస్తున్నారుగా. తీరికలేక రాలేక



అన్నీ నప్పవు

వస్త్రధారణ, ఫ్యాషన్ పోకడలగురించి అను ఇమ్మానుయేల్ తన అభిప్రాయాలు వెల్లడించింది. "కొందరికి కొన్ని రకాల దుస్తులు బాగా నప్పుతాయి. అందరికీ అన్ని రకాలూ సూట్ కావు.

చిన్నప్పుడు మాధురీ దీక్షిత్, శ్రీదేవిలను చూసి ఆశ్చర్యపోయేదాన్ని. వాళ్ళెప్పుడూ కొత్తగానే కనిపించేవాళ్ళు. ఇప్పుడేమో సమంతను చూసి ఫిదా అవుతున్నా. ఫ్యాషన్‌పరంగా నా సమకాలీనుల కంటే కొంచెం ముందంజలో వుండాలని కోరుకుంటాను. నా ఫోన్‌లో ఎప్పుడూ ఉండే యాప్‌లో ఫుడ్ నుంచి ఫ్యాషన్‌దాకా ప్రతిదీ ఉంటాయి.ఏమీ తోచనప్పుడు దాన్ని చూస్తుంటా" అని చెప్పింది.

పోయానుగాని వేరేమీ కాదు. మీ ఆరోగ్యం బాగలేదని విన్నాను. ఇప్పుడెలా ఉంది?"

"చూస్తున్నారుగా. బాగానే ఉన్నాను. కొన్ని ధర్మసూక్ష్మాలు తెలుసుకోవాలని మీవద్దకొచ్చాను"

"ధర్మసూక్ష్మాలా... అవేమిటి?"

"అవును. ధర్మసూక్ష్మాలే. మీరే నా సందేహాలు తీర్చాలి" అన్నది.

అకస్మాత్తుగా స్వామీజీ ప్రసంగం నిలిచిపోవటం వచ్చిన అపరిచిత సౌందర్యవతితో ఆయన తెలుగులో మాట్లాడటం శ్రోతల అసహనానికి కారణమయింది. గుసగుసలు పోతున్నారందరు.

అది గమనించాడు స్వామీజీ. "చూడమ్మా. నీ ధర్మసందేహాలు ఏవైనప్పటికీ తప్పకుండా తీరుస్తాను. కాని ఇప్పుడు కాదు. శ్రోతలు ఎదురుచూస్తున్నారు. ప్రవచనాలు మధ్యలో ఆపటం బాగుండదు. కాసేపు అలా కూర్చో. ప్రోగ్రామ్ పూర్తి అవగానే నీ సమస్య ఏమిటో చర్చిద్దాం" అన్నాడు.

"సారీ స్వామీజీ. అంత టైమ్ లేదు. ముందు నా సమస్యను పరిష్కరించి తర్వాత మీ ప్రసంగం కంటిన్యూ చేయండి. సింపుల్‌గా చెప్పేస్తాను" అంది సంజనా.

ఒకింత ఆలోచించి ఒప్పుకున్నాడు స్వామీజీ.

"ఓకే. త్వరగా చెప్పండి" అన్నాడు.

"స్వామీ. ఒక నీచుడు, ఒక దుర్మార్గుడు, ఒక మేకవన్నె పులి, ఒక విశ్వాసంలేని కుక్క..."

"అన్ని ఉపమానాలు అవసరం లేదమ్మా ఒక్కటి చెప్తే చాలు. ఒక దుర్మార్గుడు. అంతేనా?"

"అవును స్వామీ.ఆ దుర్మార్గుడి కన్ను మా సంస్థానంమీద పడింది. మా తాతగారు రాసిన వీలునామాను అడ్డంపెట్టుకుని మా యావదాస్తి సొంతం చేసుకోవాలనుకున్నాడు. అందుకు అడ్డుగా ఉన్న నన్ను చంపించడానికి ఎవరికీ తనమీద డౌటురాకుండా క్షుద్రప్రయోగం చేయించాడు.

అంతేకాదు, ఆ దురాశాపరుడు మా రాజగురువుని నా మేనమామను అన్యాయంగా చంపించాడు. నా తండ్రిగారిని హతమార్చాలని చూశాడు. వాడ్ని... ద్రోహికి ఎలాంటి శిక్ష విధిస్తే సరిపోతోందో చెప్పండి చాలు. వెళ్ళిపోతాను"

ఆ మాటలకు ఖంగుతిన్నాడు స్వామీజీ. తన గురించి రాకుమారికి అంతా తెలిసిపోయిందని అర్థమైంది. అంటే ఏ శిక్ష విధించాలో తన చేతనే చెప్పించి ఆ శిక్షను అమలుచేస్తుందా? చేయగలదా? ఒంటరిగా వచ్చింది.ఏంచూసుకుని ఈమెకింత ధైర్యం?

"చూడమ్మా. తప్పుచేసిన వాడు ఎలాంటివాడైనా శిక్షించటానికి చట్టాలున్నాయి. కోర్టులున్నాయి. పోలీసులున్నారు. అటు వెళ్ళకుండా పొరబాటున ఇటు వచ్చినట్టున్నావు. ఏవో నాలుగు భక్తి మాటలు చెప్పి కాలక్షేపం చేస్తున్నవాడిని నేనేం చెప్పగలను" అంటూ తప్పించుకోవాలని చూశాడు.

"మీరే చెప్పాలి స్వామీ. ఎందుకంటే వేదవేదాంగాలు చదివి ధర్మసూక్ష్మాలు తెలిసినవారు. మీరుగాక ఎవరు చెప్తారు? చెప్పండి మంత్రవాది భైరవేశ్వర్‌లా వీడికీ కుక్కచావు శిక్షగా విధిస్తే సరిపోతుందా?"

మంత్రవాది భైరవేశ్వర్ పేరు వింటూనే మరోసారి షాక్‌కి గురయ్యాడు స్వామి సత్యానంద. అంతేకాదు. మైక్‌లో వినబడుతున్న ఆ ఇద్దరి సంభాషణ తమిళం వాళ్ళకి అర్థంగావటంలేదు సరే.

అక్కడ వున్న తెలుగు తెలిసినవాళ్ళకీ అర్థంగావటంలేదు. ఆ అమ్మాయెవరు, ఆమె ఏమడుగుతోంది, స్వామీజీ ఏం చెపుతున్నాడు. ఏమీ అర్థంగాక చిత్తరువుల్లా చూస్తూ కూర్చున్నారు. స్వామీ ఏదో చెప్పబోయాడు. సరిగ్గా అదే సమయంలో తూర్పువీధి వైపు నుంచి జనం ఒక్కసారిగా గగ్గోలుగా అరవటం విన్పించి ఉలిక్కిపడి అటు చూశారంతా. సంజనా కూడా అటు చూసింది.

ఇంకా ఉంది

అంతా రాజకీయమే

వామ హస్తం కట్

బెంగుళూర్‌లో కుమారస్వామి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన బి.జె.పి యేతర పక్షాల నాయకులలో ఆనాడున్న ఉత్సాహము ఆ తర్వాత క్రమంగా తగ్గిపోతున్నది.

ప్రతి పార్టీ ఎవరితో కలవటంవల్ల తమకు వచ్చే లాభనష్టాల అంచనాలలో వున్నాయి. ఈ అంచనాల చివరిఫలితం కమ్యూనిస్టులతో చేతులు కలపటం అనవసరం అన్నది కాంగ్రెస్ నిర్ణయం.

దేశంలోని ఏ ప్రాంతంలోనూ కమ్యూనిస్టులు బలంగా లేరు. పైగా తమకున్న బలాన్ని మించిన డిమాండ్స్ చేస్తారు. అటువంటివారిని మనం మొయ్యటమే కాని, వారివల్ల మన పార్టీకి వచ్చే లాభం ఏదీ లేదన్న ఆలోచనకు రాహుల్‌గాంధీ బృందం వచ్చింది. బెంగాల్‌లో అధికారంలో వున్న మమతాబెనర్జీ అవసరం కాంగ్రెస్‌పార్టీకుంది.

కమ్యూనిస్టులతో స్నేహంచేస్తే మమతా బెనర్జీ దూరమవుతుంది. కాబట్టి ఎలా చూసినా హస్తానికి వామపక్షంతో ఎటువంటి లాభం కనిపించటంలేదు. అందుకే వామపక్షంతో హస్తం 'కట్' ఇక అధికారికంగా ప్రకటించటమే తరువాయి. ◆

మహిళలు ఓ జ్ఞాపకం

అన్ని రాజకీయ పార్టీలు దాదాపుగా మరచిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లును తిరిగి తెర మీదికి తెస్తున్నది కాంగ్రెస్‌పార్టీ. తాజాగా రాహుల్ గాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లుని పార్లమెంట్‌లో పెట్టండి మేము మద్దతు ఇస్తాం అంటూ ప్రధాని నరేంద్రమోడీకి ఉత్తరం రాశాడు.

పదేళ్ళు తాము అధికారంలో వుండగా తాము ఆ బిల్లు తేలేదనే విషయం కాంగ్రెస్‌కి గుర్తుండదు. అంతకు ముందు ఐదేళ్ళు అధికారంలో వుండి మహిళా రిజర్వేషన్ బిల్‌గురించి మాట్లాడలేదు బి.జె.పి. మొత్తం 20 ఏళ్ళపాటు 'కోల్డ్ స్టోరేజ్'లోకి నెట్టిన ఆ బిల్లు గురించి ఇప్పుడు కాంగ్రెస్ నోరు విప్పటమే అసలు రాజకీయం.

కాంగ్రెస్ నిజంగానే తమకు రిజర్వేషన్స్ ఇస్తుందని మహిళలు అనుకుంటే అంతకన్నా అమాయకత్వం మరొకటి వుండదు. ఈలోగా బి.జె.పి. ముస్లిమ్ మహిళల అంశం భుజానకెత్తుకుని త్రిపుల్ తలాక్ అంశం వారి ముందుంచి, దేశంలో ముస్లిమ్ మహిళల సాధికారత యుద్ధ ప్రాతిపదికన చేపట్టి... అందరినీ ఎన్నికల హడావుడి అంశాలే. ◆

క్రికెటర్ లొల్లి

క్రికెట్ అభిమానులు మరచిపోతున్న మాజీ కెప్టెన్ అజారుద్దీన్‌కి హఠాత్తుగా సొంత రాష్ట్రం గుర్తుకువచ్చింది. ఈసారి సికింద్రాబాద్ నుండి కాంగ్రెస్ టికెట్ మీద పోటీచేస్తా అంటున్నారు.

నిజానికి ఆయన పోటీచెయ్యదలచుకుంటే ముస్లిమ్ జనాభా అధికంగా వున్న హైదరాబాద్ నియోజకవర్గం నుండి పోటీచేయాలి. కాని హైదరాబాద్‌లో ముస్లిమ్ తమని నిలబెట్టలేనంత సెక్యులర్ విధానం కాంగ్రెస్ వారిది.

మిగిలిన నియోజకవర్గాలలో సంఖ్యాపరంగా అధికంగా వున్నవారికి టికెట్లు ఇచ్చే కాంగ్రెస్, హైదరాబాద్‌లో మాత్రం హిందువును నిలబెడుతుంది.హిందువుల ఓట్లు బి.జె.పి., కాంగ్రెస్ మధ్య చీలి ఒవైసీ అక్కడ గెలిచేందుకు సహకరిస్తుంటుంది ఆ నిర్ణయం.

అందుకని అజారుద్దీన్ ముందుగానే సికింద్రాబాద్ అన్నాడు. ఆ సీటు మీద నమ్మకం పెట్టుకున్న బి.సి. అభ్యర్థి అంజన్ కుమార్ యాదవ్ ఎదురు తిరుగుతాడని తెలుసు.

అది జరగాలనేది టి.ఆర్.ఎస్. ఆలోచన. అందుకే అజారుద్దీన్ వెనుక టి.ఆర్.ఎస్. వుందనే సందేహం కాంగ్రెస్ నేతలది. ఇలా కాంగ్రెస్ అంతర్గత సమస్యలు పెరిగితేగాని రాజధాని నగరంలో టి.ఆర్.ఎస్. పట్టు పెరగదు. ◆

మతాయుధం

ఎన్నికలు రాబోతుండగా మతం కీలక అంశం అవటం ప్రజాస్వామ్యవాదులకు ఆందోళన కలిగిస్తోంది.బి.జె.పి. మతాన్ని వాడుకుంటున్నదనే ఆరోపణ ఎప్పటినుండో వుంది.

కాని వాస్తవంలో అన్ని రాజకీయ పార్టీలు మతాన్ని ఎన్నికల్లో వాడుకుంటూ వున్నాయి. మిగిలిన పార్టీలు ఆ విషయం రహస్యంగా కానిచ్చేవి. ఇప్పుడు ఆ విషయం బహిరంగమవుతోంది.

ముస్లిమ్‌లలో వున్న భారతీయ జనతా పార్టీ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలచుకునేందుకు రాహుల్‌గాంధీ ముస్లిమ్ మేధావుల సమావేశంపెట్టి 'కాంగ్రెస్ ముస్లిమ్‌ల పార్టీ' అనటం, కాంగ్రెస్ ఎమ్.పి. శశిథరూర్ 'బి.జె.పి. భారత్‌ని హిందూ పాకిస్తాన్'గా మారుస్తుందని ఆరోపించటం ఒకే సందర్భంలో బయటికి రావటంతో కాంగ్రెస్ పార్టీ బి.జె.పి.ఉచ్చులో చిక్కుకుంది.

కాంగ్రెస్ ముస్లిమ్‌ల మీద వల్లమాలిన ప్రేమ కురిపించటం తమకు అనుకూలంగా, హిందూ ఓట్లను బలమైన ఓటు బ్యాంక్‌గా మార్చుకునేందుకు సిద్ధమైంది బి.జె.పి. 'కాంగ్రెస్ ముస్లిమ్ పురుషుల పార్టీ'నా అంటూ ప్రధాని మోడీ చురక అంటించి మత అంశం తెలివిగా రంగంలోకి తెచ్చాడు. ◆

సమయం చూసి

జాతీయ పార్టీలను మిత్రపక్షాలు సమయం చూసి దెబ్బకొడుతున్నాయి.

ఎన్నికల ముందైతే తప్పించి తమ డిమాండ్లకు లొంగవు ఈ జాతీయ పార్టీలన్న విషయం ఇతర పార్టీలకు బాగా తెలుసు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో బలహీనపడి, ఇంకా కోలుకోలేదు.

బి.జె.పి. ఇప్పుడు బలహీనంగా వుంది. అందుకే ఇదే సమయం అనుకుని పడగవిప్పుతున్నారు. బీహార్ సి.ఎమ్. నితీష్‌కుమార్ బి.జె.పికి సీట్ల పంపకం విషయం 48 గంటల్లో తేల్చాలని, బీహార్‌కి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్‌చేస్తున్నాడు. తన కోర్కెలు తీర్చకపోతే ఎన్.డి.ఎని వీడగలనన్న హెచ్చరిక అందులో దాగుంది.

ఇక బి.ఎస్.పి. కాంగ్రెస్‌తో చెడుగుడు ఆడుతుంది. ఉత్తరాది రాష్ట్రాలలో బి.ఎస్.పికి వున్న ఓటుబ్యాంక్ తనకి బదిలీచేస్తే రాజస్థాన్, ఎమ్.పిల్లో గెలవగలనని కాంగ్రెస్ అనుకుంటున్నది.

కాని ఇప్పుడు హఠాత్తుగా ఆ రెండు రాష్ట్రాలలో పొత్తు ప్రశ్నే లేదు అంటున్నది బి.ఎస్.పి. కాంగ్రెస్‌తో వున్న జిగ్నేష్ మేవానీని తనవైపు తిప్పుకుని కొత్త దళిత ఉద్యమం నిర్మించాలన్నది బి.ఎస్.పి. అధినేత మాయావతి మనసులోని మాట. ◆

హడావుడి ప్రకటనలు


చంద్రబాబు మంత్రివర్గంలోని మంత్రులు ఇచ్చే ప్రకటనలకు ఆ తర్వాత చంద్రబాబు వివరణ ఇచ్చుకోవాల్సి వస్తోంది. 24 వేల కోట్ల రూపాయలతో అమరావతిలో 1600 కిలోమీటర్ల రోడ్లు నిర్మాణమవుతున్నాయని, డిశంబర్‌లోగా పూర్తవుతాయని మంత్రి పి.నారాయణ ప్రకటించాడు.

రోడ్లకు అంత బడ్జెట్ ఏదీ! ఎప్పుడు కేటాయించారు? అనే ప్రశ్నలు సహజంగానే వస్తాయి. అవన్నీ ప్రభుత్వ బ్యాంక్ రుణాలతో వేయిస్తున్నవని ఆ తర్వాత వివరాలు ఇవ్వాల్సి వస్తోంది ప్రభుత్వం.

అదే విధంగా కర్నూలు జిల్లాకెళ్ళి ఎమ్.పి., ఎమ్.ఎల్.ఎ. టికెట్లు ఎవరికో అతిఉత్సాహంగా చెప్పి వచ్చాడు మరో మంత్రి లోకేష్.

ఇలాంటి ప్రకటనలు ఇవ్వటంలో మంత్రుల మధ్య అనారోగ్యకర పోటీనడుస్తోంది.

సాయంత్రమయ్యేసరికి ఆ రోజు మంత్రుల మాటలను చక్కదిద్దే భారం చంద్రబాబు మీద పడుతోంది. తగిన అర్హతలు చూడకుండా మంత్రి పదవులు కట్టబెడితే ఇంతే మరి.



Review

లవర్... జనాల చెవిలో ఫ్లవర్



తరచు సినిమాకు వెళ్ళే ప్రేక్షకుడికి సినిమా హాలు కూడా బాగా పరిచయం అయిపోతుంది. కళ్ళు మూసుకుని ఎక్కడ ఎంట్రీనో, ఎక్కడ ఎగ్జిట్‌నో ఇట్టే చెప్పేస్తాడు. అలా ప్రతీసారీ ఆ హాలుకే వెళ్తున్నా డని చెప్పి, అదే సినిమా వేస్తానంటే రాను పొమ్మం టాడు. కొత్త సినిమా కావాలి.

కొత్త సినిమా అంటే పేరు, పోస్టరు మారితే చాలదు. విషయం మారాలి. వివరణ కూడా మారాలి. అప్పుడే ఈ జనరేషన్ ప్రేక్షకుడికి సంతృప్తి.

లవర్ అనేసినంతమాత్రాన మజ్నూనో, సలీమ్‌నో అనుకోనక్కరలేదు. 'లవర్' అని టైటిల్ పెట్టేసినంత మాత్రాన ప్రేమికుడు సినిమా రేంజ్‌లో ఊహించు కోనక్కరలేదు. ఇది జస్ట్ ఓ సగటు చిత్రం.

ఓ ప్రేమ జంట... ఓ విలన్ గ్రూపు... వారి మధ్య ఓ చిన్న విషయం. అదీ కథ. అంతకు మించీ లేదు. అంతకు మించనూ లేదు.

దర్శకుడు కొత్తగా ఆలోచించి, కొత్తగా తీయడానికి బదులు, సేఫ్ జోన్‌లో సినిమా చేయాలని ముందే డిసైడ్ అయిపోయినట్లు కనిపిస్తోంది. కానీ సాహసం చేస్తే రాజకుమారి లభిస్తుందన్న మాంత్రికుడి మాటలు మరచిపోయాడు. అందుకే బండిబాటలో సాగిపోవడానికి నిర్ణయించుకున్నట్లు కనిపిస్తుంది.

సినిమా ఎత్తుగడ దగ్గరనుంచి ముగింపువరకు ఎక్కడా కొత్తదనపు వాసనలు కానీ, పోకడలు కానీ కనిపించవు. చిత్రమేమిటంటే సినిమా ఎత్తుగడకోసం హీరోవైపునుంచి నెరేషన్‌గా ప్రారంభించిన దర్శకుడు తరువాత ఆ వైనమే మరిచిపోయాడు.

ఏదో అలా అలా మొదలెట్టిన సినిమాను ఎలాగో అలా ముగించాలనే తప్ప, కొత్తగా తీయాలన్న ఆలోచన దగ్గరకు రానివ్వలేదు. ఖర్చు బాగుంది...సినిమాటోగ్రఫీ బాగుండాలి. సంగీతం బాగుండాలి. ఇలా అన్నీ అనుకున్న దర్శకుడు తన పనికూడా బాగుండాలి, తన స్క్రిప్ట్ బాగుండాలి, తన నెరేషన్ బాగుండాలి అని ఎందుకు అనుకోలేదో అర్థం కాదు.



యువ దర్శకుడు, యువ హీరోతో 'లవర్' అని టైటిల్‌పెట్టి సినిమా తీస్తున్నప్పుడు ఎంత యూత్‌ఫుల్‌గా వుండాలి, ఎంత కొత్తగా వుండాలి, మరెంత జోష్ వుండాలి. కానీ ఈ 'లవర్' సినిమాలో మాత్రం అవేవీ కానరావు.



పర్‌ఫెక్షన్ పోరాటం

ప్రతి సన్నివేశంలోనూ పర్‌ఫెక్షన్ కోసం పోరాడే తత్వం తనదంటున్నది మెరుపుల మెహరీన్.

ఓ సినిమాలో సరిగ్గా నటించలేకపోతే తర్వాత సరిదిద్దుకుని నటించాలన్న తత్వం అస్సలు తనకు లేనేలేదట. "రెండో అవకాశాన్ని తీసుకోలేను. ప్రతి సన్నివేశంలోనూ పర్‌ఫెక్షన్‌కోసం ప్రయత్నిస్తాను. ఫలానా సన్నివేశంలో బాగా నటించలేదనిపిస్తే చాలా చాలా ఫీలవుతాను. ఏదైనా సన్నివేశంలో సంతోషంగా లేకపోతే ఏడ్చేస్తా కూడా" అని చెప్పింది. ◆



రెగ్యులర్ ఫార్మాట్‌కు అంగుళం కూడా అటూ ఇటూ జరగకుండా సాగిపోతుందీ సినిమా.

సినిమా ప్రథమార్ధం ఎత్తుకోవడమే పాత పద్ధతిలో హీరోను ఒంటరిగా చూపించి, పాత్రలను ఏమాత్రం ఆసక్తి కలిగించకుండా పరిచయంచేసి, ఆపైన కథ లోకి తీసుకెళ్లాడు దర్శకుడు.

ఇదేంటీ... వ్యవహారం ఇలా వుందీ? అనుకుంటూనే చూడడం ప్రారంభించిన కాస్సేపటికి అర్థం అయిపోతుంది. ఇంట్రనే కాదు, సినిమా మొత్తం ఇలాగే వుంటుంది అని.

హీరో ప్రొఫెషన్ విషయంలో బైక్స్ రీమోడలింగ్ అనే కొత్తవిషయాన్ని, స్మార్ట్ బైక్స్ అనే కొత్త కాన్సెప్ట్‌ను తీసుకున్న దర్శకుడు కథను కూడా ఆ విధంగా స్మార్ట్‌గా నడిపించి వుంటే 'శహభాష్' అనేవారు ప్రేక్షకులు. కానీ అలాంటి వ్యవహారం సినిమాలో కనిపించదు.

హీరో, అనాథ, ఓ అన్నలాంటి వ్యక్తిదగ్గర వుండడం, ఓ అమ్మాయిని చూసి ప్రేమలోపడి, అల్లరిపెట్టి, చిల్లరవేషాలు వేసి తనదాన్ని చేసుకోవడం, ఆపైన ఆ అమ్మాయికి ఏదో కష్టం. దాని కోసం హీరో తెగించి పోరాడడం, కథ సుఖాంతం. ఎన్ని సినిమాలు చూడలేదు. ఇలాంటివి? ఈ ఆలోచన దర్శకుడికి ఎందుకు రాలేదో?

సినిమా ప్రథమార్ధం సోసోగా వుంటుంది. హీరో, హీరోయిన్, స్నేహితులు వ్యవహారాలు అక్కడక్కడ పెదవులపై నవ్వులు పూయిస్తాయి తప్ప, కొత్తగా ఏమీ వుండదు.

ఇంటర్వెల్ బ్యాంగ్ కూడా అంతకన్నా సాదాసీదాగా వుంటుంది తప్ప, ఎగ్జయిటింగ్‌గా అనిపించదు. సినిమా రెండో భాగం కూడా ఏమంత అద్భుతంగా అనిపించదు. ఎందుకంటే అక్కడ కూడా ఎగ్జయిటింగ్‌కు గురిచేసే అంశాలు కానీ, లేదా సరదా సందడులు కానీ ఏమీ కనిపించవు, వినిపించవు.

హీరోయిన్ ఇంట్లో హీరోకోసం అల్లుకున్న కాసిన్ని సన్నివేశాలుకూడా ఏమంత రంజుగా వుండవు. మా ఊరు చూపిస్తారా... అని హీరోయిన్ అంటే కేరళ అందాలు చూపిస్తూ, కాస్త మలయాళ భాషసరదాలు అందిస్తారు అనుకుంటే అది కూడా వుండదు.

ఇలా సెకండాఫ్‌లో ప్రవేశించిన సినిమా అలా క్లైమాక్స్‌కు దారితీసి, చటుక్కున ముగిసిపోతుంది.

హీరోయిన్ కోసం హీరో వెదుకులాట కూడా చిత్రంగా వుంటుంది. ఇలాంటి సినిమాలో నటీనటులందరిలో కాస్తయినా మనసుపెట్టి చేసింది కేవలం హీరో రాజ్ తరుణ్ ఒక్కడే.

రొటీన్‌గా నటించినా, పెద్దగా వంకపెట్టాల్సింది లేకుండా నటించాడు.మిగిలిన వారెవరు కూడా సరైన పర్‌ఫార్మెన్స్ ఇవ్వలేదు. ముఖ్యంగా కీలకమైన పాత్ర ధరించిన రాజీవ్ కనకాలను చూస్తే ఆశ్చర్యంవేస్తుంది. మంచి నటుడిని ఇలాగా వాడుకునేది? కీలకమైన పాత్రను ఇలాగేనా డిజైన్ చేసేది! అనిపిస్తుంది.

దర్శకుడు, నటులు విఫలమైనా, సాంకేతిక సహకారం మాత్రం సినిమాలో మంచిస్థాయిలో వుంది. వివిధ సంగీత దర్శకులు అందించిన పాటల్లో ఒకటి, రెండు బాగున్నాయి.

జేబి నేపథ్య సంగీతం బాగుంది. సమీర్‌రెడ్డి ఫొటోగ్రఫీ కలర్‌ఫుల్‌గా, రిచ్‌గా వుంది.

ఇటు రాయలసీమ, అటు కేరళ లొకేషన్లు బాగున్నాయి. కానీ ఏం ప్రయోజనం, దర్శకుడు కథను కానీ, కథనాన్ని కానీ, సీన్లను కానీ కొత్తగా రాసుకోలేనప్పుడు?

ఇలాంటి వైనంవల్ల వారంవారం వచ్చే రొటీన్ సినిమాల్లో ఒకటిగా మిగిలిపోయింది తప్ప కొత్తగా అనిపించలేదు 'లవర్' సినిమా.

ప్లస్‌పాయింట్స్...
నిర్మాణ విలువలు
సాంకేతిక సహకారం

మైనస్‌పాయింట్స్...
కథ, కథనాలు

పంచ్‌లైన్
పాత ప్రేమికుడే ◆

ధైర్యంగా ఉండాలి

సినీ పరిశ్రమలోకి వచ్చేవాళ్ళు మానసికంగా ఎంతోధైర్యంగా ఉండాలంటున్నది అమలాపాల్.

"స్త్రీలపై వేధింపులనేవి సినిమారంగానికే పరిమితం కాలేదు. అన్ని రంగాల్లోనూ వుంటున్నాయి. స్త్రీలు అస్సలు ధైర్యాన్ని కోల్పోకూడదు. ముఖ్యంగా చిత్ర పరిశ్రమలో ఇది చాలా అవసరం.

మానసికంగా ధైర్యంగా లేకపోతే నిలదొక్కుకోవడం కష్టం అవుతుంది.

ఆలోచనల్ని సూటిగా వ్యక్తంచేయాలి, మాట విషయంలో ఖచ్చితంగా వ్యవహరించాలి. అప్పుడే ఎటువంటి సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కోగలుగుతారు" అంటూ హితవు పలికింది. ◆



అన్ని పనులూ అవలీలగా

మొదటి సినిమా 'ఛలో'తోనే ప్రేక్షకుల మదిలో చెరుక్కుమన్న రష్మికామండన్నా చేతినిండా సినిమాలతో బిజీ. తెలుగు, కన్నడ పరిశ్రమల్లో బ్యాక్‌టు బ్యాక్ షూటింగుల్లో పాల్గొంటున్నది.

ఇంకోపక్క రక్షిత్‌శెట్టితో నిశ్చితార్థం చేసుకుని పెళ్ళికి సిద్ధమవుతున్నది. పాత్రలకోసం ట్రైనింగులు సరేసరి. ఇన్ని పనులు ఎలా బ్యాలెన్స్ అవుతున్నాయని అడిగితే నవ్వేసింది.

"చిన్నతనంనుంచీ పనులను బ్యాలెన్స్ చేసుకోవడం నాకు తెలుసు. చదువులో ఫస్ట్, ఇతర యాక్టివిటీల్లోనూ వుండేదాన్ని. ఫంక్షన్లలో డ్యాన్సులు చేసేదాన్ని" అని అంతులేని జాబితా విప్పిన రష్మిక తెలుగు బాగా మాట్లాడేస్తున్నది కూడా. ◆



కనెక్ట్ అయ్యాను

'జంబలకిడి పంబ'తో గుర్తింపు దక్కించుకున్న సిద్ధి ఇద్నాని ఇంకో కామిక్ థ్రిల్లర్‌కు సిద్ధం అయింది. "ఈ చిత్రంలో నాది ఉద్యోగంచేసే స్వతంత్ర భావాలున్న అమ్మాయి పాత్ర. వాస్తవ జీవితంలోనూ ఇండిపెండెంట్‌గా వుండే నాకు ఈ పాత్ర బాగా కనెక్ట్ అయింది. తొలి సినిమాలో మాదిరే ఈ చిత్రంలోనూ కొన్ని యాక్షన్ సన్నివేశాలుంటాయి.

అయితే ఇవి కొద్దిగా సీరియస్ టైప్. నేనీ పాత్ర బాగా చెయ్యగలనని చిత్ర నిర్మాతలు విశ్వసిస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలకోసం నిజంగా ఎగ్జయిట్ అవుతున్నా" అని వివరించింది. ◆

ఎలా ఆడుతున్నాయి?

- వరుసపెట్టి విడుదలవుతున్నాయి చిన్న సినిమాలు. వారానికి మూడు, నాలుగు వంతున.
- కానీ పబ్లిసిటీ ఖర్చులు కూడా తెచ్చుకోలేకపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి గోడకు వేసిన సున్నం బాపతు అవుతోంది.
- ఈ మధ్యకాలంలో విడుదలైన సినిమాల్లో 'ఆర్ ఎక్స్ 100' ఒక్కటే బ్లాక్ బస్టర్ సినిమా. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు తొమ్మిది కోట్లు వసూలు చేసింది. జస్ట్ రెండున్నర కోట్లతో నిర్మించిన ఈ సినిమా.
- మిగిలినవన్నీ మటాషే. ఈ పరంపర మరో ఒకటి రెండునెలలు కొనసాగేలా వుంది. ◆





కడుపూ, మనసూ నిండుతాయి

చక్కదనాల చుక్క శృతీహాసన్‌ను ఫ్రెండ్సందరూ 'మైలాపూర్ మామి' అని పిలిచేవారట.

తనకు కూడా అలా పిలిపించుకోవడం భలేగా వుండేదట. "నా ఫ్రెండ్స్ అంతా అలా పిలిచేవారు. నాకూ సరదాగా వుండేది.

కాకపోతే నేను న్యూఏజ్ వర్కింగ్ మామిని. సాంబార్ అన్నం తినడానికి, వండడానికీ ఇష్టపడతాను. భవిష్యత్‌లో నా భర్తకూ అదే వండిపెడతా. కడుపుతోపాటు మనసూ నిండుతుంది" అంటున్న శృతికి తాను బాగా రెడీ అయినప్పుడు అబ్బాయిలు చూసి ఇష్టపడుతుంటే సంతోషంగా ఉంటుందటకాని, అతిచేస్తేమాత్రం అసహనం వచ్చేస్తుందట. ◆

నచ్చినవే చేశా

పెద్దగా సినిమాలేవీ లేకుండా ఖాళీగా కనపడుతున్న కలర్స్‌స్వాతిని కదిలిస్తే చాలా కబుర్లు చెప్పింది. పైగా, షూటింగ్‌లు మాత్రమే జీవితం కాదని వ్యక్తిగత జీవితమూ ఉంటుందంటూ తనకు దొరికిన ఖాళీని సమర్థించుకున్నది. పరిశ్రమలో తన పయనానికి పదేళ్ళు పూర్తయ్యాయన్న ఉత్సాహమూ ఉంది.

"ఈ పదేళ్ళలో నాకు వచ్చిన అవకాశాల్లో నాకున్న నైతికవిలువలు, ఇష్టతల ఆధారంగా ఎంత చేయగలనో అంతా చేశా. మొదటినుంచీ కెరీర్‌ను అలాగే కొనసాగించాను" అని తెలిపింది.

దేశభక్తి ఏ ఒక్కరి సొత్తూ కాదు. భారతదేశాన్ని మాతృభూమిగా భావించి, భరతమాతను గౌరవించి పూజించేవారంతా దేశభక్తులే.

కులం, మతం, సామాజిక హోదాలు ఏవీ దేశ భక్తికి కొలమానాలు కావు. ఎక్కడో పుట్టి, అత్తెసరు చదువులు చదివి, ఆర్మీలో చేరి మరెవ్వరూ చెయ్యని సాహసాలను ప్రదర్శించి, మాతృదేశాన్ని సంరక్షించుకున్న వారెందరో వున్నారు.

మూడుపదుల వయసులో ఆ వయసు పిల్లలంతా తమ సంసారం, పిల్లలు అంటూ వారి సొంత భవిష్యత్తు గురించి ఆలోచిస్తుంటే కొందరు సైన్యంలో చేరి తమ దేశం గురించి ఆలోచిస్తున్నారు.

చివరి రోజుల్లో...

అటువంటి సైనిక వీరుల్లో హవల్దార్ అబ్దుల్ హమీద్ ఒకరు. సైనికదళంలో 'హవల్దార్' అనేది అంత పెద్ద స్థానం కాదు. కాని సాహసంలో ఆర్మీ జనరల్స్ కుండేంత స్థాయి హవల్దార్ అబ్దుల్ హమీద్‌ది.

ఒకటి కాదు, రెండు యుద్ధాల్లో తన సాహసం ప్రదర్శించాడు. 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో, ఆపైన 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలోనూ పాల్గొన్నాడు అబ్దుల్ హమీద్. హమీద్ పుట్టింది నాటి యునైటెడ్ ప్రావిన్స్‌లో ఘజీపూర్ జిల్లాలో. అతను పుట్టిన గ్రామం ధాముపూర్.

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. హమీద్‌ది పేద కుటుంబం. తండ్రి దర్జీ. హమీద్‌కి పలుగురు సోదరులు, ఇద్దరు అక్కచెల్లెళ్ళు. చిన్నప్పటి నుండి హమీద్‌కి కుస్తీలు, కత్తిసాము అంటే బాగా ఇష్టం. దేశభక్తి గీతాలు పాడుతుండేవాడు. తనకు సైనిక విభాగమే తగినది అని భావించి తన ఇరవైయ్యవ ఏట మిలటరీలో చేరాడు.

అప్పటికి భారతదేశం స్వతంత్ర దేశం. ఆర్మీలో హమీద్‌కి ఒక ప్రత్యేక గుర్తింపు లభించింది. రికాయిల్‌లెస్ గన్ పేల్చటంలో నైపుణ్యం కలవాడయ్యాడు.

హమీద్ కనుక యాంటీ ట్యాంక్ గన్ పేలిస్తే అది గురి తప్పేదికాదు. 1962లో చైనాతో జరిగినయుద్ధంలో హమీద్ తన నైపుణ్యంతో పలు ట్యాంక్‌లను ధ్వంసం చేశాడు. ఆ యుద్ధం ముగిసింది. హమీద్‌ని స్టోర్స్‌లో క్వార్టర్ మాస్టర్‌గా నియమించారు.

అలా ఒకటి రెండు సంవత్సరాలు గడిచింది. ఈలోగా పాకిస్థాన్ భారత్‌మీద దాడికి సిద్ధమైంది. ఎప్పటిలాగానే వారి తొలిదాడి కాశ్మీర్ మీద.

గెరిల్లాలకు శిక్షణనిచ్చి పంపేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ సంగతిని పసిగట్టిన భారత్ సేనలు తొలి చొరబాటు బృందాన్ని పట్టుకుని, రహస్యాలు



హవల్దార్ అబ్దుల్ హమీద్
(1933-1965)

ఎవడు ఆ వీరుడు! ఎలా తమ ట్యాంకర్లను ధ్వంసం చేస్తున్నాడు! అనే పాకిస్థానీయులకు హవల్దార్ హమీద్ సమాచారం అందింది. జీపుమీద పెట్టిన ఆర్.సి.ఎల్. గన్‌తో పేలుస్తున్నాడు కాబట్టి ముందుగా అతన్ని దాడిలో చంపేయాలన్నది పాకిస్థానీయుల లక్ష్యం.

రాబట్టారు. ఎదురుదాడితో చొరబాటుకు సిద్ధమైన గెరిల్లాలను చెల్లాచెదురుచేశారు. ఈలోగా పాకిస్థాన్ ఛండీఘర్ ఎయిర్ బేస్‌మీద దాడిచేసింది.

ట్యాంక్‌లతో భారత్ భూభాగంలోకి చొచ్చుకు వచ్చే ఆలోచనలో వున్నారు. సరిగ్గా ఆ సమయంలో అధికారులకు హవల్దార్ హమీద్ నైపుణ్యం గుర్తుకు వచ్చి అతన్ని వెంటనే యుద్ధభూమికి పిలిపించారు. 1965 సెప్టెంబర్ మొదటి వారానికల్లా హవల్దార్ హమీద్ మరో ముగ్గురు గ్రెనేడర్స్ వచ్చి, రాత్రికి రాత్రి మూడు అడుగుల గొయ్యి తవ్వి అందులో సిద్ధంగా కూర్చున్నారు.

ఆరోజు సెప్టెంబర్ 8 తెల్లవారుతుండగానే పాకిస్థానీ ట్యాంక్‌ల కదలిక శబ్దాలు వినిపించాయి. ఖేమ్కరణ్ జిల్లాలోని చీమా గ్రామంలోని ఒక చెరుకుతోటలో మాటువేసి జీప్‌మీద బిగించిన యాంటీ ట్యాంక్ గన్‌తో సిద్ధంగా ఉన్నాడు. హమీద్ వంటి వీరుడు రంగంలోకి వచ్చాడని తెలియని పాకిస్థానీ సైనికులు తమ ట్యాంక్‌లతో ముందుకు వస్తున్నారు.

హవల్దార్ హమీద్ తన గన్ పేల్చాడు. యాంటీ ట్యాంక్ గన్ పాకిస్థానీ ట్యాంక్‌కి తగలటం, నిప్పు అంటుకోవటం క్షణంలో జరిగిపోయింది. హఠాత్తుగా తగిలిన ఎదురుదెబ్బకు పాకిస్థానీయులు బెంబేలు పడిపోయి అక్కడనుండి పారిపోయారు.

రెండు గంటల్లో తిరిగి పాకిస్థానీయులు మరో మూడు ట్యాంకులతో ముందుకు వచ్చారు. ఈసారి భారీగా ట్యాంక్ గన్నులు పేలుస్తూ వచ్చారు.

ఆ సమయంలో ఆయుధాలపరంగా పాకిస్థాన్‌దే పైచేయి. కాని ధైర్యం భారతీయులది. హవల్దార్ హమీద్ మళ్ళీ తుపాకీ పేల్చాడు. హమీద్ గురి తప్పలేదు. ఒక ట్యాంక్ పేలిపోయింది.

మిగిలిన రెండు ట్యాంక్‌లను కూడా వదిలేసి పాకిస్థానీయులు పారిపోయారు. రెండు ట్యాంక్‌లను హమీద్ ధ్వంసం చేశాడు. నాలుగు పాకిస్థానీ ట్యాంకులు చేతికి చిక్కాయి.

మరుసటి రోజు తిరిగి పాకిస్థానీ సేనలు వస్తాయని తెలుసు. ఈలోగా ఆ యుద్ధ ప్రాంతానికి భారత ట్యాంక్‌లు బయలుదేరాయన్న కబురు వచ్చింది. ఇక ఒక్కరోజు శత్రువును నిలవరించగలిగితే అదనపు బలగాలతో పాకిస్థానీయుల అంతుచూడటం సాధ్యమేనని అంచనావేశాడు హవల్దార్ హమీద్.

భారత్ సైన్యం తమ ట్యాంక్‌లను ఎలా ధ్వంసం చేస్తున్నది తెలియదు. భారత్ సైన్యం ఎక్కడ పొంచి వున్నదీ అర్థంకావటంలేదు. అందుకే పాకిస్థాన్ వైమానిక దాడులు మొదలుపెట్టింది.

అయినా హమీద్ వెరవలేదు. అతని గురికి మరో రెండు ట్యాంక్‌లు ధ్వంసమయ్యాయి. ఎవడు ఆ వీరుడు! ఎలా తమ ట్యాంకర్లను ధ్వంసం చేస్తున్నాడు! అనే పాకిస్థానీయులకు హవల్దార్ హమీద్ సమాచారం అందింది. జీపుమీద పెట్టిన ఆర్.సి.ఎల్. గన్‌తో పేలుస్తున్నాడు కాబట్టి ముందుగా అతన్ని దాడిలో చంపేయాలన్నది పాకిస్థానీయుల లక్ష్యం.

నేరుగా హమీద్ జీపుని లక్ష్యం చేసుకుని ట్యాంక్‌ల దాడి సెప్టెంబర్ 10న మొదలైంది.

శత్రువులకు కనపడకుండా మాటు వేస్తూ తన ఆర్.సి.ఎల్. గన్‌కి మరో మూడు ట్యాంక్‌లను ధ్వంసం చేశాడు. ఈలోగా హమీద్ మాటువేసిన ప్రదేశాన్ని శత్రువులు గుర్తించారు. ఇక అతని మీదికి ప్రత్యక్షంగా దాడికి దిగారు.

ఇక మాటున దాగి వుండటంలో అర్థంలేదనుకున్న హవల్దార్ హమీద్ తన జీపును నేరుగా బహిరంగ ప్రదేశంలోకి తెచ్చాడు. ఎదురుగా యుద్ధ ట్యాంక్‌లు, ఇవతల ఒక జీపులో గన్‌తో హవల్దార్ హమీద్. తాను చెయ్యగలిగింది హమీద్ చేశాడు.

చివరి యత్నంగా మరోసారి తన గన్ పేల్చాడు. ఆ గన్ నుండి వెళ్ళిన బుల్లెట్ నేరుగా వెళ్ళి పాకిస్థానీ యుద్ధ ట్యాంక్‌కి వెళ్ళి తగిలింది.

అదే సమయంలో ట్యాంక్ నుండి పేల్చిన మందు గుండు వచ్చి హమీద్ జీపుకు తగిలింది. జీప్ పేలింది. హమీద్ అమరుడయ్యాడు. హవల్దార్ హమీద్ విజయపరంపర ఆగిపోయింది.

హమీద్ నేలకు ఒరిగాడు. భారత్ ట్యాంక్‌లు వచ్చాయి. భీకర పోరాటంలో మొత్తం 100 ట్యాంక్‌లు వదిలి పాకిస్థానీయులు పారిపోయారు.

శత్రువుల గుండెల్లో దడ పుట్టించిన హవల్దార్ హమీద్‌కి మరణానంతరం పరమవీరచక్ర ఇచ్చారు. ఆ వీరుడు మరణించిన చీమా గ్రామంలో అబ్దుల్ హమీద్ స్మారకం నిర్మించారు. ⓢ

ఈ శీర్షిక మీదే

ఉత్తమ ప్రశ్నకు ₹500
ప్రతి ప్రశ్నకు ₹300 బహుమతి

ఉత్తమ ప్రశ్న - సమాధానం

ఎ.కొండలరావు, దూసి

ఇతరులు మనల్ని ప్రేమించాలంటే ఏం చేయాలి?

'లౌ'క్యంగా బతకాలి.

టి.వి.రామకృష్ణ, కొత్తపేట

గోరుచుట్టుమీద రోకలిపోటంటే?

పేకాట్లో డబ్బులుపోయి నెత్తిమీద ముసుగేసుకుని వెళ్తూంటే 'ముసుగు దొంగ' అంటూ పోలీసులు తన్నడం.

ఎమ్.కృష్ణ, కాకినాడ

రోజాలు ఎక్కడుంటే అందం?

శిరోజాల్లో.

టి.వి.రామకృష్ణ, కొత్తపేట

అతి భార్యా విధేయుడంటే?

'చీ పూరుకోండి బాబూ' అని భార్య గోముగా అన్న వెంటనే పూరుకునేవాడు.

పి.యోబు, ముదునూరు

పని?

'ప'డిపోకుండా 'ని'లబెట్టేది.

ఎమ్.కృష్ణ, కాకినాడ

విషయ సూచిక చదివితే?

పుస్తకం రుచి తెలుస్తుంది.

ఎ.అశోక్‌కుమార్, హైదరాబాద్

మనుషులకుండే జంతు లక్షణం?

'కొమ్ము' కాయడం.

ఆర్.ప్రశాంతి, విజయనగరం

మంచం 'దిగే'దెప్పుడు?

పొద్దు 'ఎక్కి'నప్పుడు.


పి.వి.రమణకుమార్, చిలకలూరిపేట

పిల్లలు 'జూ' చూడాలని అనుకుంటారు మరి మహిళలు?

జ్యువెల్లరి.



ఈ కార్టూన్ మీదే



B హ్యాపీ

"ఏవండోయ్ ఇప్పుడే ఫోన్ వచ్చింది. మన పెళ్ళి కుదిర్చిన సాంబయ్య, పెళ్ళి చేయించిన పురోహితుడు ఇద్దరూ మోటార్ సైకిల్ మీద వస్తుండగా యాక్సిడెంట్ అయ్యి చచ్చిపోయారటండీ..."

"మరి చేసిన పాపం ఊరికేపోతుందా! ఏమిటి!"

"చట్నీలో ఇంత పెద్ద వెంట్రుక వచ్చింది. ఏమిటయ్యా దీనిఅర్థం" అంటూ గయ్‌మన్నాడు కూర్చున్న కస్టమర్.

"దాని అర్థం మేము ఇప్పుడు ఆడవాళ్ళను కుక్స్‌గా పెట్టుకున్నామని" అన్నాడు హోటల్ ఓనర్.

వర్షాలవల్ల లాభాలు ఏమిటి! అని జాతీయస్థాయిలో స్కూల్ విద్యార్థులకు వ్యాసపోటీ పెడితే మిగిలిన రాష్ట్రాల విద్యార్థులు పలురకాల కారణాలు రాశారు. కాని ముంబాయి విద్యార్థులంతా "బడి శెలవులు వస్తాయి" అంటూ రాశారు.

ఏడుస్తూ ఇంటికి వచ్చిన కూతురిని ఏమైందమ్మా అని అడిగింది తల్లి.

"మా ఆయన చెంపమీద కొట్టాడమ్మా"

"నువ్వు ఏం చేశావే"

"చొక్కాకి గుండీలు కుట్టానమ్మా... మరి అప్పుడు ఆ చొక్కా ఆయన వేసుకుని వున్నాడు. సూది గుండె భాగంలో దిగిందే..."

"ఏరా రామునీ మెట్లమీద నుండి నెట్టావట" అని అడిగింది టీచర్.

"లేదు టీచర్. నేను ఒక మెట్టు మీద నుండే నెట్టాను. మిగిలినవన్నీ వాడంతట వాడే దొర్లుకుంటూ పడ్డాడు టీచర్"

"ఏమిట్రా అలా నిలుచుని తింటున్నావు!"

"ఏం చెయ్యను... కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయి అంటూ మా తాత ఒకటే సతాయిస్తున్నాడు" అన్నాడు చింటు.

"నువ్వు మంచి మార్కులు తెచ్చుకుంటానని వాగ్దానం చేశావు గుర్తుందా!"

"మంచి మార్కులు వస్తే సైకిల్ కొనిపెడతావని నువ్వు వాగ్దానం చేశావుగా మమ్మీ"

"మరి నీకు మంచి మార్కులు రాలేదుగా"

"చిన్నవాడిని నేను వాగ్దాన భంగం చేశానని నువ్వు కూడా వాగ్దానం నిలబెట్టుకోననటం ఏమీ బాగోలేదు మమ్మీ..." అన్నాడు కొడుకు.

మనిషి విజయం సంపాదించిన డబ్బునుబట్టి కాక, సాధించిన మనశ్శాంతినిబట్టి వుంటుంది.